# VYAKARANAM (Grammar)
## M.A. (SANSKRIT) I Semester Paper -II

**Director**
**Dr.Nagaraju Battu**
M.H.R.M., M.B.A., L.L.M., M.A. (Psy), M.A., (Soc), M.Ed., M.Phil., Ph.D.
Centre for Distance Education
Acharya Nagarjuna University
Nagarjuna Nagar-522510

Phone No.0863-2346208, 0863-2346222, Cell No.9848477441
0863-2346259 (Study Material)
Website: www.anucde.info
e-mail: anucdedirector@gmail.com

M.A (Sanskrit): VYAKARANAM (Grammar)

ప్రక్రియా పద్ధతిలో విషయ విభాగం చేసి బోధించటం మొదలయింది. ఆ పద్ధతిలోనే రూపావతారం, రూపమాల, ప్రక్రియా కౌముది వంటి గ్రంథాలు రచింపబడ్డాయి. ఇప్పుడు భట్టోజి దీక్షితుడి సిద్ధాంతకౌముది, దానికి సంగ్రహరూపంగా లఘుసిద్ధాంతకౌముది, మధ్యకౌముది వంటి గ్రంథాలు వాడుకలో ఉన్నాయి. వాటిలో వరదరాజ పండితుడి లఘుసిద్ధాంతకౌముది మాత్రమే లఘు గ్రంథాల్లోను, సిద్ధాంతకౌముది సంపూర్ణగ్రంథంగానూ వాడుకలో ఉన్నాయి.

సంస్కృతభాషా ప్రచార సమితి కులపతులూ, సంస్థ స్థాపకుల్లో ముఖ్యులూ, అనేక శాస్త్ర గ్రంథ నిర్మాణదక్షులూ వ్యాఖ్యాన, అనువాద గ్రంథాల ద్వారా సుప్రసిద్ధులు అయిన పద్మశ్రీ పురస్కృత, మహామహోపాధ్యాయ, ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడుగారు చేసిన మహోపకారం వల్ల సమగ్రమైన బాలానందినీ వ్యాఖ్యతో వెలువడిన ఈ లఘుసిద్ధాంతకౌముది నాలుగు ముద్రణలు ముగించుకొని అయిదవసారి ముద్రితమౌతున్నది.

ఈ గ్రంథ ప్రచురణకు ఆర్థిక ప్రోత్సాహం అందించిన **M/s. శ్రీనిరాజు ఫౌండేషన్, జూబ్లీహిల్స్, హైదరాబాదు** వారికి, సమితి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న సంస్కృతభాషాభిమానులకు సంస్కృతభాషా ప్రచార సమితి పక్షాన హార్దిక కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను.

1-2-2017 **చ.వేం. శేషాచార్యులు**

హైదరాబాద్. కార్యదర్శి, సంస్కృతభాషా ప్రచార సమితి

శ్రీః

# సంస్కృత వ్యాకరణము–దాని సంక్షిప్తచరిత్ర

'ప్రథమేహి విద్వాంసో వైయాకరణాః, వ్యాకరణమూలత్వాత్సర్వవిద్యానామ్' (ధ్వ. ఆ. 132) అని ఆనందవర్ధనాచార్యులు వ్యాకరణవైయాకరణుల మహత్త్వమును ఉగ్గడించియున్నారు.

వ్యాకరణము అతి ప్రాచీనము:- వ్యాకరణమనగా ప్రకృతి ప్రత్యయ విభాగము. సంస్కృత వ్యాకరణము అతిప్రాచీనమైనది. దీని ప్రారంభమును కనుగొనుట కష్టసాధ్యము. భారతీయుల ఇతర శాస్త్రములకువలె వ్యాకరణ శాస్త్రమునకు గూడ వేదమే ఆదిమమూలమని చెప్పుటలో సందేహములేదు. 'యజ్ఞేన యజ్ఞమయజన్త దేవాః' (ఋ.1-164-50) 'ధాన్యమసి ధినుహి దేవాన్' (యజు.1-20) 'యేనదేవాః పవిత్రేణాత్మానం పునతే సదా' (సామ.ఉ 5-2-8-5) తీర్థైస్తరన్తి (అథర్వ 184-8) ఇత్యాది వైదిక వాక్యములలో 'యజ్ఞ' 'ధాన్య' 'పవిత్ర' 'తీర్థ' శబ్దముల వ్యుత్పత్తి సూచితమైయున్నది. ఇట్టి వ్యుత్పత్తులు తదనంతరకాలవర్తులగు వైయాకరణులకు మార్గదర్శకములై 'యజయాచయతవిచ్ఛప్రచ్ఛరక్షోనఙ్' (పా.సూ. 3-3-90) ధినోతేర్ధాన్యమ్' (మహాభాష్య. 5-2-4) పువఃసంజ్ఞాయామ్ (పా. సూ. 3-2-185) 'పాతృతుదివచిరిచి సిచిభ్యస్థక్' (ఉ.సూ. 2-7) ఇత్యాది నియమములకు మూలమైనవి. ఈ విధముగ వైదిక సంహితలలో బీజరూపముననున్న వ్యాకరణము వైదిక పదపాఠములలో పరిపూర్ణత్వమునందినదని చెప్పవచ్చును. ఆకాలము నాటికి ప్రకృతి ప్రత్యయములు, ధాతూపసర్గలు, సమాసమునందలి పూర్వపదోత్తరపదములు ఇత్యాది విభాగములు బాగుగ విర్ణీతములైనవి.

'నూనం వ్యాకరణం కృత్స్నమనేన బహుధాశ్రుతమ్'
బహువ్యాహరతానేన నకించిదపశబ్దితమ్' (రామా కి. 329)

అనురామాయణ శ్లోకమునుబట్టి రామాయణ కాలమునాటికే వ్యాకరణశాస్త్రమునకొక విర్ణీతరూపము లభించినట్లు తెలియుచున్నది. నామవాచకములన్నియు ధాతువుల నుండియే విష్పన్నమైనవని చెప్పువారిలో అగ్రగణ్యుడగు శాకటాయనుని ('తత్ర

సామాన్యాఖ్యాతజానీతి శాకటాయనో నైరుక్తసమయశ్చ. నిరు.1-12)వ్యాకరణము నిరుక్తకారుడగు యాస్కునకు పూర్వమే వెలసినది. 'పురాకల్ప ఏతదాసీత్, సంస్కారోత్తరకాలం బ్రాహ్మణాః వ్యాకరణం అధీయతే స్మ' (మహాభా.1.1.1) అను మహాభాష్యవాక్యము అతిప్రాచీన కాలమునుండియు వ్యాకరణాభ్యాసమున కతిప్రాధాన్య ముండెడిదని సూచించుచున్నది. పై ప్రమాణములచే వ్యాకరణశాస్త్ర మతి ప్రాచీనమైనదను విషయము విస్పష్టమగుచున్నది.

*ముఖం వ్యాకరణం ప్రోక్తమ్:-* పాణినీయ వ్యాకరణమునందు గృహీతము లగు కొన్ని పారిభాషిక సంజ్ఞలు గోపథ బ్రాహ్మణమున కనబడు చున్నవి. "ఓంకారం పృచ్ఛామః కోధాతుః,కిం ప్రాతిపదికమ్,కిం నామాఖ్యాతమ్, కిం లిఙ్గమ్,కిం వచనమ్,కా విభక్తిః,కః ప్రత్యయః,కః స్వర ఉపసర్గో నిపాతః, కిం వై వ్యాకరణమ్,కో వికారః,కో వికారీ,కతి మాత్రః,కతి వర్ణః,కత్యక్షరః, కతి పదః,కః సంయోగః,కిం స్థాననాదానుప్రదానానుకరణమ్" (గో.బ్రా.పూ. 1-24). మైత్రాయణీ సంహితయందును (1-7-3), ఐతరేయ బ్రాహ్మణమునం దును (7-7) వ్యాకరణప్రసిద్ధములగు విభక్తులు పేర్కొనబడినవి. దీనినిబట్టి వేదాంగషట్కములో నొక్కటైన వ్యాకరణము ప్రాధాన్య మాత్రముచేతనేగాక ఉత్పత్తి వికాసక్రమముచే గూడ ఇతరవేదాంగములలో నగ్రస్థానము నాక్రమించి 'ముఖం వ్యాకరణం ప్రోక్తమ్' అను అభియుక్తోక్తికి ఆశ్రయమైనది.

*వ్యాకరణోత్పత్తి:-* వ్యాకరణమునకు మూలకందమగు అక్షర సమా మ్నాయమును తొలుదొల్త బ్రహ్మ బృహస్పతికిని, బృహస్పతి ఇంద్రునకును, ఇంద్రుడు భరద్వాజునకును, భరద్వాజుడు ఋషులకును, ఋషులు బ్రాహ్మణుల కును బోధించెనని "బ్రహ్మా బృహస్పతయే ప్రోవాచ, బృహస్పతిరిన్ద్రాయ, ఇన్ద్రో భరద్వాజాయ, భరద్వాజ ఋషిభ్యః ఋషయో బ్రాహ్మణేభ్యః" అను ఋక్తంత్రకార వచనము చెప్పుచున్నది. బ్రహ్మోపజ్ఞములగు ఇతర శాస్త్రముల వలె తదుపదిష్టమగు ఆ వ్యాకరణశాస్త్రము గూడ అతి విస్తృతమైయుండవలె ననియు, దానిననుసరించి వచ్చిన వ్యాకరణములన్నియు, తదనుసారులగుట చేతనే కాక దానికంటె ప్రమాణమున అత్యల్పము లగుటచే కూడ 'అనుశాసన ములు,' 'అనుతంత్రములు' అనునామధేయములచే ప్రసిద్ధములనియు ఊహింప బడుచున్నది.



*బృహస్పతి వ్యాకరణము:-* బృహస్పతి బ్రహ్మవద్ద వ్యాకరణము నభ్యసించి ఇంద్రునకు బోధించెను. ఈ విషయమును "ఏవం హి శ్రూయతే బృహస్పతిరింద్రాయ దివ్యం వర్ష సహస్రం ప్రతిపదోక్తానాం శబ్దానాం శబ్దపారా యణం ప్రోవాచ, నాన్తం జగామ, బృహస్పతిశ్చ ప్రవక్తా, ఇన్ద్రశ్చాధ్యేతా, దివ్యం వర్ష సహస్రమధ్యయనకాలః, న చాన్తం జగామ" (మహాభాష్య. 1-1-1) ఇంద్రునకు బోధించుటకై బృహస్పతి రచించిన ఈ వ్యాకరణ గ్రంథము పేరు శబ్దపారాయణమై యుండు నని మహాభాష్యవ్యాఖ్యాకారు లగు భర్తృహరికై- యటుల 'రూఢిశబ్దోఽయం కస్యచిద్ గ్రంథస్య' "శబ్దపారాయణశబ్దో యోగ రూఢః శాస్త్రవిశేషస్య" (ప్రదీప. 1-1-1) అను వాక్యములు సూచించుచున్నవి. అనగా బృహస్పతి వ్యాకరణము 'గౌః,అశ్వః పురుషో,హస్తీ,శకునిః,మృగః, బ్రాహ్మణః" (మ.భా.1-1-1) ఇత్యాదివిధముల ప్రతిపదపాఠరూపమై యుండె ననియర్థము. ఈపద్ధతిలో అసంఖ్యాకము లగు పదములను, విభిన్నవిభక్త్యాదు లలో వాటికి సంబంధించిన రూపములను అన్నిటిని చెప్పవలసి యుండుటచే ఎన్నేండ్లు చదివినను ఈ వ్యాకరణము తరుగకుండుట సహజము. అనగా బ్రహ్మ మొదలు బృహస్పతివరకును వచ్చిన వ్యాకరణములలో వరుసగ పదములను ఏకరువెట్టుటయే గాని ప్రకృతిప్రత్యయాదివిభాగములను చేసి, ఒక శబ్దము నుదా హరణముగ తీసికొని ఇతర శబ్దములను సాధించు ప్రక్రియ ఆవిర్భవింపలేదు. అందుచే ఈ వ్యాకరణములకు నిజమైన ప్రకృతిప్రత్యయ విభాగరూప వ్యాకరణ త్వము లేదు. వీటికి శబ్దపారాయణ మను నామధేయమే యుక్తము.

*ఇంద్రవ్యాకరణము:-* బృహస్పతినుండి 'శబ్దపారాయణమును' అభ్యసించిన ఇంద్రుడు ఆ పద్ధతిలో నున్న క్లేశము నెరింగినవా డగుటచే ఒక నూత్నప్రక్రియను ఆవిష్కరించెను. అఖండరూపమున నున్న పదములను మధ్యకువిభజించి వాటిలోని కొంతభాగమును ప్రకృతిగను, కొంతభాగమును ప్రత్యయముగను నిర్ణయించు విధానమును కనుగొనెను. ఇప్పటినుండియే వాస్తవ మైన వ్యాకరణమునకు నాంది యేర్పడె నని చెప్పవచ్చును. "వాగ్వై పరాచ్య వ్యాకృతావదత్తే దేవా ఇన్ద్రమబ్రువన్ ఇమాం నో వాచం వ్యాకుర్వితి,..తామిన్ద్రో మధ్యతోఽవక్రమ్య వ్యాకరోత్" (తై.సం. 6-4-7) అనుతైత్తిరీయసంహితా వాక్యము, దానిపై "తామఖణ్డాం వాచం మధ్యే విచ్ఛిద్య ప్రకృతిప్రత్యయవిభా

గం సర్వత్రాకరోత్' అను సాయణాచార్యుని వ్యాఖ్యానమును ఈ విషయమును ధ్రువీకరించుచున్నవి.

*రెండు సంప్రదాయములు:-* వ్యాకరణమున ఐంద్రసంప్రదాయమనియు, మాహేశ్వరసంప్రదాయమనియు రెండు సంప్రదాయములుకలవు కాతంత్రవ్యాకరణము ఐంద్రసంప్రదాయమునకు సంబంధించినదనియు, పాణినీయ వ్యాకరణము మహేశ్వర సంప్రదాయమునకు సంబంధించినదనియు అభియుక్తోక్తి.

*పాణినికి పూర్వమునందున్న వ్యాకరణములు:-* పాణిని తన వ్యాకరణమునందు ఆపిశలి, కాశ్యపుడు, గార్గ్యుడు, గాలవుడు, చాక్రవర్మణుడు, భారద్వాజుడు, శాకటాయనుడు, శాకల్యుడు, సేనకుడు, స్ఫోటాయనుడు అను పదిమంది ప్రాచీన వ్యాకరణాచార్యులను పేర్కొనెను వీరేకాక ఇంకను మహేశ్వరుడు, బృహస్పతి, ఇంద్రుడు, వాయువు, భరద్వాజుడు, భాగురి, పౌష్కరసాది, కాశకృత్స్నుడు, రౌఢి, చారాయణుడు, మాధ్యందిని, వైయాఘ్రపద్యుడు, శౌనకి, గౌతముడు, వ్యాడి అను పదునైదుగురు వ్యాకరణాచార్యులు (పాణినికంటె పూర్వులు) ఉండెడివారని కొన్ని ప్రాచీన గ్రంథములనుండి తెలియుచున్నది. ప్రస్తుతము విదితములైయున్న పదిప్రాతిశాఖ్యములందును, ఏడు ఇతర వైదిక వ్యాకరణములందును దాదాపు ఏబదితొమ్మిదిమంది ప్రాచీనచార్యుల నామధేయములు పేర్కొనబడియున్నవి. ప్రాతిశాఖ్యములు గూడ ఒక విధముగ వైదికవ్యాకరణములేగాన వీటిలో పేర్కొనబడిన ఈ ప్రాచీనాచార్యులు వైయాకరణులని చెప్పుటకు సందేహములేదు. ఈ విధముగ పాణినికి పూర్వము, ప్రస్తుతము మనకు తెలిసినంతవరకు, రెండు మూడు పర్యాయములు ఆవృత్తములగు నామధేయములను తీసివేయగా ఏనుబదియైదు మంది వైయాకరణుల పేర్లు తెలియవచ్చుచున్నవి.

*ఎనిమిది వ్యాకరణములు:-* హైమబృహద్వృత్త్యవచూర్ణియందు ఎనిమిది వ్యాకరణములు పేర్కొనబడినవి.

"బ్రాహ్మమైశాన మైన్ద్రించ ప్రాజాపత్యం బృహస్పతిమ్
త్వాష్ట్రిమాపిశలంచేతి పాణినీయ మథాష్టమమ్"



ఋగ్వేద కల్పద్రుమమున బ్రాహ్మము చాంద్రము, యామ్యము, రౌద్రము, వాయవ్యము, వారుణము, సౌమ్యము, వైష్ణవము అను ఎనిమిది వ్యాకరణములు చెప్పబడినవి. బోపదేవవిరచితమగు కవికల్పద్రుమమునందలి-

'ఇన్ద్రశ్చన్ద్రః కాశకృత్స్నాపిశలీ శాకటాయనః,
పాణిన్యమరజైనేంద్రా జయన్త్యష్టాదిశాబ్దికాః'

అను శ్లోకము ఎనమండుగురు ప్రాచీన శాబ్దికులను పేర్కొనుచున్నది. ఇట్లే కొన్ని ఇతర గ్రంథములలో గూడ నామనిర్దేశపూర్వకముగను, తద్రహితముగను వ్యాకరణము లెనిమిదియుండెడివని చెప్పబడియున్నది.

*నవవ్యాకరణములు:-* శ్రీతత్త్వ వివేకమను నొక వైష్ణవ గ్రంథమునందు- ఐంద్రంచాంద్రం కాశకృత్స్నం కౌమారం శాకటాయనమ్, సారస్వతం చాపిశలం శాకల్యం పాణినీయకమ్' అను తొమ్మిది వ్యాకరణములు పేర్కొనబడినవి. ఇట్లే రామాయణాదులలోని 'సోఽయంనవవ్యాకరణార్థవేత్తా' (రామా. 7-36-47) ఇత్యాది వాక్యములు గూడ వ్యాకరణములు తొమ్మిదియని చెప్పుచున్నవి. కాశికావృత్తిలోని 'పంచవ్యాకరణః' అను పదము కాశికాకారునకు ఐదు వ్యాకరణములు తెలిసియుండునని సూచించుచున్నది. ఈ ప్రాచీన వ్యాకరణములలో కొన్ని (ప్రాతిశాఖ్యాదులు) వైదిక మాత్రములు; కాతంత్ర వ్యాకరణాదులు లౌకిక మాత్రములు, పాణినీయాదులు లౌకిక వైదిక వ్యాకరణములు.

ఈ వ్యాకరణములను పాణినికంటె ప్రాచీనములనియు అర్వాచీనములనియు రెండు విధములుగ విభజింపవచ్చును. పైన చూపిన 25గురు వ్యాకరణాచార్యులును, ప్రాతిశాఖ్యాదినిర్దిష్టులగు 59గురు ఆచార్యులును రచించిన వ్యాకరణములు మొదటి విభాగమునకు చెందినవి.

*పాణినీయమున స్మరింపబడని ప్రాచీన వైయాకరణులు:-*

*మహేశ్వరుడు:-* సారస్వతభాష్యమునందలి.

"సముద్రవత్ వ్యాకరణం మహేశ్వరే తదర్ధకుంభోద్ధరణం బృహస్పతౌ,
తద్భాగభాగాచ్చ గతం పురన్దరే కుశాగ్రబిందూత్పతితం హి పాణినౌ"

అను శ్లోకమును బట్టి మాహేశ్వరవ్యాకరణము అతివిస్తృతమైన దని తెలియుచున్నది. పాణినీయశిక్షకు చివర నున్న-

'యేనాక్షరసమామ్నాయమధిగమ్యమహేశ్వరాత్
కృత్స్నంవ్యాకరణం ప్రోక్తం తస్మై పాణినయే నమః'

అనుశ్లోకముచే 'అఇఉణ్' ఇత్యాది చతుర్దశ సూత్రములు మహేశ్వరోపజ్ఞము లనియు. ఈ సూత్రములనే గాక అనేకములగు ఇతర విషయములను కూడ పాణిని మహేశ్వరునినుండి గ్రహించి యుండు ననియు సూచిత మగుచున్నది. ఈ వ్యాకరణ మిపుడులభ్యము కాదు.

*బృహస్పతి వ్యాకరణము*:- వెనుక ఉదాహృతమగు మహాభాష్య వాక్యమును పట్టియు, న్యాయమంజర్యుదాహృతమగు-"తథాచ బృహస్పతిః-'ప్రతిపద మశక్యత్వాల్లక్షణస్యాప్యవ్యవస్థానాత్, తత్రాపిస్ఖలిత దర్శనాత్, అనవస్థా ప్రసంగాచ్చ మరణాన్తో వ్యాధిర్వ్యాకరణమితి ఔశనసః' ఇతి" అను వాక్యమును బట్టియు బృహస్పతి వ్యాకరణము నొకదానిని రచించి యుండవలెననియు, దాని పేరు శబ్దపారాయణమై యుండుననియు, అదియే ఐంద్ర వ్యాకరణమునకు మూలమై యుండుననియు తెలియుచున్నది.

*ఐంద్ర వ్యాకరణము*:- (9500-క్రీ పూ.)ఇది ఇపు డుపలభ్యమానము కాకున్నను; శాకటాయన (జైన) వ్యాకరణము, లంకావతార సూత్రము, హైమ బృహద్వృత్త్యవచూర్ణి మొదలగు గ్రంథములలో నిర్దిష్టమై యున్నది. అల్బేరూనీ తన యాత్రాగ్రంథమున ఈ వ్యాకరణమును పేర్కొనెను. పండ్రెండవ శతాబ్దికి పూర్వమునందు వెలసిన మహాభారత వ్యాఖ్యాతయగు దేవబోధుని-

'యాన్యుజ్జహార మాహేన్ద్రాద్వ్యాసోవ్యాకరణార్ణవాత్
పదరత్నాని కిం తాని సన్తి పాణినిగోష్పదే'

అను శ్లోకమును బట్టి ఈవ్యాకరణము పాణినీయముకంటె ఎన్నియో రెట్లు విస్తృతమైనదని తెలియుచున్నది. 'అథవర్ణసమూహః' అనునది ఐంద్రవ్యాకరణ ప్రథమసూత్రము. అర్థవత్తగు వర్ణసమూహము ఈవ్యాకరణమున పదముగ గ్రహింపబడును (అర్థఃపదమ్). పాణినీయమున సూచితములగు ఎన్నియో పరిభాషలు ఇందు స్పష్టముగ చెప్పబడినవి. ఇట్టి విషయములు అర్వాచీన గ్రంథములనుండి తెలియుచున్నవి.

*వాయవ్యవ్యాకరణము*:- (8500-క్రీ.పూ.)"వాగ్వైపరాచ్యవ్యాకృతావదత్, తేదేవా ఇన్ద్రమబ్రువన్ ఇమాంనోవాచం వ్యాకుర్వితి, సోఽబ్రవీద్వరం



వృణై, మహ్యంచైవవాయవేచ సహగృహ్యాతామితి" (తై.సం. 6-4-7) అను తైత్తిరీయసంహితా వాక్యము వాయువు వ్యాకరణ రచనయందు ఇంద్రునకు సహాయముచేసెనని సూచించుచున్నది. వాయుపురాణాదులలోని 'శబ్దశాస్త్రవిశారదః' (2-44) ఇత్యాది వాక్యములుగూడ వాయవ్యవ్యాకరణ మొకటి ఉండెనని సూచించుచున్నవి.

*భరద్వాజ వ్యాకరణము*:- (9300-క్రీ.పూ.) "బ్రహ్మ బృహస్పతయే ప్రోవాచ బృహస్పతిరిన్ద్రాయ, ఇన్ద్రోభరద్వాజాయ" ఇత్యాది ఋక్తంత్ర వాక్యముచే ఇంద్ర సంప్రదాయమునకు సంబంధించిన ఈవ్యాకరణముండెడిదని ఊహింపబడుచున్నది. 'భారద్వాజకమాఖ్యాతమ్'అను యజుఃప్రాతిశాఖ్యమునందలి కాత్యాయన వచనముచే భరద్వాజుడు తన వ్యాకరణమున ఆఖ్యాతము (క్రియ)లను గూర్చి విస్తృతముగ వ్రాసెనని తెలియుచున్నది.

*భాగురి వ్యాకరణము*:- (4000-క్రీ.పూ.) భాగురి పాణినీయమున స్మరింపబడకున్నను ఈతని మతము శాబ్దికులలో అధిక ప్రచారములోనున్నట్లు

"వష్టి భాగురిరల్లోపమవాప్యోరుపసర్గయోః
అపంచైవ హలన్తానాం యథా వాచానిశాదిశా"

అను సిద్ధాంతకౌముద్యాద్యుదాహృత శ్లోకములనుబట్టి తెలియుచున్నది. భాగురి స్మృతియని శబ్దశక్తి ప్రకాశికాది గ్రంథములందు ఉద్ధృతములగు-

'గుహూధూపచ్ఛిచ్ఛిపణి పనేరాయః కమేస్తుణిఙ్
ఋతేరియఙ్ చతుర్లేషు నిత్యం స్వార్థే పరత్ర వా'
అపాదాన సంప్రదాన కరణాధారకర్మణామ్
కర్తుశ్చాన్యోన్యసందేహే పరమేకంప్రవర్తతే"

ఇత్యాది కారికలనుబట్టి భాగురివ్యాకరణము శ్లోకబద్ధమైనట్లును, పాణిని వ్యాకరణముకంటె విస్తృతమైనట్లును తెలియుచున్నది.

*పౌష్కరసాది వ్యాకరణము*:- (3100-క్రీ.పూ.) 'చరోద్వితీయాః శరిపౌష్కరసాదేరితివాచ్యమ్' అను వార్తికమున పౌష్కరసాద్యాచార్యుడు పేర్కొనబడెను. దీనిచే ఈతడు వ్యాకరణము రచించెనని స్పష్టమగుచున్నది.

*చారాయణ వ్యాకరణము*:- (3100-క్రీ. పూ.) ఈ వ్యాకరణమును గూర్చి లౌగాక్షిగృహ్యసూత్రవ్యాఖ్యానమునందలి (5.1) 'తథాచచారాయణి

సూత్రమ్-'పురుకృతేచ్ఛత్రయోః' ఇతి పురుశబ్దః కృతశబ్దశ్చలుప్యతే యథా సంఖ్యం ఛే త్రే పరతః పురుచ్ఛదనం పుచ్ఛమ్, కృతస్యఛదనం వినాశనం కృచ్ఛ్రమ్'అను వాక్యమును బట్టియు 'కమ్బలచారాయణీయాః' ఓదనపాణినీయాః, ఘృతరౌఢీయాః' అను మహాభాష్యోదాహరణములచేతను (1-1-73) స్పష్టమగుచున్నది.

*కాశకృత్స్న వ్యాకరణము*:- (3100-క్రీ.పూ.) పాణినినాప్రోక్తం పాణినీయమ్, ఆపిశలమ్, కాశకృత్స్నమ్' అను భాష్యోదాహరణముల నుండియు, బోపదేవ క్షీరస్వామ్యాదుల రచనలనుండియు కాశకృత్స్న వ్యాకరణమునుగూర్చి మనకు తెలియుచున్నది. కాశకృత్స్నయధాతు పాఠమొకటి కాశకృత్స్న శబ్దకలాపధాతు పాఠమను పేరుతో కన్నడ వ్యాఖ్యానముతో లభించినది. ఆవ్యాఖ్యానమున 134 కాశకృత్స్న సూత్రములు గూడ ఉదాహరింపబడినవి. కాశకృత్స్న వ్యాకరణము ఏదియోయొక పూర్వవ్యాకరణమునకు సంక్షిప్తరూపమై యుండునని యు, కాని పాణినీయముకంటె విస్తృతమై యుండవచ్చుననియు 'కాశకృత్స్నం గురులాఘవమ్' అను కాశికాదులలోని ఉదాహరణవాక్యము సూచించుచున్నదనియు, కాశకృత్స్నుడు ప్రసిద్ధపదములకు మాత్రమే వ్యాకరణము రచించి అప్రసిద్ధపదములను పరిత్యజించుటచే తన వ్యాకరణమును సంక్షిప్త రూపమున వ్రాయగలిగెననియు, ఈవిధముగ పూర్వపూర్వ వ్యాకరణములకంటె ఉత్తరోత్తర వ్యాకరణములు సంక్షిప్తములగుచు వచ్చెననియు విమర్శకుల అభిప్రాయము. ఈతని వ్యాకరణము శ్లోకబద్ధము. ఉదా:- గృహాః పుంసిచభూమ్న్యేవ' 'అకర్మకేభ్యోధాతుభ్యో భావేకర్మణియఙ్ స్మృతః'మొ.

*శంతను వ్యాకరణము*:- (3100-క్రీ పూ.) ఇది శంతనువు అను ఆచార్యుడు రచించినది. ఇపుడు లభ్యమగుచున్న ఫిట్ సూత్రములు ఈ వ్యాకరణమునకు సంబంధించినవి.

*వైయాఘ్రపద్య వ్యాకరణము*:- (3100-క్రీ. పూ.) ఈవ్యాకరణమునుగూర్చి కాశికలోని 'గుణం త్వగన్తే నపుంసకే వ్యాఘ్రపదాంవరిష్ఠః' ఇత్యాది వాక్యములవలన తెలియుచున్నది. కాశికయందలి 'దశకాః వైయాఘ్రపదీయాః' అను వాక్యాంతరముచే ఈవ్యాకరణము దశాధ్యాయపరిమితమని ఊహింపవచ్చును.



*మాధ్యందిని వ్యాకరణము*:- (3000- క్రీ పూ.) కాశికయందలి 'సంబోధనే తూశనసత్రిరూపం సాన్తంతథానాన్తమథాప్యదన్తమ్
మాధ్యందినిర్వష్టి గుణం త్వగన్తే నపుంసకే వ్యాఘ్రపదాం వరిష్ఠః'
(7-1-94)అను శ్లోకము, ప్రక్రియా కౌముదిలోని 'ఇకః షణ్డేపి సంబుద్ధౌ గుణో మాధ్యందినేర్మతే' అను వాక్యమువలనను ఈ వ్యాకరణమునుగూర్చి తెలియుచున్నది.

*రౌఢివ్యాకరణము*:- (క్రీ. పూ. 3100) కాశికలోని 'ఆపిశలిపాణినీయాః' 'పాణినీయ రౌఢీయాః' 'రౌఢీయకాశకృత్స్నాః' అను ఉదాహరణములందు (6-2-36) వైయాకరణులగు ఆపిశలి, పాణిని కాశకృత్స్నులతో కలిపి చెప్పుటచే రౌఢిగూడ ఒక వ్యాకరణాచార్యుడని తెలియుచున్నది. మహాభాష్యమునందలి 'ఘృతరౌఢీయాః' అను ఉదాహరణము పైనచూపబడినది. రౌఢి తన శిష్యులకు ఎక్కువ నెయ్యి ఇచ్చుచుండెడివాడనియు, చదువుకంటె గూడ నేతిపై ఎక్కువ మక్కువచే ఆతనివద్ద శిష్యులు చేరుచుండెడి వారనియు దీనియర్థము.

*శౌనకి వ్యాకరణము*:- (3000-క్రీ పూ.) చరకసంహితావ్యాఖ్యాతయగు జజ్ఝటుడు 'కారణశబ్దస్తు వ్యుత్పాదితః- కరోతేరపి కర్తృత్వే దీర్ఘత్వం శాస్తిశౌనకిః' అనియు, భట్టికావ్యవ్యాఖ్యయగు జయమంగలయందు 'అవ' 'అపి' అను ఉపసర్గల అకారము లోపించునని చెప్పుసందర్భమున 'ధాఞ్ధాతోస్తని నహ్యోశ్చ బహులత్వేన శౌనకిః'అనియు శౌనకియను ఆచార్యుని నామధేయమును చెప్పుటచే ఆతడొక వ్యాకరణమును రచించెనని తెలియుచున్నది.

*గౌతమ వ్యాకరణము*:- (3000-క్రీ.పూ.) 'ఆపిశల పాణినీయవ్యాడి గౌతమీయాః' అను మహాభాష్యోదాహరణమున (6-2-36) ఆపిశలాదివైయాకరణులతో చెప్పబడియుండుటచేతను, 'ప్రథమపూర్వోహకారశ్చతుర్థంతస్య సస్థానం ప్లాక్షికౌండిన్య గౌతమ పౌష్కరసాదీనామ్'అను తైత్తిరీయ ప్రాతిశాఖ్య వాక్యముచేతను (5-38) గౌతముడొక వ్యాకరణమును రచించెనని తెలియుచున్నది.

*వ్యాడి వ్యాకరణము*:- (2900-క్రీ. పూ.) వ్యాడ్యాచార్యుని నామధేయము ఋక్ప్రాతిశాఖ్యమునందును మహాభాష్యాదులందును పేర్కొనబడినది. పురుషోత్తమదేవుడు భాషావృత్తియను గ్రంథమునందు 'ఇకాం యణ్భిర్వ్యవధానం

వ్యాడిగాలవయోరితి వక్తవ్యమ్' అను సూత్రమున వ్యాడి మతమును ఉదాహరించెను. ఈతనికి దాక్షాయణుడని నామాంతరము. ఈతడు దాక్షీపుత్రుడగు పాణినికి మేనమామయని చెప్పుదురు. ఈతడు పాణిని అష్టాధ్యాయిపై సంగ్రహమను అతివిస్తృత వ్యాఖ్యానము వ్రాసెను. సముద్రగుప్తుడు తన కృష్ణచరిత ప్రారంభమున వ్రాసిన 'రసాచార్యః కవిర్వ్యాడిః శబ్దబ్రహ్మైకవాఙ్మునిః, దాక్షీపుత్ర వచోవ్యాఖ్యాపటుర్మీమాంసకాగ్రణీః' అను శ్లోకము ఈవిషయమును ధ్రువీకరించుచున్నది. ఈగ్రంథము 'శోభనాఖలు దాక్షాయణస్య సంగ్రహస్యకృతిః' అని పతంజలి మన్ననలను చూరకొన్నది. 'ఇహ పురా పాణినీయేఽస్మిన్ వ్యాకరణే వ్యాడ్యుపరచితం లక్షగ్రంథ పరిమాణం సంగ్రహాభిధానం నిబంధమాసీత్'అను వాక్యపదీయ వ్యాఖ్యాతయగు పుణ్యరాజువాక్యము ఈ గ్రంథము లక్షగ్రంథ పరిమితమై అతివిస్తృతమైనదని చెప్పుచున్నది. ఏతద్గ్రంథ పఠనమానాడు అత్యధిక గౌరవహేతువుగ పరిగణింపబడెడిదట. ఈ గ్రంథమును బోధించు పాఠశాలలకు వ్యాడిశాలలనిపేరు ఉండెడిదట. పెండ్లి కావలెననుకొనెడువారు సంగ్రహమును చదివెడివారట. మహాభాష్య కాశికాదులలోని 'కుమారీదాక్షః' ('కుమార్యాదిలాభకామాః దాక్ష్యాదిప్రోక్తాని శాస్త్రాణ్యధీయన్తే, తచ్ఛిష్యతాంవా ప్రతిపద్యన్తే, తఏవం శిక్ష్యన్తే'-కాశిక 6-2-69) ఇత్యాద్యుదాహరణములు తెలుపుచున్నది. ఇందు మొత్తము 24000 విషయములు చర్చింపబడినవని మహాభాష్యవ్యాఖ్యానమున భర్తృహరి వ్రాసెను. వైయాకరణాభిమత దార్శనిక సిద్ధాంతములు గూడ ఇందు చర్చింపబడియుండును, అవియే భర్తృహర్యాదుల వాక్యపదీయాదులకు మార్గదర్శకములై యుండును. భర్తృహరి కాలమునాటికే సంగ్రహము కొంత వరకు పఠన పాఠనములనుండి దూరమగుచుండెడిదని వాక్యపదీయ ద్వితీయ కాండాంతమునందలి ఈ క్రింది శ్లోకములచే తెలియుచున్నది:-

'ప్రాయేణ సంక్షేపరుచీన్ అల్పవిద్యా పరిగ్రహాన్,
సంప్రాప్య వైయాకరణాన్ సంగ్రహేఽస్తముపాగతే,
కృతేఽథ పతంజలినా గురుణా-తీర్థదర్శినా
సర్వేషాం న్యాయబీజానాం మహాభాష్యేనిబంధనే'.

ఈ సంగ్రహమునే కాక ఈతడు ఒక వ్యాకరణ గ్రంథమును, పరిభాషా పాఠమును, లింగానుశాసనమును గూడ రచించెనని ఇతర గ్రంథముల ద్వారా తెలియుచున్నది.



## పాణిని పేర్కొనిన ఆచార్యులు

ఆపిశలి:- (3000-క్రీ.పూ.) ఆపిశలి నామధేయము 'వా సుప్యాపిశలేః' అను పాణిని సూత్రమునందు పేర్కొనబడినది. మహాభాష్యాదులలో గూడ ఆపిశలి మతము, అనేకములగు ఆపిశలి సూత్రములును ప్రమాణరూపమున ఉట్టంకింపబడినవి. 'ఆపిశలి శాలలు'అను పేరుతో ప్రసిద్ధములగు పాఠశాలలలో ఆపిశల వ్యాకరణ పఠనపాఠనములు జరుగుచుండెడివని తెలియుచున్నది.

గ్రంథాంతరములం దుపలభ్యమానములగు 'అష్టకా ఆపిశల పాణినీయాః' ఇత్యాద్యుదాహరణములచే ఆపిశలి వ్యాకరణము గూడ అష్టాధ్యాయ పరిమితమని తెలియుచున్నది. మహాభాష్యమునందలి 'ఆపిశలమధీతే ఆపిశలా బ్రాహ్మణీ' అను ఉదాహరణము పతంజల్యాదుల కాలమునాటికి ఆపిశల వ్యాకరణము అతి విపుల ప్రచారములో నుండెడిదనియు, స్త్రీలుకూడ ఆవ్యాకరణమును చదువుచుండెడివారనియు తెలిపుచున్నది. ఈ వ్యాకరణము లౌకిక వైదిక భాషలకు రెండింటికిని సంబంధించి పాణినీయముకంటె కొంతవరకు విస్తృతమైయుండెడిది. సూత్రనిర్మాణము (ఉదా:- 'మన్యకర్మణ్యనాదరే ఉపమానే విభాషా ప్రాణిషు' ను), 'విభాషా' 'గుణ' 'సార్వధాతుక' మొదలగు సంజ్ఞలు, 'టాప్' 'శన్' 'శప్' మొదలగు ప్రత్యయములు, 'భష్' మొదలగు ప్రత్యాహారములు, వీటి సామ్యమునుబట్టిచూడ పాణినీయ వ్యాకరణము ఆపిశల వ్యాకరణమును దగ్గరగ అనుసరించెనని తెలియుచున్నది. పదమంజరీకారుడగు హరదత్తుని ఈ క్రింది వాక్యము పైవిషయమునకు పోద్బలకముగా నున్నది. "కథం పునరిదమాచార్యేణ పాణినినావగతమేతే సాధవఇతి, ఆపిశలేన పూర్వవ్యాకరణేన, ఆపిశలినా తర్హి కేనావగతమ్? తతః పూర్వేణ వ్యాకరణేన" "పాణినిరపి స్వకాలే శబ్దాన్ ప్రత్యక్షయన్ ఆపిశలాదినా పూర్వస్మిన్నపి కాలే సత్తామనుసన్ధత్తే, ఏవమాపిశలిరపి". పైవాక్యములచే వ్యాకరణరచనయనునది ఒక అవిచ్ఛిన్న ప్రవాహముగ సాగినదనియు, పాణిని ఆపిశల్యాది వ్యాకరణముల సహాయముతోడనే తన వ్యాకరణమును సంతరించుకొనెననియు స్పష్టమగుచున్నది. ఆపిశలి తన వ్యాకరణమునకు అంగముగా ధాతుపాఠ, గణపాఠ శిక్షలను కూడ రచించెను. ప్రస్తుత మ్పలభ్యమానమగుచున్న పంచపాది ఉణాది సూత్రపాఠము ఆపిశలి రచితమని విమర్శకుల అభిప్రాయము.

కాశ్యపుడు:- (3000-క్రి. పూ.) పాణిని అష్టాధ్యాయిలో రెండు స్థానములందు (1-2-25;8-4-67) కాశ్యపుని మతమును చూపెను. దీనిని బట్టియు, ఇతర గ్రంథములను బట్టియు ఈతడు వ్యాకరణ గ్రంథమును రచించెనని తెలియుచున్నది గాని అది లభ్యముకాదు.

గార్గ్యుడు:- (3100-క్రీ.పూ.) అష్టాధ్యాయిలో ఈతని నామధేయము మూడు సూత్రములలో (7-3-99;8-3-20;8-4-67) గ్రహింపబడినది. ఈతని వ్యాకరణము సర్వాంగ పూర్ణమైనదిగ ఊహింపబడుచున్నది గాని ఇప్పుడు లభ్యమగుటలేదు.

గాలవుడు:- (3100-క్రీ.పూ.) అష్టాధ్యాయిలో ఈతనిమతము నాల్గు స్థలములందు చూపబడినది. పురుషోత్తమదేవుడు తన భాషావృత్తియందు (1-1-77) 'ఇకాంయణ్పూర్వ్యవధానం వ్యాడిగాలవయోరి వక్తవ్యమ్' అని వ్రాయుచు వ్యాడిగాలవుల మతము ప్రకారము యణ్ ఆదేశముగనే గాక, ఆగమముగ కూడ వచ్చుటచే 'దధ్యత్ర' 'మధ్వరిః', వలె 'దధియత్ర' 'మధువరిః' ఇత్యాది ప్రయోగములుకూడ సాధువని వ్రాసెను. 'భ్వాదయః' అనుటకు బదులు 'భూవాదయోధాతవః' అని వ్రాయుటచే ఈమతము పాణినికికూడ అంగీకార్యమేయని తోచుచున్నది. ఈవిధముగ గాలవరచితమగు వ్యాకరణ మొకటి యుండెడిదనుట నిశ్చితము.

చాక్రవర్మణుడు:- (3000-క్రీ.పూ.) ఈతనిపేరు 'ఈ చాక్రవర్మణస్య' అను సూత్రమునందు గ్రహింపబడినది. దీనిని బట్టియు, ఇతర గ్రంథములనుబట్టియు ఈతడొక వ్యాకరణమును రచించెనని తెలియుచున్నది.

భారద్వాజుడు:- (3000-క్రీ. పూ.) 'ఋతో భారద్వాజస్య' అను పాణిని సూత్రమునందును (7-2-63) తైత్తిరీయ ప్రాతిశాఖ్య మైత్రాయణీయ ప్రాతిశాఖ్యలందును నిర్దిష్టుడగు ఈతడు వ్యాకరణకర్తయై యుండవలెను. ప్రస్తుతమీతని వ్యాకరణము స్వరూపస్వభావములను తెలియునవకాశములేదు. భారద్వాజకృతములని మహాభాష్యమునందు చెప్పబడిన కొన్నివార్తికములు ఏతత్కృతములై యుండవచ్చును.

శాకటాయనుడు:- (3000-క్రీ పూ.)పాణిని ఈతనిని మూడు స్థలములందు పేర్కొనెను. వాజసనేయ ప్రాతిశాఖ్య. ఋక్ప్రాతిశాఖ్య, యాస్కనిరుక్త



మహాభాష్యాదులందుగూడ ఈతడు మహావైయాకరణుడుగ చెప్పబడినాడు. భాష్యకారుడొకచోట 'కొందరు మెలకువగనే యుండికూడ తమ కండ్ల ఎదుట ఏమి జరుగుచున్నదో తెలిసికొనజాలరు. బండ్లుపోయే మార్గమున కూర్చుండి (వాటికై ప్రతీక్షించుచుండిన) శాకటాయనుడు ఎదుటపోవుచున్న బండ్లను గుర్తింపజాలక పోయెను.'-"అథవా భవతికశ్చిత్ జాగ్రదపి వర్తమానకాలంనోపలభతే, తద్యథా వైయాకరణానాం శాకటాయనోరథమార్గ ఆసీనః శకటసార్థం యాన్తంనోపలేభే" (3-2-115) అని శాకటాయనుని పరధ్యానమును గూర్చిన ఒక సంఘటనను ఉట్టంకించియున్నాడు. దానిబట్టి ఈతడు Professorial forgetfulness గల మహాపండితుడనియు, ఈతని నామధేయము పౌరుషనామధేయమనియు సూచితమగుచున్నది. కాశికలోని 'అనుశాకటాయనం వైయాకరణాః' 'ఉపశాకటాయనం వైయాకరణాః' ఇత్యాద్యుదాహరణములచే ఇతరవైయాకరణులందరును శాకటాయనుని ముందు దిగదుడుపని తెలియుచున్నది. ఈ వ్యాకరణమిపుడు లభించుటలేదు. దీనివైశిష్ట్యమునుగూర్చి మనకు అర్వాచీన గ్రంథములనుండి మాత్రమే తెలియుచున్నది. ఈ వ్యాకరణము లౌకికవైదిక భాషలు రెండిటికిని సంబంధించినది. శాకటాయనుడు నామవాచక పదములన్నియు ధాతుజన్యములని అంగీకరించుటయే కాక శాకపూణి మొదలగు ప్రాచీన నిరుక్తకారులవలె ఒకే నామవాచకపదము విభిన్నధాతువులనుండి నిష్పన్నమగునట్లు గూడ అంగీకరించెను. ఉదాహరణకు 'సత్య'శబ్దము 'ఇణ్' ధాతువునుండియు అసధాతువునుండియుగూడ నిష్పన్నమైనట్లు ఈతడంగీకరించినట్లు తెలియుచున్నది. ఈతని మతము ప్రకారము శబ్దములు జాతిగుణ క్రియావాచక రూపమున మూడు విధములు. ఈతడు 'అచ్ఛ' 'శ్రద్' 'అన్తర్'అను వాటిని గూడ ఉపసర్గలుగ అంగీకరించెను.

శాకల్యుడు:- (3100-క్రీ.పూ.) పాణిని ఈతనిని నాలుగు పర్యాయములు పేర్కొనెను. ఈతని వ్యాకరణము కూడ లౌకికవైదికభాషలు రెండింటికిని సంబంధించినది. ఇది అలభ్యము.

సేనకుడు:- (2950-క్రీ.పూ.) 'గిరేశ్చ సేనకస్య' అనుసూత్రమున పాణిని ఈతని నామధేయమును గ్రహించుటచే ఈతడుకూడ వ్యాకరణకర్తయని తెలియుచున్నది.

స్ఫోటాయనుడు:- (2950-క్రీ.పూ.) 'అవఙ్ స్ఫోటాయనస్య' అను సూత్రమునందు నిర్దిష్టుడగు స్ఫోటాయనుడు పదమంజరీకారుని వచనమునుబట్టి స్ఫోటవాదమును ఇదంప్రథమముగ ఆవిష్కరించిన వైయాకరణుడని ఊహింపబడుచున్నది. భరద్వాజాచార్యుడు తన యంత్రసర్వస్వమను గ్రంథమునందలి వైమానిక ప్రకరణమున 'చిత్రిణ్యేవేతి స్ఫోటాయనః' అను సూత్రమునందు స్ఫోటాయనుని నామధేయము నుదాహరించుటచే ఈతడు గొప్పవైజ్ఞానికుడు గూడ అయి ఉండవచ్చునని పండితుల అభిప్రాయము.

పాణిని:- (2900-క్రీ.పూ.) పాణిని సంస్కృత వైయాకరణులలోనే గాక ప్రపంచమునందలి సర్వభాషా వైయాకరణులలో అత్యున్నతమగు గౌరవార్హ స్థానము నాక్రమించియున్నాడు. ఈతడు రచించిన వ్యాకరణముతో పోల్చదగిన వ్యాకరణము ప్రపంచమునందలి ప్రాచీన భాషలకుగాని అర్వాచీన భాషలకుగాని నాటినుండి నేటివరకు రచింపబడలేదను విషయము సర్వపండితలోకాంగీకృతము. ఈ వైయాకరణమూర్ధన్యుడు అనేక గ్రంథములందు పాణిన, పాణిని, దాక్షీపుత్ర, శాలంకి, శాలాతురీయ, ఆహిక, పాణినేయ, పణిపుత్ర అను ఏనిమిది నామధేయములతో ప్రసిద్ధి పొందియున్నాడు. ఈతడు సంగ్రహకారుడగు వ్యాడికి మేనల్లుడు. ఛందశ్శాస్త్ర ప్రవక్తయగు పింగలుడు ఈతని తమ్ముడు. ఈతని గురువు ఉపవర్షుడని లోకప్రతీతి. 'ఉపసేదివాన్ కౌత్సః పాణినిమ్' ఇత్యాదిభాష్య ప్రయోగములనుబట్టి కౌత్సుడు ఈతని ప్రధాన శిష్యులలో ఒక్కడని తెలియుచున్నది. వరరుచ్యపర నామధేయుడును వార్తికకారుడును అగు కాత్యాయనుడు గూడ ఈతని శిష్యుడేయని ప్రసిద్ధి. వీరిరువురే కాక పాణినివద్ద ఎందరో శిష్యులుండెడివారనియు వారిలో కొందరికి పూర్వపాణినీయులనియు, కొందరికి అపరపాణినీయులనియు పేరులుండెడివనియు కాశికాకారుని ద్వారా తెలియుచున్నది. (6-2-104). "ఉభయథాహ్యాచార్యేణ శిష్యాః సూత్రం ప్రతిపాదితాః కేచిదాకడారాదేకాసంజ్ఞా ఇతి; కేచిత్ ప్రాక్కడారాత్పరం కార్యమితి"అను భాష్యకార వాక్యముకూడ (1-4-1) పాణినివద్ద ఎందరో శిష్యులుండెడివారనియు, వారికి అనేక పర్యాయములు ఆయన తన వ్యాకరణమును బోధించెననియు అట్లు బోధించునపుడు కొన్నికొన్ని సూత్రములలో పాణినియే పాఠభేదములను ప్రవేశపెట్టెననియు తెలియుచున్నది. ఈతని పూర్వులు పంజాబు ప్రాంతమునందు నివసించెడివారు. ఈతడు సింహము ఘాతబడి మరణించెనని



ఒక ప్రసిద్ధ శ్లోకము చెప్పుచున్నది. ఈతడు మరణించినరోజు త్రయోదశితిథి యని వైయాకరుణులలో ప్రసిద్ధి. ఏమాసమో, పక్షమో తెలికపోవుటచే త్రయోదశీ తిథిని పాణినీయా నధ్యాయదివసమునుగా పరిగణించుట నేటికి పరిపాటియై యున్నది.

ఈతని కాలమును గూర్చి పండితులలో విప్రతిపత్తిగలదు. కొందరు క్రీస్తుకు పూర్వం 7వ శతాబ్దికి చెందినవాడని అంగీకరింపగా మరికొందరు క్రీస్తుకు పూర్వం 4వ శతాబ్దికి చెందినవాడని చెప్పుదురు. విమర్శకాగ్రేసరులగు యుధిష్ఠిర మీమాంసకులు ఎన్నియో ఆంతరంగిక బహిరంగ ప్రమాణములను ఆధారముగగొని పాణిని క్రీస్తుకు పూర్వము దాదాపు 2900 సంవత్సరముల ప్రాంతమువాడై యుండునని నిర్ణయించి యున్నారు.

పాణిని తనకాలమునాటి సార్వజనికమగు సంస్కృత భాషకు వ్యాకరణము రచించిన వ్యాకరణశాస్త్రమాత్ర వేత్తయేకాదు; సమస్త ప్రాచీన వాఙ్మయము, నాటి భూగోళమునకు సంబంధించిన విషయములు, ఆచారవ్యవహారాదులు, రాజకీయ వాణిజ్యాది విషయములు, తదితర లౌకిక వ్యవహారములన్నియును అతనికి కరతలామలకము వలెనుండెడివి. వాసుదేవశరణ అగ్రవాల్ మొదలగు విమర్శకులు అష్టాధ్యాయిని బాగుగ పరిశీలించి రచించిన 'ఇండియా ఇన్ పాణినిస్ టైమ్' ఇత్యాది గ్రంథములవలన ఈ విషయము స్పష్టమగును.

భాష్యకారుడగు పతంజలి అభిప్రాయము ప్రకారము పాణిని సూత్రము నంచలి ఒక్క అక్షరము కూడ వ్యర్థమగుటకు వీలులేదు. "ప్రమాణభూత ఆచార్యోదర్భ పవిత్రపాణిః శుచావవకాశే ఉపవిశ్య మహతా ప్రయత్నేన సూత్రాణి ప్రణయతిస్మ. తత్రాశక్యం వర్ణేనాప్యనర్థకేన భవితుమ్, కిం పునరియతా సూత్రేణ" (మ.భాష్య.1-1-1) "సామర్థ్యయోగా న్నహికించిదస్మిన్ పశ్యామి శాస్త్రే యదనర్థకంస్యాత్" (మ. భాష్య. 6-1-77) (ఈ శాస్త్రమునందలి సూత్రములన్నియు పరస్పర సంబద్ధములగుటచే దీనిలో నిరర్థకమైన దొక్కటియు నాకు కానరాదు). ఇట్లే "ఉదక్చ విపాశః" అనుసూత్రమునకు వృత్తి వ్రాయుచు జయాదిత్యుడు "మహతీ సూక్ష్మేక్షికావర్తతే సూత్రకారస్య" అని పాణినికిగల సూక్ష్మేక్షికను కొనియాడినాడు.

"పాణిని మహర్షి శ్రద్ధాపూర్ణమానసముతో శబ్దభండారములోనున్న శబ్దములను ఏరి, సహస్ర శ్లోకపరిమితమగు వ్యాకరణమును రచించెను. (నేడు వద

సంఖ్యను ప్రమాణముగా గ్రహించు ఆంగ్ల సంప్రదాయమున్నట్లు శ్లోకచందస్సునందు 32 అక్షరములుండును గాన దానినొక పరిమాణముగ గ్రహించి గ్రంథ ప్రమాణమును నిర్ణయించుట ప్రాచీన పద్ధతి). దీనిలో అంతవరకు లిఖితమగు ప్రాచీన నవీనజ్ఞానమంతయు పరిసమాప్తి నొందినది. వర్ణపదాదుల విషయమున ఇక చెప్పవలసిన విషయమేదియు మిగులలేదు" అని ప్రసిద్ధ చైనాదేశ యాత్రికుడగు హ్యూయన్‌సాంగ్ వ్రాసియున్నాడు. పాణిని ప్రతిభను కొనియాడని పాశ్చాత్యవైయాకరుణుడొక్కడునులేడు.

పాణిని తన అష్టాధ్యాయిని 'వృద్ధిరాదైచ్' అను సూత్రముతో ప్రారంభించెననియు 'అథ శబ్దానుశాసనమ్' అనునది భాష్యకారుని వాక్యమనియు కైయటాదుల అభిప్రాయము. కాని ప్రాచీన సూత్రకార సంప్రదాయము ననుసరించి చూడ 'అథ శబ్దాను శాసనమ్' అనునదియే అష్టాధ్యాయీ ప్రథమ సూత్రమైయుండవలెనని చెప్పుచు, యుధిష్ఠిర మీమాంసకులు "వ్యాకరణ శాస్త్రమారభమాణో భగవాన్ పాణినిమునిః ప్రయోజననామనీ వ్యాచిఖ్యాసుః ప్రతిజానీతే-అథ శబ్దానుశాసనమితి" అను భాషావృత్తి వ్యాఖ్యాతయగు సృష్టిధరాచార్యుని వాక్యమును, తదితరములగు అనేక ప్రమాణములను చూపియున్నారు. ఇట్లు 'అఇఉణ్'మొదలగు ప్రత్యాహార సూత్రములు కూడ పాణిని విరచితములేయై యుండవలెనను దయానందసరస్వతీ మతమును సమర్థించుచు వీరు తగు ప్రమాణములను చూపియున్నారు.

పాణిన్యష్టాధ్యాయి యథాతథముగ సురక్షితమై యున్నది. పాఠాంతరములు చాలస్వల్ప సంఖ్యాకములు మాత్రమే కనబడుచున్నది. ఇందు కొన్ని పాఠాంతరములు పాణిని ప్రవచనభేదముచే వచ్చినవి, (ఇవి అత్యల్పములు) కొన్ని వృత్తికారాదులద్వారా వచ్చినవి, కొన్ని లేఖక ప్రమాదజన్యములు. కొన్ని స్థలములలో వార్తికాంశములను సూత్రములందుచేర్చి పఠించుటచే పాఠభేదములు వచ్చినవి. సూత్రములలో ఈవిధమగు మార్పుచేసినవాడు కాశికాకారుడని కైయటహర దత్తాదులాక్షేపించి యున్నారు. కాని సూక్ష్మపరిశీలనముచే కాశికాకారునికంటె పూర్వమే ఈపని జరిగియుండునని తెలియుచున్నది.

పాణిని వేరువేరు శిష్యగణములకు తన అష్టాధ్యాయిని బోధించునపుడు కొంచెము మార్పులు చేయుటచే మూడు విధములగు పాఠము లేర్పడినవి ఈ భేదము ధాతుపాఠ, గణపాఠ ఉణాది పాఠములందు గూడ కనబడుచున్నది. కాశికాకారాదు లనుసరించిన పాఠము ప్రాచ్యపాఠము, క్షీరస్వామి మొదలగు కాశ్మీరీయులనుసరించినది ఉదీచ్యము, కాత్యాయనుడు వార్తికములను చేర్చినపాఠము దాక్షిణాత్యపాఠము. ప్రాచ్యపాఠమును వృద్ధపాఠమనియు, ఉదీచ్యదాక్షిణాత్య పాఠములను లఘుపాఠములనియు విభజింప వచ్చును. అందు ఉదీచ్య దాక్షిణాత్య పాఠములనడుమనున్న భేదము అతిస్వల్పము.



పాణిని వ్యాకరణమునకు అష్టాధ్యాయి, అష్టకము, శబ్దానుశాసనము, వృత్తి సూత్రము, అష్టికా మొదలగు నామధేయములుకలవు. అందు మొదటిది అతిప్రసిద్ధమైనది.

చాంద్ర వ్యాకరణాదులలో 'పాణినోపజ్ఞమకాలం వ్యాకరణమ్' 'పాణిన్యుపజ్ఞమకాలం వ్యాకరణమ్' అను రెండు వాక్యములున్నవి. పాణినికంటె పూర్వమునందున్న వైయాకరణులు భూతవర్తమానాది కాలముల స్వరూపమును స్పష్టీకరించియున్నారు. కాని పాణిని లోకప్రసిద్ధములగుటచే ఆవిశేషములను తన వ్యాకరణమునందు చూపలేదని పై వాక్యమున కభిప్రాయము.

పాణినీయ వ్యాకరణము ప్రాచీన వ్యాకరణములకంటె కొంతవరకు సంక్షిప్త రూపమునన్నది. ఈతడు ప్రాచీన వ్యాకరణములందలి కొన్ని విషయములను ప్రసిద్ధములగుటచే మరల తన వ్యాకరణమున చెప్పలేదు. కొన్నిపదములను సాధించుటకు ప్రయత్నముచేయక వదిలివేసెను. ఉదాహరణకు 'క్షిణోతి' 'ఋణోతి' తృణోతి ఇత్యాదులందు ఉపధాగుణ నిషేధక సూత్రము పాణినీయమునలేకుండుటచే మాధవీయ ధాతువృత్తియందు ఆపిశలి సూత్రమును ప్రమాణముగ చూపవలసి వచ్చినది. 'నైకముదాహరణం యోగారంభం ప్రయోజయతి' (మహా.భా. 7-1-96) ఇత్యాది మహాభాష్య వాక్యములనుపట్టి పాణిని ఒకటిరెండు ఉదాహరణలకు మాత్రమే సంబంధించెడి నియమములను విధించలేదని తెలియుచున్నది. 'తద్ధి శాస్త్రప్రాయోవాదోయదుత తద్ధితమూఢాః పాణినీయాః' అను కావ్యమీమాంసయందలి రాజశేఖర వాక్యముచే పాణినీయమందలి తద్ధిత ప్రకరణము సంక్షిప్త రూపమునన్నదని తెలియుచున్నది ఇట్లే పాణిని 'జనికర్తుః' 'తత్ప్రయోజకః' ఇత్యాదులందు తనవ్యాకరణము ననుసరించి అసాధువగు సమాసమును చేయుటచే ఇట్టి ప్రయోగములు పూర్వ వ్యాకరణ సిద్ధములని సూచించియున్నాడు. ఈవిధముగ పాణిని తనకాలమున ప్రచుర ప్రచారములోనున్న పదములకు మాత్రము వ్యాకరణము వ్రాసియున్నాడు. అందుచే ఆతని వ్యాకరణము ననుసరించి సిద్ధింపని పదములను గూడ సాధువులుగ గ్రహింప

వలసియుండును. 'పురాణ' 'సర్వనామ' గ్రంథవాచి 'బ్రాహ్మణ' శద్దాదులను పాణినీయ నిపాతత్వముచే సాధువులని అంగీకరించినట్లు ఇతర పదములను గూడ సాధువులని అంగీకరింపవలెననియు విమర్శకులు చెప్పుదురు. కావుననే మహాభారత వ్యాఖ్యాకారుడగు దేవబోధుడు-

"నదృష్ట ఇతివైయాసే శబ్దే మా సంశయం కృథాః
అజ్ఞైరజ్ఞాతమిత్యేవ పదం న హి న విద్యతే,
యాన్యుజ్జహార మాహేంద్రాత్ వ్యాసో వ్యాకరణార్ణవాత్
పదరత్నాని కిం తాని సన్తి పాణినిగోష్పదే"

అని వ్రాసియున్నాడు.

సూత్రశబ్దమునకు 'సూచనాత్ సూత్రమ్' (సుశ్రుత-సూత్రస్థానము), 'సూచయతి, సూతే, సూత్రయతి వా సూత్రమ్', "సూత్రం-సూచనకృత్ సూత్యతే గ్రథ్యతే ఇతి సూత్రమ్, సూచనాద్వా", 'అల్పాక్షరమసందిగ్ధం సారవద్విశ్వతో ముఖమ్, అస్తోభమనవద్యంచ సూత్రం సూత్రవిదోవిదుః' ఇత్యాది నిర్వచనములు ప్రసిద్ధమైనవి. తక్కువ శబ్దములతో ఎక్కువ అర్థములను సూచించుట సూత్రలక్షణము. పాణిని తన సూత్రములను శబ్దలాఘవముతోపాటు అర్థలాఘవమును గూడ దృష్టిలోనుంచుకొని రచించెను. కావుననే ఆతడు పఠితృసౌకర్యార్థమై ప్రాచీనవైయాకరణ ప్రసిద్ధములగు సర్వనామాది సంజ్ఞలను గ్రహించుటయేకాక ప్రసిద్ధములగు ప్రాచీన సూత్రములను గూడ కొద్దిమార్పులతో తన గ్రంథమునందు గ్రహించెను. పాణినీయమునందలి శ్లోకచ్ఛాయగల సూత్రములు శ్లోకరూపముననున్న ప్రాచీన వ్యాకరణ సూత్రముల కనుకరణములనియు, ఇట్లే 'అజ్' మొదలగు ప్రాచీన ప్రత్యయములను, సంజ్ఞలను గ్రహించి రచించిన సూత్రములు గూడ పూర్వవ్యాకరణగతములై యుండుననియు విమర్శకుల అభిప్రాయము. ఉదాహరణకు:- 'పక్షిమత్స్యమృగాన్ హన్తి పరిపన్థంచతిష్ఠతి' "తదస్మైదీయతే యుక్తం శ్రాణామాంసౌదనాట్టిఠన్" 'నోదాత్తస్వరితోదయమ్' 'వృద్ధిరాదైజదేఙ్గుణః' 'ఇగ్యణః సంప్రసారణమ్', 'తజానావాత్మనేపదమ్', 'కృత్తద్ధిత సమాసాశ్చ' మొదలగు వాటియందు శ్లోకచ్ఛాయ యున్నది. 'ఆజీచాపః' 'ఔఙఆపః' ఇత్యాదులందు ప్రాచీన వ్యాకరణగత ప్రత్యయములును, 'ఉభయథర్క్షు' 'గోతోణిత్' ఇత్యాదులలోని 'ఉభయథా' 'గో', (ఓకారాంతశబ్దములకు 'గో' అని ప్రాచీన వైయాకరణసంజ్ఞ), 'అన్యతరస్యామ్' మొదలగు ప్రాచీన



సంజ్ఞలును ఉపయుక్తమైనవి. 'శ్నసోరల్లోపః' (6-4-11) అను సూత్రమునందు 'అస్' ధాతవు ఆపిశలి గణపాఠము ననుసరించి 'స్' అని నిర్దేశింపబడినది. "సకారమాత్రమ స్తిధాతు మాపిశలి రాచార్యః ప్రతిజానీతే. తథాహి న తస్య పాణినేరివ 'అసభువి' ఇతిగణ పాఠః, కింతర్హి 'సభువి' ఇతి స పఠతి" అని న్యాసకారుడు (1-3-22) వ్రాసియున్నాడు. పూర్వవ్యాకరణములందు కార్యిని షష్ఠిచే నిర్దేశించుటకుబదులు ప్రథమచే నిర్దేశించుట పరిపాటి. "పూర్వవ్యాకరణే ప్రథమయా కార్యీ నిర్దిశ్యతే" (కైయ-1-1-163) "పూర్వాచార్యాః కార్యభాజః షష్ఠ్యా న నిరదిక్షన్" (కైయ-8-4-7) అనికైయటుడు. పాణిని 'అల్లోపోऽనః' 'తివింశతేర్డితి' ఇత్యాదులందు ఈ పద్ధతినవలంబించెను. ఇట్టిస్థలములలోని పాణిని సూత్రములు ప్రాచీన వైయాకరణానుకరణములని ఊహింపవచ్చునని విమర్శకుల అభిప్రాయము.

ఈవిధముగ పాణిని శిష్యసౌకర్యార్థమై చాలవరకు ప్రచురప్రచారములో నున్న ప్రాచీన వైయాకరుణల మార్గమునవలంబించుచు తన బుద్ధిచాతుర్యముచే ఎన్నియో క్రొత్త సంవిధానములను గూడ చేసికొనుచు అత్యద్భుతమగు అష్టాధ్యాయి గ్రంథమును నిర్మించెను. ఇందు ఒక్కొక్క అధ్యాయములో నాలుగేసిపాదములున్నవి. ఈపాదములను మొదటనున్న సూత్రమునుబట్టి 'గాంకుటాది పాదము' 'భూపాదము' మొదలగు పేర్లతో పేర్కొనుట అలవాటులో నుండెడిదట.

అష్టాధ్యాయికి సహాయకముగనుండుటకై పాణిని ధాతుపాఠ, గణపాఠ, ఉణాదిసూత్ర, లింగానుశాసనలములను రచించెను. పాణిని తన అష్టాధ్యాయిని శిష్యులకు బోధించుసమయమున తత్సౌకర్యార్థమై వృత్తినికూడ రచించియుండునని ఊహింపబడుచున్నది. శబ్దోశ్చారణ జ్ఞానమునకై పాణిని సూత్రాత్మకమగు ఒక శిక్షాగ్రంథమును రచించెను. లుప్తప్రాయమగు దీనిని దయానంద సరస్వత్యాదులు ప్రాచీన గ్రంథములనుండి ఉద్ధరించిరి. ఇదికూడ ఆపిశలి శిక్షాసూత్రమువలె ఎనిమిది ప్రకరణములలో విభక్తమైనది. ఈ సూత్రములకు ఆపిశలి సూత్రములతో చాలపోలికలున్నవి. దీనిలో లఘుపాఠము గురుపాఠము అను పాఠద్వయమున్నట్లు తెలియుచున్నది. పాణినీయ శిక్షయను పేరుతో ప్రసిద్ధమగు శ్లోకరూపమగు శిక్ష ఆతని అనుజుడగు పింగలుని రచనయని శిక్షాప్రకాశటీకాకారుని "జ్యేష్ఠభ్రాతృభిర్విహితే వ్యాకరణేऽనుజస్తత్రభవాన్ పింగలా

చార్యస్తన్మతమనుభావ్య శిష్యం వక్తుం ప్రతిజానీతే'' అను వాక్యమువలన తెలియుచున్నది. ఇందుగూడ లఘుపాఠము, బృహత్పాఠము అను పాఠద్వయమున్నది. వీటికి వరుసగ 'యాజుషపాఠ' 'ఆర్చపాఠ'ములని పేరు.

పాణిని జాంబవతీ పరిణయమను మహాకావ్యమునుకూడ రచించెను. లండన్‌లోని ఇండియా ఆఫీస్ లైబ్రరీలోనున్న ద్విరూపకోశమను ఒకచిన్న గ్రంథము కూడ పాణిని రచితమని చెప్పబడుచున్నది. పూర్వపాణినీయమను పేరనున్న 24 సూత్రముల గ్రంథము పాణిని విరచితమను విషయమున పండితులలో వి ప్రతిపత్తిగలదు.

వార్తికములు:- అష్టాధ్యాయిపై ఎందరో పండితులు వార్తికములను రచించియుండిరి. పతంజలి కొందరిపేర్లను మాత్రమే పేర్కొనినాడు. చాలమంది వార్తికములను 'అపరఆహుః' అని మాత్రమే ఉదాహరించినాడు. ప్రస్తుతము మనకు కాత్య లేక కాత్యాయనుడు, భారద్వాజుడు, సునాగుడు, క్రోష్ట, బాడవుడు, అను ఐదుగురు వార్తికకారుల నామధేయములు మాత్రమే తెలియుచున్నవి.

"ఉక్తానుక్తదురుక్తానాం చిన్తా యత్ర ప్రవర్తతే,
తం గ్రన్థం వార్తికం ప్రాహుర్వార్తికజ్ఞా మనీషిణః''

అను వార్తిక లక్షణము ప్రసిద్ధము. వ్యాకరణ శాస్త్రమునకు సంబంధించినంతవరకు 'వృత్తి' శబ్దమునకు 'వ్యాకరణశాస్త్ర ప్రవృత్తి'యని యర్థము. "కా పునర్వృత్తిః? శాస్త్రప్రవృత్తిః'' ఇత్యాది భాష్యకారాదివాక్యములిందులకు ప్రమాణము. కావున వార్తికమనగా 'వృత్తివ్యాఖ్యానము' అని చెప్పవచ్చును. వాక్యము, వ్యాఖ్యానసూత్రము, భాష్యసూత్రము అనుతంత్రము, అనుస్మృతి అను పదములు 'వార్తిక' పర్యాయములు. కావుననే వార్తికకారుని వాక్యకారుడని కూడ అందురు.

కాత్యాయనుడు:- పాణినీయ వ్యాకరణముపై వ్రాసిన వార్తికములలో కాత్యాయన రచితములగు వార్తికములు ప్రసిద్ధమైనవి. కాత్యాయనునకు కాత్యుడు, పునర్వసువు, మేధాజిత్, వరరుచి అను నామాంతరములు గలవు. ఈతడు పాణిని శిష్యుడు, దాక్షిణాత్యుడు. 'యథా లౌకిక వైదికేషు' అనువార్తికమును వ్యాఖ్యానించుచు పతంజలి "ప్రియతద్ధితాః దాక్షిణాత్యాః, యథాలోకేవేదే చ



ప్రయోక్తవ్యే యథా లౌకికవైదికేషు ప్రయుఞ్జతే'' అని వ్రాయుటచే ఈతని దాక్షిణాత్యత్వము స్పష్టమగుచున్నది.

కాత్యాయనుని వార్తికములులేనిచో అష్టాధ్యాయి అసంపూర్ణ గ్రంథముగ నుండిపోయెడిది. అందుచే ఇవి పాణినీయమునకు ప్రధానాంగములు. పతంజలి కాత్యాయన వార్తికములనే ఆధారముగచేసికొని తన భాష్యమును రచించెను. వార్తికపాఠము మనకిపుడు స్వతంత్ర గ్రంథరూపమున లభ్యమగుటలేదు. ఇవియన్నియు మహాభాష్యమున ఇతర వార్తికములతో కూడ కలిపి వ్యాఖ్యానింపబడినవి.

'సిద్ధేశబ్దార్థసంబన్ధే' అనునది ప్రథమ వార్తికమని చాలమంది అభిప్రాయము. కాని 'రక్షోహాగమలఘ్వ సన్దేహాః ప్రయోజనమ్' అనునది ప్రథమ వార్తికమని యుధిష్ఠిరమీమాంసకుల అభిప్రాయము. కావుననే ఋగ్వేదభాష్యోపోద్ఘాతమునందు సాయణాచార్యులు ''తస్యైతస్య వ్యాకరణస్య ప్రయోజనవిశేషో వరరుచినా వార్తికే దర్శితః-'రక్షోహాగమలఘ్వసన్దేహాః ప్రయోజనమ్'ఇతి. ఏతాని రక్షాదీని ప్రయోజనాని ప్రయోజనాన్తరాణి చ మహాభాష్యే పతంజలినా స్పష్టీకృతాని"అని వ్రాసియున్నాడు. ''సుహృద్భూత్వా ఆచార్య ఇదం శాస్త్రమన్వాచష్టే'' ఇత్యాది భాష్యకారవచనము కూడ ఈవార్తికము భాష్యకారునిది కాదని సూచించుచున్నది. భాష్యకారుడు తన్నుతాను ఆచార్యునిగా నిర్దేశించుకొనడుకదా? కాత్యాయనాదులు ఐదుగురు మాత్రమేకాక వ్యాఘ్రభూతి, వైయాఘ్రపాదులను ఇంకను ఇరువురు వార్తికకారులు కూడ ఉండిరని తెలియుచున్నది.

మహాభాష్యమున గోనర్దీయుడు, గోణికాపుత్రుడు, సౌర్యభగవాన్, కుణరబాడవుడు అను వైయాకరణుల నామధేయములు కూడ పేర్కొనబడినవి. గోనర్దీయ, గోణికాపుత్ర శబ్దములు పతంజలి నామాంతరములని చెప్పుదురు కాని అవి భిన్నవ్యక్తుల నామధేయములని విమర్శకుల ఆశయము.

ప్రాచీన భాష్యములు:- మహాభాష్యమును పరిశీలింపగా ఈప్రాచీన వార్తికములపై అనేక భాష్యములుండినట్లు తెలియుచున్నది. ఈభాష్యకారుల మతమును పతంజలి తనభాష్యమునందు 'అపరఆహ' అని చూపుచుండును. 'సమర్థతరాణాం వా' అను వార్తికముపై 'అపరఆహ' అని మూడు మతములను చూపెను. ఇందుచే పతంజలికి పూర్వము కనీసము మూడు భాష్యములుండియుండవచ్చునని ఊహించవచ్చును. పాతంజలభాష్యానంతరము కూడ హేలా

రాజు, రాఘవసూరి, రాజరుద్రుడు అనువారు వార్తికములపై వ్యాఖ్యానములు రచించినట్లు గ్రంథాంతరముల ద్వారా తెలియుచున్నది.

పతంజలి:- (2000-క్రీ.పూ.) ఈతడు పాణినీయ వ్యాకరణముపై భాష్యమును రచించెను. భాష, శైలి, విషయవివేచనము మొదలగు విషయములలో ఈభాష్యమునకిదియేసాటి. కావుననే దీనికి మహాభాష్యమని ప్రసిద్ధి. పతంజలి ఆదిశేషుని అపరావతారమని ప్రసిద్ధి. సూత్ర, వార్తికభాష్యములలో అభిప్రాయ భేదము వచ్చినపుడు పతంజలి మతమే ప్రమాణమని వైయాకరణు లంగీకరింతురు. ప్రాచీన గ్రంథములలో పతంజలి, గోనర్దీయుడు, గోణికాపుత్రుడు, నాగనాథుడు, అహిపతి, ఫణాభృత్, శేషరాజు, శేషాహి, చూర్ణికారుడు, పదకారుడు మొదలగు నామధేయములతోగూడ నిర్దేశింపబడియున్నాడు. ఇందు మొదటి రెండు పేర్లును భిన్నవ్యక్తుల నామధేయములని పైనచూపబడినది. భాష్యమునకు 'చూర్ణి' 'పదము' అను నామాంతరములుండుటచే చివరి రెండు పేర్లును వచ్చినవి. 'భాష్యంచూర్ణిః' అని క్షీరస్వామి, 'అనుత్సూత్రపదన్యాసా' ఇత్యాది శిశుపాలవధ శ్లోకమును వ్యాఖ్యానించుచు వల్లభదేవుడు "పదం శేషాహివిరచితం భాష్యమ్" అని వ్రాసియున్నాడు.

"అభిజానాసి దేవదత్త కశ్మీరాన్ గమిష్యామః తత్ర సక్తూన్ పాస్యామః" ఇత్యాద్యుదాహరణములందు కాశ్మీరమును గూర్చి అనేక పర్యాయములు ముచ్చటించుటచేత నీతడు కాశ్మీర నివాసియని కొందరందురు. మథురా, సాకేత, కౌశాంబీ, పాటలిపుత్రాదులతో కూడ ఈతనికి సన్నిహిత పరిచయమున్నట్లు ఈతని భాష్యమునుండి తెలియుచున్నది. పాశ్చాత్య పండితులు ఈతడు (క్రీ.పూ. 150) ప్రాంతమున నుండెడివాడని చెప్పుదురు. కాని ఈతడు క్రీ.పూ. దాదాపు 2000 ప్రాంతమువాడై యుండునని యథిష్ఠిర మీమాంసకుల ఆశయము.

పతంజలి తన కాలమున లభించుచున్న పాణిని వ్యాకరణమునేగాక అనేక ఇతర ప్రాచీన వ్యాకరణములను గూడ దృష్టిలో నుంచుకొని తనభాష్యమును రచించెను. పాణినీయ వ్యాఖ్యాన వ్యాజమున ఎన్నియో అనేక విషయములను చెప్పెను. అందుచే మహాభాష్యము వ్యాకరణ శాస్త్రమునకే కాక ఎన్నియో ఇతర విద్యలకు కూడ ఆకరమని చెప్పవచ్చును. కావుననే భర్తృహరి.

'కృతేఽథ పతంజలినా గురుణా దీర్ఘదర్శినా,
సర్వేషాం న్యాయబీజానాం మహాభాష్యే నిబన్ధనే' (వాక్యప. 2-476)



అని వ్రాయుచు మహాభాష్యము సర్వశాస్త్రీయ న్యాయములకాకరమని చెప్పెను.

మహాభాష్యము అప్పుడప్పుడు పఠనపాఠనములకు దూరమై మరల ఉద్ధరింపబడినది. బైజి, సౌభవ, హార్యక్షాదులగు శుష్కతార్కికులచే మహాభాష్యము పఠనపాఠనముల నుండి దూరము చేయబడగా చంద్రాచార్యుడు మిక్కిలి శ్రమపడి దక్షిణాపథమునుండి భాష్యగ్రంథమును సంపాదించి మరల దానిని ప్రచారములోనికి తీసికొని వచ్చెనని భర్తృహరి వ్రాసియున్నాడు:-

బైజిసౌభవహార్యక్షైః శుష్కతర్కానుసారిభిః
ఆర్షే విప్లావితే గ్రంథే సంగ్రహప్రతికంచుకే,
యః పతంజలిశిష్యేభ్యో భ్రష్టో వ్యాకరణాగమః
కాలే స దాక్షిణాత్యేషు గ్రంథమాత్రే వ్యవస్థితః
పర్వతాదాగమం లబ్ధ్వా భాష్యబీజానుసారిభిః
స నీతో బహుశాఖత్వం చంద్రాచార్యాదిభిః పునః (వాక్యప. 2-487-9)

అభిమన్యుడను కాశ్మీరదేశ మహారాజు ఆజ్ఞానుసారముగా చంద్రాచార్యుడు మహాభాష్యము నుద్ధరించెనని కల్హణుడు కూడ వ్రాసియున్నాడు:-

చంద్రాచార్యాదిభిర్లబ్ధ్వా దేశం తస్మాత్తదాగమమ్,
ప్రవర్తితం మహాభాష్యం స్వం చ వ్యాకరణం కృతమ్. (రాజత.1-1-76)

ఇట్లే కాలాంతరమున తన దేశమున విచ్ఛిన్న ప్రచారమగు మహాభాష్యమును కాశ్మీరరాజగు జయాపీడుడు క్షీరపండితుని ద్వారా పునరుద్ధరింపచేసెనని రాజతరంగిణి చెప్పుచున్నది.

"దేశాన్తరాదాగమయ్యాథ వ్యాచక్షణాన్ క్షమాపతిః
ప్రావర్తయత విచ్ఛిన్నం మహాభాష్యం స్వమండపే,
క్షీరాభిధానాచ్ఛబ్ద విద్యోపాధ్యాయాత్ సంభృతశ్రుతః
బుధైః సహ యయౌ వృద్ధిం స జయాపీడపండితః"

ఈవిధముగ మహాభాష్యపఠన పాఠనాదులు అప్పుడప్పుడు ఆయాప్రాంతములందు విచ్ఛిన్నములగుచుండుట అవిపునరుద్ధరింపబడుట జరుగుచు వచ్చినవి. అందుచే మహాభాష్యమునందలి పాఠములెన్నియో అస్తవ్యములగుట సహజము. కావుననే కైయటనాగేశాదులు అనేక పాఠాంతరములను చూపియుండిరి. పతంజలి

వ్యాకరణమహాభాష్యమునేకాక నిదాన సూత్రమను యోగదర్శనమును, మహానంద కావ్యమను యోగవిద్యానిరూపకమగు కావ్యమును, సిద్ధాంత సారావళియను నొకవైద్య గ్రంథమును, సాంఖ్యశాస్త్రమును, సాహిత్యశాస్త్రమును, లోహ శాస్త్రమును రచించెనని చెప్పుదురు. చరకసంహిత కూడ పతంజలి రచితము లేక పతంజలి సంస్కృతము అనియు, చరకుడనునది వైదికచర్ణ విశేషమగు చరక చరణమునకు చెందిన పతంజలికి నామాంతరమై యుండుననియు కొందరి అభి ప్రాయము. ఈగ్రంథములన్నియు వ్యాకరణభాష్య కర్తృరచితములని చెప్పుటకు కింవదన్తి తప్ప ప్రబలప్రమాణములేవియు లేవు.

భాష్యవ్యాఖ్యలు:- మహాభాష్యముపై ఎన్నియో వ్యాఖ్యలు వ్రాయ బడినవి. అందు చాలవరకు లుప్తమైనవి. కొన్ని నామమాత్రావశిష్టములైనవి. లభ్యమగు వ్యాఖ్యానములలో భర్తృహరి విరచితమగువ్యాఖ్య అతిప్రాచీనమైనది. ప్రామాణికమైనది. పాశ్చాత్య విద్వాంసుల ప్రకారము ఈతడు 7వ శతాబ్దికి చెందినవాడు. శ్రీ.కే.యస్. అయ్యర్ తమ 'భర్తృహరి'అను మహత్త్వపూర్ణమగు విమర్శ గ్రంథములో భర్తృహరి 5వ శతాబ్దికి చెందినవాడని నిరూపించిరి. ఈతడే వాక్యపదీయకర్త. శతకత్రయ, భట్టికావ్యాదులకర్త కూడ ఈతడే అను విషయమున పండితులలో విప్రతిపత్తికలదు. ఈతడు బౌద్ధుడను వాదము భ్రాంతిమూలకము. ఈతడు రచించిన మహాభాష్య వ్యాఖ్యానమునకు మహాభాష్య దీపికయనిపేరు. ఈతడు పూర్తిభాష్యముపై వ్యాఖ్యానము వ్రాసియుండును. కాని ప్రస్తుతము బెర్లిన్ లైబ్రరీద్వారా లభించిన ఈవ్యాఖ్యానమున ప్రథమాధ్యాయ ప్రథమపాదముకూడ పూర్తిగాలేదు.

కైయటవిరచితమగు మహాభాష్య వ్యాఖ్యానము అతిప్రసిద్ధము. ఈతడు 11వ శతాబ్ది ప్రాంతమునకు చెందినవాడు. ఈతని తండ్రి జైయటుడు. మమ్మట, ఉవ్వటులు ఈతని సోదరులను వాదము నామసాదృశ్యమాత్ర కల్పితము. వారి తండ్రి వజ్రటుడు. ఈతని వ్యాఖ్యానమునకు ప్రదీపమనిపేరు. ప్రస్తుతము భాష్యార్థమును గ్రహించుటకు సహాయముచేయు ఉత్తమవ్యాఖ్య ఇదియే. ఈప్రదీపము అత్యుత్తమ మహాభాష్య వ్యాఖ్యానమగుటచే దీనిపై 15 వ్యాఖ్యలు రచింపబడినవి.

ప్రసిద్ధ మహాకవియగు బిల్హణుని తండ్రియు, ద్వాదశ శతాబ్దికి చెందినవాడును అగు జ్యేష్ఠకలశుడు భాష్యవ్యాఖ్యను వ్రాసినట్లు ప్రసిద్ధికలదు. పంద్రెం



డవ శతాబ్దికి చెందిన మైత్రేయరక్షితుడను బౌద్ధపండితుడు కూడ ఒక వ్యాఖ్యానము వ్రాసెను. ఈతడు వంగదేశీయుడు. 'దేవ' నామమున ప్రసిద్ధుడగు పురుషోత్తమదేవుడు 'ప్రాణపణా' అనువ్యాఖ్యానము వ్రాసెను. ఈతడు పదమూడవ శతాబ్దికిచెందిన వంగదేశీయుడు. బౌద్ధమతావలంబి. ఈవ్యాఖ్యానముపై కొన్ని వ్యాఖ్యానములు బయల్వెడలినవి.

పదమూడవ శతాబ్దికి చెందిన ధనేశ్వరపండితుడు భాష్యముపై చిన్తామణి యను వ్యాఖ్యానమును రచించెను. ప్రసిద్ధులగు ఎందరో వైయాకరణశిరోమణులకు ఆకరమగు శేషవంశమునకు చెందిన శేషనారాయణుడు సూక్తిరత్నాకరమను ప్రౌఢవ్యాఖ్యను రచించెను. ఈతడు 16వ శతాబ్దికి చెందినవాడు. 16వ శతాబ్ది ప్రాంతమునకు చెందిన విష్ణుమిత్రుడు క్షీరోదరమను వ్యాఖ్యను రచించెను. 17వ శతాబ్దికి చెందిన నీలకంఠవాజపేయి భాష్యతత్త్వ వివేకమను వ్యాఖ్యను వ్రాసెను. ఈకాలమునకే చెందిన శేషవిష్ణువను పండితుడు 'మహాభాష్య ప్రకాశిక'ను శివరామేంద్ర సరస్వతి మహాభాష్య రత్నాకరమును ప్రయాగ వేంకటాద్రికవి విద్వన్ముఖభూషణమును, తిరుమలయజ్వ 'అనుపద'ను కుమార తాతయ అనునతడు మరియొక వ్యాఖ్యానమును, ఆచార్య రాజసింహుడు 'శబ్దబృహతి'ని నారాయణుడు మహాభాష్య వివరణమును, గోపాలకృష్ణశాస్త్రి 'శాబ్దిక చింతామణిని' రచించిరి. అజ్ఞాత కర్తృకములగు మరి కొన్ని వ్యాఖ్యానములపేర్లు కూడ వినవచ్చుచున్నవి.

మహాభాష్యమునకు పదమను పేరుకూడ ఉన్నట్లు పైనచూచి యున్నాము. ఈభాష్యమునను సరించి 'అనుపదము' 'పదశేషము' అను రెండు అష్టాధ్యాయీ వ్యాఖ్యారూపములగు గ్రంథములు రచితములైనట్లు తెలియుచున్నది. ఆగ్రంథము లిపుడుదుర్లభములైనను అనుపదకారుని మతము, పదశేషకారుని మతము అను పేర పైగ్రంథములలోని విషయములు కొన్ని గ్రంథములలో ఉదాహృతములైనవి.

అష్టాధ్యాయిపై వృత్తులు:- సూత్రములపై వ్యాఖ్యానమెట్లుండవలెనను విషయమును చెప్పుచు భాష్యకారుడు 'న కేవలం చర్చాపదాని వ్యాఖ్యానమ్- వృద్ధిః, ఆత్, ఐచ్, ఇతి, కింతర్హి ? ఉదాహరణమ్, ప్రత్యుదాహరణమ్, వాక్యాధ్యాహారః ఇత్యేతత్ సముదితం వ్యాఖ్యానం భవతి" (మహాభా. 1-1-1) అని వ్రాసియున్నాడు.

'పదచ్ఛేదః పదార్థోక్తిః విగ్రహో వాక్యయోజనా
పూర్వపక్షసమాధానం వ్యాఖ్యానం పంచలక్షణమ్'

అను ప్రసిద్ధమగు కారిక కూడ వ్యాఖ్యాన స్వరూపమును నిర్వచించుచున్నది. ఇట్టి లక్షణముగల సూత్రవ్యాఖ్యానమునకు వృత్తియనిపేరు. అష్టాధ్యాయిపై ఇట్టివృత్తులు ఎన్నియో రచింపబడినవి. మహాభాష్యమునకు పూర్వము కూడ కనీసము రెండు మూడు వృత్తి గ్రంథములుండి యుండవలెనని భాష్యము వలన తెలియుచున్నది. మహాభాష్యము తరువాత వచ్చిన వృత్తులన్నియు పూర్తిగ మహాభాష్యముపై ఆధారపడినవి.

పైన సూచించిన విధముగ పాణిని స్వయముగ ఎన్నియో పర్యాయములు ఎందరో విద్యార్థి బృందములకు తన అష్టాధ్యాయిని బోధించియుండెను. కావున ఆతడు స్వయముగ ఒక వృత్తిని రచించియుండ వచ్చునని భర్తృహరి జయాదిత్యాదుల గ్రంథములద్వారా తెలియుచున్నది.

శ్వోభూతియను పాణిని శిష్యుడొక వృత్తి గ్రంథమును రచించియుండెను. పాణిని మేనమామయగు వ్యాడి సంగ్రహమను గ్రంథమునేకాక అష్టాధ్యాయిపై ఒక వృత్తిని కూడ రచించియుండ వచ్చునని ఊహింపబడుచున్నది. క్రీ.పూ. 2000 ప్రాంతమునకు చెందిన 'కుణిఃయను పండితుడు రచించిన వృత్తి గ్రంథమును భర్తృహరి, కైయట హరదత్తాదు లుదాహరించియున్నారు. పురుషోత్తమ దేవుడు తన భాషావృత్తియందు (1-2-57) "మాథుర్యాం తు వృత్తావశిష్య గ్రహణమాపాదమనువర్తతే" అని వ్రాయుచు మాథురుడు అను పండితుడొక వృత్తిని రచించెనని సూచించియున్నాడు. ఈతడు (క్రీ.పూ. 2000) ప్రాంతము వాడై యుండును.

విక్రమార్కుని ఆస్థానమునందున్నట్లు ప్రసిద్ధుడగు వరరుచి అష్టాధ్యాయిపై ఒక వృత్తిని రచించెను. ఈతడు వార్తిక కారుడగు కాత్యాయన వరరుచి కంటె భిన్నుడు, అర్వాచీనుడు.

పంచమ శతాబ్దికి చెందినవాడును, పూజ్యపాదాపర నామధేయుడును, జైనేంద్ర శబ్దానుశాసన రచయితయు అగు దేవనంది అష్టాధ్యాయిపై 'శబ్దావతారన్యాసము' అను వ్యాఖ్యను రచించెను.

ఆరవశతాబ్దికి చెందిన కోంకణాధిపతియగు దుర్వినీతుడు శబ్దావతారమను వృత్తిని రచించెను.



కాశికా ప్రథమ శ్లోకన్యాసవ్యాఖ్యానమునందలి "వృత్తిః పాణినీయ సూత్రాణాం వివరణం చుల్లిభట్టి నిర్లూరాది విరచితమ్" అను వాక్యముచే షష్ఠ శతాబ్ది ప్రాంతమునకు చెందిన 'చుల్లిభట్టి' 'నిర్లూరుడు' అనువారుకూడ వృత్తులు రచించినట్లు తెలియుచున్నది.

కాశికావృత్తి:— జయాదిత్యుడు, వామనుడు అను ఇరువురు పండితులు రచించిన వృత్తికి "కాశిక" అనిపేరు. పాణినీయ వ్యాకరణమున మహాభాష్య భర్తృహరి గ్రంథముల తరువాత ఈ వృత్తియే అత్యుత్తమమైనదని నిస్సంశయముగ చెప్పవచ్చును. కాశికాకారులు అనేకస్థానములందు భాష్యమును అనుసరింపక ప్రాచీనవృత్తి గ్రంథములను అనుసరించిరి. మొదటి నాలుగు అధ్యాయములవృత్తి జయాదిత్యుడును మిగిలిన నాలుగు అధ్యాయములవృత్తి వామనుడును రచించెనని కొందరందురు. "ప్రథమద్వితీయపంచమ షష్ఠా జయాదిత్యకృతవృత్తయః; ఇతరే వామనకృతవృత్తయ ఇత్యభియుక్తాః" అని శబ్దరత్నకారుడు వ్రాసియున్నాడు. శైలినిబట్టి చూడగా మొదటి ఐదు అధ్యాయములవృత్తియు జయాదిత్య రచితమనియు, మిగిలినది వామనకృతమనియు, వామనుని వృత్తి ఎక్కువ ప్రౌఢమైనదనియు మరికొందరందురు. జయాదిత్యవామను లిరువురును స్వతంత్రముగ అష్టాధ్యాయిపై పూర్తిగ రెండువృత్తులు రచించియుందురనియు, కాలాంతరమున ఆ రెండును మిశ్రితములై యుండుననియు యుధిష్ఠిరమీమాంసకుల యభిప్రాయము.

హరదత్తాదులగు కాశికావ్యాఖ్యాతలు కాశీపురమున రచింపబడుటచే ఈ గ్రంథమునకు 'కాశిక' యనిపేరని చెప్పియున్నారు. 'కాశయతి ప్రకాశయతి సూత్రార్థం' అను వ్యుత్పత్తిచే కాశిక యనగా సూత్రార్థప్రకాశకము అని మరికొందరు చెప్పుదురు. దీనికి, 'ఏకవృత్తి' ప్రాచీనవృత్తి అను నామాంతరములు గలవు. ఆయా సూత్రములవద్ద గణపాఠములను చూపుట, ఇపుడు అలభ్యములైన ఎన్నియో ప్రాచీన వృత్తిగ్రంథములనుండి విభిన్నమతములను, అతి ప్రాచీనమగు ఉదాహరణములను చూపుట మొదలగునవి ఈ కాశికయందలి వైశిష్ట్యము.

కాశికావృత్తి అతి ప్రధానమగు వృత్తియగుటచే దానిపై ఎన్నియో వ్యాఖ్యోపవ్యాఖ్యానములు రచింపబడినవి. వాటిలో కొన్ని నామమాత్రశేషములు. కొన్నిటి రచయితల నామధేయములు అజ్ఞాతములు.

ప్రసిద్ధ బౌద్ధపండితుడగు జినేంద్రబుద్ధి కాశికావివరణపంజిక యను వ్యాఖ్యను రచించెను. దానికి న్యాస మని మరియొక పేరు. ఈ న్యాసముపై మైత్రేయరక్షితుడు తంత్రప్రదీపమను విస్తృతవ్యాఖ్యానము రచించెను. దానిపై నందనమిశ్రుడు తంత్రప్రదీపోద్ద్యోతనమను వ్యాఖ్యను, సనాతనతర్కాచార్యుడు 'ప్రభ' అను వ్యాఖ్యానమును మరియొక అజ్ఞాతనామధేయుడగు పండితుడు 'ఆలోకము' అను వ్యాఖ్యను రచించిరి.

ప్రసిద్ధమహాకావ్యవ్యాఖ్యాతయగు మల్లినాథుడు న్యాసముపై న్యాసోద్యోతమను వ్యాఖ్యను రచించెను. నరపతిమహామిశ్రుడు న్యాసప్రకాశమను వ్యాఖ్యను రచించెను. పుండరీకాక్ష విద్యాసాగరుడు మరియొక వ్యాఖ్యను రచించెను. రత్నమతి యనునతడొక వ్యాఖ్యను రచించెను.

ఇందు మిత్రుడను నొకపండితుడు కాశికపై అనున్యాసమను వ్యాఖ్యను రచించెను. ఈ వ్యాఖ్యపై శ్రీ మానశర్మ అనున్యాససారమను వ్యాఖ్యను రచించెను.

అజ్ఞాతనామధేయుడగు ఒక వైయాకరణుడు మహాన్యాసమను కాశికా వ్యాఖ్యను రచించెను. 12వ శతాబ్దికిచెందిన విద్యాసాగరముని ప్రక్రియామంజరి యను వ్యాఖ్యను రచించెను. 12వ శతాబ్దికిచెందిన హరదత్తమిశ్రుడు పదమంజరి యను పాండితీమండితమగు నొక వ్యాఖ్యను రచించెను. ఈతడు కావేరీతీరవాసి. శివభక్తుడు. ఈ పదమంజరిపై రంగనాథయజ్వ (18వ శతాబ్దము) మంజరీ మకరందమను పేరుతో ఒక వ్యాఖ్యను, శివభట్టుడు కుంకుమవికాసమను వ్యాఖ్యను రచించెను.

14వ శతాబ్దికిచెందిన రామదేవమిశ్రుడు కాశికపై వృత్తిప్రదీపమను వ్యాఖ్యను రచించెను. ఇతడు 'హరదత్తానువాది' యని మాధవధాతు వృత్తియందు చెప్పబడినది. ఇట్లే అజ్ఞాతకర్తృకములగు 'వృత్తిరత్నాకరము' 'చికిత్స' అను మరిరెండు వ్యాఖ్యానములుకూడ లభించుచున్నవి.

కాశిక తరువాత చెప్పవలసిన వృత్తి భాగవృత్తి. దీనిని భర్తృహరియను అపరనామధేయముగల విమలమతి రచించెను. ఈతడు గొప్ప బౌద్ధపండితుడు. ఈతడు ఎనిమిదవ శతాబ్దమునకు చెంది యుండును. ఈతని గ్రంథమునుండి అనేకులు ఉదాహరించిరి. దీనిని శ్రీధరుడు వ్యాఖ్యానించెను.



ఎనిమిదవశతాబ్ది అంతమునకు చెందిన భర్తృీశ్వరుడు రచించిన వృత్తి ఉజ్జ్వలాదులచే పేర్కొనబడినది. ప్రసిద్ధ నైయాయికుడగు భట్టజయన్తుడు (9వ శతాబ్దము) ఒక వృత్తిని, 12వ శతాబ్దికిచెందిన కేశవుడు, ఒకవృత్తిని, 12వ శతాబ్దికేచెందిన ఇందుమిత్రుడు 'ఇందుమతి'ని ఈశతాబ్దికేచెందిన మైత్రేయరక్షితుడు 'దుర్ఘటవృత్తిని' రచించిరి. 1150 సం. ప్రాంతమువాడగు పురుషోత్తమదేవుడు అష్టాధ్యాయియందలి లౌకికసూత్రములకొక వృత్తిని రచించెను. అందుచే దీనికి భాషావృత్తియని పేరు. ఈతడు దుర్ఘటవృత్తియను మరియొక వృత్తిని గూడ రచించినట్లు తెలియుచున్నది. ఈతని భాషావృత్తిపై వంగదేశీయుడగు సృష్టిధరచక్రవర్తి 'భాషావృత్త్యర్థవివృతి' యను వ్యాఖ్యానమును వ్రాసెను.

పదమూడవ శతాబ్దికిచెందిన శరణదేవుడను బౌద్ధపండితుడు అష్టాధ్యాయియందలి కొన్ని విశేషసూత్రములకు దుర్ఘటవృత్తి యను ఒక వృత్తిని రచించెను. వ్యాకరణమునందలి సాధారణనియమములచే సాధుత్వము లభింపని పదముల సాధుత్వమును సాధించుటకై రచితమగుటచే దీని నామధేయము అన్వర్థము.

16వ శతాబ్దమునకు చెందిన భట్టోజిదీక్షితుడు శబ్దకౌస్తుభమను నొక విస్తృతమగు వృత్తిని రచించెను. ఇపుడిది మొదటి రెండున్నర అధ్యాయము లును, నాల్గవ అధ్యాయముమాత్రమే లభించుచున్నది. ఈతడు మహారాష్ట్ర బ్రాహ్మణుడు. తండ్రి లక్ష్మీధరుడు, తమ్ముడు రంగోజిభట్టు. భానుజిదీక్షితుడు, వీరేశ్వరుడు అను ఇరువురు కుమారులు. వీరేశ్వరుని కుమారుడు హరిదీక్షితుడు. రంగోజిభట్టు కుమారుడు కొండుభట్టు. భట్టోజిదీక్షితుడు శేషశ్రీకృష్ణపండితుని వద్ద వ్యాకరణశాస్త్రాధ్యయనము చేసెను. అప్పయ్యదీక్షితునివద్ద వేదాంతాదుల నభ్యసించెను. శబ్దకౌస్తుభముపై నాగేశుడు 'విషమపది' యను వ్యాఖ్యానమును, వైద్యనాథపాయగుండ పండితుడు ప్రభను, విద్యానాథశుక్లపండితుడు ఉద్ద్యోతమును, రాఘవేంద్రాచార్యుడు ప్రభను, కృష్ణమిత్రుడు భావప్రదీపమును, భాస్కరదీక్షితుడు శబ్దకౌస్తుభదూషణమును రచించెను. జగన్నాథపండితరాయలు శబ్దకౌస్తుభమును ఖండించుచు కౌస్తుభఖండనమను గ్రంథమును రచించినట్లు తెలియుచున్నది.

16వ శతాబ్దికిచెందిన ప్రసిద్ధ దాక్షిణాత్యపండితుడగు అప్పయ్యదీక్షితుడు సూత్రప్రకాశమను వృత్తిని, 17వ శతాబ్దికిచెందిన నీలకంఠ వాజపేయి 'పాణినీయదీపిక'ను, ఈ కాలమునకే చెందిన అన్నంభట్టు 'పాణినీయమితాక్షర'ను,

విశ్వేశ్వరసూరి 'వ్యాకరణసిద్ధాంతసుధానిధి'ని రచించిరి. చివరి గ్రథము మొదటి మూడు అధ్యాయములపై మాత్రమే లభించుచున్నది. 18 వ శతాబ్దికి చెందిన గోకులచంద్రుడు సంక్షిప్తమగు వృత్తిని రచించెను. ఈతడు వైశ్యుడు. ఓరం భట్టుడను కాశీనివాసియగు ఒక మహారాష్ట్ర పండితుడు వ్యాకరణదీపిక యను వృత్తిని రచించెను. ఆర్యసమాజ ప్రతిష్ఠాపకులగు స్వామీ దయానందసరస్వతి 'అష్టాధ్యాయీభాష్యము' అను విస్తృతమగు వ్యాఖ్యను రచించిరి.

*అజ్ఞాతకాలికవృత్తిగ్రంథములు:-* అప్పనన్నైనార్యుడు ప్రక్రియా దీపికయను వృత్తిని రచించెను. నారాయణసుధి అను పండితుడు అష్టాధ్యాయీ ప్రదీపాపరనామధేయమగు శబ్దభూషణమను విస్తృతవృత్తిని రచించెను. మైథిల పండితుడగు రుద్రధరుడు ఒక వృత్తిని రచించెను. ఉదయనుడు 'మితవృత్త్యర్థ సంగ్రహము' అను పేర కాశికావృత్తిని సంక్షేపించెను. ఈతడు ప్రసిద్ధ నైయాయికునికంటె భిన్నుడు. ఉదయశంకరభట్టు ఒక వృత్తిగ్రంథమును రచించెను. రామచంద్రుడు కాశికావృత్తి సంక్షిప్తరూపమున నొక వృత్తిని రచించెను. సదానందుడు తత్త్వదీపికయను వృత్తిని రచించెను. పాణినీయ లఘువృత్తి యను శ్లోకబద్ధమగు నొక వృత్తి త్రివేంద్రంగ్రంథాలయ మందును, పాణినీయసూత్రవృత్తి యను మరియొక శ్లోకరూపవృత్తి మైసూరు ప్రభుత్వ పుస్తకాలయమునందును ఉన్నవి. ఈ రెండును ఒకే గ్రంథమై యుండవచ్చును. పై రెండు వృత్తులపైనను శ్లోకబద్ధములగు వ్యాఖ్యలు లభించుచున్నవి. పైవృత్తులు కాక అజ్ఞాతకర్తృకములగు 'పాణినీయ సూత్రవృత్తి' 'పాణినీయ సూత్రవివరణము', 'పాణినీయ సూత్రవివృతి,' 'పాణినీయసూత్రవివృతి లఘువృత్తి కారిక' 'పాణినీయసూత్రవ్యాఖ్యానము' (ఉదాహరణ శ్లోకసమేతము) అను వృత్తులుకూడ లభించుచున్నవి.

*ప్రక్రియాగ్రంథములు:-* పాణినీయ వ్యాకరణముతరువాత కాతంత్ర వ్యాకరణము మొదలగు కొన్ని చిన్నచిన్న వ్యాకరణములు బయలుదేరినవి. ఆ వ్యాకరణము లన్నియు ప్రక్రియానుసారముగా రచింపబడినవి. అనగా సంధులు, సమాసములు, కృత్తులు, తద్ధితములు మొదలగునవి ఆయా ప్రకరణములలో చెప్పబడినవి. ఆయా ప్రకరణములను చదివినచో ఆ విషయములకు సంబంధించిన జ్ఞానము పూర్తిగ కలుగును. అష్టాధ్యాయిలో అట్టి ప్రకరణవిభాగము లేకుండుటచే మొత్తము అష్టాధ్యాయిని కంఠస్థము చేసిననేకాని ఏవిషయమునుగూర్చియు



నిశ్చితమగు జ్ఞానము కలుగదు. ఉదాహరణకు సమాసములకు సంబంధించిన విషయములు కొన్ని ద్వితీయాధ్యాయమునందును, కొన్ని పంచమాధ్యాయము నందును, కొన్ని షష్ఠాధ్యాయమునందును ఉన్నవి. కావున సమాసములనుగూర్చిన నిశ్చితజ్ఞానము కావలెనన్నచో కనీసము ఆరధ్యాయములైనను అభ్యసించవలసి యుండును. కాతంత్రాది వ్యాకరణములందు ఇట్టి శ్రమలేకుండుటచే విద్యార్థులు వాటియందే ఎక్కువశ్రద్ధచూపుటను గ్రహించి కొందరు అష్టాధ్యాయీసూత్రము లను ప్రక్రియానుసారముగ వివిధ ప్రకరణరూపమున విభజించి గ్రంథములను రచించిరి. వాటికి ప్రక్రియాగ్రంథములని పేరు. 16వ శతాబ్దమునుండి దాదాపు నాలుగు శతాబ్దులపాటు ఈ పద్ధతి అత్యధికప్రచారములో నున్నది.

అష్టాధ్యాయిని కంఠస్థము చేయుట అను కొంచెము శ్రమకోర్చినచో ఈ ప్రక్రియాపద్ధతి కంటె అష్టాధ్యాయీ క్రమపద్ధతియే అత్యుత్తమమైనదని ప్రత్యక్షముగ నిరూపించుచు, ఈ శతాబ్ది ప్రారంభమున స్వామీవిరజానందులు, దయానందసరస్వతి, మొదలగువారు అష్టాధ్యాయి క్రమపాఠమును మరల ప్రచారములోనికి తీసికొని వచ్చినారు. ఇపుడా విధానమునకుకూడ క్రమముగ ప్రాధాన్య మీయబడుచున్నది.

అష్టాధ్యాయిపై, రచితములగు ప్రక్రియాగ్రంథములలో అతి ప్రాచీన మైనది 'రూపావతారము.' దానిని 12 వ శతాబ్దికిచెందిన బౌద్ధపండితుడగు ధర్మకీర్తి రచించెను. ఈతడు న్యాయబింద్వాదులను రచించిన ప్రసిద్ధ బౌద్ధ నైయాయికునికంటె భిన్నుడు. ఈతడు అష్టాధ్యాయియందు విభిన్నస్థానములలోనున్న సూత్రములనుచేర్చి విభిన్న ప్రకరణములుగకూర్చి ఈ గ్రంథమును రచించెను. ఈ రూపావతారముపై శంకరరాముడను పండితుడు నీవియను వ్యాఖ్యను రచించెను. ఈతడు 17 వ శతాబ్దికి పూర్వమందుండి యుండును. ఇదికాక అజ్ఞాతకర్తృకమగు మరియొక వ్యాఖ్యానముకూడ అసంపూర్ణముగ లభ్యమగుచున్నది.

13 వ శతాబ్దియందు రచితమగు అజ్ఞాతకర్తృకమైన ఒక రత్నాకరమను గ్రంథము మాధవధాతు వృత్త్యాదులందు పేర్కొనబడినది.

విమలసరస్వతి 14 వ శతాబ్దమున అష్టాధ్యాయిలోని కొన్ని సూత్రములను మాత్రమే గ్రహించి రూపమాలయను గ్రంథమును రచించెను.

15 వ శతాబ్దికి చెందిన రామచంద్రుడు ప్రక్రియాకౌముదియను గ్రంథమును రచించెను. ఇందుకూడ పాణినీయ సూత్రములన్నియు గ్రహింపబడలేదు.

కాని ఇది ధర్మకీర్తి విరచితమగు రూపావతారముకంటె విస్తృతమై పాణినీయ ప్రవేశము కోరువారికి సహాయకారిగ నుండునట్లు రచింపబడినది. ఈతడు ప్రసిద్ధ వైయాకరణ వంశమగు శేషవంశమునకు చెందినవాడు. కృష్ణాచార్యుని కుమారుడు. అష్టవ్యాకరణవేత్త.

రామచంద్రుని జ్యేష్ఠభ్రాతయగు నృసింహుని కుమారుడును, రామచంద్రుని శిష్యుడును రామచంద్రుని పుత్రుడగు నృసింహుని గురువును అగు శేషకృష్ణుడు (15 వ శతాబ్ది) ప్రక్రియా కౌముదిపై ప్రకాశమను వ్యాఖ్యను రచించెను. దీనికి ప్రక్రియా కౌముదీవృత్తియని నామాంతరము.

రామచంద్రుని పౌత్రుడును, నృసింహుని పుత్రుడునుఅగు విట్ఠలపండితుడు ప్రక్రియా కౌముదిపై 'ప్రసాదము' అను వ్యాఖ్య రచించెను. విట్ఠలుడు శేషకృష్ణుని పుత్రుడును రామేశ్వరా పరనామధేయుడునుఅగు వీరేశ్వరునివద్ద వ్యాకరణము నభ్యసించెను.

శేషశ్రీకృష్ణుని పుత్రుడగు వీరేశ్వరుని శిష్యుడగు చక్రపాణిదత్తుడు (16 వ శతాబ్దము) 'ప్రక్రియా ప్రదీపము' అను వ్యాఖ్యను రచించెను. ఈతడు 'ప్రౌఢమనోరమాఖండనము' కూడ రచించెను.

వారణవనేశుడు 'అమృతసృతి' యను వ్యాఖ్యానమును ర చిం చె ను. ఈతనికాలము అజ్ఞాతము.

విశ్వకర్మశాస్త్రి యనునతడు ప్రక్రియా వ్యాకృతియను వ్యాఖ్యను రచించెను. దీనికి ప్రక్రియా ప్రదీపమని కూడ పేరు.

నృసింహుడను నొక పండితుడు 'వ్యాఖ్యానము' అనుపేర నొక వ్యాఖ్యానమును, అజ్ఞాత నామధేయుడగు మరియొక పండితుడు నిర్మల దర్పణమను మరియొక వ్యాఖ్యానమును, జయంతుడు 'తత్త్వచంద్రః' అను వ్యాఖ్యానమును, విద్యానాథదీక్షితుడు ప్రక్రియా రంజనము అను వ్యాఖ్యను, వరదరాజు వివరణమను వ్యాఖ్యను రచించెను. ఈ వరదరాజు లఘుకౌముదీ రచయిత కావచ్చును.

ఇంతవరకు వచ్చిన రూపావతార రూపమాలా, ప్రక్రియాకౌముదులలో అష్టాధ్యాయీ సూత్రములన్నియు గ్రహింపబడలేదు. ఈ లోపమును తీర్చుచు భట్టోజిదీక్షితుడు వైయాకరణ సిద్ధాంత కౌముదిని రచించెను. ఈ గ్రంథము ఆవిర్భవించుటతో అంతకుపూర్వమునందున్న గ్రంథములన్నియు విస్మృతప్రాయములైనవి. ఇది రచించినది మొదలు నాటినుండి నేటివరకు సమస్త భారతమునందును వ్యాకరణ పఠన పాఠనములు దీని ద్వారానే జరుగుచున్నవి.





సిద్ధాంత కౌముదిపై ఎన్నియో వ్యాఖ్యానములు బయల్వెడలినవి. భట్టోజిదీక్షితుడు దీనిపై స్వయముగ "ప్రౌఢమనోరమ" అను వ్యాఖ్యానమును రచించెను. ఇందు ఈతడు అక్కడక్కడ ప్రక్రియా కౌముదీకారాదుల మతములను ఖండించెను. అంతవరకునుఉన్న గ్రంథములలో అన్యవైయాకరణుల మతములు ప్రమాణముగకూడ చూపబడుచుండెడివి. కాని భట్టోజిదీక్షితుడు వ్యాకరణ విషయమున ఒక్క మునిత్రయమునకే యథాక్రమముగ ప్రామాణ్యమని స్థిరీకరించుటకు ప్రయత్నించుటచే ఆధునిక వైయాకరుణులకు ప్రాచీన వైయాకరణుల మతములను తెలిసికొనుటకుగాని వివిధ వ్యాకరణముల తులనాత్మక పరిశీలనము జరుపుటకుగాని పూర్తిగ అవకాశము లేకుండపోయినది.

శేషవీరేశ్వరుని కుమారుడు (నామధేయము అజ్ఞాతము) ప్రౌఢమనోరమాఖండన గ్రంథమొకటి నిర్మించెనని పండితరాజవచనముద్వారా తెలియుచున్నది. అది ఇపుడు లభ్యముకాదు. శేషవీరేశ్వరుని శిష్యుడగు చక్రపాణిదత్తుడు రచించిన మనోరమాఖండన గ్రంథము కొంతవరకు మాత్రమే లభించుచున్నది. పండితరాజ జగన్నాథుడు ప్రౌఢమనోరమాకుచమర్దనమను పేరుతో ప్రౌఢమనోరమను ఖండించుచూ ఒక గ్రంథమును రచించెను. ఇది సంపూర్ణముగ లభ్యము కాదు.

భట్టోజిదీక్షితుని పౌత్రుడగు హరిదీక్షితుడు ప్రౌఢమనోరమపై బృహచ్ఛబ్దరత్నము లఘుశబ్దరత్నము అను వ్యాఖ్యాద్వయమును రచించెను. బృహచ్ఛబ్దరత్నము ఇంకను అప్రకాశితము. లఘుశబ్దరత్నముపైగూడ ఎన్నియో వ్యాఖ్యలు బయల్వెడలినవి. హరిదీక్షితుని శిష్యుడగు నాగోజిభట్టే లఘుశబ్దరత్నమును రచించి తన గురువుపేరు పెట్టెనని పండిత ప్రవాదము.

16 వ శతాబ్దికి చెందిన జ్ఞానేంద్ర సరస్వతి సిద్ధాంత కౌముదిపై తత్త్వబోధిని యను వ్యాఖ్యను రచించెను. ఇది చాలవరకు ప్రౌఢమనోరమానుసరణరూపము. తత్త్వబోధినిపై అతని శిష్యుడగు నీలకంఠవాజపేయిగూఢార్థప్రకాశికా అను వ్యాఖ్యను వ్రాసెను. ఈతడు సిద్ధాంత కౌముదిపైకూడ సుఖబోధినియను వ్యాఖ్యను రచించెను.

17 వ శతాబ్ది చివరిభాగమునకు చెందిన రామానందుడు సిద్ధాంత కౌముదిపై "తత్త్వదీపిక" అను వ్యాఖ్యను రచించెను. ఇది హలంత స్త్రీలింగాంతము లభ్యమగుచున్నది.

ప్రసిద్ధ వైయాకరణుడగు నాగేశభట్టు (18 వ శతాబ్ది) సిద్ధాంత కౌముదిపై బృహచ్ఛబ్దేందుశేఖరము, లఘుశబ్దేందుశేఖరము అను వ్యాఖ్యాద్వయమును రచించెను. ఈతడనేక శాస్త్రములలో ఉద్దండ పండితుడు. ఈతడు వ్యాకరణమున పై గ్రంథములనే కాక కైయట ప్రదీపవ్యాఖ్యయగు ఉద్యోతమును, పరిభాషేందుశేఖరము, లఘుమంజూష, పరమలఘుమంజూష, స్ఫోటవాదము, మహాభాష్య ప్రత్యాఖ్యానసంగ్రహము అను ప్రామాణిక గ్రంథములను రచించెను. 17 వ శతాబ్ది చివరిభాగమునకు చెందిన రామకృష్ణుడు సిద్ధాంత కౌముదిపై రత్నాకరమును, రంగనాథయజ్వ "పూర్ణిమ"ను రచించిరి. 19 వ శతాబ్ది ప్రారంభమున వాసుదేవ దీక్షితుడు బాలమనోరమ యను వ్యాఖ్యను రచించెను. ఇది విద్యార్థులకు చాల ఉపయుక్తమగుటచే బహుళప్రచారము నందినది. కృష్ణమిత్రుడు రత్నార్ణవమను వ్యాఖ్యను రచించెను. శేషవంశమునకు చెందిన రామచంద్రుడు సిద్ధాంత కౌముదియందలి స్వరప్రక్రియపై వ్యాఖ్యానము రచించెను.

ఇవికాక తిరుమల ద్వాదశాహయాజి రచించిన 'సుమనోరమ,' తోప్పల దీక్షిత కృతమగు 'ప్రకాశము,' అజ్ఞాతకర్తృకములగు 'లఘుమనోరమా' 'శబ్దసాగర' 'శబ్దరసార్ణవ' 'సుఖాంజన' వ్యాఖ్యానములు, లక్ష్మీనృసింహుని 'విలాసము,' శివరామ సరస్వతీ రచితమగు 'రత్నాకరము,' ఇంద్రదత్తోపాధ్యాయుని 'ఫక్కికాప్రకాశము,' సారస్వత వ్యాధమిశ్రుని 'బాలబోధ,' వల్లభుని 'మానసరంజని' మొదలగు వ్యాఖ్యానములుకూడ వివిధ పుస్తక భాండాగారములలో నున్నవి.

కేరలదేశీయుడగు నారాయణభట్టు (1618-91) దేవనారాయణుడను ఒక రాజు ఆజ్ఞచే ప్రక్రియాసర్వస్వమను ఒక 20 ప్రకరణముల గ్రంథమును రచించెను. దానినతడు 60 దినములలో రచించినట్లు ప్రతీతి. ఈతడు అనేక శాస్త్రములలో పండితుడు. మహాకవి. నారాయణీయమను భాగవత కథాసంగ్రహరూపమగు కావ్యము ఏతద్రచితమే. ఈ ప్రక్రియా సర్వస్వమువై మూడు వ్యాఖ్యానములున్నవి.



పాణినికి తరువాతవచ్చిన వ్యాకరణములు :- పైన చూపిన విధముగ పాణిని తన కాలమున లభ్యమగు వ్యాకరణములనన్నిటిని బాగుగ పరిశీలించి అత్యద్భుతమగు అష్టాధ్యాయిని రచించెను. ఈ పాణినీయ వ్యాకరణము వ్యాఖ్యోపవ్యాఖ్యానములతో విస్తరించినది. ఐనను పాణిని తరువాత వచ్చిన ఎందరో మహాపండితులు ఈ పాణినీయ వ్యాకరణమే వ్యాకరణశాస్త్రమున పరమావధియని యెంచక దానినుండి తగు సహాయమును స్వీకరించి ఎన్నియో వ్యాకరణములను రచించిరి. వాటిలో కొన్ని లుప్తమైనవి, కొన్నిటి పేరులు మాత్రమే తెలియవచ్చుచున్నవి. కొన్నిమాత్రము లభించుచున్నవి. ఈ అర్వాచీన వ్యాకరణములలో చాలవరకు లౌకిక భాషావ్యాకరణములు. అర్వాచీనవైయాకరణులలో కాతంత్రికారుడు, చంద్రగోమి, క్షపణకుడు, దేవనంది, వామనుడు, పాల్యకీర్తి, శివస్వామి, భోజదేవుడు, బుద్ధిసాగరుడు, భద్రేశ్వరసూరి, హేమచంద్రుడు, క్రమదీశ్వరుడు, సారస్వత వ్యాకరణకారుడు, రామాశ్రమ సిద్ధాంతచంద్రికాకారుడు, బోపదేవుడు, పద్మనాభుడు అను పదునారుగురును ముఖ్యులు.

కాతంత్రకారుడు:- (క్రీ. పూ 2000) కాతంత్ర వ్యాకరణమునకు కలాపకము, కౌమారము అను నామాంతరములుకలవు. ఇందు ఆఖ్యాతాంతమొక భాగము. కృదంతము మరియొక భాగము గలవు. రెండుభాగములును విభిన్న కర్తృకములు. ఈ వ్యాకరణమునకు కాశకృత్స్నవిరచితమును, శబ్దకలాపాపరనామధేయమునుఅగు కాశకృత్స్నతంత్రము ఉపజీవ్యమనియు, అందుచే కాతంత్రనామము 'కాశకృత్స్నతంత్రము'నకు సంక్షిప్త రూపమనియు, దానికి గల శబ్దకలాపమను పేరునుబట్టి దీనికి కలాపసంజ్ఞ లభించినదనియు, ఇది కుమారులకు (బాలులకు) ఉపయుక్తమగుటచే కౌమారమనియు యుధిష్ఠిరమీమంసకుల అభిప్రాయము. ఇపుడు లభ్యమగు కాతంత్ర వ్యాకరణమునకు మూలమగునది అతి ప్రాచీనమైనది. శర్వవర్మ దానిని సంక్షిప్తము చేసెను. అందును ఆఖ్యాతాంతభాగమును శర్వవర్మ రచించెననియు, కృదంతభాగమును కాత్యాయనుడను పండితుడు రచించెననియు విమర్శకుల అభిప్రాయము.

ఈ వ్యాకరణమునందు చాలవిషయములు ప్రతిపాదితములు కాకుండుటచే 11 వ శతాబ్దికి చెందిన శ్రీపతిదత్తుడు 'కాతంత్రపరిశిష్టమును' దానిపై ఒక

వృత్తినికూడ రచించెను. 12 వ శతాబ్దికి చెందిన విజయానందుడు 'కాతంత్రోత్తరమను గ్రంథమును రచించెను.

ఈ కాతంత్ర వ్యాకరణము ప్రస్తుతము వంగదేశమునందు మాత్రమే ఉన్నది. కాని పూర్వకాలమున సమస్త భారత దేశమునందేకాక విదేశములందు కూడ దాని ప్రచారముండెడిది.

ఈ వ్యాకరణముపైకూడ ఎన్నియో వృత్తులు రచింపబడినవి. దుర్గసింహ విరచితమైన వృత్తి లభ్యమైనవాటిలో అతి ప్రాచీనమైనది. ఈ దుర్గవృత్తిపైకూడ అనేక వ్యాఖ్యానములు వాటిపై కొన్ని వ్యాఖ్యలు వెలసినవి. ఈ విధముగా కాతంత్ర వ్యాకరణముకూడ వ్యాఖ్యోపవ్యాఖ్యానములతో బహుముఖముల విస్తరించినది

*చంద్రగోమి:-* బౌద్ధమతావలంబియు, క్రీ.పూ. 1000సం. ప్రాంతమువాడగు చంద్రగోమి పాణినీయము నాధారముగగొని ఒక వ్యాకరణమును రచించెను. కాశ్మీరమున పఠనపాఠనములనుండి దూరమైన మహాభాష్యమునీతడు అనిరుద్ధుడను కాశ్మీర నరేంద్రుని యాజ్ఞచే పునరుద్ధరించెనని రాజతరంగిణీ ద్వారా తెలియుచున్నది. ఈతడు మహాభాష్యమునుండికూడ ఎక్కువ సహాయమును తీసికొనెను. దీనికి చాంద్రవ్యాకరణమని పేరు. 'చంద్రోపజ్ఞమసంజ్ఞకం వ్యాకరణమ్' అను పండితోక్తి, చంద్రగోమి తాను పారిభాషిక సంజ్ఞలనేమియు క్రొత్తగ చెప్పక పాణిన్యాది ప్రసిద్ధములగు సంజ్ఞలనే గ్రహించెనని చెప్పుచున్నది. వార్తికములు భాష్యేష్టులు మొదలగువాటిని కూడ ఈతడు తన సూత్రములలో సంగ్రహించి పాణినీయమునందులేని రూపములనుగూడ సాధించెను. కొన్ని స్థలములలో పతంజలి మతమును కాదని ప్రాచీనాచార్యుల మతమును స్వీకరించెను.

ఇపుడు ఈ వ్యాకరణము షష్ఠాధ్యాయాంతమువరకు మాత్రమే లభించుచున్నది. ఈతడు బౌద్ధుడగుటచే వైదిక సర్వప్రక్రియలను చూపలేదని బెల్వాల్కర్ మొదలగువారు తలంచిరి. కాని కొన్ని ఆంతరంగిక ప్రమాణములచే ఈ గ్రంథముకూడ అష్టాధ్యాయాత్మకమనియు, అష్టమాధ్యాయమునందు స్వరప్రక్రియయు, సప్తమమున వైదిక ప్రక్రియయు ఉండవచ్చుననియు సూచితమగుచున్నది. ఈతడు తన వ్యాకరణమునకు అనుబంధములుగ ధాతుపాఠ, ఉణాదిసూత్రపాఠ, గణపాఠ, లింగానుశాసన శిక్షాసూత్రములనుగూడ రచించెను.



20 ఉపసర్గముల అర్థములను వివరించుచు ఈతడు వ్రాసిన ఉపసర్గవృత్తి. ప్రస్తుతము టిబెట్టు భాషలో మాత్రమే లభించుచున్నది. ఈతడు తన వ్యాకరణముపై స్వయముగ వృత్తిని రచించెను. 13 వ శతాబ్దికిచెందిన కశ్యపభిక్షువు రచించిన బాలబోధినియను వృత్తి లంకలో ప్రచారములో నున్నదట. ఈ కాశ్యపుడు చాంద్ర వ్యాకరణానుసారముగ బాలావబోధమను వ్యాకరణమును రచించెను. ఇది సిద్ధాంతకౌముదికి లఘుకౌముదివలె నుండును.

*క్షపణకుడు:-* విక్రమార్కుని ఆస్థానమునందలి నవరత్నములలో ఒక్కడుగ ప్రసిద్ధుడగు క్షపణకుడు ఒక వ్యాకరణ గ్రంథమును రచించినట్లు తెలియుచున్నది. జైనాచార్యుడగు సిద్ధసేన దివాకరుడే ఈ క్షపణకుడని ఐతిహాసికుల అభిప్రాయము. ఈతడొక ఉణాది సూత్రవ్యాఖ్యకూడ రచించెను. ఈతడు తన వ్యాకరణముపై ఒక వృత్తిని రచించియుండును. క్షపణక మహాన్యాసమనుపేర అజ్ఞాత కర్తృకమగు ఒక వృత్తి కూడ గ్రంథాంతరములందు దాహృతమైనది.

*దేవనంది:-* 400 క్రీ. శ. ప్రాంతమువాడును, పూజ్యపాదాపరనామధేయుడును అగు ఆచార్యదేవనంది 'జైనేంద్ర' నామధేయమగు వ్యాకరణమును రచించెను. ఈ వ్యాకరణమును మహావీరుడు ఇంద్రునికి బోధించెననియు, అందుచే దానికి జైనేంద్ర నామధేయము వచ్చినదనియు లక్ష్మీవల్లభాదులగు కొందరు జైనులు చెప్పిరి. దేవనందికే జినేంద్రుడను నామాంతరముండియుండవచ్చును. అందుచే దానికాపేరు వచ్చియుండవచ్చును. ఈ వ్యాకరణమునకు ఔదీచ్య సంస్కరణమొకటియు దాక్షిణాత్య సంస్కరణ మొకటియు కలవు. వాటిలో ఔదీచ్య సంస్కరణము దేవనంది కృతమనియు, దాక్షిణాత్య సంస్కరణమునకు వాస్తవమున శబ్దార్ణవమని పేరనియు, దానిని 10వ శతాబ్దికి చెందిన గుణనంది సంస్కరించెననియు యుధిష్ఠిర మీమాంసకుల మతము. ఈ వ్యాకరణము చాలవరకు పాణినీయమును, అచ్చటచ్చట చాంద్రవ్యాకరణమును అనుసరించుచున్నది. ఈతడు తన వ్యాకరణమున శ్రీదత్తుడు, యశోభద్రుడు, భూతబలి, ప్రభాచంద్రుడు, సిద్ధసేనుడు, సమంతభద్రుడు. అను ఆరుగురు ప్రాచీన జైనవైయాకరణుల నామధేయములను పేర్కొనెను.

ఈ వ్యాకరణముపై న్యాసము, భాష్యము. వృత్తి టీక మొదలగు అనేక వ్యాఖ్యానములు ప్రక్రియాగ్రంథములుకూడ రచింపబడినవి. దేవనందియే స్వయ

ముగ ఒక న్యాసమును రచించెను. దానిపేరుకూడ జైనేంద్రమే. ఇది లభించుట లేదు. జైనేంద్ర వ్యాకరణమునకు దాక్షిణాత్య సంస్కరణమని చెప్పబడెడు శబ్దార్ణవముపైగూడ వృత్తి ప్రక్రియా గ్రంథములు రచింపబడినవి.

*వామనుడు:-* 8 వ శతాబ్దికంటె పూర్వమునందున్న వామనుడు విశ్రాంత విద్యాధరమను వ్యాకరణమును రచించెను. ఈతడే స్వయముగా రెండు వృత్తులను కూడ వ్రాసెను.

*అకలంకభట్టు:-* 8 వ శతాబ్దికి చెందిన అకలంకభట్టు ఒక వ్యాకరణ గ్రంథమును, దానిపై మంజరీమకరందమను వ్యాఖ్యానమును రచించెను.

*పాల్యాకీర్తి:-* ఈతనికి శాకటాయనుడని నామాంతరము. ఈ శాకటాయనుడు అర్వాచీనుడు. 9 వ శతాబ్దికి చెందినవాడు. దిగంబర శ్వేతాంబర సంప్రదాయములకు మధ్యలోనున్న యాపనీయ సంప్రదాయమునకు చెందిన జైనాచార్యుడు. తన శాకటాయన తంత్రమను వ్యాకరణ గ్రంథమున ఈతడు ఆర్యవజ్రుడు, సిద్ధనంది, ఇంద్రుడు అను ప్రాచీన వైయాకరణులను స్మరించెను. దానిపై ఈతడే రచించిన వృత్తి కాక మరికొన్ని వృత్తులును ప్రక్రియా గ్రంథములు కూడ వెలసినవి.

*శివస్వామి:-* కప్పణాభ్యుదయ మహాకావ్యకర్తగా ప్రసిద్ధిచెందిన శివస్వామి (10 వ శతాబ్ది) ఒక వ్యాకరణ గ్రంథమును, దానిపై వృత్తిని, ధాతుపాఠమును రచించినట్లు గణరత్న మహోదధ్యాదులద్వారా తెలియుచున్నది. ఈతడు బౌద్ధమతావలంబి.

*భోజమహారాజు:-* గుప్తరాజుల స్వర్ణయుగమునకు పిమ్మట మరియొక పర్యాయము సంస్కృతభాషా వాఙ్మయములను సర్వజనప్రియభాషా వాఙ్మయములుగ చేసి, ఎన్నియో గ్రంథములను స్వయముగ రచించి, ఎందరో మహాపండిత కవులను పోషించిన భోజమహారాజు పేరు వినని భారతీయుడుండడు. ఈతడు ధారాధీశుడు. పారమార వంశీయుడు. సింధులుని కుమారుడు. 11 వ శతాబ్దమున రాజ్యమును చేసినవాడు.

"చండాలోఽపిభవేద్విద్వాన్ యఃస తిష్ఠతు మే పురి
విప్రోఽపి యో భవేన్మూర్ఖః స పురాద్బహిరస్తు మే"

అని ఉద్ఘోషించినవాడు.



ఈతడు సరస్వతీ కంఠాభరణమను పేర రెండు మహాగ్రంథములను రచించెను. అందులో ఒకటి అలంకార శాస్త్రగ్రంథము; రెండవది వ్యాకరణ శాస్త్ర గ్రంథము. ప్రాచీన వైయాకరణులందరును శబ్దానుశాసనము వేరుగను, పరిభాషాపాఠ, గణపాఠ, ఉణాదిపాఠాదులను వేరుగను రచించుచుండెడివారు. అందుచే పాఠకులు చాలమంది శబ్దానుశాసనమును మాత్రమే పఠించి, గణపాఠాదులను ముట్టకుండుట పరిపాటియైపోయినది. ఈ లోపమును అంతమొందింప దలచి ఈతడు తన శబ్దానుశాసనమున పరిభాషా గణపాఠాదులను యథాస్థానమున కూర్చెను. ఇది ఎనిమిదధ్యాయముల గ్రంథము. మొదటి ఏడు అధ్యాయములు లౌకికశబ్ద ప్రక్రియారూపములు, ఎనిమిదవ అధ్యాయము వైదిక ప్రక్రియా స్వరప్రక్రియా రూపము. ఈతడు పాణినీయమును కొంతవరకును చాలవరకు చాంద్రవ్యాకరణమును అనుసరించెను. ఈతడే స్వయముగ ఒక వృత్తినిగూడ రచించెను. దండనాథ నారాయణపండితుడొక హృదయహారిణియను వృత్తిని రచించెను. ఇది భోజరచిత వృత్తికే సంక్షిప్తరూపమని పండితుల అభిప్రాయము. కృష్ణలీలాశుకుడు పురుషకారమను వ్యాఖ్యను రచించెను. సరస్వతీకంఠాభరణముపై 'పదసింధుసేతువు' అను ప్రక్రియా గ్రంథముకూడ రచింపబడెను.

*బుద్ధిసాగరసూరి:-* 11 వ శతాబ్దికి చెందిన బుద్ధిసాగరసూరి యను జైనాచార్యుడు 'బుద్ధిసాగరము' అను వ్యాకరణమును రచించెను. దానికి 'పంచగ్రంథి' యని మరియొక పేరు.

*భద్రేశ్వరసూరి:-* 12 వ శతాబ్దికి చెందిన భద్రేశ్వరసూరియను మరియొక జైనాచార్యుడు "దీపకము" అను వ్యాకరణమును రచించెను.

గణరత్న మహోదధియను సుప్రసిద్ధ గ్రంథమును రచించిన వర్ధమానుడు (12 వ శతాబ్ది) శబ్దానుశాసనమునుకూడ రచించియుండునని ఊహింపబడుచున్నది.

*హేమచంద్రసూరి:-* 12 వ శతాబ్దికి చెందిన ప్రసిద్ధ జైనాచార్యుడగు హేమచంద్రసూరి "సిద్ధ హైమశబ్దానుశాసనము" అను ఒక అతివిస్తృతమగు వ్యాకరణమును రచించెను. ఇందు ఎనిమిది అధ్యాయములు కలవు. మొదటి ఏడు అధ్యాయములును సంస్కృతభాషా వ్యాకరణములు. ఎనిమిదవ

అధ్యాయము ప్రాకృత వ్యాకరణరూపము. ఇది ప్రాచీన వ్యాకరణమువలెకాక కాతంత్ర వ్యాకరణమువలె విషయానుసారముగ విభక్త్యైక్య, సంజ్ఞా, స్వరసంధి, వ్యంజనసంధి, నామ, కారక, షత్వ, ణత్వ, స్త్రీప్రత్యయ, సమాస, ఆఖ్యాత, కృదంత, తద్ధితప్రకరణ రూపములనున్నది. హేమచంద్రుడు తన శబ్దానుశాసనముపై లఘువృత్తి, మధ్యవృత్తి, బృహద్వృత్తి అను మూడువృత్తులను బృహన్న్యాసమనుపేర అతివిస్తృతమగు ఒక న్యాసమును రచించెను. స్వరచితములగు ధాతుపాఠ, ఉణాదిపాఠ, గణపాఠ, లింగానుశాసనములపైగూడ వృత్తులను రచించెను. ఎందరో ఇతర పండితులుకూడ ఈ శబ్దానుశాసనముపై వ్యాఖ్యలు రచించిరి.

*క్రమదీశ్వరుడు*:- 13 వ శతాబ్దికి చెందిన క్రమదీశ్వరుడు 'సంక్షిప్తసారము' అను వ్యాకరణమును రచించెను. ఈతడు తన వ్యాకరణముపై రచించిన రసవతియను ఒకవృత్తిని జుమరనంది పరిష్కరించుటచే ఈ వ్యాకరణము జౌమర వ్యాకరణమను పేరుతో ప్రసిద్ధికెక్కినది. ఈ వ్యాకరణము పశ్చిమ బెంగాలు ప్రాంతమున ప్రచారములో నున్నది.

*సారస్వత వ్యాకరణము*:- (13 వ శతాబ్ది) అనుభూతి స్వరూపాచార్యుడు సరస్వతీదేవినుండి సూత్రములను స్వీకరించి ఈ వ్యాకరణమును రచించెనని ప్రసిద్ధి. కాని సారస్వతసూత్రములను శ్రీ నరేంద్రాచార్యుడు రచించినట్లు ప్రమాణములు కలవు. దీనిపైకూడ ఎన్నియో వ్యాఖ్యానములు రచింపబడినవి. కొందరు పండితులు దీనికి కొన్ని మార్పు చేర్పులతో రూపాంతరములు కల్పించి వాటిని ప్రచారములోనికి తెచ్చిరి.

*బోపదేవుడు*:- 14 వ శతాబ్దికి చెందిన బోపదేవుడు 'ముగ్ధబోధము' అను చిన్న వ్యాకరణమును రచించెను. ఈతడు దౌలతాబాదు ప్రాంతమునకు చెందినవాడు. ఈతని తండ్రియగు ధనేశ్వరుడు గొప్ప వైద్యుడు. మహాభాష్యముపై చింతామణియను వ్యాఖ్యానమును రచించినవాడీతడే. ముగ్ధబోధ వ్యాకరణముపై ఎన్నియో వ్యాఖ్యానములు బయల్వెడలినవి. కొన్ని రూపాంతరములు కూడ రచింపబడినవి.

*పద్మనాభదత్తుడు*:- 14 వ శతాబ్దికి చెందిన పద్మనాభదత్తుడు "సుపద్మము" అను అతిసంక్షిప్తమగు వ్యాకరణమును రచించెను. ఈతడు



ప్రయోగదీపిక, ఉణాదివృత్తి, ధాతుకౌముది, యఙ్లుగ్వృత్తి, భూరిప్రయోగకోశము, పరిభాషావృత్తి మొదలగు ఇతర గ్రంథములను కూడ రచించెను. ఈ సుపద్మ వ్యాకరణముపైకూడ కొన్ని వ్యాఖ్యలు రచింపబడినవి.

పైన చూపిన వ్యాకరణ గ్రంథములేకాక పాణినికి పిమ్మట ఎన్నియో ఇతర వ్యాకరణములు బయల్వెడలినవి గాని వాటికితగు ప్రచారము లభింపలేదు: కొన్ని నామమాత్రావశిష్టములైనవి.*

ఈ విధముగ వేదములలో లబ్ధ బీజావాపమగు సంస్కృత వ్యాకరణము అనాదికాలమునుండి నేటివరకును అవిచ్ఛిన్నముగ బహుముఖముల విస్తారమును పొందుచు వచ్చినది. ఏ కాలమునందును కూడ పండితులు తమకు పూర్వమున నున్న వ్యాకరణములతో సంతృప్తి పడినట్లు అగపడదు. క్రొత్త క్రొత్త వ్యాకరణములను రచించుచు క్రొత్త క్రొత్త ప్రయోగముల ప్రామాణ్యమును సాధించుచు వ్యాకరణ వాఙ్మయములను పెంచుచునేయుండిరి. కాని భట్టోజిదీక్షితుడు మొదలగు కొందరు పండితులు 'యథోత్తరం మునీనాం ప్రామాణ్యమ్' అనుదానినే గట్టిగ పట్టుకొని పాణిని కాత్యాయన పతంజలులు తప్ప మరియెవ్వరు చెప్పినదియు ప్రమాణము కాదనియు, వారిలోకూడ పతంజలిదే అంతిమనిర్ణయమనియు నొక ప్రౌఢ వాదమును ప్రారంభించిరి. 'కలౌపారాశరీస్మృతిః' అను వాక్యముచే కలియుగమున పరాశర స్మృతియే ప్రమాణమని యంగీకరించునట్లు పాణినీయ వ్యాకరణమునే శిష్టులు వేదాంగముగ అంగీకరించుటచే ఇతరవ్యాకరణములన్నియు అప్రమాణములని వారి అభిప్రాయము. అందుచే శిశుపాలవధాదులలో ప్రయుక్తములగు "ద్వయేషామ్" ఇత్యాది శబ్దములకు వ్యాకరణాంతరములచే సాధుత్వము సాధింప యత్నింపరాదని భట్టోజిదీక్షితుడు వ్రాసియున్నాడు. 'యత్తు కశ్చిదాహ చాంద్రవర్మణవ్యాకరణే ద్వయపదస్యాపి సర్వనామతాభ్యుపగమాత్ తద్రీత్యా అయంప్రయోగ ఇతి, తదపి న; మునిత్రయ మతేనేదానీం సాధ్వసాధువిభాగః; తస్యైవేదానీన్తనశిష్టై ర్వేదాంగతయా పరిగృహీతత్వాత్. దృశ్యన్తేచ నియతకాలాః స్మృతయః; యథా కలౌ పారాశరీ స్మృతిరితి. (శబ్దకౌస్తుభము.)

---

* ఈ వ్యాకరణ శాస్త్రేతిహాసము, ప్రసిద్ధ వైయాకరణులును, విమర్శకాగ్రగణ్యులును అగు శ్రీ యుధిష్ఠిరమీమాంసక పండితులు రచించిన సంస్కృత వ్యాకరణ శాస్త్ర కా ఇతిహాస్ అను గ్రంథము ప్రథమభాగము (ద్వితీయ ముద్రణము) ననుసరించి వ్రాయబడినది. వ్యాకరణశాస్త్రమునందాసక్తి కలవారికీగ్రంథము అవశ్య పఠనీయము.

1-1-27) ఇది కేవలము ప్రౌఢవాదమని చెప్పకతప్పదు. పాణినీయము ప్రకారము 'పరిమృజన్తి' అనురూపము మాత్రమే సిద్ధింపవలసియుండ వ్యాకరణాంతరములందున్న పరిమార్జన్తి మొదలగు వృద్ధిసహితరూపములు కూడ సాధ్యములే యని భాష్యకారులు వ్రాసియున్నారు. 'ఏవంతర్హి-ఇహాన్యే వైయాకరణాః మృజేరజాదౌ సంక్రమే విభాషా వృద్ధి మారభన్తే - పరిమృజన్తి, పరిమార్జన్తి, పరిమమృజతుః, పరిమమార్జతుః ఇత్యాద్యర్థమ్, తదిహాపి సాధ్యమ్' (మహాభా. 1-1-3). పాణినీయముతప్ప ఇతర వ్యాకరణములన్నియు అప్రమాణములే యన్న వాదమే యుక్తమైనచో భాష్యకారుని పై వాక్యములు అర్థరహితము లని చెప్పవలసి వచ్చును.

ఈ వాదమును భట్టోజి దీక్షితాదులు ప్రారంభించిరి కాని ప్రసిద్ధ వ్యాఖ్యాతలగు మల్లినాథాదులుకూడ ఎన్నియో ప్రయోగములకు ఇతర వ్యాకరణముల ద్వారా సాధుత్వమును సాధించియున్నారు. కొన్ని ప్రాచీన గ్రంథములను పరిశీలించుచో కాతంత్రాదులే ప్రమాణముకాని పాణినీయము ప్రమాణము కాదనువారు కూడ అత్యధికసంఖ్యాకు లుండెడివారని స్పష్టమగును. మూడవశతాబ్దికిచెందిన పద్మప్రాభృతకమను భాణమునందలి ఈ క్రింది విటవాక్యములు పాణినీయులకును కాతంత్రవైయాకరణులకును నడుమ 'కాకోలూకము' జరుగుచుండెడిదని స్పష్టీకరించుచున్నది.

'ఏష హి పాణినిపూర్వకః దందశూకపుత్రః దత్తకలశిర్నామ వైయాకరణః ప్రతిముఖమేవోపస్థితో ఽస్మాన్-కిం భవానాహ. ఏషో ఽస్మి బలిభుగ్భిరివ సంఘాతబలిభిః కాతన్త్రికైరవస్కన్దిత ఇతి. హన్త ప్రవృత్తం కాకోలూకమ్. సఖే దిష్ట్యా త్వామలూనపక్షం పశ్యామి. కిం బ్రవీషి, కా చేదానీం మమ వైయాకరణపాశవేషు కాతంత్రేష్వాస్థా ఇతి."

దీనిని బట్టి ఒక్కొక్క కాలమునందు ఒక్కొక్క వ్యాకరణమునే ప్రమాణముగ నంగీకరింపవలెనన్న వాదము ఎంత యుక్తిదూరమో తెలియుచున్నది. పాణిని వ్యాకరణము బహుళప్రచారమునకు వచ్చినదన్నచో అది కేవలము దాని యందు వ్యాకరణమున కుండవలసిన ఉత్తమలక్షణము లుండుటయే కాని తావన్మాత్రముచే నితరవ్యాకరణములన్నియు అప్రమాణములని కట్టడిచేయుట యుక్తిసంగతముకాదు. కావుననే ప్రక్రియాసర్వస్వకారుడును మహావైయాకర



ణుడు నగు నారాయణభట్టపాదుడు 'అపాణినీయ ప్రామాణ్యసాధనమ్' (S. V. యూనివర్సిటీ ఓరియంటల్ రిసర్చి ఇన్స్టిట్యూట్ చే ప్రకటితము) అను చిన్న గ్రంథమున పాణిని ఏవిధముగ తనకంటె పూర్వమునందున్న వ్యాకరణవాఙ్మయాదుల జ్ఞానమును పురస్కరించుకొని తన వ్యాకరణమును రచించెనో ఇతర వైయాకరణులుకూడ అట్లే చేసియున్నారు గాన వారి వ్యాకరణము లప్రమాణము లనరాదనియు, అపాణినీయములగు ప్రయోగములేవైన ఇతరవ్యాకరణసిద్ధములైనచో మనము తప్పక పరిగ్రహింపవలెననియు సయుక్తికముగ ప్రతిపాదించియున్నాడు.

"పాణిన్యుక్తం ప్రమాణం న తు పునరపరం చంద్రభోజాదిశాస్త్రం
కేష్యాహుస్తల్లఘిష్ఠం న ఖలు బహువిదామస్తి నిర్మూలవాక్యమ్.
బహ్వంగీకారభేదో భవతి గుణవశాత్, పాణినేః ప్రాక్కథం వా,
పూర్వోక్తిం పాణినిశ్చాప్యనువదతి, విరోధేఽపి కల్ప్యో వికల్పః."

అనునది అతని గ్రంథప్రారంభమునందలి సంగ్రహశ్లోకము. దీనినిబట్టి ప్రాచీనములైనను అర్వాచీనములైనను 'ప్రయోగశరణాః వైయాకరణాః' అను లోకోక్తి ననుసరించి రచించిన వ్యాకరణము లన్నిటిని ప్రమాణముగ నంగీకరించుటయే యుక్తమని చెప్పకతప్పదు. భాషకు వ్యాకరణమనావశ్యకమను వాదము ఎంత అసమంజసమో, ఏదియో ఒక వ్యాకరణమును మాత్రమే గ్రుడ్డిగ నమ్మి దాని నియమములనుండి ఎంతమాత్రముకూడ ఇటు నటు కదలరాదను వాదము కూడ అంత అసమంజసమే. మధ్యమార్గము నవలంబించుటయే న్యాయము.

పైన వర్ణించినవిధముగ అసంఖ్యాకములుగ బయల్వెడలిన వ్యాకరణ గ్రంథములలో లఘుసిద్ధాంతకౌముది ఒకటి. దీని రచయిత వరదరాజపండితుడనియు, ఈతడు భట్టోజిదీక్షితుని శిష్యుడనియు, అతడు రచించిన సిద్ధాంతకౌముదిని సంక్షేపమొనరించి 'మధ్యకౌముది', 'లఘుకౌముది' అను రెండు గ్రంథములను రచించెననియు ఐతిహ్యము తక్క ఇతనినిగూర్చిన విశేషము లింకేవియు తెలియవు. శాస్త్రాంతరవ్యాసక్తులగువారు సులభముగ వ్యాకరణము నభ్యసించుటకై లఘుకౌముది రచింపబడెనని అతడే చెప్పియున్నాడు. దానికి తెలుగులో చిన్న వ్యాఖ్య వ్రాసినచో బాగుండునని దాదాపు నాలుగు సంవత్సరముల క్రితము మదీయ శ్రేయోభిలాషులగు పూజ్యులు శ్రీ దివాకర్ల వెంకటావధానిగారు చెప్పియుండుటచే అపుడు ప్రారంభించి బాలమనోరమాదుల సహాయముతో ఈ

# అథ సన్ధి ప్రకరణమ్

## అచ్ సన్ధిః

### 15. ఇకో యణచి 6.1.77

ఇకః స్థానే యణ్ స్యాదచి సంహితాయాం విషయే. "సు ఉపాస్యః" ఇతి స్థితే—

ఇకః,యణ్,అచి,ఇకః అనునది షష్ఠ్యన్తపద మగుటచే "షష్ఠీస్థానేయోగా అను పరిభాష ననుసరించి లభించిన 'స్థానే' యను పదము 'ఇకః' అనుదా సంబంధించును. 'సంహితాయామ్'అను అధికారసూత్రము అనువర్తించు సంహిత విషయ మగునపుడు (ఉద్దిష్ట మగునపుడు) 'ఇక్' (ఇఉఋఌ) మున, అచ్చు పరముగా నుండగా,'యణ్'(యవరల) వచ్చును.

రెండు వర్ణముల కలయికకు సంధి యని పేరు. ఇట్టి సంధి సంహి యున్నపుడే కలుగును. సంహిత కొన్ని స్థలములలో నిత్య మనియు, వా నందు వైకల్పిక మనియు ఈ క్రింది కారిక చెప్పుచున్నది:-

"సంహితైకపదే నిత్యా నిత్యా ధాతూపసర్గయోః
నిత్యా సమాసే వాక్యే తు సా వివక్షామపేక్షతే".

"సుధీ + ఉపాస్యఃఅని యుండగా":— 'సుధీ ఉపాస్యః'అను పీ హరణమున సకారముపై నున్న ఉకారము కూడ ఇక్కు. దానికి ధకారమ నున్న ఈకారము పర మగుటచే 'యణ్'రావలె నను సందేహము క వచ్చును. తన్నివారణకై ఈ క్రింది సూత్రము చెప్పబడుచున్నది.

### 16. తస్మిన్నితి నిర్దిష్టే పూర్వస్య 1.1.66

సప్తమీనిర్దేశేన విధీయమానం కార్యం వర్ణాన్తరేణావ్యవహి పూర్వస్య బోధ్యమ్.

1. షష్ఠి సంబంధమును బోధించును. కాని ఆ సంబంధవిశేష మేది తెలియనపుడు ఆ షష్ఠ్యంతపదము ప్రక్కన 'స్థానే'అను పదమ చేర్చవలెను; అని ఈ సూత్రమునకు అర్థము.



సప్తమీనిర్దేశపూర్వకముగ విధింపబడిన కార్యము వర్ణాన్తరవ్యవహితము కాని పూర్వవర్ణమునకు అనగా సప్తమీనిర్దిష్ట మగుదానికి వెనుకనే యున్న వర్ణమునకు వచ్చును.

'ఇకో యణచి'అను సూత్రమున 'అచి'అనునది సప్తమ్యన్తపదము. కావున ఈ సూత్రముచే విధింపబడిన కార్యము సప్తమ్యన్తపదనిర్దిష్ట మగు అచ్చునకు వెనుక వర్ణాన్తరావ్యవహితముగ నున్న ఇక్కునకే వచ్చును గాని వర్ణాన్తరవ్యవహిత మగుదానికి రాదు. కావున 'సు'నందలి ఉకారమునకు 'ధీ'యందలి ఈకారము పరముగ నున్నను ఈ 'ఉ'కార'ఈ'కారముల నడుమ 'ధ'కారము (ధ్) ఉండుటచే ఇచట ఇక్కు అచ్చునకు వర్ణాన్తరావ్యవహితపూర్వము కాదు. కావున ఉకారమునకు యణాదేశప్రసక్తి లేదు. ఇక 'ధీ'యందలి 'ఈ'కారము నకు 'ఉపాస్య'యందలి 'ఉ'కారము పరముగా నున్నది. ఈ రెండింటి నడుమ వర్ణ మేదియు లేదు కావున ఇచట యణాగమము రావచ్చును.

కాని 'ఇక్'సంజ్ఞ గల వర్ణములు నాలుగు గలవు. 'యణ్'లును నాలుగు గలవు కావున ఏ 'ఇక్'స్థానమున ఏ 'యణ్'రావలెను అనునది నిర్ణయించుటకై ఈ క్రింది సూత్రము చెప్పబడుచున్నది:-

### 17. స్థానేఽన్తరతమః 1.1.50

ప్రసఙ్గే సతి సదృశతమః ఆదేశః స్యాత్'సుధ్య్ + ఉపాస్యః' ఇతి జాతే.

స్థానే, అన్తరతమః.'స్థానే'అనగా ప్రసఙ్గ మని యర్థము. ప్రసఙ్గము కలిగినపుడు- అనగా ఒక వర్ణము స్థానమున అనేకవర్ణములు ఆదేశముగ వచ్చుటకు అవకాశము కలిగి నపుడు- ఎక్కువ సాదృశ్యము గల వర్ణము ఆదేశముగ వచ్చును.

ఈ నియమము ననుసరించి తాలుస్థానసామ్యముచే 'ఈ'కార'య'కారములకు ఎక్కువ సాదృశ్యము కలదు కావున 'ధీ'యందలి 'ఈ'కారస్థానమున 'య్' ఆదేశముగా వచ్చుటచే 'సుధ్య్ + ఉపాస్యః'అను రూపము సిద్ధించినది.

వ్యాకరణమున 'ఆదేశము''ఆగమము'అను రెండు పారిభాషికపదములు గలవు. ఒక వర్ణమును లేక వర్ణసముదాయమును తొలగించి దాని స్థానమున వేరొక వర్ణముగాని వర్ణసముదాయము గాని వచ్చినచో ఆదేశ మనియు,

ఉన్నదానిని తొలగించక దాని ప్రక్కనే మరి యొకటి వచ్చి చేరినచో ఆగమ మనియు పేర్లు. 'మిత్రవదాగమః;శత్రువదాదేశః'అని శాస్త్రజ్ఞవచనము. ఇచట 'యణ్'ఆదేశ మను విషయము పూర్వోదాహరణమున విస్పష్టము.

18. అచిచ. 8.4.47

అచః పరస్య యరో ద్వే వా స్తో న త్వచి. ఇతి ధకారస్య ద్విత్వమ్.

'అచో రహాభ్యాం ద్వే' "యరోనునాసికేఽనునాసికో వా" అను సూత్రములనుండి 'అచః''ద్వే''యరః''వా'అను పదములు అనువర్తించును.

అచ్చుకంటె పర మగు 'యర్'కు ద్విత్వము వికల్పముగ వచ్చును. అచ్చు పర మగునపుడు మాత్రము రాదు.

ఇట్లు 'సుధ్య్'అను పదమున 'ధ్' అను 'యర్''ఉ'అను అచ్చుకంటె పరముగా నున్నది కావునను, దానికి అచ్చు పరముగ లేదు కావునను ద్విత్వముచే 'ధ్ధ్'అని యగుటచే 'సుధ్ధ్య్+ఉపాస్యః'అని యుండగా:-

19. ఝలాం జశ్ ఝశి 8.4.53

స్పష్టమ్.ఇతి పూర్వధకారస్య దకారః

ఝల్లులకు ఝశ్ పర మగునపుడు జశ్ వచ్చును. ఈ సూత్రముచే మొదటిధకారమునకు ఝశ్ (రెండవధకారము) పరముగ నుండుటచే జశ్(ద్) వచ్చును. రెండవ ధకారమునకు పర మగు వర్ణము(య్)ఝశ్ కాదు కావున దానికి జశ్త్వప్రసక్తి లేదు. "సుద్ధ్య్+ఉపాస్య:" అని యుండగా:-

20. సంయోగాన్తస్య లోపః 8.2.23

సంయోగాన్తం యత్పదం తదన్త్యస్య లోపః స్యాత్.

'పదస్య'అను అధికారసూత్రము అనువర్తించును.'సంయోగాన్తస్య' అనుదానిని 'పదస్య'అను దానికి విశేషణముగ చేసి వ్యాఖ్యానించగా సంయోగాన్త మగు పదమునకు లోప మగునని అర్థము వచ్చును. అట్లైనచో మొత్తము పదమే లోపించవలసి యుండును. కావున 'అలోన్త్యస్య' అను ఉత్తరపరిభాషా సూత్రము (21) ననుసరించి ఈ సూత్రమును వ్యాఖ్యానించగా సంయోగాన్త





మగు (సంయోగము అంతమందు గల) పదమునందలి యన్త్యవర్ణమునకు లోపము కల్గు నని యర్థము వచ్చును.

21. అలోన్త్యస్య 1.1.52

షష్ఠీనిర్దిష్టస్యాన్త్యస్యాలః ఆదేశః స్యాత్.ఇతి యలోపే ప్రాప్తే:-

'షష్ఠీస్థానే యోగా'అను సూత్రమునుండి 'షష్ఠీ''స్థానే' అనుపదములు అనువర్తించును. ప్రథమాన్త మగుషష్ఠీ అను పదము తృతీయాన్తముగా మారును. 'నిర్దిష్టస్య'అని అధ్యాహారము. 'స్థానే'అను పదము తరువాత 'విధీయమానః'అని అధ్యాహారము. ఈ విధముగ 'స్థానే విధీయమానః షష్ఠ్యా నిర్దిష్టస్య అన్త్యస్య అలః స్యాత్' అని పర్యవసితార్థము. అనగా ఏదైన యొక దాని స్థానమున విధింపబడు నాదేశము షష్ఠ్యన్తపదముచే నిర్దిష్ట మగుదాని చివరి అల్లునకు వచ్చునని యర్థము. వర్ణసమామ్నాయమునందలి మొదటి 'అ'కారము నకు చివరి సూత్రమునందలి 'ల్'తో ప్రత్యాహారముచేయుటచే నేర్పడిన 'అల్' అనునది వర్ణసామాన్య వాచకము. ఈ పరిభాష ననుసరించి 'సంయోగాన్తస్య లోపః' (20) అను లోపము షష్ఠీనిర్దిష్ట మగు సంయోగాన్తపదము చివరి యకారమునకు వచ్చును ఈ విధముగా "సుధ్య్+ఉపాస్యః" అను నపుడు 'య్' అనునది లోపించ వలసి యుండగా:-

వా. యణః ప్రతిషేధో వాచ్యః

సుద్ధ్యుపాస్యః, సుధ్యుపాస్యః; మద్ధ్వరిః, మధ్వరిః; ధాత్త్రంశః, ధాత్రంశః; లాకృతిః.

యణ్ విషయమున సంయోగాన్తలోపము ప్రతిషిద్ధ మని చెప్పవలెను. ఈ వార్తికము ననుసరించి యకారమునకు లోపము చేయరాదు.

"ఉక్తానుక్తదురుక్తానాం చింతా యత్ర ప్రవర్తతే
తం గ్రన్థం వార్తికం ప్రాహుర్వార్తికజ్ఞా విచక్షణాః."

అని వార్తికలక్షణము. కాత్యాయనుడు పాణిని సూత్రములపై వార్తికములు వ్రాసి సూత్రములలోని కొన్ని లోపములను సరిచేయుటకు ప్రయత్నించెను.

'అచిచ' అను సూత్రముచే ద్విత్వము వైకల్పికము గాన ద్విత్వపక్షముచే 'సుద్ధ్యుపాస్యః' అను రూపము, ద్విత్వాభావపక్షమున 'సుధ్యుపాస్యః'

అను రూపమును సిద్ధించును. 'సుధీభిః ఉపాస్యః'అని విగ్రహము.

మద్ధ్వరిః:- 'మధు + అరిః'అని యుండగా "ఇకో యణచి"అను సూత్ర ముచే ఉకారస్థానమున స్థానసామ్యముచే అంతరతమ మగు 'వ్'అను యణ్ వచ్చును. 'మధ్ వ్ + అరిః'అని యుండగా 'సుధ్యుపాస్యః' అను రూపమునందు వలె ధకారమునకు ద్విత్వజశ్త్వములు వచ్చి 'మద్ ధ్వరిః' అనియు, ద్విత్వము లేని పక్షమున 'మధ్వరిః' అనియు రెండు రూపములు సిద్ధించును. 'యణః ప్రతి షేధో వాచ్యః' అను నిషేధముచే 'వ'కారమునకు సంయోగాన్త లోప ముండదు. "మధోః అరిః" అని విగ్రహము.

ధాత్రంశః:- 'ధాతృ + అంశః'అను స్థలమున ఋకారమునకు స్థాన సామ్యముచే రేఫ(ర్)యణాదేశముగ వచ్చును. 'ధాతర్ + అంశః' అని యుండగా 'అనచి చ'అను సూత్రముచే తకారమునకు ద్విత్వము చేసిన పక్షమున 'ధాత్త్రంశః' అనియు, ద్విత్వాభావపక్షమున 'ధాత్రంశః' అనియు రెండు రూపములు సిద్ధించును. 'యణః ప్రతిషేధో వాచ్యః' అను వార్తికముచే రేఫకు సంయోగాన్తలోపము నిషిద్ధము. 'ధాతుః అంశః'అని విగ్రహము.

లాకృతిః:- 'ఌ + ఆకృతిః' అని యుండగా 'ఇక్' అగు 'ఌ'కారము నకు స్థానసామ్యముచే అన్తరతమ మగు'ల్'అను యణ్ ఆదేశమై ల్ + ఆకృతిః = 'లాకృతిః' అను రూపము సిద్ధించును. "ఌకారస్య ఆకృతిరివ ఆకృతిః యస్య సః" అని విగ్రహము.

22. ఏచోఽయవాయావః 6.1.78

ఏచః క్రమాత్ అయ్, అవ్ ఆయ్, ఆవ్, ఏతే స్యురచి.

ఏచః, అయవాయావః. 'ఇకో యణచి' అను సూత్రమునుండి 'అచి' అనునది అనువర్తించును. ఏచ్చునకు (ఏఓఐఔలకు) అచ్చు పర మగునపుడు వరుసగా అయ్, అవ్, ఆయ్, ఆవ్, అను నాదేశములు వచ్చును.

ఇచట ఏ వర్ణమునకే యాదేశము వచ్చును అను సందేహము నివర్తించుటకై క్రింది సూత్రము చెప్పబడుచున్నది. ఈ సూత్రము ననుసరించియే 'క్రమాత్' అనునది వృత్తిలో చేర్చబడినది.



23. యథాసఙ్ఖ్యమనుదేశః సమానామ్ 1.3.10

సమసమ్బన్ధీ విధిర్యథాసఙ్ఖ్యం స్యాత్. హరయే. విష్ణవే. నాయకః, పావకః.

సమానసంఖ్యకలవాటికి సంబంధించిన కార్యము యథాసంఖ్యముగ నగును.

ఇచట ఏచ్చులు నాలుగు. అయాదులు గూడ నాలుగు. కావున ఏఓఐఔలకు అయాదులు వరుసగా వచ్చును. అనగా 'ఏ'కు 'అయ్' 'ఓ'కు 'అవ్' 'ఐ'కు 'ఆయ్' 'ఔ'కు 'ఆవ్' ఆదేశము లగును.

హరయే:- 'హరే + ఏ' అని యుండగా రేఫోత్తరవర్తి యగు ఏకార మునకు 'ఏ' అను అచ్చు పర మగుటచే 'అయ్' అను నాదేశము వచ్చి 'హర్ + అయ్ + ఏ' = 'హరయే' అను రూప మేర్పడును.

విష్ణవే:- విష్ణో + ఏ. 'ఓ'కారమునకు 'అవ్' ఆదేశము..... విష్ణ్ + అవ్ + ఏ = 'విష్ణవే' అను రూపము నిష్పన్న మగును.

నాయకః:- 'నై + అక' అని యుండగా 'ఐ'కారస్థానమున 'ఆయ్' వచ్చుటచే న్ + ఆయ్ + అక = 'నాయకః' అను రూపము సిద్ధించును.

పావకః:- 'పౌ + అక' అని యుండగా 'ఔ'కారస్థానమున 'ఆవ్' ఆదేశము—ప్ + ఆవ్ + అకః = 'పావకః' అను రూపము సిద్ధించును.

24. వాన్తో యి ప్రత్యయే 6.1.79

యకారాదౌ ప్రత్యయే పరే ఓదౌతోరవ్, ఆవ్ ఏతౌ స్తః. గవ్యమ్, నావ్యమ్.

'య'వర్ణవాచక మగు సప్తమ్యన్త 'యి'పదము 'ప్రత్యయే' అనుదానికి విశేషణము. 'యస్మిన్ విధి స్తదాదావల్గ్రహణే' (అనగా వర్ణవాచక మగు సప్తమ్యన్తపదమును ప్రయోగించి కార్యమును విధించు నపుడు "ఆవర్ణము ఆది యందు గల" అను అర్థము చెప్పవలెను) అను పరిభాష ననుసరించి 'యి' అనుదానికి 'యకారాదౌ' యని యర్థము. 'అవ్' 'ఆవ్'లు వచ్చుటకు ఓకారౌకారములకు మాత్రమే అర్హత గలదు గాన 'ఓదౌతోః' అనునది అర్థాత్సిద్ధము.

వా స్తః = ఓకారము అంతమున కలది యకారాదిప్రత్యయము పర మగునపుడు ఓకారౌకారములకు 'అవ్' 'ఆవ్' అను నాదేశములు వచ్చును.

గవ్యమ్:- గోః వికారః గవ్యమ్. గోశబ్దమునకు 'గోపయసోర్యత్' అను సూత్రముచే (1115) 'యత్' ప్రత్యయమును జేర్చ 'గో + య' అని యగును. ఇపుడీ సూత్రముచే 'ఓ'కారమునకు యకారాదిప్రత్యయము పర మగుటచే 'అవ్' ఆదేశమై గ్ + అవ్ + య గవ్యమ్ అను రూపము సిద్ధించును.

నావ్యమ్:- నావా తార్యం నావ్యమ్. (నావచే దాట దగినది). ఇచట తార్యము అను నర్థమున "నౌవయోధర్మ విషమూలమూల సీతాతులాభ్యస్తార్యతుల్య ప్రాప్యవధ్యానామ్య సమసమిత సమ్మితేషు'' అను సూత్రముచే (1134) 'యత్' ప్రత్యయము. ఔకారమునకు 'ఆవ్' ఆదేశము "న్ + ఆవ్ + య" = 'నావ్య' అను రూపము నిష్పన్న మగును.

వా. అధ్వపరిమాణే చ.

గవ్యూతిః.

ఈ వార్తికము 'గోర్యూతౌ ఛందస్యుపసఙ్ఖ్యానమ్' అను వార్తికమునకు పిదప నున్నది. కావున 'గోః' 'యూతౌ' అను పదములు అనువర్తించును. మార్గపరిమాణార్థమున గోశబ్దమునకు 'యూతి' యనునది పర మగునపుడు 'ఓ'కారమునకు 'అవ్' ఆదేశము వచ్చును. గో + యూతి = గ్ + అవ్ + యూతి = గవ్యూతిః (క్రోశద్వయము)

25. అదేఙ్గుణః 1.1.2

అత్ ఏఙ్ చ గుణసంజ్ఞః స్యాత్.

ఇది సంజ్ఞాసూత్రము హ్రస్వ మగు 'అ'కారమునకును 'ఏఙ్' (ఏఓ)కును గుణ మని పేరు.

26. తపర స్తత్కాలస్య 1.1.70

తః పరః యస్మాత్స చ, తాత్పరశ్చోచ్చార్యమాణసమకాలస్యైవ సంజ్ఞా స్యాత్.

"అణుదిత్సవర్ణ స్యచాప్రత్యయః" నుండి 'అణ్' అనువర్తించును. 'తపరః' అనుదానికి 'తః పరః యస్మాత్ సః' అని బహువ్రీహిసమాసము నాశ్రయించుటచే 'తకారము పరమందు కలది' అనియు, 'తాత్ పరః' అని తత్పురుష సమాసాశ్రయణముచే 'తకారముకంటె పరమైనది' అనియు రెండర్థము లంగీకరింపబడినవి.



తకారము పరమందు కలదియు, తకారముకంటె పరమును నగు 'అణ్' ఎంత కాలము గల (ఎన్ని మాత్రలు గల) వర్ణ ముచ్చరింప బడినదో దానికి మాత్రమే సంజ్ఞ యగును.

ఇది 'అణుదిత్సవర్ణస్య చాప్రత్యయః' (11) అను సూత్రమున కపవాదము. ఆ సూత్రము ననుసరించి 'అ'మొదలగునవి తమ సవర్ణము లగు 'ఆ' కార'ఆ3'కారాదులను గూడ గ్రహించును. కాని ఈ సూత్రము ననుసరించి 'అ' మొదలగునవి తపర మగుచో సవర్ణము లగు ఇతర రూపములను గ్రహింపవు. కావున 'అత్''ఇత్'అనినచో కేవలహ్రస్వరూపము లగు 'అ'కార'ఇ'కారాదులకు మాత్రమే గ్రహణము దీర్ఘాదులకు గ్రహణము లేదు. కావుననే వెనుకటి సూత్రమునందు 'అత్' అనునది తపరము (తకారము పరమందు కలది) అగుటచే కేవలహ్రస్వమునకు మాత్రమే గ్రాహకము. అట్లే 'అదేఙ్' అనునపుడు 'ఏఙ్' అనునది కూడ తపరమే–అనగా తకారముకంటె పర మగునది. కావున 'ఏఙ్' అనునది ద్విమాత్రాక మగు దీర్ఘమును (ఏఙ్) మాత్రమే గ్రహించును కాని త్రిమాత్రాక ప్లుతాదులను గ్రహింపదు.

27. ఆద్గుణః. 6.1.87

అవర్ణాదచి పరే పూర్వపరయోరేకో గుణ ఆదేశః స్యాత్. ఉపేన్ద్రః. గఙ్గోదకమ్.

'ఇకోయణచి' నుండి 'అచి', ''ఏకః పూర్వపరయోః'' అను అధికార సూత్రమును అనువర్తించును.

అకారముకంటె అచ్చు పర మగునపుడు పూర్వపరవర్ణములకు ఒక గుణ మాదేశముగ వచ్చును.

ఉపేన్ద్రః:- ఉప + ఇన్ద్ర అని యుండగా పకారముపై నున్న 'అ'కారమునకు 'ఇ'అను అచ్చు పర మగుటచే ఈ రెండు వర్ణముల (అఇ) స్థానమందును ఒక గుణము ఆదేశ మగును. ఇచట స్థానులు 'అ'కార'ఇ'కారములు.

అందు 'ఆ'కారమునకు స్థానము కంఠము; ఇకారమునకు తాలువు. కావున యథా సంభవముగ ఆదేశముగ నట్టిదే వచ్చిన యుక్తముగాన ఈ అకారేకారముల స్థానమున గుణసంజ్ఞకవర్ణములలో కంఠతాలవ్య మగు 'ఏ'కారము వచ్చి 'ఉపేన్ద్రః' అను రూపము సిద్ధించినది.

గఙ్గోదకమ్:- 'గఙ్గా + ఉదక' అవి యుండగా కంఠస్థానక మగు 'ఆ' కారమునకును ఓష్ఠస్థానక మగు 'ఉ'కారమునకును కంఠౌష్ఠ్య మగు 'ఓ'కారము గుణముగా వచ్చుటచే "గఙ్గోదకమ్"అను రూపము నిష్పన్నమైనది.

### 28. ఉపదేశేఽజనునాసిక ఇత్ 1.3.2

ఉపదేశేఽనునాసికోఽచ్ ఇత్సంజ్ఞః స్యాత్. ప్రతిజ్ఞానునాసిక్యాః పాణినీయాః. లణ్ సూత్రస్థావర్ణేన సహోచ్చార్యమాణో రేఫో రలయోః సంజ్ఞా.

ఉపదేశమందు అనునాసిక మగు అచ్ ఇత్సంజ్ఞక మగును.

పాణినివ్యాకరణసంప్రదాయజ్ఞులు ప్రతిజ్ఞ చేయబడిన (అంగీకరింపబడిన) అనునాసికత్వము కలవారు. అనగా ఏ వర్ణము అనునాసికము ఏది నిరనునాసికము అని తెలియుటకు శాస్త్రసంప్రదాయమే శరణ్య మని యర్థము.

ఆరవమాహేశ్వరసూత్ర మగు 'లణ్' అనుదానిలోని 'అ'కారమును అనునాసిక మని అంగీకరించుటచే దానికీ సూత్రము ననుసరించి ఇత్సంజ్ఞ లభించగా ఈ'అ'కారముతో 'హయవరట్'అను సూత్రమునందలి రేఫను(ర్) కలిపి 'ర'అను ప్రత్యాహార మేర్పడును. ఈ'ర'ప్రత్యాహారము'ఆదిరన్త్యేన సహేతా'అను సూత్రముచే (4) రేఫలకారములకు రెంటికిని సంజ్ఞ యగును.

### 29. ఉరణ్ రపరః. 1.1.51

ఋ ఇతి త్రింశతః సంజ్ఞేత్యుక్తమ్. తత్స్థానే యోఽణ్, స రపరస్సన్నేవ ప్రవర్తతే. కృష్ణర్ద్ధిః. తవల్కారః.

ఉః;అణ్;రపరః. 'ఉః'అనునది 'ఋ'అనుదాని షష్ఠ్యేకవచనరూపము. 'షష్ఠీ స్థానేయోగా'అను పరిభాషచే 'స్థానే'అనునది లభించును.



'ఋ'అనునది ముప్పది భేదములకు సంజ్ఞ యగు నని వెనుకనే చెప్పబడినది. దాని స్థానమున వచ్చు అణ్ రేఫపరకముగనే వచ్చును.

'ఋలువర్ణయోర్మిథస్సావర్ణ్యం వాచ్యమ్'అను వార్తికము ననుసరించి ఋకారలుకారములు సవర్ణము లగుటచే, 'ఋ'కారము 'లు'కారమునకు గూడ గ్రాహకము గాన 'ఉః'అనగా 'ఋలు'వర్ణముల స్థానమందని యర్థము.'రపరః' అను నపుడు 'ర'అనునది, పూర్వోక్తవిధమున రేఫలకారములకు గ్రాహకము. ఇట్లు 'ఋలు'వర్ణస్థానమునన్ విధింపబడిన 'అణ్' 'రల'పరమై వచ్చు నని యర్థము. 'ఋలు'వర్ణముల స్థానమున 'అణ్'వచ్చు ననగా వరుసగా 'అర్,ఇర్,ఉర్, అల్,ఇల్,ఉల్'అనునవి వచ్చు నని యర్థము.

కృష్ణర్ద్ధిః:- కృష్ణ + ఋద్ధిః అనుచోట అకారఋకారముల స్థానమున 'ఆద్గుణః' అను సూత్రముచే (27) గుణము ఏకాదేశమై రావలెను. అందు గుణసంజ్ఞకము లగు 'అఏఓ'లలో 'అ'కారమే ఆంతరతమము గాన నది ఋకార స్థానమున గూడ వచ్చుటచే రేఫపరకమై(అర్)వచ్చును. కృష్ణ్ + అర్ + ద్ధిః- 'కృష్ణర్ద్ధిః'అను రూపము సిద్ధించును.

తవల్కారః:- 'తవ + లుకారః' ఇచట అకారలుకారస్థానమున పూర్వోక్త విధమున 'అల్'ఏకాదేశమై వచ్చును. తవ్ + అల్ + కారః = తవల్కారః అను రూపము సిద్ధించును.

### 30. లోపశ్శాకల్యస్య 8.3.19

అవర్ణపూర్వయోః పదాన్తయోర్యవయోర్లోపో వాఽశి పరే.

'భోభగోఅఘోఅపూర్వస్యయోఽశి' నుండి 'అపూర్వస్య' 'అశి' 'వ్యోర్లఘుప్రయత్నతరః శాకటాయనస్య' నుండి 'వ్యోః' (వకారయకారయోః) అనువర్తించును. 'పదస్య'అను అధికారసూత్రము అనువృత్తమై 'వ్యోః' అనుదానిని దానికి విశేషణముగ చేయుటచే, 'యేన విధిస్తదన్తస్య'అను పరిభాషచే, 'అవర్ణపూర్వవకారయకారాన్తస్య పదస్యలోపః' అను నర్థము వచ్చును. 'అలోఽన్త్యస్య' పరిభాషచే (సూ. 21) ఆ లోపము అన్త్యవర్ణములకు-అనగా వకార యకారములకు-వచ్చును. ఈ లోపము శాకల్యుడను వైయాకరణుని మతమునే వచ్చును గాని ఇతరవైయాకరణుల మతమున రాదు, కావున వైకల్పికము.

('శాకల్యస్య' ఇత్యాదులచే విభిన్నవైయాకరణుల నామనిర్దేశపూర్వకముగ విధించిన కార్యము ఎల్ల యెడలను వైకల్పిక మని గ్రహించవలెను) ఫలితార్థము ఈ విధముగ నుండును:-

అవర్ణము పూర్వమునందు గల పదాన్తయకారవకారములకు 'అశ్'పరమగునపుడు లోపము వికల్పముగ నగును.

'హరఇహ' 'విష్ణఇహ'అనునవి ఉదాహరణములు. 'హరే + ఇహ' 'విష్ణో + ఇహ'అని యుండగా 'ఏచోయవాయావః'అను సూత్రముచే (22) 'అయ్''అవ్' ఆదేశములు రాగా"హర్ + అయ్ + ఇహ = హరయ్ఇహ" "విష్ణ్ + అవ్ + ఇహ = విష్ణవ్ + ఇహ''అను రూపము లైనవి. ఇచట నున్న యకారవకారములు అవర్ణపూర్వకము లగుటచేతను 'అశ్'అగు'ఇ' పరమునం దుండుటచేతను ఈ సూత్రము ప్రవర్తించి లోపము (య్‌వ్‌లకు) వికల్పముగ వచ్చినచో 'హర ఇహ''విష్ణ ఇహ'అను రూపములు సిద్ధించును. లోపము రాని పక్షమున 'హరయిహ' 'విష్ణవిహ'అను రూపము లగును.

లోపపక్షమున 'హర ఇహ' 'విష్ణ ఇహ' అను రూపములు సిద్ధించి యుండగా నిచట 'ఆద్గుణః' అను సూత్రముచే గుణము వచ్చి 'హరేహ' 'విష్ణేహ' అను రూపములు సిద్ధించుటకు అవకాశము కలదు. కాని యట్లు గుణము రాదు. అందులకు కారణము క్రింద చూపబడుచున్నది.

## 31. పూర్వత్రాసిద్ధమ్ 8.2.1

సపాదసప్తాధ్యాయీం ప్రతి త్రిపాద్యసిద్ధా; త్రిపాద్యామపి పూర్వం ప్రతి పరం శాస్త్రమసిద్ధమ్. హర ఇహ, హర యిహ. విష్ణ ఇహ, విష్ణ విహ.

పూర్వత్ర = పూర్వశాస్త్రము ప్రవర్తింపవలసి యున్నపుడు, అసిద్ధమ్ (పరశాస్త్రము) అసిద్ధమగును– అని సూత్రార్థము.

పాణినివిరచిత మగు అష్టాధ్యాయిలో నెనిమిది అధ్యాయములును, ఒక్కొక యధ్యాయమున నాలుగు పాదములును గలవు. 'పూర్వత్రాసిద్ధమ్' అనునది ఎనిమిదవ యధ్యాయము ద్వితీయపాదమునందలి మొదటి సూత్రము. కావున దీని వెనుక ఏడధ్యాయముల ఒకపాద మున్నది. ఆ భాగమునకు 'సపాద సప్తాధ్యాయి' యని పేరు. ఈ సూత్రము తరువాత మూడు పాదము లున్నవి. వీటికి 'త్రిపాది' యని పేరు. త్రిపాది ప్రారంభమున నీ సూత్ర మున్నది గాన సపాదసప్తాధ్యాయి దృష్టిలో త్రిపాది అసిద్ధము—అనగా లేనిదానివంటిది— అను నర్థము వచ్చును. ఈ సూత్రము అధికారసూత్రము. (అధికారసూత్ర మనగా తన స్థానమున లక్ష్యసిద్ధికి ఉపయుక్త మగు నర్థమును జెప్ప జాలక తన యనంతర వచ్చు [ఉత్తరవర్తి] సూత్రముతో కలసి యర్థమును బోధించు సూత్ర మని యర్థము. 'స్వస్థలే లక్ష్యేపయోగి బోధా జనకత్వే సతి స్వోత్తర వర్తివాక్యైకవాక్యతాపన్నత్వం అధికారత్వమ్".) కావున త్రిపాదిలోని ప్రతి సూత్రముతోడను ఈ సూత్రము సంబంధించుటచే పూర్వసూత్రము ప్రవర్తించు నపుడు దానిదృష్టిలో ఈ సూత్రము (ప్రస్తుత మగు ఉత్తరసూత్రము) అసిద్ధ మగు నని చెప్పుచుండును. ఇట్లు సపాదసప్తాధ్యాయిని గూర్చి త్రిపాది అసిద్ధము. త్రిపాదిలో కూడ పూర్వసూత్రదృష్టిలో ఉత్తరసూత్రము అసిద్ధము అని ఈ సూత్రము బోధించుచున్నది

ఇపుడు 'హరయ్ + ఇహ'. 'విష్ణవ్ + ఇహ' అని యుండగా 'లోప శ్శాకల్యస్య' అను సూత్రముచే (30) 'య్‌వ్' లకు లోపము వచ్చినది. కావున 'హర + ఇహ', 'విష్ణ + ఇహ' అని యుండుటచే 'ఆద్గుణః' అను సూత్రమున కవకాశము వచ్చినది. లోపమే లేనిచో అకారమునకు అచ్చు పరము కాకుండుటచే గుణమునకు ప్రసక్తి లేదు. కాని లోపము వచ్చినను ఇపుడు ఈ సూత్రము ననుసరించి గుణమున కవకాశము లేదు. లోపసూత్రము అష్టమాధ్యాయ తృతీయ పాదమునం దున్నది. గుణసూత్రము ఆరవఅధ్యాయము మొదటి పాదములోనిది. వెనుక చెప్పిన రీతిగా సప్తాదసప్తాధ్యాయిదృష్టిలో త్రిపాది అసిద్ధము గాన 'ఆద్గుణః' అనుసూత్రమునకు 'లోపశ్శాకల్యస్య' అను సూత్రము గాని తత్కార్యము గాని ఉన్నట్లే కనబడదు. అనగా గుణసూత్రము దృష్టిలో యకారవకారములే ఉన్నట్లు కనబడుచుండును. కావున అకారమునకు అచ్చు పరముగా లేకుండుటచే గుణము రాదు. 'హర ఇహ' 'విష్ణ ఇహ' అను రూపములు మాత్రమే లోప పక్షమున నుండును. లోపాభావపక్షమున 'హర యిహ' 'విష్ణ విహ' అను రూపము లగును.

## 32. వృద్ధిరాదైచ్ 1.1.1

ఆదైచ్చ వృద్ధిసంజ్ఞః స్యాత్.

వృద్ధిః; ఆత్; ఐచ్.

'ఆ'కారమునకును 'ఐఔ'లకును వృద్ధి యని పేరు.

గుణసూత్రమునందు వలె ఈ సూత్రమునందు గూడ తపరకరణ ముండుటచే కేవలదీర్ఘము లగు 'ఆ, ఐ, ఔ'లకు మాత్రమే గ్రహణము కాని తత్సవర్ణములకు లేదు.

### 33. వృద్ధిరేచి 6.1.88

ఆదేచి పరే వృద్ధిరేకాదేశః స్యాత్. గుణాపవాదః, కృష్ణైకత్వమ్, గఙ్గౌఘః, దేవైశ్వర్యమ్, కృష్ణౌత్కణ్ఠ్యమ్.

'ఆద్గుణః' నుండి 'ఆత్' "ఏకః పూర్వపరయోః" అను అధికారసూత్రమును అనువర్తించును.

అకారమునకు ఏచ్ (ఏ, ఓ) పర మగునపుడు పూర్వపరవర్ణములకు వృద్ధి యేకాదేశముగ వచ్చును.

*ఈ వృద్ధి గుణమున కపవాదము*

సామాన్యశాస్త్రము, అపవాదశాస్త్రము అని శాస్త్రము (విధి) రెండు విధములు. అధికస్థలములందవకాశము గలది సామాన్యశాస్త్రము. పరిమితస్థలములందవకాశము కలది అపవాదశాస్త్రము లేక విశేషశాస్త్రము. సాధారణముగ అపవాదశాస్త్రము ప్రవర్తించు ఎల్ల స్థలములందును సామాన్యశాస్త్రము ప్రవర్తింపనవకాశ ముండును. సామాన్యశాస్త్రము ప్రవర్తించినచో అపవాదశాస్త్రమున కవకాశమే యుండదు. కావున అపవాదశాస్త్రము సామాన్యశాస్త్రముకంటె బలీయమను నియమము కలదు. "నిరవకాశో విధిరపవాదః". ఉదాహరణకు–గుణసూత్రము అకారమునకు అచ్చు పరమగుచో గుణము వచ్చు నని చెప్పుచున్నది. వృద్ధిసూత్రము అకారమునకు ఏచ్ పర మగుచో వృద్ధి వచ్చు నని చెప్పుచున్నది. 'ఏచ్' కూడ 'అచ్' కావున వృద్ధి రావలసి యున్న అన్ని లక్ష్యములందును గుణమున కవకాశ ముండుటచే గుణము చేసినచో వృద్ధిశాస్త్రమునకు అవకాశము లేకుండ పోవును. అందుచే వృద్ధిశాస్త్రము గుణశాస్త్రమున కపవాద మని యంగీకరించి వృద్ధికి అవకాశము లేని 'ఉపేన్ద్రః' ఇత్యాది స్థలములందు మాత్రమే గుణశాస్త్రమును ప్రవర్తింప జేయవలెను.



కృష్ణైకత్వమ్:– 'కృష్ణ + ఏకత్వ' అని యుండగా 'అ'కారమునకు 'ఏ'కారము పరముగ నున్నది గాన ఆ రెండింటి స్థానమున స్థానసామ్యము గల ఐకారము ఏకాదేశ మై 'కృష్ణైకత్వమ్' అను రూపము నిష్పన్న మైనది.

గఙ్గౌఘః:– 'గఙ్గా + ఓఘః' అని యుండగా 'ఆఓ'ల స్థానమున స్థానసామ్యముచే అంతరతమ మగు 'ఔ' ఏకాదేశ మై 'గఙ్గౌఘః' అను రూప మేర్పడినది.

దేవైశ్వర్యమ్:– దేవ + ఐశ్వర్యమ్ అని యుండగా 'అఐ'ల స్థానమున 'ఐ' ఏకాదేశ మై 'దేవైశ్వర్యమ్' అను రూప మేర్పడినది.

కృష్ణౌత్కణ్ఠ్యమ్:– 'కృష్ణ + ఔత్కణ్ఠ్యం' అని యుండగా 'ఔ'కార మేకాదేశ మై 'కృష్ణౌత్కణ్ఠ్యమ్' అను రూపము సిద్ధించును.

### 34. ఏత్యేధత్యూఠ్సు 6.1.89

అవర్ణాత్ ఏజాద్యోః ఏత్యేధత్యోః ఊఠి చ పరే వృద్ధిరేకాదేశః స్యాత్. పరరూపగుణాపవాదః. ఉపైతి. ఉపైధతే. ప్రష్ఠౌహః. ఏజాద్యోః కిమ్? ఉపేతః, మా భవాన్ ప్రేదిధత్.

'ఆద్గుణః' నుండి 'ఆత్' 'వృద్ధిరేచి' నుండి 'ఏచి' అనువర్తించును. 'ఏచి' అనుదానిని 'ఏత్యేధత్యూఠ్సు' అను పదమునకు విశేషణముగా చేయగా:–

అవర్ణముకంటె ఏజాదు లగు—అనగా 'ఏచ్'తో ప్రారంభ మగు 'ఇణ్' 'ఏధ' ధాతువులను 'ఊఠ్' అనునదియు పర మగు నపుడు వృద్ధి ఏకాదేశముగ వచ్చును.

ఇచట 'ఊఠ్' ఊకారముతో ప్రారంభ మగును గాని 'ఏచ్'తో ప్రారంభ మగు నవకాశము దానికి లేదు గాన ఏజాదిత్వము ఊఠ్‌నకు చెప్పబడలేదు.

ఇది 'ఏఙి పరరూపమ్' అను సూత్రముచే (38) విధింప నున్న పరరూపమునకును 'ఆద్గుణః' అను సూత్రముచే (27) విధింపబడిన గుణమునకును అపవాదము.

ఉపైతి:- 'ఉప + ఏతి'. ఇచట అకారమునకు ఏజాదిక మగు ఇణ్ ధాతువు ('ఏతి' అనునది 'ఇణ్ గతౌ' అను ధాతువు లట్ ప్రథమపురుషైకవచనము) పర మగుటచే వృద్ధి వచ్చి 'ఉపైతి' అను రూప మేర్పడినది.

ఉపైధతే:- ఉప + ఏధతే. ఇచట గూడ అకారమునకు ఏజాది ఏధ ధాతువు పర మగుటచే వృద్ధి చేయబడినది.

పై రెండుదాహరణములందును ఈ సూత్రము లేకున్నచో 'ఏఙి పర రూపమ్' అను సూత్రముచే (38) పరరూపము వచ్చి 'ఉపేతి' ఉపేధతే'' అను రూపములు ఏర్పడి యుండెడివి. కాని వెనుక చూపిన విధముగ ఈ సూత్రము పరరూపసూత్రమున కపవాద మగుటచే వృద్ధియే వచ్చినది.

ప్రష్ఠౌహః:- ప్రష్ఠ + ఊహః. 'ఊహ' అనునది ''వాహ ఊఠ్' అను సూత్రముచే (257) 'వాహ్' అనుదానికి 'ఊఠ్' అను నాదేశము చేయుటచే నేర్పడినది. కావున ఇచట 'అ'కారమునకు 'ఊఠ్'పర మగుటచే 'ఔ'కార మేకా దేశ మై 'ప్రష్ఠౌహః' అను రూపము సిద్ధించును.

ఈ సూత్రము లేకున్నచో ఇచట 'అద్గుణః' అను సూత్రముచే గుణము వచ్చి యుండెడిది.

ఏచ్చుతో నారంభ మగు 'ఇణ్' 'ఏధ' ధాతువులని చెప్పక 'ఇణ్' 'ఏధ' ధాతువులు అని మాత్రమే చెప్పి యున్నచో ఆ ధాతురూపములకు 'ఏచ్' ఆదియం దున్నను లేకున్నను వృద్ధి వచ్చి యుండెడిది. అట్లైనచో 'ఉప + ఇతః' అను నపుడు 'ఇణ్' ధాతురూప మగు 'ఇతః' అనునది ఏజాది కాక పోయినను వృద్ధి వచ్చి 'ఉపైతః' అనియు, 'ప్ర + ఇదిధత్' అనుచో 'ఇదిధత్' అను ఏధధాతు రూపము ఏజాదికముకాకపోయినను వృద్ధి వచ్చి 'ప్రైదిధత్' అనియు అనిష్ట రూపములు సిద్ధించెడివి. తన్నివారణార్థమై 'ఏజాద్యోః' అను విశేషణము చేర్చ బడెను.

'ఇదిధత్' అనునది ణిజన్త మగు ఏధధాతువు లుఙ్ ప్రథమపురుషైకవచన రూపము. 'మాఙ్'తోకలసి యుండుటచే అడాగమము రాలేదు.



వా. అక్షాదూహిన్యాముపసఙ్ఖ్యానమ్.

అక్షౌహిణీ సేనా.

'అక్ష'శబ్దమునకు 'ఊహినీ' శబ్దము పర మగునపుడు వృద్ధి చెప్ప వలెను.

అక్షౌహిణీ:- అక్ష + ఊహినీ. ఇచట సామాన్యశాస్త్ర మగు 'అద్గుణః' అను సూత్రముచే గుణము రావలసి యుండ నీ సూత్రముచే వృద్ధి వచ్చి 'అక్షౌహిణీ' రూపము సిద్ధించినది. 'పూర్వపదాత్సంజ్ఞాయామగః' అను సూత్ర ముచే (1267) 'న'కారమునకు 'ణ'కారము.

వా. ప్రాదూహోఢోఢ్యేషైష్యేషు.

ప్రౌహః. ప్రౌఢః. ప్రౌఢిః. ప్రైషః. ప్రైష్యః

'ప్ర'అను ఉపసర్గకంటె ఊహ,ఊఢ,ఊఢి,ఏష,ఏష్య అనునవి పర మగునపుడు వృద్ధి పూర్వపరముల కేకాదేశముగ వచ్చును.

ప్ర + ఊహః = ప్రౌహః-ప్రకృష్ట మగు తర్కము. ప్ర + ఊఢః- ప్రౌఢః=ప్రౌఢుడు. ప్ర + ఊఢిః-ప్రౌఢిః = ప్రౌఢత్వము. ప్ర + ఏషః-ప్రైషః, ప్రేరేపించుట. ప్ర + ఏష్యః- ప్రైష్యః = భృత్యుడు. మొదటి మూడు లక్ష్యము లలో గుణమునకును చివరి రెండు లక్ష్యములలో పరరూపమునకును ఈ వృద్ధి యపవాదము.

వా. ఋతే చ తృతీయాసమాసే.

సుఖేన ఋతః సుఖార్తః. తృతీయేతి కిమ్? పరమర్తః

తృతీయాసమాసమున అకారముకంటె 'ఋత'అను పదము పర మగు నపుడు (గుణమునకు బదులు) పూర్వపరవర్ణములకు వృద్ధి యేకాదేశముగ వచ్చును.

సుఖార్తః- సుఖ + ఋత. ఇచట 'అ'కార'ఋ'కారముల స్థానమున వృద్ధిసంజ్ఞక మగు'ఆ'కారము రపరమై (అర్) వచ్చుటచే 'సుఖార్తః' అను రూపము నిష్పన్న మైనది. 'సుఖేన ఋతః' అని విగ్రహము.

'తృతీయాసమాసే' అని చెప్పుటచే కర్మధారయసమాస మగు "పరమ ఋతశ్చాసౌ ఋతశ్చ పరమర్తః' అను పదమున అకారమునకు ఋతశబ్దము పర మైనను వృద్ధిచేయబడలేదు. 'పరమ-ఋత'అని యుండగా గుణముచే 'పరమర్త'అను రూప మేర్పడినది.

*వా. ప్రవత్సతర కమ్బల వసనార్ణ దశానామృణే.*

ప్రార్ణమ్. వత్సతరార్ణమ్, ఇత్యాది.

ప్ర,వత్సతర,కమ్బల,వసన,ఋణ,దశ అను పదములకు ఋణశబ్దము పర మగునపుడు (గుణమునకు బదులుగ) పూర్వపరవర్ణములకు వృద్ధి యేకాదేశ మై వచ్చును. ఇచట అన్ని లక్ష్యములందును 'అ' కారము రపర మై (ఆర్) ఆదేశ మగును.

ప్ర + ఋణమ్ = 'ప్రార్ణమ్' అధిక మగు ఋణము. వత్సతర + ఋణమ్ 'వత్సతరార్ణమ్' = లేగదూడకై చేసిన ఋణము. కమ్బల + ఋణమ్ = 'కమ్బలార్ణమ్' కంబళికొరకై చేసిన ఋణము వసన + ఋణమ్ 'వసనార్ణమ్' వస్త్రముకొఱకై చేసిన ఋణము. ఋణ + ఋణమ్ = 'ఋణార్ణమ్' ఒక ఋణము దీర్చుటకై చేసిన రెండవ ఋణము దశ + ఋణ = దశార్ణః = ఒక దేశము'.దశ ఋణాని జలాని యస్మిన్ సః దశార్ణః'అని విగ్రహము.

## 35. *ఉపసర్గాః క్రియాయోగే* 1.4.59.

ప్రాదయః క్రియాయోగే ఉపసర్గసంజ్ఞాః స్యుః.

'ప్రాదయః'అను సూత్రము అనువర్తించును. ప్రాదులు క్రియాసంబంధ మేర్పడినపుడు ఉపసర్గ సంజ్ఞము లగును.

ప్ర,పరా,అప,సమ్,అను,అవ,నిస్, నిర్,దుస్,దుర్,వి, ఆఙ్,ని, అధి,అపి,అతి,సు,ఉత్,అభి,ప్రతి,పరి,ఉప-ఏతే ప్రాదయః.

ప్ర, పరా మొదలగు ఇరువదిరెండును ప్రాదులు.



## 36. *భూవాదయో ధాతవః* 1.3.1

క్రియావాచినః భ్వాదయో ధాతుసంజ్ఞాః స్యుః.

క్రియావాచకము లగు 'భూ'మొదలగునవి ధాతుసంజ్ఞములు.

ధాతుపాఠమున మొదటిధాతువు'భూ'ధాతు వగుటచే 'భ్వాదయః' అని చెప్పబడినది. సూత్రమున 'భూ'ధాతువును మాత్ర ముదాహరించి 'భ్వాదయః' అనిచెప్పిన చాలినను 'వా'ధాతువును గూడ చేర్చుటచే 'వా'ధాతువువంటివి-అనగా 'వా ధాతువు' వలె క్రియావాచకము లైనవి-అను విశేషార్థము చెప్పబడినది. ఇట్లు చెప్పుటచే క్రియావాచకములు కాక భూమ్యాదివాచకము లగు 'భూ'ఇత్యాదులకు ధాతుత్వము లేదు.

## 37. *ఉపసర్గాదృతి ధాతౌ* 6.1.91

అవర్ణాన్తాదుపసర్గాత్ ఋకారాదౌ ధాతౌ పరే వృద్ధిరేకాదేశః స్యాత్.ప్రార్ఛతి.

'అద్గుణః' నుండి 'అత్' వృద్ధిరేచి' నుండి 'వృద్ధిః' 'ఏకః పూర్వపరయోః' అను అధికారసూత్రమును అనువర్తించును.

అవర్ణాన్త మగు ఉపసర్గకంటె ఋకారాదిధాతువు పర మగునపుడు పూర్వపరవర్ణములకు వృద్ధి యేకాదేశముగ వచ్చును.

ప్రార్ఛతి:- ప్ర + ఋచ్ఛతి ఇచ్చట 'ప్ర'అను అకారాన్తోపసర్గకు 'ఋ'కారాది యగు 'ఋచ్ఛతి'పర మగుటచే వృద్ధి(ఆర్)వచ్చును.

## 38. *ఏఙి పరరూపమ్* 6.1.94

ఆదుపసర్గాత్ ఏఙాదౌ ధాతౌ పరే పరరూపమేకాదేశః స్యాత్. ప్రేజతే. ఉపోషతి.

పూర్వసూత్రమునందు వలె'అత్''ఏకః','పూర్వపరయోః'అను పదములను, పూర్వసూత్రమునుండి 'ఉపసర్గాత్''ధాతౌ'అను పదములను అనువర్తించును.

అవర్ణాన్త మగు ఉపసర్గకంటె ఏఙాదిధాతువు పర మగునపుడు పూర్వపరవర్ణములకు పరరూపము ఏకాదేశ మగును.

రెండు వర్ణముల స్థానమున పరవర్ణముతో సమాన మగు వర్ణము (అనగా పరవర్ణము) ఆదేశముగా వచ్చుటకు పరరూప మనియు, పూర్వవర్ణముతో సమాన మగు వర్ణము (అనగా పూర్వవర్ణము) వచ్చుటకు పూర్వరూప మనియు పేర్లు.

ప్రేజతే:- ప్ర + ఏజతే. ఇచట అకారాన్త మగు ఉపసర్గకు ఏజాదిధాతు వగు 'ఏజతే' పరముగ నుండుటచే 'అఏ'లస్థానమున పరవర్ణ రూపము (ఏ) వచ్చి 'ప్రేజతే' అను రూప మేర్పడినది. అధికముగ కంపించుచున్నది అని యర్థము.

ఉపోషతి:- ఉప + ఓషతి, ఇచట అకారాన్తోపసర్గకు ఏజాదిధాతు వగు 'ఓషతి' పర మగుటచే పరరూపముచే 'ఉపోషతి' అను రూపము సిద్ధించినది. 'జ్వలించుచున్నది' అని యర్థము. ఈ పరరూపము 'వృద్ధిరేచి' (33)అను వృద్ధికి అపవాదము.

### 39. అచోన్త్యాది టి. 1.1.64

అచాం మధ్యే యోఽన్త్యః స ఆదిర్యస్య తత్ టిసంజ్ఞం స్యాత్.

అచః, అన్త్యాది, టి. 'అచః' అనునది నిర్ధారణషష్ఠ్యన్తము అన్త్యః ఆదిః యస్య తత్ అన్త్యాది.

(పదమునందలి) అచ్చులలో ఏ అచ్చు అన్త్య మైనదో ఆ అచ్చు ఆది యందుగల-అనగా ఆ అచ్చుతో ప్రారంభ మగు-వర్ణసముదాయమునకు టి యను పేరు.

ఉదాహరణమునకు:- 'మనస్'అను శబ్దమున 'న'కారముపై నున్న 'అ'కారము అంత్య మగు అచ్చు. దానితో ప్రారంభ మగు వర్ణసముదాయము 'అస్'అనునది. దానికి 'టి'అను పేరు. 'శక'మొదలగు పదములలో చివరి అచ్చు 'క'కారముపై 'అ'కారము. దానితో ప్రారంభ మగు వర్ణసముదాయ మేదియు లేకపోయినను ఆ చివరి అచ్చునకే టి యను పేరు.

వా. శకన్ధ్వాదిషు పరరూపం వాచ్యమ్; తచ్చ టేః.

శకన్ధుః. కర్కన్ధుః. మనీషా ఆకృతిగణోఽయమ్ మార్తణ్డః.





శకన్ధ్వాదిపదముల విషయమున పూర్వపరవర్ణములకు పరరూప మేకాదేశ మగునని చెప్పవలెను. ఈ పరరూపము 'టి'కి వచ్చును.

శకన్ధుః- (శకానాం అన్ధుః, కూపః శకన్ధుః) శక + అన్ధుః ఇచట 'శక' యందలి టి యగు'అ'కారమునకును 'అన్ధుః'అను పదమునందలి 'అ'కారమునకును పరరూపమగు 'అ'కారము వచ్చుటచే 'శకన్ధుః'అను రూపము నిష్పన్న మగును.

కర్కన్ధుః- (కర్కాణాం అన్ధుః, కూపః కర్కన్ధుః) 'శకన్ధుః'వలెనే రూపనిష్పత్తి యగును.

మనీషా:- మనస్ + ఈషా, ఇచట 'మనస్'నందలి'అస్'అను వర్ణసముదాయమునకు టి యను సంజ్ఞ కావున 'అస్' + 'ఈ'-ఈ రెండిటి స్థానమున పరవర్ణ రూప మగు ఈకారము వచ్చుటచే 'మనీషా'యను రూపము సిద్ధించును. బుద్ధి యని యర్థము.

శకన్ధ్వాదిగణము ఆకృతిగణము. కావున 'మార్తండః'అను రూపము గూడ సిద్ధించినది.

పాణినిమహర్షి తన వ్యాకరణమున ఒకే కార్యము గల అనేకపదముల నొక సముదాయముగ నేర్పరచి దానికి గణ మని పేరిడెను. అట్టి గణము లెన్నియో గలవు. ఏదైన ఒక గణము మొదట నున్న పదము ననుసరించి యా గణమునకు పేరు పెట్టుచుందురు. ఉదాహరణమునకు—'శకంధు' అను పదము మొదట నుండుటచే ఈ గణమునకు శకన్ధ్వాదిగణ మని పేరు వచ్చెను. ఈ గణములలో కొన్ని ఆకృతిగణములు. అనగా నొక గణమున కొన్ని పదములు చేర్చి వాటి కన్నిటికిని వర్తించు వ్యాకరణకార్య మేదైన విధింపబడి యుండును. ఆ కార్యమే వర్తించు మరి యొక పద మేదైన నుండవచ్చును. కాని యా పదము ఆ గణమున చేర్పబడక పోయినను మన మా పదమును ఆకృతిసామ్య మును బట్టి యా గణమున చేర్చి యా వ్యాకరణకార్యము నాపదమునకు కూడ వర్తింప చేయవచ్చును. ఇట్లు ఇతరపదములను గూడ జేర్చుట కవకాశము గల గణములను 'ఆకృతిగణము' లందురు. శకన్ధ్వాదిగణము కూడ ఆకృతిగణమే. కావుననే 'మృతండ'మొదలగు క్రొత్త పదములను ఇందు చేర్చి పరరూపము చేయ నవకాశ మేర్పడినది.

'మృత + అండ'అని యుండగా ఈ వార్తికముచే పరరూపము చేయగా 'మృతణ్డ'యను రూప మేర్పడినది. దానిపై 'తత ఆగతః'అను సూత్రముచే (1098) 'అణ్'చేర్చి ఆదివృద్ధ్యాదికము చేయగా 'మార్తణ్డ'అను రూప మేర్పడినది. అట్లు కానిచో సవర్ణదీర్ఘసంధిచే 'మృతాణ్డ'యై పిదప 'మార్తాణ్డ'అను రూపము ఏర్పడి యుండెడిది.

### 40. ఓమాఙోశ్చ. 6.1.95

ఓమి ఆఙి చాత్ పరే పరరూపమేకాదేశః స్యాత్. శివాయోం నమః. శివ ఏహి:-

'అద్గుణః''ఏఙి పరరూపమ్''ఏకః పూర్వపరయోః'అను సూత్రములనుండి 'ఆత్''పరరూపమ్''ఏకః','పూర్వపరయోః'అను పదములు అనువర్తించును.

అకారముకంటె 'ఓమ్''ఆఙ్'అనునవి పర మగునపుడు పూర్వపరముల స్థానమున పరరూప మేకాదేశ మగును.

శివాయోంనమః- శివాయ + ఓంనమః ఇచట యకారోత్తరవర్తి యగు 'అ'కారమునకు'ఓం'అనునది పరముగ నుండుటచే పూర్వపరవర్ణము లగు 'అ'కార'ఓ'కారముల స్థానమున పరరూపమగు ఓకార మేకాదేశమై'శివాయోం నమః' అను రూపము సిద్ధించినది.

శివ + ఏహి. ఇచట ఏహి అనునది 'ఆఙ్'అను ఉపసర్గ 'ఇహి'అను ఇణ్ ధాతులోణ్మధ్యమపురుషైకవచనరూపముతో కలియుటచే నేర్పడిన రూపము. ఆఙ్ నందలి'ఙ్'ఇత్సంజ్ఞక మగుటచే 'ఆ'అనునది మాత్రమే పరిశిష్టమై 'అద్గుణః'అను సూత్రముచే (27) గుణము వచ్చి 'ఏహి'అను రూపము సిద్ధించినది.

ఇపుడు శివ + ఏహిఅనునపుడు వకారోత్తరవర్తి యగు అకారమునకు 'ఏహి'లోని 'ఏ'పరముగ నున్నది కాని 'ఆఙ్'పరముగ లేదు కావున ఇచట పరరూప మెట్లు వచ్చును? అను సందేహము కలుగును. తన్నివృత్తికై క్రింది సూత్రము చెప్పబడుచున్నది:-

### 41. అన్తాదివచ్చ. 6.1.85

యోఽయమేకాదేశః స పూర్వస్యాన్తవత్ పరస్యాదివత్ స్యాత్ శివేహి.



'ఏకః పూర్వపరయోః' అనునది అనువర్తించును. ఏకాదేశము పూర్వమునకు (పూర్వవర్ణసముదాయమునకు) అన్తము వలెను పరమునకు (పరవర్ణసముదాయమునకు) ఆది వలెను అగును.

'ఏకః పూర్వపరయోః'అను అధికారమున ఎల్ల యెడలను వర్ణద్వయము స్థానిగను ఒక వర్ణము ఆదేశముగను వచ్చుచుండును. ఇట్లు ఏకాదేశముగ వచ్చిన వర్ణము ప్రథమస్థానివర్ణఘటిత మగు పూర్వవర్ణసముదాయమునకు అన్తమున నున్న ప్రథమస్థాని చేయు కార్యమును, ద్వితీయస్థానిఘటిత మగు ఉత్తరవర్ణసముదాయమున కాదియం దున్న ద్వితీయస్థాని చేయు కార్యమును కూడ చేయు నని సూత్రార్థము. ఏకాదేశము చేయుటకు పూర్వము పూర్వవర్ణసముదాయమునందు లేక ఉత్తరవర్ణసముదాయమునందు గల ధాతుత్వ.ప్రాతిపదికత్వ. నిపాతత్వోపసర్గత్వ సుబన్తత్వాదివ్యవహారము ఏకాదేశముగ వచ్చిన వర్ణమునందు కూడ నుండు నని భావము.

'ఏహి'అనునపుడు'ఏ'కారము ఉపసర్గ యగు'ఆ'కును'ఇహి'అనుదాని'ఇ'కినిఏకాదేశమై వచ్చినది. 'ఆ'అనునది పూర్వవర్ణసముదాయము. దాని అంతము కూడ వ్యపదేశివద్భావముచే[1] 'ఆ'అనునదియే. ఉత్తరవర్ణసముదాయ మగు 'ఇహి'అను దాని ఆద్యక్షరము'ఇ'అనునది. కావున ఈ రెండిటి స్థానమున వచ్చిన 'ఏ' అటు 'ఆ'గను ఇటు 'ఇ'గను గూడ పరిగణింపబడి తత్కార్యములు సాధించును. కావున 'శివ + ఏహి'అనునపుడు 'ఏ'అనుదానిని 'ఆఙ్'గ పరిగణించి 'ఓమాఙోశ్చ'అను సూత్రముచే పరరూపము చేయవచ్చును. అట్లు పరరూపము చేయగా 'శివేహి'అను రూపము సిద్ధించును.

### 42. అకస్సవర్ణే దీర్ఘః 6.1.101

అకః సవర్ణే అచి పరే పూర్వపరయోర్దీర్ఘ ఏకాదేశః స్యాత్. దైత్యారిః,శ్రీశః,విష్ణూదయః, హోతౄకారః.

'ఇకోయణచి' నుండి 'అచి','ఏకఃపూర్వపరయోః'అను అధికార సూత్రమును అనువర్తించును.

---

1. 'దేవదత్తస్య ఏకః పుత్రః స ఏవ జ్యేష్ఠః స ఏవ కనిష్ఠః స ఏవ మధ్యమః'అను న్యాయమున ఒకే వర్ణమును ఆదిగను అంతము గను పరిగణించుటకు వ్యపదేశివద్భావ మని పేరు.

'అక్'నకు సవర్ణ మగు 'అచ్'పర మగుచో పూర్వపరవర్ణముల స్థానమున దీర్ఘ మేకాదేశ మగును.

దైత్యారిః-'దైత్య + అరిః'ఇచట యకారోత్తరవర్తి యగు 'అ'కారమునకు 'అరిః'యందలి సవర్ణ మగు 'అ'కారము పరమైనది గాన ఈ సూత్రముచే అన్తరతమ మగు 'ఆ'కారము ఏకాదేశమై 'దైత్యారిః'అను రూప మేర్పడినది.

శ్రీశః-'శ్రీ + ఈశః'ఇచట రెండు ఈకారముల స్థానమున దీర్ఘ మగు 'ఈ'కారము ఏకాదేశమై 'శ్రీశః'అను రూప మేర్పడినది.

విష్ణూదయః-'విష్ణు + ఉదయః' 'విష్ణూదయః'.హోతృ + ఋకారః = హోతౄకారః'ఈ రూపములు గూడ పై విధముగనే యేర్పడినవి.

### 43. ఏఙః పదాన్తాదతి. 6.1.109

పదాన్తాదేఙోఽతి పరే పూర్వరూపమేకాదేశః స్యాత్. హరేఽవ. విష్ణోఽవ.

'అమి పూర్వః' నుండి 'పూర్వః''ఏకః పూర్వపరయోః'అను నధికార సూత్రమును అనువర్తించును.

పదాన్తమందున్న ఏఙ్(ఏఓ)కంటె హ్రస్వ'అ'కారము పర మగునపుడు పూర్వపరములకు పూర్వరూప మేకాదేశముగ వచ్చును.

హరేఽవ:- 'హరే + అవ'ఇచట పదాన్తమందలి రేఫోత్తరవర్తి యగు ఏకారమునకు 'అవ'యందలి హ్రస్వ'అ'కారము పరముగ నున్నది గాన ఈ 'ఏఅ'ల స్థానమున పూర్వవర్ణ మగు ఏకారరూపము (ఏకారము) వచ్చుటచే 'హరేఽవ'అను రూప మేర్పడినది.

విష్ణోఽవ:- 'విష్ణో + అవ'ఇచట పూర్వోదాహరణమునందు వలె ఓకారఅకారముల స్థానమున పూర్వరూప మగు 'ఓ'వచ్చుటచే 'విష్ణోఽవ'అను రూప మేర్పడును.

### 44. సర్వత్ర విభాషా గోః. 6.1.122

లోకే వేదే చ ఏఙన్తస్య గోరతి వా ప్రకృతిభావః పదాన్తే.గో అగ్రమ్. గోఽగ్రమ్. ఏఙన్తస్య కిమ్? చిత్రగ్వగ్రమ్ పదాన్తే కిమ్ ? గోః.



'ఏఙః ప్రదాన్తాదతి' అను సూత్రము, 'ప్రకృత్యాన్తః పాదమ్' నుండి 'ప్రకృత్యా' అను పదము అనువర్తించును. దీని వెనుకనున్న 'యజుష్యురః' అను సూత్రమున యజుర్వేద ప్రసక్తి యుండుటచే నీ సూత్రమున 'సర్వత్ర' యని ప్రయోగింప బడినది. సర్వత్ర యనగా లౌకిక సంస్కృతమునందును వైదికసంస్కృతమునందును గూడ యని యర్థము. 'విభాషా' యనగా వికల్పముగ అని యర్థము.

లోకమునందును వేదమునందును గూడ ఏఙన్త మగు గోశబ్దమునకు హ్రస్వ 'అ'కారము పర మగునపుడు వికల్పముగ ప్రకృతిభావము వచ్చును. ఈ 'ఏఙ్' (ఓ) పదాన్తమునం దుండవలెను.

గోఅగ్రమ్:- గో + అగ్రమ్. ఇచట గో అనునది పదము. ఓకారాన్తము. దీనికి హ్రస్వ 'అ'కారము పరముగ నున్నది గాన వికల్పముగ ప్రకృతిభావము (సన్ధ్యభావము) వచ్చుటచే 'గోఅగ్రమ్' అను రూపము ఏర్పడును.

ప్రకృతిభావము రాని పక్షమున 'ఏఙః పదాన్తాదతి' అను సూత్రముచే పూర్వరూపము వచ్చి 'గోఽగ్రమ్' అను రూపము నిష్పన్న మగును.

'ఏఙన్తస్య' అని ఏలచెప్పబడెను? అట్లు చెప్పనిచో "చిత్రగ్వగ్రమ్" అనుచోట దోషము వచ్చును. 'చిత్రాః గావః యస్య సః చిత్రగుః' అను బహువ్రీహి సమాసమున గోశబ్దమునకు 'గోస్త్రియోరుపసర్జనస్య' అను సూత్రముచే (955) హ్రస్వము వచ్చి 'గు' అను రూప మగును. 'చిత్రగు + అగ్ర అనునపుడు పదాన్తగోశబ్దమునకు హ్రస్వ అకారము పరముగ నున్నను గో శబ్దము 'ఓ'కారాన్తము కాకుండుటచే ప్రకృతివద్భావ ప్రసక్తి లేదు. 'ఏఙన్తస్య' అను విశేషణము లేకున్నచో పాక్షిక ప్రకృతిభావముచే 'చిత్రగు అగ్రమ్' అను అనిష్ట రూపము కూడ సిద్ధించెడిది.

'పదాన్తే' అననేల? అట్లవనిచో 'గోః' అను చోట దోషము వచ్చును. 'గోః' అనునది 'గో' అను ప్రాతిపదికకు 'జసి' లేక 'జస్' (అస్) విభక్తి ప్రత్యయమును చేర్చుటచే ఏర్పడిన రూపము. పంచమ్యేకవచనము లేక షష్ఠ్యేకవచనము. రూపనిష్పత్తి సమయమున 'గో + అస్' అని యుండును. 'పదాన్తే' యని చెప్ప కున్నచో ఇచట గూడ పాక్షికప్రకృతిభావము వచ్చి 'గో అః' వంటి అనిష్టరూపము సిద్ధించును. 'పదాన్తే' యనుటచే ఈ దోష

ముండదు. ఏల యన 'గో + అస్' అనునపుడు 'అస్' అను విభక్తి ప్రత్యయముతో కలసిననే 'గోః' అనునది 'సుప్తిఙన్తం పదం' అను సూత్రముచే (14) పదమైనదిగాని విభక్తి ప్రత్యయములేని 'గో' పదము కాజాలదు. కావున ఓకారము పదాన్తగతము కాకుండుటచే నిచట ప్రకృతిభావప్రసక్తి లేదు. 'ఙసిఙసోశ్చ' అను సూత్రముచే (173) పూర్వరూపము రాగా 'గోః' అను రూపము సిద్ధించును.[1]

47వ సూత్రముచే విధింప నున్న 'అవఙ్' ఆదేశము ఎచట రావలెను అను విషయము తెలుపుటకై క్రింది రెండు పరిభాషా సూత్రములు నిచట ప్రసంగవశమున చెప్పబడుచున్నవి.

## 45. అనేకాల్ శిత్ సర్వస్య 1.1.55

ఇతి ప్రాప్తే.

అనేకాల్లను—అనగా అనేకాక్షరములు గలదియు, శిత్- అనగా శకారను ఇత్‌గా గలదియు—అగు ఆదేశము స్థాని యంతకును ఆదేశముగ వచ్చును.

ఈ సూత్రము ప్రకారము 'అవఙ్' అనునది 'అనేకాల్' అగుటచే స్థాని నంతను పూర్తిగా తొలగించి ఆదేశము కావలసి యుండగా:-

## 46. ఙిచ్చ 1.1.53

ఙిదనేకాలప్యన్త్యస్యైవ స్యాత్.

'అలోన్త్యస్య' అను సూత్రము అనువర్తించును.

'ఙిత్' ('ఙ'కారము ఇత్‌గా గలది) అగు ఆదేశము, 'అనేకాల్' ఐనను స్థాని యైనదాని చివరి 'అల్' (అక్షరము)నకు వచ్చును.

ఈ సూత్రము 'అనేకాల్ శిత్సర్వస్య' అను సూత్రమున కపవాదము కావున వృత్తిలో 'అనేకాలపి' అని చేర్చబడినది.

## 47. అవఙ్ స్ఫోటాయనస్య 6.1.123

పదాన్తే ఏజన్తస్య గోరవఙ్ వాఽచి. గవాగ్రమ్; గోఽగ్రమ్. పదాన్తే కిమ్? గవి.

1. 'గో అగ్రమ్' అనునది సమాన మగుటచే సమసించుటకు పూర్వముండి సమసించిన తరువాత లోపించిన (సూ-724) విభక్తి ప్రత్యయమును బట్టి 'గో + అగ్రమ్' అను పదమునందలి 'గో' కూడ పదమే. కావున అచట ఓకారము పదాన్తస్థటకార మగును.



'ఏఙః పదాన్తాదతి' నుండి 'ఏఙః' 'పదాన్తాత్' 'ఇకో యణచి' నుండి 'అచి' 'సర్వత్ర విభాషా గోః' నుండి 'గోః', అనువర్తించును.

పదాన్తమున ఏజన్త మగు గోశబ్దమునకు అచ్చు పర మగునపుడు 'అవఙ్' వికల్పముగ వచ్చును.

'గో + అగ్రమ్' అని యుండగా ఏజన్త మగు గోశబ్దమునకు 'అగ్రమ్' అను పదమునందలి 'అ' పర మగుటచే 'అవఙ్' వచ్చును. 'అవఙ్'లోని 'ఙ' కారము 'హలన్త్యమ్' అను సూత్రముచే (1) ఇత్సంజ్ఞకము. ఇట్లు ఙిత్తు కావున 'అవఙ్' ఆదేశము స్థానిగా నిర్దిష్ట మగు 'గో'శబ్దము నంత్యాల్లు (అంత్యాక్షరము) స్థానమున వచ్చి 'గ్ + అవ + అగ్ర' 'గవాగ్ర' అను రూపము సిద్ధించును. అవఙాదేశము రాని పక్షమున 'ఏఙః పదాన్తాదతి' అని పూర్వరూపము చేయగా 'గోఽగ్రమ్' అను రూపము. వైకల్పిక ప్రకృతిభావముచే 'గో అగ్రమ్' అను రూపము వెనుక చూపబడినది (సూ-44).

'పదాన్తే' యని అననేల? 'పదాన్తే' యని చెప్పక పోయినచో 'గవి' అను సప్తమీవిభక్త్యేకవచనమున దోషము వచ్చును. 'గవి' అనునది గోశబ్దమునకు 'ఙి' ప్రత్యయము చేర్చగా 'గో + ఇ' అని యున్నపుడు 'ఏచోఽయవాయావః' అను సూత్రముచే (22) 'అవ్' ఆదేశము చేయగా నేర్పడినది. ఈ సూత్రమున 'పదాన్తే' యని చెప్పకున్నచో 'గో + ఇ' అనునపుడు ఓకారాంత గోశబ్దమునకు అచ్చు పరముగ నున్నది. గాన 'అవఙ్' వచ్చి "గ్ + అవ + ఇ" = 'గవే' అను అనిష్టరూపము గూడ వికల్పముగ సిద్ధించెడిది. తన్నివారణకై 'పదాన్తే' యని చేర్చబడినది. ఇపుడు 'సుప్తిఙన్తం పదమ్' అను సూత్రమును (14) అనుసరించి 'గో + ఇ' అను మొత్తము సముదాయమే పదము కాని 'గో' అనునది పదము కాదు కావున 'అవఙ్' వచ్చు ప్రసక్తి లేదు.

ఈ సూత్రమున 'స్ఫోటాయన' అనునది ఒక ప్రాచీన వ్యాకరణాచార్యుని పేరు.

## 48. ఇన్ద్రే చ 6.1.124

గోరవఙ్స్యాదిన్ద్రే. గవేన్ద్రః.

'సర్వత్ర విభాషా గోః' 'అవఙ్ స్ఫోటాయనస్య' అను సూత్రములనుండి 'గోః' 'అవఙ్' అను పదములు అనువర్తించును.

గోశబ్దమునకు ఇన్ద్రశబ్దము పర మగునపుడు 'అవఙ్' ఆదేశము వచ్చును.

'గో + ఇన్ద్రః' అనునపుడు ఓకారమునకు 'అవఙ్' ఆదేశము రాగా గ్ + అవ + ఇన్ద్రః = గవ + ఇన్ద్రః = 'గవేన్ద్రః' (గుణసన్ధిచే) అను రూప మేర్పడును.

49. దూరాద్ధూతే చ. 8.2.84

దూరాత్సమ్బోధనే వాక్యస్య టేః ప్లుతో వా.

దూరాత్, హూతే, చ. 'వాక్యస్య టేః ప్లుత ఉదాత్తః' అను సూత్రము అనువర్తించును.

దూరమునుండి పిలుచునపుడు (ఉపయుక్త మగు) వాక్యముయొక్క టికి ప్లుతము వికల్పముగ వచ్చును, అది యుదాత్త మగును.

50. ప్లుత ప్రగృహ్యా అచి నిత్యమ్. 6.1.125

ఏతేఽచి ప్రకృత్యా స్యుః. ఆగచ్ఛ కృష్ణ౩ అత్ర గౌశ్చరతి.

'ప్రకృత్యాన్తః పాదమ్' నుండి 'ప్రకృత్యా' అనువర్తించును.

ప్లుతసంజ్ఞ కలవియు ప్రగృహ్యసంజ్ఞ కలవియు నగు పదములు అచ్చు పర మగునపుడు, ప్రకృతిభావముతో నుండును (సంధిని పొందవు)

'ఆగచ్ఛ కృష్ణ౩ అత్ర గౌశ్చరతి':- ఇచ్చట 'ఆగచ్ఛ కృష్ణ' అనునది యొక వాక్యము. 'అత్ర గౌశ్చరతి'అనునది రెండవ వాక్యము. ఇందు మొదటి వాక్యము దూరాహ్వానమున కుపయుక్త మైనది గాన దీని'టి' యగు'ణ'కారోత్తరవర్తి యగు 'అ'కారమునకు పూర్వసూత్రముచే వికల్పముగ ప్లుతము వచ్చినది. అట్లు ప్లుత మగుటచే ఈ 'అ'కారమునకు ఈ సూత్రముచే ప్రకృతివద్భావము; అనగా ద్వితీయవాక్యమునందలి 'అ'కారముతో సంధి లేదు. ప్లుతము లేని పక్షమున 'కృష్ణాత్ర గౌశ్చరతి'యని సవర్ణదీర్ఘసన్ధి రావచ్చును.

51. ఈదూదేద్ద్వివచనం ప్రగృహ్యమ్. 1.1.111

ఈదూదేదన్తం ద్వివచనం ప్రగృహ్యసంజ్ఞం స్యాత్. హరీ ఏతౌ. విష్ణూ ఇమౌ. గఙ్గే అమూ.

'ఈదూదేత్' అనునది 'ఈ''ఊ''ఏ'ల తపరనిర్దేశము. ఇది 'ద్వివచనం' అనుదానికి విశేషణ మగుటచే 'యేన విధిస్తదన్తస్య'అను పరిభాషాసూత్రము ననుసరించి 'ఈదూదేదన్తం'అను నర్థమును బోధించును.



'ఈ'కార'ఊ'కార'ఏ'కారాన్త మగు ద్వివచనమునకు ప్రగృహ్య మనిపేరు.

పై యుదాహరణములలో 'హరీ''విష్ణూ' 'గఙ్గే' అను పదములపైనున్న 'ఈ'కార'ఊ'కార'ఏ'కారములు ద్వివచనములు గాన ప్రగృహ్యసంజ్ఞములై 'ప్లుత ప్రగృహ్యా అచి నిత్యమ్' అను సూత్రముచే (50) ప్రకృతిభావమును బొందును. 'హరీ ఏతౌ''విష్ణూ ఇమౌ' 'గఙ్గే అమూ' అను సన్ధిరహితరూపము లేర్పడును.

52. అదసో మాత్. 1.1.12

అస్మాత్పరావీదూతౌ ప్రగృహ్యౌ స్తః. అమీ ఈశాః. రామకృష్ణావమూ ఆసాతే. మాత్కిమ్? అముకేఽత్ర.

'ఈదూదేద్ద్వివచనం ప్రగృహ్యం' నుండి 'ఈదూత్','ప్రగృహ్యమ్', అనువర్తించును. అదశ్శబ్దావయవమకారమునకు పర మగు 'ఏ'కార మనునది అసంభావ్య మగుటచే 'ఈదూత్'లతో కలసి యొకే సమాసమున నిర్దిష్టమైనను 'ఏత్' అనునది అనువర్తించదు.

అదశ్శబ్దావయవ మగు మకారముకంటె పరములగు 'ఈ'కార'ఊ'కారములు ప్రగృహ్యసంజ్ఞము లగును.

'అమీ + ఈశాః' 'అమూ + ఆసాతే' అనునపుడు 'ఈ'కార'ఊ' కారములు అదశ్శబ్దమకారోత్తరవర్తు లగుటచే ప్రగృహ్యములై ప్రకృతిభావమును (సూ. 50) చెందినవి. కావున 'ఈ'కారద్వయమునకు సవర్ణదీర్ఘసన్ధియు, 'ఊ'కార 'ఆ'కారములకు యణాదేశసంధియు రాలేదు.

'మాత్'అని చెప్పనేల? అట్లు చెప్పకున్నచో 'అముకే అత్ర' అనునపుడు గూడ అనిష్ట మగు ప్రకృతిభావము వచ్చి యుండెడిది.

ఈ సూత్రమున 'మాత్'అని యుండుటవలననే వెనుక చెప్పిన విధమున అదశ్శబ్దావయవ మగు మకారమునకు పర మగు 'ఏ'కార మనునది అసంభావ్యము గాన 'ఏత్' అనునది అనువర్తించ లేదు.'మాత్'అనునది లేకున్నచో 'సన్నియోగశిష్టానాం సహ వా ప్రవృత్తిః సహ వా నివృత్తిః' (ఒక్క సముదాయమున పఠింపబడినవి అన్నియు కలసియే ప్రవర్తించును లేదా కలసియే నివర్తించును) అను న్యాయముచే 'ఈదూత్'లతో 'ఏత్'కూడ అనువర్తించి యుండెడిది. అపుడు 'అదశ్శబ్దసంబద్ధము లగు ఈకార ఊకార ఏకారములు

ప్రగృహ్యసంజ్ఞకము లగును అను నర్థము చెప్పవలయును. అట్టిచో అదశ్శబ్ద ప్రథమాబహువచనమున 'అవ్యయసర్వనామ్నామకచ్ ప్రాక్టేః' అను సూత్రముచే (1232) అకచ్ ప్రత్యయమును చేర్చుటచే నేర్పడిన 'అముకే'ను పదము నందలి ఏకారమునకు గూడ ప్రగృహ్యసంజ్ఞ లభించుటచే 'అముకే + అత్ర' అను నపుడు ప్రకృతిభావము వచ్చి యుండెడిది. ఆ అనిష్టరూపపరిహారమే 'మాత్' అనుదాని ప్రయోజనము.

### 53. చాదయోఽసత్త్వే, 1.4.57.

అద్రవ్యార్థాశ్చాదయో నిపాతాః స్యుః.

'ప్రాగ్రీశ్వరాన్నిపాతాః' అనుసూత్రముచే 'నిపాతాః' అనునది లభించును. ద్రవ్యభిన్న మగు నర్థమును బోధించు చాదులు నిపాతసంజ్ఞకము లగును.

### 54. ప్రాదయః. 1.4.58

ఏతేపి తథా.

'పూర్వసూత్రమునందువలె 'నిపాతాః'అను పదము, 'చాదయోఽసత్త్వే' అను సూత్రమునుండి 'అసత్త్వే'అను పదము అనువర్తించును.

ఇవి కూడ అట్లే యగును. అనగా ద్రవ్యభిన్నార్థవాచకము లగుప్రాదుల కూడ నిపాతసంజ్ఞకము లగును.

### 55. నిపాత ఏకాజనాఙ్ 1.1.14.

ఏకోఽజ్‌నిపాతః ఆఙ్వర్జః ప్రగృహ్యః స్యాత్. ఇ ఇన్ద్రః, ఉ ఉమేశః. 'వాక్యస్మరణయోరఙిత్'-ఆ ఏవం ను మన్యసే; ఆ ఏవం కిల తత్.అన్యత్ర ఙిత్. ఈషదుష్ణం ఓష్ణమ్.

'ఈదూదేద్ద్వివచనం ప్రగృహ్యమ్' నుండి 'ప్రగృహ్యమ్' అను వర్తించును.

'ఆఙ్'కంటె భిన్న మగు, ఒక 'అచ్'రూపమున నున్న నిపాతము ప్రగృహ్యమనిపేరు.

'ఇ + ఇన్ద్రః' ఇచట 'ఇ'ఏకాజ్రూప మగు నిపాతము కావున ప్రగృహ్యసంజ్ఞక మైనది. 'ప్లుతప్రగృహ్యా అచి నిత్యమ్' అను సూత్రముచే (50) ప్రకృతిభావము. ఇ ఇన్ద్రః అను రూప మేర్పడినది. 'ఉ + ఉమేశః' అను



నుదాహరణమున గూడ ప్రగృహ్యసంజ్ఞాదుల నీ విధముగనే యెఱుగునది. 'ఇ'విస్మయమును 'ఉ'వితర్కమును సూచించును.

'ఆ'అను నిపాత కనేకార్థములు గలవు. అందు కొన్ని యర్థములలో ఇది 'ఙిత్తు' (ఆఙ్) అనియు,కొన్ని యర్థములలో 'ఆ'మాత్రమే యనియు ఈ క్రింది కారిక చెప్పుచున్నది.

> ఈషదర్థే క్రియాయోగే మర్యాదాభివిధౌ చ యః,
> ఏతమాతం ఙితం విద్యాద్వాక్యస్మరణయోరఙిత్.

అనగా-అల్పార్థమునందును, క్రియతో సంబంధించి నపుడును మర్యాదార్థమునందును అభివిధ్యర్థమునందును 'ఆ'అనునది ఙిత్తు (ఆఙ్). వాక్యమునందును (పూర్వోక్త విషయమును అన్యథాచేయుటకుపయుక్తమగు వాక్యము), స్మరణార్థమునందును అఙిత్తు ('ఆ'మాత్రమే). ఏ వస్తువును అవధిగా చెప్పుదురో దానిని కలపకున్నచో 'మర్యాద' యనియు- (తేన వినా మర్యాదా) ఆ వస్తువును గూడ గ్రహించినచో 'అభివిధి'యనియు (తేన సహేత్యభివిధిః) అనియు పేర్లు. ఈ సూత్రమున 'అనాఙ్'అని చెప్పుటచే ఙిత్తగు 'ఆ' అను దానికి మాత్రమే ప్రగృహ్యసంజ్ఞానిషేధము ఙిత్తు కాని 'ఆ'అను దానికి ఈ నిషేధము వర్తించదు కావున ప్రగృహ్యసంజ్ఞా ప్రకృతిభావములు కలుగును. 'ఆ ఏవం ను మన్యసే 'ఆ ఏవం కిల తత్' అను నుదాహరణములలో మొదటి వాక్యమునకు 'నీవు వెనుక ఇట్లు అనుకొనలేదు. ఇపుడు ఇట్లు తలచుచున్నావా?' అనియు రెండవవాక్యమునకు 'ఔను, ఇది అటులేనట' అనియు అర్థము, కావున మొదటి 'ఆ'వాక్యమునందును, రెండవ 'ఆ' స్మరణార్థమునందును ప్రయోగింపబడుటచే ఇవి అఙిత్తులు. కావున ఈ నిషేధము వర్తించక ప్రగృహ్యసంజ్ఞా ప్రకృతిభావములు వచ్చుటచే,వృద్ధిసంధి రాలేదు.

'ఆ + ఉష్ణమ్' అనుచోట 'ఆ' కొంచెము అను నర్థమున నుపయుక్తము కావున ఙిత్తు. దానికి 'అనాఙ్'అను నిషేధ ముండుటచే ప్రగృహ్యసంజ్ఞాదులు లేవు. 'ఆద్గుణః' యని (27) గుణము వచ్చి 'ఓష్ణమ్' అను రూప మేర్పడినది.

### 56. ఓత్ 1.1.15.

ఓదన్తో నిపాతః ప్రగృహ్యః స్యాత్. అహో ఈశాః

వెనుకటి సూత్రము నుండి 'నిపాతః'. 'ఈదూదేద్ద్వివచనం ప్రగృహ్యమ్'నుండి 'ప్రగృహ్యమ్' అనువర్తించును.

ఓకారా న్త మగు నిపాతము ప్రగృహ్యసంజ్ఞక మగును.

'అహో + ఈశాః' :- 'అహో' అనునది ఓకారా న్త నిపాత మగుట

ప్రగృహ్యసంజ్ఞా ప్రకృతిభావములు వచ్చి 'అహో ఈశాః' అను రూపము నిష్పన్న మగును. అవాదేశము రాదు.

57. సమ్బుద్ధౌ శాకలస్యేతావనార్షే 1.1.16

సమ్బుద్ధినిమిత్తక ఓకారో వా ప్రగృహ్యోఽవైదికే ఇతౌ పరే

విష్ణో ఇతి. విష్ణ ఇతి. విష్ణవితి.

'ఈదూదేద్ద్వివచనం ప్రగృహ్యమ్' నుండి 'ప్రగృహ్యమ్'. 'ఓత్' అను సూత్రము అనువర్తించును. 'ఆర్షః' అనగా 'వైదికము' అని యర్థము.

అవైదిక మగు 'ఇతి' అనునది పర మగునపుడు సమ్బుద్ధినిమిత్తక మగు 'ఓ'కారము వికల్పముగ (శాకల్యమతమున) ప్రగృహ్యసంజ్ఞక మగును.

సంబోధనప్రథమైక వచనమునకు 'సమ్బుద్ధి' యని పేరు.

'విష్ణో + ఇతి' :- 'విష్ణు' అనుదానికి సమ్బుద్ధిని నిమిత్తముగ చేసి 'హ్రస్వస్య గుణః' అను సూత్రముచే (169) గుణము చేయగా 'విష్ణో' అను రూప మేర్పడినది. దానికి అవైదిక మగు 'ఇతి' శబ్దము పరమై 'విష్ణో + ఇతి' అని యుండగా ఈ సూత్రముచే ప్రగృహ్యసంజ్ఞః పిదప ప్రకృతిభావము వచ్చుటచే 'విష్ణో ఇతి' అను రూపము. ప్రగృహ్యసంజ్ఞ. వైకల్పిక మగుట 'ఏచోయవాయావః' అను సూత్రముచే ( 22 ) అవాదేశము వచ్చి 'విష్ణవ్ + ఇతి' అని యుండగా 'లోపశ్శాకల్యస్య' (30) అను వైకల్పిక లోపముచే 'విష్ణ ఇతి' అను రూపము లోపాభావపక్షమున 'విష్ణవితి' అను రూపము. వకారలోపము అసిద్ధము గాన గుణము రాదు.

58. మయ ఉఞో వో వా 8.3.33

మయః పరస్య ఉఞః వో వా స్యాదచి. కిమ్వుక్తమ్, కిము ఉక్తమ్.

'ఇకో హ్రస్వాదచి ఙముణ్నిత్యమ్' నుండి 'అచి' అనువర్తించును.

'మయ్' కంటె పర మగు 'ఉఞ్'కు అచ్చు పర మగునపుడు వికల్పముగ వకార మాదేశ మగును.



'ఉఞ్'లోని ఞకారము ఇత్సంజ్ఞకము.

కిమ్ + ఉ + ఉక్తమ్:- ఇచట 'ఉ' మయ్ ప్రత్యాహారాన్తర్గత మగు 'మ'కారము కంటె పరముగా నున్నది; దీనికి అచ్చు పరముగ నున్నది. కావున 'వ'కారాదేశము వచ్చి కిమ్ + వ్ + ఉక్తమ్ = 'కిమ్వుక్తమ్' అను రూప మగును. 'వ'కారము వైకల్పికము గాన 'నిపాత ఏకాజనాఙ్' అను సూత్రముచే (55) ప్రగృహ్యసంజ్ఞయు, ప్రకృతిభావమును (సూ-50) కలుగుటచే 'కిము ఉక్తమ్' అనురూప మేర్పడును.

59 ఇకోఽసవర్ణే శాకల్యస్య హ్రస్వశ్చ 6.1.127

పదాన్తాః ఇకః హ్రస్వా వా స్యురసవర్ణే ఽచి. హ్రస్వవిధాన సామర్థ్యాన్న స్వరసన్ధిః. చక్రి అత్ర 'చక్ర్యత్ర'. పదాన్తా ఇతి కిమ్? గౌర్యౌ.

'ఏఙః పదాన్తాదతి' 'ప్లుతప్రగృహ్యా అచి నిత్యమ్' అను సూత్రముల నుండి 'పదాన్తాత్' 'అచి' అను పదములు అనువర్తించును.

పదాన్తము లగు ఇక్కులు అసవర్ణ మగు అచ్చు పర మగునపుడు వికల్పముగ హ్రస్వము లగును.

చక్రీ + అత్ర. ఇచట రేఫోత్తరవర్తి యగు పదాన్త ఈకారమునకు అసవర్ణ మగు 'అ' అను అచ్చు పర మగుటచే వికల్పముగ హ్రస్వము వచ్చి 'చక్రి అత్ర' అను రూప మేర్పడును. 'చక్రి + అత్ర' అని యుండగా యణాదేశసంధిచే 'చక్ర్యత్ర' అను రూపమును చేయరాదు. ఏల యనగా 'చక్ర్యత్ర' అను రూపమే కావలె నన్నచో మొదట 'ఈ'కారమును హ్రస్వము చేసి పిమ్మట యణాదేశము చేయ పని లేదు. 'చక్రీ + అత్ర' అని యుండగానే యణాదేశము చేయవచ్చును. కావున హ్రస్వము చేసిన ఫలిత మేమియు నుండదు గాన హ్రస్వవిధాన సామర్థ్యముచే హ్రస్వము చేసిన రూపమునకు యణాదేశము రాదు. హ్రస్వము వైకల్పికము గాన 'చక్రీ + అత్ర' అను నపుడు 'ఈ'కారమునకు యణాదేశము చేయుటచే 'చక్ర్యత్ర' అను రెండవ రూపము గూడ సిద్ధించును.

'పదాన్తాః' అను విశేషణ మెందులకు? 'గౌర్యౌ' అనుచో ఈ సూత్రము ప్రవర్తింపకుండుటకు. 'గౌర్యౌ' అనునది 'గౌరీ' శబ్దమునకు 'ఔ' అను విభక్తి ప్రత్యయమును జేర్చుటచే ఏర్పడినది. 'గౌరీ + ఔ' అని యుండగా రేఫోత్తర

వర్తి యగు ఈకారము పదాన్తేకారము కాదు గాన ఈ సూత్రముచే హ్రస్వ
తద్బలముచే సన్ధ్యభావమును రావు. 'సుప్తిఙన్తం పదమ్' అను సూత్రము
ననుసరించి 'గౌరీ + ఔ' అనునదియే పదము కాని 'గౌరీ' అనునది పదమ
కాదు. కావున 'ఔ' పదాన్తము కాని 'ఈ' కాదు.

వా. న సమాసే.

వాప్యశ్వః.

సమాసమున పై సూత్రము ప్రవర్తించదు.

కావుననే 'వాపీ + అశ్వః' అనునపుడు పై సూత్రముచే హ్రస్వమ
తత్ప్రయుక్త మగు సంధ్యభావమును రావు. యణాదేశ సంధిచే 'వాప్యశ్వః'
అను రూపము సిద్ధించును. 'వాప్యాం అశ్వః' అని విగ్రహము.

60. అచో రహాభ్యాం ద్వే. 8.4.46

అచః పరాభ్యాం రేఫహకారాభ్యాం పరస్య యరో ద్వే వా స్తః
గౌర్య్యౌ'.

'యరోఽనునాసికేఽనునాసికో వా' నుండి 'యరః' 'వా' అనువర్తించును.

అచ్చుకంటె పరమై యుండు రేఫహకారములకంటె పర మగు 'యర్'
కు ద్విత్వము వికల్పముగ వచ్చును.

గౌర్యౌ:- 'గౌరీ + ఔ' అని యుండగా యణాదేశముచే 'గౌర్య్ + ఔ'
అని యుండగా, గకారోత్తరవర్తి యగు అచ్చు (ఔ) కంటె పరముగా
రేఫకంటె పరముగా నున్న 'యర్' (య్)కు వైకల్పిక ద్విత్వము చే
'గౌర్య్యౌ' అను రూపము, ద్విత్వాభావపక్షమున 'గౌర్యౌ' అను రూపము
సిద్ధించును.

61. ఋత్యకః 6.1.128

ఋతి పరే పదాన్తా అకః ప్రాగ్వద్వా. బ్రహ్మ ఋషిః. బ్రహ్మర్షిః.
పదాన్తాః కిమ్? ఆర్చ్ఛత్. ఇతి అచ్సన్ధిః.

'ఏఙః పదాన్తాదతి' 'ఇకోఽసవర్ణే శాకల్యస్య హ్రస్వశ్చ' అనుసూత్రము
నుండి 'పదాన్తాత్' 'శాకల్యస్య' 'హ్రస్వః' అను పదములు అనువర్తించును.



హ్రస్వ ఋకారము పర మగునపుడు పదాన్తము లగు అక్కులు వికల్ప
ముగ వెనుకటి వలె నగును — అనగా హ్రస్వము లగును.

'బ్రహ్మ ఋషిః':- ఇచట పదాన్తాక్ అనగా మకారోత్తరవర్తి
యగు 'అ'కారము. ఈ 'అక్కు'నకు 'ఋషి' అను పదమునందలి హ్రస్వ
మగు 'ఋ'కారము పర మగుటచే వికల్పముగ హ్రస్వము వచ్చి 'బ్రహ్మఋషిః'
అను రూప మగును. హ్రస్వవిధాన సామర్థ్యముచే ఇచట గుణసంధి చేయరాదు.
హ్రస్వము రాని పక్షమున 'ఆద్గుణః' అను సూత్రముచే (27) గుణము రాగా
'బ్రహ్మర్షిః' అను రూపము సిద్ధించును.

'పదాన్తాః' అననేల? అనకున్నచో 'ఆర్చ్ఛత్' అను పదమున ఈ
సూత్రము ప్రవర్తించును. 'ఋ గతౌ' అను ధాతువు. లఙ్ ప్రథమ పురుషైక
వచనమున ఆడాగమాదులు చేయగా 'అ + ఋచ్ఛత్' అని యుండగా ఇచట
'అ' అనునది పదాన్త మగు 'అక్' కాకుండుటచే ఈ సూత్రముచే హ్రస్వము
తత్ప్రయుక్త సంధ్యభావమును రాలేదు. 'ఆటశ్చ' అను సూత్రముచే వృద్ధి.
'ఆర్చ్ఛత్' అను రూపము నిష్పన్న మైనది. 'పదాన్తాః' అనకున్నచో
'అఋచ్ఛత్' అను వైకల్పిక రూపము గూడ యుండెడిది.

అచ్సంధి ప్రకరణము సమాప్తము.

# అథ హల్సన్ధిః

## 62. స్తోః శ్చునా శ్చుః 8.4.40

సకారతవర్గయోః శకారచవర్గాభ్యాం యోగే శకారచవర్గౌ స్తః. రామశ్శేతే. రామశ్చినోతి. సచ్చిత్. శార్ఙ్గిఞ్జయ.

'యోగే' అని అధ్యాహారము. సకారతవర్గములకు శకారచవర్గములతో సంబంధ మేర్పడినచో శకారచవర్గములు ఆదేశము లగును.

'స,తథదధన' అను వర్ణములకు 'శ,చఛజఝఞ' అను వర్ణములలో నే యొక్కదానితో నైన పూర్వమం దైనను పరమం దైనను యోగము కలిగినపుడు వరుసగా 'శచఛజఝఞ' వర్ణములు ఆదేశ మగును.

ఇచట సకారతవర్గములు స్థానులు; శకారచవర్గములు ఆదేశములు. 'యథాసంఖ్యమనుదేశః సమానాం' అను సూత్రముచే (23) స్థాన్యాదేశములు రెండును సమసంఖ్యాకములు గాన ఆదేశములు యథాసంఖ్యముగా వచ్చును. స్థాన్యాదేశములకు మాత్రమే యథాసంఖ్యత్వము గాని సకారతవర్గములతో సంబంధించు శకారచవర్గముల విషయమున లేదు. అనగా సకారమునకు సకారయోగ మున్ననే సకార మాదేశ మగును. అట్లే తకారాదులకు చకారాదియోగ ముండవలెను అను నియమము లేదు. సకారమునకు సకారముతో గాని చవర్గమునందలి మరి యే యితరవర్ణముతో గాని సంబంధము కలిగినను సకార మాదేశ మగును. ఇట్లే ఇతర వర్ణముల విషయమున గ్రహించునది. ఇందులకు 'శాత్' అను ముందు రాబోవు సూత్రము జ్ఞాపకము. ఆ సూత్రము శకారముకంటె పర మగు తవర్గమునకు చుత్వమును నిషేధించుచున్నది. 'స్తునాయోగే అను నపుడు గూడ యథాసంఖ్యత్వ మున్నచో శకారసకారములకు యోగము కలిగినపుడు మాత్రమే శ్చుత్వము రావలెను కాని శకారతవర్గులకు యోగము కలిగి నపుడు చుత్వ ప్రసక్తియే లేదు గాన 'శాత్' అను సూత్రము నిరర్థకము కాకలపి వచ్చును. కావున 'స్తునా యోగే' అను నపుడు యథాసంఖ్యత్వము లేదని సూచింపబడుచున్నది. ఇపుడు శకారతకారాదియోగమున గూడ తకారాదులకు శ్చుత్వము వచ్చెడు అవకాశ మున్నది గాన 'శాత్' అను నిషేధసూత్రము సార్థక మగుచున్నది.





రామశ్శేతే:- 'రామస్ + శేతే'- ఇచట సకారమునకు 'శేతే' యందలి శకారముతో యోగ ముండుటచే శకార మాదేశమై 'రామశ్శేతే' అను రూపము సిద్ధించును.

రామశ్చినోతి:- 'రామస్ + చినోతి' అని యుండగా సకారమునకు చకారయోగ ముండుటచే 'శ'కార మాదేశమై 'రామశ్చినోతి' యను రూపము సిద్ధించును.

సచ్చిత్ - 'సత్ + చిత్' ఇచట తవర్గప్రథమాక్షర మగు తకారమునకు చకారయోగ ముండుటచే చవర్గప్రథమాక్షర మగు చకార మాదేశమై 'సచ్చిత్' అను రూపము నిష్పన్న మైనది.

శార్ఙ్గిఞ్జయ:- 'శార్ఙ్గిన్ + జయ' ఇచట తవర్గపంచమాక్షర మగు నకారమునకు జకారయోగ ముండుటచే చవర్గపంచమాక్షర మగు 'ఞ'కార మాదేశముగ వచ్చి 'శార్ఙ్గిఞ్జయ' అను రూపము సిద్ధించినది.

## 63. శాత్ 8.4.44

శాత్ పరస్య తవర్గస్య చుత్వం న స్యాత్. విశ్నః; ప్రశ్నః.

'న పదాన్తాట్టోరనామ్' 'స్తోః శ్చునా శ్చుః' అను సూత్రములనుండి 'న' 'తోః' 'చుః' అను పదములు అనువర్తించును. ('స్,శ్' అను పదములు అనువర్తింపవు).

శకారముకంటె పర మగు తవర్గమునకు చుత్వము రాదు.

విశ్నః, ప్రశ్నః:- ఈ ఉదాహరణములందు తవర్గీయాక్షర మగు 'న'కారమునకు 'శ'కారముతో యోగ మున్నది గాన "స్తోఃశ్చునా శ్చుః" అను సూత్రముచే (62) శ్చుత్వము వచ్చినచో 'విశ్ఞః' 'ప్రశ్ఞః' అను రూపములు కావలసి యుండ ఈ సూత్రము శకారముకంటె పరమగు తవర్గమునకు శ్చుత్వమును నిషేధించుచున్నది.

## 64. ష్టునా ష్టుః. 8.4.41

స్తోః ష్టునా యోగే ష్టుః స్యాత్. రామష్షష్ఠః, రామష్టీకతే. పేష్టా. తట్టీకా; చక్రిణ్ఢౌకసే.

'స్తోః శ్చునా శ్చుః' నుండి 'స్తోః' అనువర్తించును. 'యోగే' అని యధ్యాహారము.

సకారతవర్గములకు షకారటవర్గములతో సంబంధమున్నచో (వరుసగా) షకారటవర్గము లాదేశము లగును.

'స్తోః శ్చునా శ్చుః' అను సూత్రమునందు వలె ఈ సూత్రమునందు కూడ స్థాన్యాదేశములకే యథాసంఖ్యత్వము కాని 'ష్టునా యోగే' అనుచో యథాసంఖ్యత్వము లేదు. ఇందులకు తవర్గకు షకారము పర మగునపుడు ష్టుత్వమును నిషేధించు 'తోః షి' యను సూత్రము (66) జ్ఞాపకము. యథాసంఖ్యత్వమున్నచో తవర్గమునకు చవర్గయోగముననే ష్టుత్వము కాని షకారయోగమున ష్టుత్వప్రసక్తియే లేదు కదా?

రామష్షష్ఠః:- 'రామస్ + షష్ఠః'. ఇచట సకారమునకు షకారయోగ ముండుటచే షకార మాదేశమై 'రామష్షష్ఠః' అను రూప మేర్పడెను.

రామష్టీకతే:- రామస్ + టీకతే. ఇచట సకారమునకు టకారయోగముచే షకార మాదేశమై 'రామష్టీకతే' యను రూప మగును.

పేష్టా:- పేష్ + తా. ఇచట 'త'కారమునకు షకారయోగముచే 'ట'కార మాదేశమై 'పేష్టా' యను రూపము సిద్ధించినది.

తట్టీకా:- తత్ + టీకా. ఇచట 'త'కారమునకు టకారయోగముచే 'ట'కార మాదేశమై 'తట్టీకా' యను రూపము సిద్ధించెను.

చక్రిణ్ఢౌకసే:- చక్రిన్ + ఢౌకసే. ఇచట 'న'కారమునకు ఢకారయోగముచే 'ణ'కార మాదేశమై 'చక్రిణ్ఢౌకసే' అను రూప మేర్పడినది.

### 65. న పదాన్తాట్టోరనామ్. 8.4.42

పదాన్తాట్టవర్గాత్పరస్యానామః స్తోః ష్టుర్న స్యాత్. షట్ సన్తః. షట్ తే. పదాన్తాత్ కిమ్? ఈట్టే. టోః కిమ్? సర్పిష్టమమ్.

'స్తోః శ్చునా శ్చుః' నుండి 'స్తోః' 'ష్టునా ష్టుః' నుండి 'ష్టుః' అనువర్తించును.

పదాన్త మగు టవర్గుకంటె పరములును, 'నామ్' శబ్దభిన్న శబ్దములకు సంబంధించినవియు నగు సకారతవర్గములకు ష్టుత్వము రాదు.

'షట్ + సన్తః' 'షట్ + తే'. ఇచట సకారతకారములు పదాన్త టకారముకంటె పరముగ నుండుటచే ష్టుత్వము రాదు. 'షట్సన్తః' 'షట్తే' అను రూపములు సిద్ధించును.



'పదాన్తాత్' అననేల? 'ఈట్టే' అనుచోట దోషము వచ్చును. 'ఈడ్' ధాతువు లట్ ప్రథమపురుషైకవచనమున 'ఈట్ + తే' అని యుండగా తవర్గునకు టవర్గుతో యోగ ముండుటచే ష్టుత్వముచే తకారమునకు టకార మాదేశమై 'ఈట్టే' అను రూపము సిద్ధించును. ఈ సూత్రమున 'పదాన్తాత్' అని యనకున్నచో టవర్గుకంటె పర మగు తవర్గునకు ష్టుత్వము రాదు అను నర్థము వచ్చును. అట్లైన ఇచట ష్టుత్వము వచ్చెడిది కాదు. 'పదాన్తాత్' అనుటచే 'ఈట్ + తే' అను 'తిఙ్' ప్రత్యయసహిత మగుదానికే 'సుప్తిఙన్తం పదమ్' అను సూత్రముచే (14) పదసంజ్ఞ కావున 'ఈట్' నందలి 'ట'కారమునకు పదాన్తత్వము లేదు గాన ఈ నిషేధ మిచట ప్రవర్తించదు. ష్టుత్వము వచ్చును.

'టోః' అన నేల? అట్లనకున్నచో పూర్వసూత్రమునుండి 'ష్టు' అను దానిని అనువర్తించి పదాన్తషకారముకంటె పర మగు తవర్గునకు గూడ ష్టుత్వనిషేధము చెప్పవలసి యుండును. అట్లైనచో 'సర్పిష్ + తమమ్' అను చోట పదాన్తషకారము కంటె పర మగు తకారమునకు ష్టుత్వముచే టకారము రాకుండెడిది. 'టోః' అని చెప్పుటచే షకారముకంటె పర మగు తవర్గమున కీ నిషేధము వర్తించదు గాన 'సర్పిష్టమమ్' అను రూపము సిద్ధించును.

వా. అనామ్నవతినగరీణామితి వాచ్యమ్.

షణ్ణామ్. షణ్ణవతిః, షణ్ణగర్యః.

'అనామ్ నవతి నగరీణామ్' అని చెప్పవలెను.

'న పదాన్తాట్టోరనామ్' అను సూత్రమున (65) 'అనామ్' అని చెప్పుటచే 'నామ్' నందలి నకారవిషయమున మాత్రమే ఈ ష్టుత్వనిషేధము లేదను నర్థము వచ్చును గాన 'నవతి' 'నగరీ'లలోని 'న'కారమునకు కూడ నీనిషేధము వర్తింప రాదను నుద్దేశముతో వార్త్తికకారుడు 'నవతి' 'నగరీ' అను పదములను గూడ 'నామ్'తో పాటు చేర్చ వలె నని చెప్పుచున్నాడు.

షణ్ణామ్:- షడ్ + నామ్. ఇచట 'షడ్' అను దానికి 'సుప్తిఙన్తం పదమ్' అను సూత్రముచే (14) పదసంజ్ఞ లేకున్నను ('షడ్ + నామ్' అనునది సుబన్తము కాని 'షడ్' అనునది సుబన్తము కాదు) 'స్వాదిష్వసర్వనామస్థానే'

అను సూత్రము (164)చే హలాది యగు 'నామ్' అను సుప్ప్రత్యయము ప మగుటచే పదసంజ్ఞ యున్నది. కావున పదాన్త 'డ'కారముకంటె పర మ 'న'కారమునకు 'న పదాన్తాత్' అనుటచే ష్టుత్వనిషేధము రావలసి యున్న 'అనామ్' అనుటచే ష్టుత్వనిషేధము నిషిద్ధమైనది. కావున ష్టుత్వముచే నకా మునకు ణకారము—'షడ్ + ణామ్. ఇచట 'ప్రత్యయే భాషాయాం నిత్య అను వార్తికము (68 సూ.) చే నిత్యముగ 'డ'కారమునకు 'ణ'కారాదేశ వచ్చుటచే 'షణ్ణామ్' అను రూపము నిష్పన్నమైనది.

'షడ్ + నవతిః' 'షడ్ + నగర్యః' అనుచోట 'న'కారము పదాన్తడ రముకంటె పరమైనను ఈ వార్తికముచే ష్టుత్వనిషేధము నిషిద్ధము గ ష్టుత్వము వచ్చి 'షడ్ + ణవతిః' 'షడ్ + ణగర్యః' అని యుండగా 'యరో నాసికేఽనునాసికో వా' అను సూత్రముచే(68)'డ'కారమునకు ణత్వవికల్పము 'షణ్ణవతిః' 'షడ్ణవతిః' 'షణ్ణగర్యః' 'షడ్ణగర్యః' అను ద్వివి రూపములు సిద్ధించును.

66. తోః షి. 8.4 43

తవర్గస్య షకారే పరే న ష్టుత్వమ్, సన్ షష్ఠః.

'న పదాన్తాట్టోరనామ్' 'ష్టునాష్టుః' అను సూత్రములనుండి 'ష్టుః' అను పదములు అనువర్తించును.

'ష'కారము పర మగునపుడు తవర్గమునకు ష్టుత్వము (అనగా టవర్గము రాదు.

సన్షష్ఠః:- 'సన్ + షష్ఠః' ఇచట 'న'కారమునకు షకారయో ముండుటచే 'ష్టునా ష్టుః'అను సూత్రముచే రావలసి యున్న ష్టుత్వమును సూత్రము నిషేధించుచున్నది. ష్టుత్వము రాకుండుటచే 'సన్షష్ఠః'అను రూప మాత్రమే యుండును.

67. ఝలాం జశోఽన్తే. 8.2.39

పదాన్తే ఝలాం జశః స్యుః. వాగీశః.

'పదస్య'అనునది అధికృతము. పదాన్తమునందలి 'ఝల్'లకు 'జశ్' ఆదేశ మగును. జశ్శులనగా వర్గతృతీయాక్షరములు. పదాంతమున నున్న ఝ లకు స్థానాద్యాన్తరతమ్యము ననుసరించి జశ్శులు వచ్చును. అనగా చవర్గశకా



మునకు జకారము, పవర్గమునకు బకారము కవర్గహకారములకు గకారము (హకారవిషయమున 'హో ఢః' ఇత్యాదులు (251) ఈ సూత్రమును బాధించును), టవర్గషకారములకు 'డ'కారము, తవర్గసకారములకు దకారము (సకార విషయమున 'ససజుషో రుః' (105) దీనిని బాధించును), వచ్చును.

వాగీశః :- 'వాక్ + ఈశః'. ఇచట కకారము పదాన్తస్థ మగుటచే జశ్త్వము చే గకారము చేయగా 'వాగీశః' అను రూపము.

68. యరోఽనునాసికేఽనునాసికో వా. 8.4.45

యరః పదాన్తస్యానునాసికే పరేఽనునాసికో వా స్యాత్. ఏతన్మురారిః, ఏతద్మురారిః.

'నపదాన్తాట్టోరనామ్'నుండి 'పదాన్తాత్' అనువృత్తమై షష్ఠ్యంతమగును. పదాన్త మగు 'యర్'కు అనునాసికవర్ణము పర మగునపుడు అనునాసికవర్ణము వికల్పముగ వచ్చును.

'ఏతద్ + మురారిః'. ఇచట పదాన్తదకారమునకు అనునాసికవర్ణ మగు మకారము పర మగుటచే, దంతస్థానసామ్యముచే ఆంతరతమ మగు 'న'కార మాదేశమై 'ఏతన్మురారిః' అనియు, ఈ కార్యము వైకల్పిక మగుటచే 'ఏతద్మురారిః' అనియు రెండు రూపములు సిద్ధించును.

వా. ప్రత్యయే భాషాయాం నిత్యమ్.

తన్మాత్రమ్. చిన్మయమ్.

లౌకిక భాషయందు ( అనునాసికాది ) ప్రత్యయము పర మగునపుడు పూర్వోక్త కార్యము నిత్యముగ వచ్చును.

'తన్మాత్రమ్' :- తద్ + మాత్రమ్ ఇచట 'తత్ ప్రమాణం యస్య' అనునర్థమున 'ప్రమాణే ద్వయసజ్దఘ్నఞ్మాత్రచః'అను సూత్రముచే (1167) మాత్రచ్ ప్రత్యయము. పదాన్తదకారమునకు అనునాసికవర్ణము పర మగుటచేపూర్వసూత్రముచే అనునాసికవర్ణము వికల్పముగ రావలసి యుండగా, పర మగు అనునాసికవర్ణము ప్రత్యయగత మగుటచే ఈ వార్తికము ననుసరించి అనునాసికవర్ణము నిత్యముగ వచ్చి 'తన్మాత్రమ్' అను ఒక్క రూపమే సిద్ధించును.

చిన్మయమ్ :- 'చిత్ + మయం'. 'చిత్'అను శబ్దమునకు 'నిత్యం వృద్ధశరాదిభ్యః' (1118) అను సూత్రముచే స్వార్థమున మయట్ ప్రత్యయము చేర్చుటచే 'చిత్ + మయ' అని యుండును. ఇచట 'మయట్' అనునది ప్రత్యయ మగుటచే పూర్వోదాహరణమునందు వలె అనునాసికవర్ణము నిత్యముగ వచ్చి 'చిన్మయమ్' అను రూపము సిద్ధించును.

69. తోర్లి. 8.4.60

తవర్గస్య లకారే పరే పరసవర్ణః. తల్లయః. విద్వాఀల్లిఖతి. నస్యానునాసికో లః.

'అనుస్వారస్య యయి పరసవర్ణః'నుండి 'పరసవర్ణః' అనువర్తించును

తవర్గమునకు లకారము పర మగునపుడు పరసవర్ణము (పర మగు లకారమునకు సవర్ణ మగు వర్ణము) ఆదేశ మగును.

తల్లయః :- 'తద్ + లయః'. ఇచట తవర్గీయ మగు దకారమునకు లకారము పర మగుటచే తత్సవర్ణ మగు 'ల'కార మాదేశమై 'తల్లయః' అను రూపము సిద్ధించును.

విద్వాన్లిఖతి :- 'విద్వాన్ + లిఖతి'. ఇచట గూడ నకారమునకు వెనుకటి వలె లకార మాదేశ మగును. కాని 'న'కారము అనునాసికవర్ణ మగుటచే దాని స్థానమున అనునాసిక'ల'కార మాదేశ మగును. "విద్వాఀల్లిఖతి" అను రూపము సిద్ధించును.

70. ఉదః స్థాస్తమ్భోః పూర్వస్య. 8.4.61

ఉదః పరయోః స్థాస్తమ్భోః పూర్వసవర్ణః.

'అనుస్వారస్య యయి పరసవర్ణః'నుండి 'సవర్ణః' అనువర్తించును.

ఉద్ (అను ఉపసర్గ) కంటె పర మగు స్థాధాతు స్తమ్భుధాతువులకు పూర్వసవర్ణ మాదేశ మగును.

పూర్వసవర్ణము స్థాస్తంభధాతువులలోని యే వర్ణములకు వచ్చునో నిర్ధారణ చేయుటకై ఈ క్రింది పరిభాషాసూత్రములు చూపబడుచున్నవి.

71. తస్మాదిత్యుత్తరస్య. 1.1.67

పంచమీనిర్దేశేన క్రియమాణం కార్యం వర్ణాన్తరేణావ్యవహితస్య పరస్య జ్ఞేయమ్.



'తస్మాత్' అనునది పంచమ్యన్తానుకరణము. పంచమ్యంతపదముచే నిర్దేశించి విధింపబడిన కార్యము వర్ణాంతరముచే అవ్యవహిత మగు పరమునకు వచ్చును.

'ఉదః స్థాస్తంభోః పూర్వస్య'అను సూత్రమున 'ఉదః' అనునది పంచమ్యన్తపదము. పంచమ్యన్తపద మగు 'ఉదః' అను దానిచే నిర్దేశింపబడినది 'ఉద్' అను ఉపసర్గ. కావున నిచట విధింపబడిన పూర్వసవర్ణత్వ మను కార్యము పంచమ్యంతనిర్దిష్ట మగు 'ఉద్' అను ఉపసర్గకు అవ్యవహితోత్తరవర్తి యగు దానికి ('స్థా'' స్తంభ్'లకు ) అగునని ఈ పరిభాష చెప్పుచున్నది. కావుననే 'ఉద్ + ప్రస్థానమ్' ఇత్యాదిస్థలములలో 'ఉద్'కు 'స్థా'ధాతువు పరమైనను వర్ణాన్తరవ్యవహిత మగుటచే ('ఉద్''స్థా'ల మధ్య 'ప్ర'ఉన్నది) పూర్వసవర్ణము రాదు.

'ఉద్ + స్థానమ్' 'ఉద్ + 'స్తమ్భనమ్' అనునపుడు 'ఉదఃస్థాస్తంభోః పూర్వస్య'అను పూర్వసవర్ణము 'అలోన్త్యస్య'అను పరిభాషచే (21) 'స్థా' 'స్తమ్భ్'ధాతువుల అంత్యవర్ణస్థానమున రావలసి యున్నది. కాని దానికి అపవాదముగ ఈ క్రింది పరిభాషాసూత్రము చెప్పబడుచున్నది.

72. ఆదేః పరస్య. 1.1.54

పరస్య యద్విహితం తత్తస్యాదేర్బోధ్యమ్. ఇతి సస్య థః.

'అలోఽన్త్యస్య'నుండి 'అలః' అనువర్తించును. పరమునకు విధింపబడిన కార్యము అందలి ఆదివర్ణమున కగును.

'ఉద్ + స్థానమ్' ఉద్ + స్తమ్భనమ్'. ఇచట 'ఉద్' అను ఉపసర్గకంటె పరముగ 'స్థా'' స్తమ్భ్'ధాతువు లున్నవి. కావున వెనుక చూపిన రెండు పరిభాషాసూత్రముల ననుసరించి పూర్వరూపము ఆ ధాతువుల యాదివర్ణ మగు సకారమునకు వచ్చును. పూర్వవర్ణము దకారము కావున దాని సవర్ణము లగు 'తథదధన'లలో నేదైన యొకటి రావలెను. అందు స్థాని సకారము గాన ఈ ఐదువర్ణములలో 'స్థానేన్తరతమః'అనుసూత్రము (17) ననుసరించి సకారమునకు అంతరతమ మైన వర్ణము రావలెను. దంతస్థాన సామ్యముచే పైయైదు వర్ణములును సకారమునకు సవర్ణములే. కావున బాహ్యప్రయత్నముల ననుసరించి ఈ యైదింటిలో ఏది సకారమునకు సన్నిహితతమమో చూచుకొనవలెను. సకారమునకు వివార,శ్వాస, అఘోష,మహాప్రాణము లను బాహ్యప్రయత్నములు

గలవు. పైయైదు వర్ణములలో నొక్క ధకారమునకు మాత్రమే ఈ యైదు బాహ్య ప్రయత్నములు నున్నవి గాన నదియే సకారమునకు అంతరతమము. కావున సకారమునకు ధకారము వచ్చుటచే 'ఉద్ + ధ్ + ధానమ్' 'ఉద్ + ధ్ + తమ్భనమ్' అని యుండగా,

73. ఝరో ఝరి సవర్ణే. 8.4.65

హలః పరస్య ఝరో వా లోపః సవర్ణే ఝరి.

'ఝయో హో న్యతరస్యామ్' 'హలోయమాంయమిలోపః' అను సూత్రములనుండి అన్యతరస్యామ్' 'హలః' 'లోపః' అనువర్తించును. హల్లుకంటె పర మగు ఝర్‌నకు సవర్ణ మగు 'ఝర్' పర మగునపుడు లోపము వికల్పముగ వచ్చును.

హల్లగు దకారముకంటె పర మగు ధకారమునకు (ఝర్‌కు) సవర్ణ మగు ఝర్ (మొదటియుదాహరణమున థకారము రెండవ యుదాహరణమున తకారము) పర మగుటచే వికల్పముగ లోపము చేయగా 'ఉద్ + థానమ్' 'ఉద్ + తమ్భనమ్' అను రూపములు ఏర్పడును. లోపము రాని పక్షమున 'ఉద్ + ధ్ + థానమ్' 'ఉద్ + ధ్ + తమ్భనమ్' అను రూపములే యుండును.

74. ఖరి చ. 8.4.55

ఖరి ఝలాం చరః స్యుః. ఇత్యుదో దస్య తః-ఉత్థానమ్ ఉత్తమ్భనమ్.

'ఝలాం జశ్ ఝశి' 'అభ్యాసే చర్చ' అను సూత్రములనుండి 'ఝలామ్' 'చర్' అనుపదములు అనువర్తించును.

'ఖర్' పర మగునపుడు 'ఝల్'లకు 'చర్'లు వచ్చును.

లోపపక్షమున 'ఉద్ + థానమ్' అనియు 'ఉద్ + తమ్భనమ్' అనియు నుండగా—'ఝల్' అగు దకారమునకు 'ఖర్' అగు థకారము, తకారము పరముగ నుండుటచే ఈసూత్రముచే 'చర్' వచ్చును. స్థానసామ్యముచే దకార స్థానమున తకార మాదేశమై 'ఉత్థానమ్' 'ఉత్తమ్భనమ్' అను రూపము లగును. లోపాభావపక్షమున 'ఉద్ + ధ్ + థానమ్' 'ఉద్ + ధ్ + తమ్భనమ్' అని యుండగా మొదట దకారమునకు చర్త్వముచే 'ఉత్ + ధ్ + థానమ్' 'ఉత్ + ధ్ + తమ్భనమ్' అనియు పిదప ధకారమునకు గూడ చర్త్వము వచ్చుటచే 'ఉత్ + త్ + థానమ్' = 'ఉత్త్థానమ్' అనియు 'ఉత్ + త్ + తమ్భనమ్' 'ఉత్త్తమ్భనమ్' అనియు రూపము లేర్పడును.



75. ఝయో హోఽన్యతరస్యామ్. 8.4.62

ఝయః పరస్య హస్య వా పూర్వసవర్ణః, నాదస్య, ఘోషస్య, సంవారస్య, మహాప్రాణస్య హస్య తాదృశో వర్గచతుర్థః — వాగ్ఘరిః, వాగ్హరిః.

'ఉదః స్థాస్తమ్భోః పూర్వస్య' 'అనుస్వారస్య యయి పరసవర్ణః' అను సూత్రమునుండి 'పూర్వస్య' 'సవర్ణః' అను పదములు అనువర్తించును. ఝయ్‌కంటె పర మగు హకారమునకు వికల్పముగ పూర్వసవర్ణము ఆదేశ మగును.

వాగ్ఘరిః:- 'వాగ్ + హరిః'. ఇచట 'ఝయ్' అగు గకారముకంటె పర మగు హకారమునకు గకారసవర్ణ మగు వర్ణము రావలెను. గకారమునకు కవర్గమునకు జెందిన ఐదు వర్ణములును సవర్ణములే. కాని 'స్థానేఽన్తరతమః' అను సూత్రము (17) ననుసరించి స్థాని యగు హకారమునకు బాహ్యయత్న సామ్యముచే కూడ సావర్ణ్యము గల వర్ణ మేదైన ఈ ఐదు వర్ణములలో నున్నది యని పరిశీలించినచో అట్టి వర్ణము ఘకార మొక్కటియే యున్నది. హకారమునకు నాద, ఘోష, సంవారమహాప్రాణయత్నములు. ఘకారమునకు గూడ నవియే యత్నములు. కావున హకారమునకు ఘకారము వచ్చుటచే 'వాగ్ఘరిః' అను రూపము సిద్ధించును. పూర్వసవర్ణాదేశము వైకల్పికము గాన 'వాగ్హరిః' అను ద్వితీయ రూప మగును.

76. శశ్ఛోఽటి. 8.4.63

ఝయః పరస్య శస్య ఛో వాఽటి. 'తద్ + శివః' ఇత్యత్ర దస్య శ్చుత్వేన జకారే కృతే 'ఖరి చ' ఇతి జకారస్య చకారః, తచ్ఛివః; తచ్ శివః.

'ఝయోహోఽన్యతరస్యామ్' నుండి 'ఝయః', 'అన్యతరస్యామ్' అనువర్తించును. 'ఝయ్'కంటె పర మగు శకారమునకు 'అట్' పర మగు నపుడు వికల్పముగ ఛకారము ఆదేశమగును.

తచ్ఛివః:- 'తద్ + శివః' ఇచట మొదట దకారమునకు శ్చుత్వము జకారమును, మరల 'ఖరి చ' అను సూత్రముచే (71) చర్త్వము చేయగా జకారమునకు చకార మాదేశమై 'తచ్ + శివః' అను రూపము సిద్ధించును. ఇచట 'ఝయ్' (చ్) కంటె పర మగు శకారమునకు అట్ (ఇ) పర మగుటచే ఈసూత్రముచే ఛత్వము వచ్చును. తచ్ + ఛివః = 'తచ్ఛివః' అను రూపము సిద్ధించును. ఛత్వము రానిచో 'తచ్శివః' అను రూపము సిద్ధించును. (శ్చుత్వ చర్త్వ ఛత్వవిధాయక సూత్రములన్నియు త్రిపాదిలోనివి. అందు ఛత్వవిధాయకసూత్రము పరసూత్ర మగుటచే అసిద్ధము గాన ముందుగనే దకారమునకు శ్చుత్వచర్త్వములు చేసి పిమ్మట శకారమునకు ఛత్వము చేయవలెను).

77. మోఽనుస్వారః 8.3.23

మాన్తస్య పదస్యానుస్వారో హలి. హరిం వన్దే.

'పదస్య' అధికృతము. 'హలి సర్వేషామ్' నుండి 'హలి' అనువర్తించును. మకారాంత మగు పదమునకు హల్లు పర మగునపుడు అనుస్వారము ఆదేశమగును. 'అలోన్త్యస్య' అను పరిభాషచే (31) ఈ యనుస్వారము అంత్యాక్షర స్థానమున వచ్చును.

'హరింవన్దే':- హరిమ్ + వన్దే. ఇచట 'హరిమ్' అను పదాంతమునందలి మకారమునకు హల్లగు 'వ'కారము పర మగుటచే అనుస్వార మాదేశమై 'హరిం వన్దే' అను ప్రయోగము సిద్ధించినది.

78. నశ్చాపదాన్తస్య ఝలి 8.3.24

నస్య మస్య చాఽపదాన్తస్య ఝల్యనుస్వారః. యశాంసి; ఆక్రంస్యతే, ఝలి కిమ్? మన్యసే.

'మోఽనుస్వారః' నుండి 'మః' 'అనుస్వారః' అనువర్తించును. అపదాంత మగు నకారమకారములకు ఝల్ పర మగునపుడు అనుస్వారమాదేశ మగును.

యశాంసి:- యశాన్ + సి. ఇచట అపదాన్త మగు నకారమునకు ఝల్ (సకారము) పర మగుటచే అనుస్వారాదేశము వచ్చి 'యశాంసి' అను రూపము సిద్ధించును.





'ఆక్రంస్యతే':- ఆక్రమ్ + స్యతే. ఇచట పదమధ్యస్థ మగు మకారమునకు ఝల్ పర మగుటచే అనుస్వారాదేశము. 'ఆక్రంస్యతే' అను రూపము సిద్ధించును.

'ఝలి' యని యననేల? అట్లనకున్నచో 'మన్యసే' అనుచో దోషము వచ్చును. ఈ పదమున పదమధ్యగత మగు నకారమునకు ఝల్ పరము కాకుండుటచే అనుస్వారము రాలేదు. యకారము ఝల్ కాదు.

79. అనుస్వారస్య యయి పరసవర్ణః 8.4.58

స్పష్టమ్ శాన్తః.

అనుస్వారమునకు యయ్ పర మగునపుడు పరసవర్ణ మగు వర్ణ మాదేశ మగును.

శాన్తః:- క్తప్రత్యయాంత మగు 'శమ్'ధాతువునందలి పదమధ్యగత మకారమునకు 'నశ్చాపదాన్తస్య ఝలి'అను సూత్రముచే అనుస్వారము వచ్చుటచే 'శాంత అని యుండగా ఈ సూత్రముచే అనుస్వారకు పరసవర్ణము. పర మగు తకారమునకు సవర్ణము లగు ఐదు వర్ణములలో అనునాసిక్యసామ్యముచే నకారము అనుస్వారకు అంతరతమము గాన నకారము వచ్చును. 'శాన్ + త' 'శాన్తః' అను రూప మగును.

80. వా పదాన్తస్య. 8.4.59

త్వఙ్కరోషి; త్వంకరోషి.

వెనుకటి సూత్ర మనువర్తించును. పదాంత మగు అనుస్వారకు యయ్ పర మగునపుడు పరసవర్ణము వికల్పముగ వచ్చును.

త్వమ్ + కరోషి:- ఇచట పదాన్తగత మగు 'మ'కారమునకు యయ్పర మగుటచే పరవర్ణ మగు కకారమునకు సవర్ణము, అనునాసికమును నైన ఙకార మాదేశమై 'త్వఙ్కరోషి'అనియు. పరసవర్ణము వైకల్పిక మగుటచే తదభావపక్షమున 'మోనుస్వారః' అను సూత్రముచే (77) అనుస్వార రాగా 'త్వం కరోషి'యనియు ప్రయోగములు సిద్ధించును.

81. మో రాజి సమః క్వౌ. 8.3.25

క్విబన్తే రాజతౌ పరే సమో మస్య మ ఏవ స్యాత్. సమ్రాట్.

'మోనుఽస్వారః' నుండి 'మః' అనువర్తించును. 'సమ్'అను ఉప

సర్గకు క్విప్ప్రత్యయాంత మగు 'రాజ్'ధాతువు పర మగునపుడు (ఉపసర్గాంతమున నున్న)మకారమునకు మకారమే వచ్చును.

ఈ సూత్రము 'మోఽనుస్వారః'అనుదానికి (77) అపవాదము.

సమ్రాట్:- సమ్ + రాట్. 'రాట్'అనునది'రాజ్'ధాతువునకు క్విప్ప్రత్యయము చేర్చుటచే సిద్ధించిన రూపము. ఇదిపరమగునపుడు'సమ్'నందలి మకారము అటులనే యుండి 'సమ్రాట్' అను రూపము సిద్ధించినది.

82. హే మపరే వా. 8.3.26

మపరే హకారే పరే మస్య మో వా. కిమ్ హ్మలయతి, కిం హ్మలయతి.

'మోఽనుస్వారః' 'మో రాజి సమః క్వౌ'అను సూత్రములనుండి'మః' 'మః'అనువర్తించును. మకారము పరముగా గల హకారము పర మగునపుడు మకారమునకు వికల్పముగా మకారము వచ్చును.

కిమ్హ్మలయతి:- ఇచట మకారమునకు మకారపరక మగు హకారము పర మగుటచే ఈ సూత్రముచే వైకల్పికముగ మకారము వచ్చి 'కిమ్హ్మలయతి' అను రూపము, మకారము రాని పక్షమున 'మోఽనుస్వారః'అను సూత్రముచే (77) అనుస్వారము వచ్చి 'కిం హ్మలయతి'అను రూపమును నిష్పన్న మగును.

వా. యవలపరే యవలా వా.

కిय़్హ్యః, కింహ్యః, కిव़్హ్వలయతి, కింహ్వలయతి కిల్ హ్లాదయతి; కింహ్లాదయతి.

మకారమునకు 'యవల'లు పరముగా గల హకారము పర మగునపుడు వికల్పముగ 'యవల'లు వచ్చును.

కిय़్హ్యః:- ఇచట హకారమునకు యకారము పరముగ నున్నది. అట్టి హకారము పర మగుటచే మకారమునకు యకారము వచ్చును. స్థాని యగు మకారము అనునాసికవర్ణ మగుటచే యకారము కూడ అనునాసికమే వచ్చి 'కిय़్హ్యః'అను రూపము సిద్ధించును.

'కిమ్ + హ్వలయతి' 'కిమ్ + హ్లాదయతి' అను నుదాహరణములలో గూడ పూర్వోక్తప్రక్రియనే అనుసరించునది. ఈ మూడు ఉదాహరణములందును



'యవల'లు రాని పక్షమున 'మోఽనుస్వారః'అను సూత్రముచే (77) అనుస్వారము వచ్చి 'కింహ్యః' ఇత్యాదిరూపము లగును.

83. నపరే నః. 8.3.27

నపరే హకారే మస్య నో వా. కిన్హ్నుతే, కింహ్నుతే

'హే మపరే వా' 'మో రాజి సమః క్వౌ, అను సూత్రములనుండి 'హే''వా''మః' అనువర్తించును. నకారము పరముగా గల హకారము పర మగునపుడు మకారమునకు వికల్పముగ నకారము వచ్చును.

కిమ్హ్నుతే:- ఇచట మకారమునకు నకారపరక మగు హకారము పర మగుటచే నకార మాదేశమై 'కిన్ హ్నుతే'అను రూపము, నకారాభావ పక్షమున 'మోఽనుస్వారః'అను (77) అనుస్వారచే 'కింహ్నుతే' అను రూపమును సిద్ధించును.

84. ఆద్యన్తౌ టకితౌ. 1.1.46

టిత్కితౌ యస్యోక్తౌ తస్య క్రమాదాద్యన్తావయవౌ స్తః.

ఇదిపరిభాషాసూత్రము. 'టిత్''కిత్'అనునవి దేనికి ఆగమములుగ విధింపబడినవో దానికి క్రమముగ ఆద్యవయవముగను అన్తావయవముగను వచ్చును. టిత్తు ఆద్యవయవముగను కిత్తు అంతావయవముగను వచ్చును.

85. ఙ్ణోః కుక్ టుక్ శరి 8.3.28

వా స్తః.

'హే మపరే వా' నుండి 'వా' అనువర్తించును. ఙకారణకారములకు శర్ పరమగునపుడు 'కుక్''టుక్'అను నాగమములు వచ్చును.

'కుక్''టుక్'లలోని 'ఉ''క్'లు ఇత్సంజ్ఞకములు. అనగా కకారము మాత్రము శేషించును.

'ప్రాఙ్ + షష్ఠః' 'సుగణ్ + షష్ఠః' ఇచట ఙకారణకారములకు శర్ పరముగ నున్నది గాన ఙకారమునకు 'కుక్'ణకారమునకు 'టుక్'అను ఆగమములు వచ్చును. ఈ రెండును కిత్తులు గాన పూర్వసూత్రము ననుసరించి స్థానికి అన్తావయముగ వచ్చుటచే 'ప్రాఙ్ + క్ + షష్ఠః' 'సుగణ్ + ట్ + షష్ఠః'అని యుండగా:-

వా. చయో ద్వితీయాః శరి పౌష్కరసాదేరితి వాచ్యమ్

ప్రాఙ్ఖ్షష్ఠః, ప్రాఙ్క్షష్ఠః, ప్రాఙ్ షష్ఠః, సుగణ్ఠ్షష్ఠః, సుగణ్ట్షష్ఠః, సుగణ్ షష్ఠః.

శర్ పర మగునపుడు చయ్ం (వర్గప్రథమాక్షరముల) స్థానమున పౌష్కరసాద్యాచార్యుని మతము ననుసరించి (వికల్పముగా) ద్వితీయవర్ణములు ఆదేశము లగు నని చెప్పవలెను.

పై ఉదాహరణములయందు కకారటకారములకు శర్ పరముగా నుండుటచే వికల్పముగ నీ వార్తికముచే ఖకారఠ కారములు వచ్చి 'ప్రాఙ్ఖ్షష్ఠః' 'సుగణ్ఠ్షష్ఠః' అను రూపము లగును. కుక్టుగాగమములు వైకల్పికము లగుటచే 'ప్రాఙ్షష్ఠః' 'సుగణ్షష్ఠః' అను రూపము లుండును. కకారషకారములు సంయుక్తము లగునపుడు 'క్ష'యగును గాన 'ప్రాఙ్ + క్ + షష్ఠః' అనునది 'ప్రాఙ్క్షష్ఠః' అని యైనది.

86. డః సి ధుట్ 8.3.29

డాత్పరస్య సస్య ధుడ్వా. షట్త్సన్తః, షట్సన్తః.

'హే మపరే వా' నుండి 'వా' అనువర్తించును. డకారముకంటె పర మగు సకారమునకు 'ధుట్ అను ఆగమము వచ్చును.

షడ్ + సన్తః-ఇచట డకారోత్తరవర్తి యగు సకారమునకు 'ధుట్' ఆగమము 'టిత్' అగుటచే ('ధుట్'లోని 'ఉ' 'ట్'లు ఇత్సంజ్ఞకములు) ఆద్యవయవముగ వచ్చును. 'షడ్ + ధ్ + సన్తః' అని యుండగా 'ఖరిచ' అను సూత్రము (74)చే 'ధ'కారమునకు చర్త్వముచే 'త'కారము. పిమ్మట ఖర్ (తకారము) పర మగుటచే డకారమునకు చర్త్వముచే టకారము వచ్చి 'షట్ + త్ + సన్తః' 'షట్త్సన్తః' అని యగును. 'ధుట్'రాని పక్షమున 'డ'కారమునకు చర్త్వముచే టకారము వచ్చి 'షట్సన్తః' అను రూప మగును.

87. నశ్చ 8.3.30

నాన్తాత్ పరస్య సస్య ధుడ్వా. సన్త్సః; సన్సః

'డః సి ధుట్' 'హే మపరే వా' అను సూత్రములనుండి 'సి' 'ధుట్' 'వా' అనువర్తించును. నకారాన్తముకంటె పర మగు సకారమునకు వికల్పముగ 'ధుట్' అను ఆగమము వచ్చును.



సన్ + సః-ఇచట నకారముకంటె పర మగు సకారమునకు ఆద్యవయవముగ 'ధుట్'ఆగమము వచ్చుటచే 'సన్ + ధ్ + సః' అని యుండగా ధకారమునకు చర్త్వముచే తకారము వచ్చి 'సన్త్సః' అను రూపమును 'ధుట్' రాని పక్షమున 'సన్సః' అను రూపమును సిద్ధించును.

88. శి తుక్ 8.3.31

పదాన్తస్య నస్య శే పరే తుగ్ వా. సఞ్ఛమ్భుః, సఞ్చ్ఛమ్భుః, సఞ్చ్శమ్భుః, సఞ్శమ్భుః.

'నశ్చ' 'హే మపరే వా' అను సూత్రములనుండి 'నః' 'వా' అనువర్తించును. 'పదస్య' అధికృతము. పదాంత మగు నకారమునకు శకారము పర మగునపుడు 'తుక్' అను నాగమము వికల్పముగ వచ్చును. 'తుక్'లోని 'ఉ' 'క్'లు ఇత్సంజ్ఞకములు. ఈఆగమము 'కిత్' అగుటచే స్థానికి అన్తావయవముగ వచ్చును (సూ. 84)

సన్ + శమ్భుః- ఇచట పదాంతనకారమునకు శకారము పర మగుటచే తుగాగమముచే-'సన్ + త్ + శమ్భుః' శ్చుత్వముచే తకారమునకు చకారము-సన్ + చ్ + శమ్భుః; నకారమునకు చకారయోగముచే శ్చుత్వముచే ఞకారాదేశము-'సఞ్ + చ్ + శమ్భుః': 'శశ్ఛోటి' అను సూత్రము (76)చే శకారమునకు ఛకారము-'సఞ్ + చ్ + ఛమ్భుః' ఇచట 'ఝరో ఝరి సవర్ణే' అను సూత్రముచే (73) చకారమునకు లోపము వచ్చిన పక్షమున 'సఞ్ ఛమ్భుః' అనియు, లోపము రాని పక్షమున 'సఞ్చ్ఛమ్భుః' అనియు రెండు రూపములు. తుగాగమము చేసి పైన చూపిన విధమున లోపము చేసినను, తుగాగమము రాని పక్షమునను గూడ 'సఞ్ ఛమ్భుః'అనియే రూపము. తుగాగమము చేసి శకారమునకు ఛత్వము చేయని పక్షమున 'సఞ్చ్ శమ్భుః' అను మూడవ రూప మగును. తుగాగమఛత్వములు రెండును జేయని పక్షమున నకారమునకు శ్చుత్వము చేయగా 'సఞ్ శమ్భుః' అను నాల్గవరూపము సిద్ధించును.

ఈ రూపచతుష్టయమును జూపుచు ఈ క్రింది కారిక సిద్ధాంతకౌముదిలో నీయబడినది:-

'ఙచౌ ఙచథా ఙచళా ఙళావితి చతుష్టయమ్.
రూపాణామిహ తుక్ఛత్వచలోపానాం వికల్పనాత్.

89. ఙమో హ్రస్వాదచిఙముణ్నిత్యమ్ 8.3.32

హ్రస్వాత్పరో యో ఙమ్, తదన్తం యత్పదం, తస్మాత్పరస్యాచో ఙముట్, ప్రత్యఙ్ఙాత్మా. సుగణ్ణీశః. సన్నచ్యుతః.

ఙమః, హ్రస్వాత్, అచి, ఙముట్, నిత్యమ్. 'పదస్య'అధికృతము.

హ్రస్వముకంటె పర మగు'ఙమ్' (ఙణన) అంతమందు గల పదమునకు పరముగా నున్న అచ్చునకు 'ఙముట్' (ఙణన) ఆగమమువచ్చును.

ఙముట్'లోని 'ఙమ్' అనునది ఙ్,ణ్,న్,అను మూడు వర్ణముల ప్రత్యాహారము. ఙమ్ అనుదాని చివర నున్న 'ఉట్'అను దానివి ప్రత్యేకవర్ణమునకు సంబంధింపచేయుటచే 'ఙుట్''ణుట్''నుట్'అను నాగమములను చెప్పినట్లగును.

'ఙముట్'లోని 'ఉట్'లు ఇత్సంజ్ఞకములు. ఈ యాగమము టిత్తుగా అచ్చునకు ఆద్యవయవముగ వచ్చును.

ప్రత్యఙ్ + ఆత్మా-ఇచట హ్రస్వ మగు యకారోత్తరవర్తి యగు ఙకారము పదాన్తమునం దున్నది. కావున ఈ పదమునకు పర మగు 'ఆ'అను అచ్చునకు ఙకార మాదేశమై 'ప్రత్యఙ్ఙాత్మా' అను రూపము సిద్ధించినది. ఇట్లే 'సుగణ్ + ఈశః''సన్ + అచ్యుతః'అను నుదాహరణములందు ణకారనకారములకంటెపరమగు 'ఈ'కార'అ'కారములకు ణకారనకారములు ఆద్యవయవాగములుగ వచ్చుటచే 'సుగణ్ణీశః''సన్నచ్యుతః' అను రూపములు సిద్ధించును. ఇచట ఙకారణకారనకారోత్తరవర్తు లగు అచ్చులకు యథాసంఖ్యసూత్రమువలన వరుసగ ఙకారణకారనకారములు వచ్చినవి.

90. సమః సుటి 8.3.5

సమో రుః సుటి.

'మతువసో రు సంబుద్ధౌ' నుండి 'రు' అనువర్తించును. 'సమ్'నకు సుట్ పర మగునపుడు 'రు' వచ్చును.

'అలోన్త్యస్య'అను పరిభాషచే (21) 'సమ్'అను ఉపసర్గయందలి యంత్యవర్ణ మగు మకారమున కీ యాదేశము వచ్చును.



'సమ్' పూర్వకకృఞ్ ధాతువునకు "సంపరిభ్యాం కరోతౌ భూషణే"అను సూత్రముచే (684) 'సుట్' అను ఆగమము విధింపబడినది. కావున 'సమ్ + స్కర్తా' అను నుదాహరణమున 'సుట్'పర మగుటచే 'సమ్' నందలి మకారమునకు 'రు' ఆదేశము వచ్చి 'సరు + కర్తా' అని యుండగా:-

91. అత్రానునాసికః పూర్వస్య తు వా. 8.3.2

అత్ర రుప్రకరణే రోః పూర్వస్యానునాసికో వా.

ఈ రుప్రకరణమున రుకంటె పూర్వమునం దున్న వర్ణమునకు వికల్పముగ అనునాసికము వచ్చును.

ఈ సూత్రముచే 'రు'కు పూర్వమునం దున్న అకారమునకు అనునాసికము వచ్చుటచే 'సఁరు + స్కర్తా' అని యుండును. ఈ అనునాసికము రాని పక్షమున:-

92. అనునాసికాత్పరోఽనుస్వారః. 8.3.4

అనునాసికం విహాయ రోః పూర్వస్మాత్ పరోఽనుస్వారాగమః స్యాత్.

'అత్రానునాసికః పూర్వస్య తు వా' నుండి 'పూర్వస్య' అనువర్తించును. అనునాసికము రాని పక్షమున 'రు'కు పూర్వమునం దున్న వర్ణమునకు పరమై అనుస్వారాగమము వచ్చును.

ఈ సూత్రముచే 'రు'కు పూర్వమునం దున్న అకారమునకు పరమై అనుస్వార వచ్చుటచే 'సంరు + స్కర్తా' అని యుండును. 'రు'లోని ఉకారము ఇత్సంజ్ఞక మగుటచే 'సఁర్ + స్కర్తా' 'సంర్ + స్కర్తా' అని యుండగా:-

93. ఖరవసానయోర్విసర్జనీయః 8.3.15

ఖరి అవసానే చ పదాన్తస్య రేఫస్య విసర్గః

'పదస్య' అధికృతము. "రో రి" నుండి 'రః' అనువర్తించును. పదాంతమునందలి రేఫకు 'ఖర్', లేక, అవసానము పర మగునపుడు విసర్గము వచ్చును.

పై ప్రయోగములలో రేఫకు 'ఖర్' (సకారము) పర మగుటచే విసర్గము రాగా 'సఁః + స్కర్తా' 'సంః + స్కర్తా' అని యగును. ఇచట 'విసర్జనీయస్య సః' అను సూత్రముచే (103) విసర్గకు సకారము వచ్చుటకు అవకాశ

మున్నది గాని దాని కపవాదసూత్ర మగు 'వా శరి' అనుదానిచే (104) వైకల్పిక సకారము వచ్చును. కావున నిత్యసకారసిద్ధికై ఈ క్రింది వార్త్తికము చెప్పబడు చున్నది।-

వా. సంపుంకానాం సో వక్తవ్యః.

సంస్కర్త్తా, సంస్కర్త్తా.

'సమ్' 'పుమ్' 'కాన్' శబ్దముల విసర్గకు సకారము వచ్చు నని చెప్పవలెను.

ఈ వార్త్తికముచే విసర్గకు సకార మాదేశమై 'సఁస్కర్త్తా' 'సంస్కర్త్తా' అను రూపములు సిద్ధించును.

94. పుమః ఖయ్యమ్పరే 8.3.6

అమ్పరే పుమో రుః. పుఁస్కోకిలః, పుంస్కోకిలః.

'పుమ్' అనుదానికి 'అమ్' పరముగా గల ఖయ్ పరమగునపుడు 'రు' వచ్చును.

'అలో న్త్యస్య' అను పరిభాషచే (21) రు, అంత్య మగు మకారమున కాదేశమై వచ్చును.

'పుమ్ + కోకిలః':- ఇచట 'పుమ్'నకు 'ఖయ్' ప్రత్యాహారాంతర్గత మగు కకారము పరముగ నున్నది. దానికి ఓకారము పరముగ నుండుటచే అది అమ్పరకము. కావున 'పుమ్'లోని మకారమునకు 'రు' వచ్చుటచే 'పుర్ + కోకిలః' అని యగును. 'అత్రానునాసికః పూర్వస్య తు వా' (91) 'అనునాసికాత్పరోనుస్వారః' (92) అను సూత్రములచే అనునాసికానుస్వారములు వచ్చుటచే 'పుఁర్ + కోకిలః' 'పుంర్ + కోకిలః' అని యగును. రేఫకు 'ఖరవసానయోర్విసర్జనీయః' (93)అను విసర్గ, 'సంపుంకానాం సో వక్తవ్యః' అను వార్త్తికముచే సకారమును వచ్చి 'పుఁస్కోకిలః' 'పుంస్కోకిలః' అను రూపములు సిద్ధించును.

95. నశ్ఛవ్యప్రశాన్ 8.3.7

అమ్పరే ఛవి నాన్తస్య పదస్య రుః.

నః, ఛవి; అప్రశాన్. 'పుమః ఖయ్యమ్పరే' నుండి 'అమ్పరే' 'పదస్య' అను అధికారసూత్రమును అనువర్త్తించును. 'ప్రశాన్' అను పదము కంటె





భిన్న మగు నాంత మగు పదమునకు అమ్ పరముగా గల 'ఛవ్' పర మగునపుడు 'రు' వచ్చును.

'అలో న్త్యస్య' అను పరిభాషచే (21) అన్త్యనకారమున కాదేశ మగును. 'చక్రిన్ + త్రాయస్వ': ఇచట పదాంతగత మగు నకారమునకు ఛవ్ ప్రత్యాహారాన్తర్గత మగు తకారము పరముగ నున్నది. దానికి అమ్ (రేఫ) పరముగా నున్నది. కావున నకారమునకు రు వచ్చుటచే 'చక్రిర్ + త్రాయస్వ' అని యుండగా పూర్వోదాహరణములందు వలె అనునాసికానుస్వారములు వచ్చుటచే 'చక్రిఁర్ + త్రాయస్వ' 'చక్రింర్ + త్రాయస్వ' అని యగును. పిమ్మట 'ఖరవసానయోర్విసర్జనీయః' అను సూత్రముచే (93) విసర్గము చేసిన పిదప।-

96. విసర్జనీయస్య సః 8.3.34

ఖరి. చక్రింస్త్రాయస్వ. అప్రశాన్ కిమ్? ప్రశాన్ తనోతి. పదాన్తస్యేతి కిమ్? హన్తి.

'ఖరవసానయోర్విసర్జనీయః' నుండి మండూకప్లుతిచే 'ఖర్' అను వర్త్తించును.

విసర్గమునకు 'ఖర్' పర మగునపుడు సకార మాదేశ మగును. ఈ సూత్రముచే పై లక్ష్యములందలి విసర్గకు సకార మాదేశమై 'చక్రిఁస్త్రాయస్వ' 'చక్రింస్త్రాయస్వ' అను రూపద్వయము సిద్ధించును.

(95 వ సూత్రమున) 'అప్రశాన్' అనకున్నచో 'ప్రశాన్ + తనోతి'అను చోట 'ప్రశాన్' అనునది కూడ నకారాన్త మగుటచే దీనికి అమ్పరక మగు ఛవ్ పర మగుటచే రుత్వాదులు వచ్చి 'ప్రశాంస్తనోతి' ఇత్యాద్యనిష్టరూపములు కాకుండుటకై 'అప్రశాన్' అని చెప్పబడెను.

'పదాన్తస్య' అనకున్నచో 'హన్ + తి' అను నుదాహరణమున గూడ రుత్వాదులు వచ్చి యుండెడివి. 'పదాన్తస్య' అనుటచే 'హన్' అనునది పదము కాకుండుటచే నీ రుత్వాదులు రావు.

97. నౄన్ పే. 8.3.10

నౄన్నిత్యస్య రుర్వా పే.

'మతువసో రు సంబుద్ధౌ' 'ఉభయథర్క్షు' అను సూత్రములనుండి 'రు' 'ఉభయథా' అనువర్త్తించును. 'ఉభయథా' అనగా వికల్పముగా అని యర్థము.

'నౄన్' అను ద్వితీయాంత శబ్దమునకు పకారము పర మగునపుడు వికల్పముగ 'రు' వచ్చును.

'నౄన్ + పాహి'. ఇచట 'అలోఽన్త్యస్య' అను పరిభాషచే (21) నకారమున కాదేశమై 'రు' వచ్చి 'నౄర్ + పాహి' అని యుండగా అనునాసికా దేశ (91) అనుస్వారాగమ (92) విసర్గలచే (93) 'నౄఁః + పాహి' 'నౄంః + పాహి' అను రూపము లగును. ఇచట 'విసర్జనీయస్య సః' అను సూత్రముచే (96) విసర్గకు సకారము రావలసి యుండగా దాని కపవాదముగ నీ క్రింది సూత్రము చెప్పబడుచున్నది.

98. కుప్వోః ≍క ≍పౌ చ. 8.3.37

కవర్గే పవర్గే చ పరే విసర్గస్య ≍క ≍పౌ స్తః. చాద్విసర్గః. నౄఁ≍పాహి, నౄఁఃపాహి, నౄం≍పాహి, నౄంఃపాహి; నౄన్పాహి.

'విసర్జనీయస్య సః' నుండి 'విసర్జనీయస్య' అనువర్తించును. విసర్గకు కవర్గపవర్గములు పర మగునపుడు వరుసగా ≍క, ≍ప లు (జిహ్వామూలీయోపధ్మానీయములు) ఆదేశము లగును.

ఈ సూత్రమున 'చ' అను నవ్యయము నుపయోగించుటచే ఈ ≍క ≍ప లును, విసర్గము గూడ వచ్చు నని యర్థము చెప్పికొనవలెను.

పై యుదాహరణములలో విసర్గమునకు ≍ప వచ్చినచో 'నౄఁ≍పాహి', 'నౄం≍పాహి' అను రూపములును పక్షాంతరమున విసర్గయే వచ్చుటచే 'నౄఁఃపాహి' 'నౄంఃపాహి' అను రూపములును సిద్ధించును. 'చ'కారబలముచే విసర్గమునకు విసర్గమే వచ్చు ననుటచే నిచట 'విసర్గనీయస్య సః' అను సకారమునకు ప్రసక్తి లేదు. రుత్వము వైకల్పిక మగుటచే రుత్వాభావపక్షమున 'నౄన్పాహి' యను రూప ముండును.

99. తస్య పరమామ్రేడితమ్. 8.1.2

ద్విరుక్తస్య పరం ఆమ్రేడితం స్యాత్.

ఈ సూత్రము 'సర్వస్య ద్వే' అను అధికారసూత్రము క్రింద నుండుటచే 'తస్య' అనుదానికి 'ద్విరుక్తస్య' అని యర్థము. రెండు పర్యాయము లుచ్చరింపబడిన దాని రెండవ రూపమునకు 'ఆమ్రేడితమ్' అని పేరు.



'కిమ్'శబ్ద ద్వితీయాబహువచనాంత మగు 'కాన్' అను పదమును 'నిత్యవీప్సయోః' అను సూత్రము (889)చే ఆవృత్తి చేయగా 'కాన్ + కాన్' అని యగును. ఇచట రెండవ 'కాన్' అనుదానికి 'ఆమ్రేడితం' అని పేరు.

100. కానామ్రేడితే 8.3.12

కాన్నకారస్య రుః స్యాదామ్రేడితే. కాఁస్కాన్, కాంస్కాన్.

కాన్, ఆమ్రేడితే. 'మతువసో రు సమ్బుద్ధౌ' నుండి 'రు' అనువర్తించును. అలోఽన్త్యపరిభాష (21) ప్రవర్తించును. 'కాన్' అను పదము నందలి నకారమునకు ఆమ్రేడితము పర మగునపుడు 'రు' ఆదేశ మగును.

'కాన్ + కాన్' అను నపుడు మొదటి 'కాన్' అను పదమునందలి నకారమునకు రు వచ్చుటచే 'కార్ + కాన్' అనియు పిమ్మట, అనునాసిక, అనుస్వారవిసర్గములును, 'సంపుంకానాం సో వక్తవ్యః' అను వార్తికముచే సకారమును వచ్చుటచే 'కాఁస్కాన్' + 'కాంస్కాన్' అను రెండు రూపములు నిష్పన్న మగును.

101. ఛే చ 6.1.73

హ్రస్వస్య ఛే పరే తుక్. శివచ్ఛాయా.

'హ్రస్వస్య పితి కృతి తుక్' నుండి 'హ్రస్వస్య', 'తుక్' అనువర్తించును. 'సంహితాయాం' అధికారము. (సంహితయందు) హ్రస్వమునకు ఛకారము పర మగునపుడు 'తుక్' అను నాగమము వచ్చును.

'శివ + ఛాయా'. ఇచట హ్రస్వ మగు వకారోత్తరవర్తి 'అ'కారమునకు ఛకారము పర మగుటచే తుగాగమము వచ్చును. 'తుక్'లోని 'ఉ' 'క్'లు ఇత్సంజ్ఞకములు. ఇది కిత్త గుటచే 'ఆద్యన్తౌ టకితౌ' అను పరిభాషచే (84) అంతావయవముగ వచ్చును. కావున 'శివ + త్ + ఛాయా' అని యుండగా శ్చుత్వము అసిద్ధ మగుటచే ముందుగ 'ఝలాం జశోఽన్తే' అను సూత్రముచే (67) జశ్త్వము — 'శివద్ + ఛాయా' శ్చుత్వము (62) — శివజ్ + ఛాయా, 'ఖరి చ' అను సూత్రముచే (74) చర్త్వము — శివచ్ + ఛాయా = 'శివచ్ఛాయా' అను రూపము సిద్ధించును.

102. పదాన్తాద్వా 6.1.76

దీర్ఘాత్ పదాన్తాత్ ఛే తుగ్వా. లక్ష్మీచ్ఛాయా. లక్ష్మీఛాయా.

'ఇతిహల్సన్ధిప్రకరణమ్'

"దీర్ఘాత్" అను సూత్రము, 'ఛే చ' నుండి 'ఛే' 'హ్రస్వస్య పితి కృతి తుక్'నుండి 'తుక్' అనువర్తించును. దీర్ఘ మగు పదాన్తముకంటె ఛకారము పర మగునపుడు వికల్పముగ 'తుక్' వచ్చును.

'లక్ష్మీ + ఛాయా'. ఇచట పదాన్తస్థ మగు ఈకారమునకు ఛకారము పర మగుటచే తుగాగమము. లక్ష్మీత్ + ఛాయా, జశ్త్వ. శ్చుత్వ. చర్త్వములచే వెనుకటి వలె వరుసగా దకార, జకార, చకారము లాదేశము లై 'లక్ష్మీచ్ఛాయా' అను రూప మగును. తుగాగమము వైకల్పికము గాన తదభావపక్షమున 'లక్ష్మీఛాయా' అను రూప మగును.

హల్సంధి ప్రకరణము సమాప్తము.

# అథ విసర్గసన్ధి ప్రకరణమ్

103. విసర్జనీయస్య సః 8.3.34

ఖరి విసర్జనీయస్య సః స్యాత్. విష్ణుస్త్రాతా.

ఈ సూత్రము 96 వ సూత్రముగ హల్సంధి ప్రకరణమున వచ్చినది.

'విష్ణుస్త్రాతా':- 'విష్ణుః + త్రాతా'. ఇచట విసర్గకు 'ఖర్' ఐన తకారము పర మగుటచే సకార మాదేశముగ వచ్చి 'విష్ణుస్త్రాతా' అను ప్రయోగము సిద్ధించినది.

104. వా శరి 8.3.36

శరి విసర్గస్య విసర్గో వా స్యాత్. హరిః శేతే. హరిశ్శేతే.

'విసర్జనీయస్య సః' నుండి 'విసర్జనీయస్య' 'శర్పరే విసర్జనీయః' నుండి 'విసర్జనీయః' అనువర్తించును. విసర్గమునకు 'శర్' పర మగునపుడు వికల్పముగ విసర్గ వచ్చును.



ఇది పై సూత్రమున కపవాదము. ఈ సూత్రము ప్రవర్తించని పక్షమున పై సూత్రము ప్రవర్తింపవచ్చును.

'హరిః + శేతే'. ఇచట విసర్గమునకు శర్ ప్రత్యాహారాంతర్గత మగు శకారము పర మగుటచే విసర్గమే వచ్చి 'హరిః శేతే' అను రూప మేర్పడును. ఈ సూత్రము ప్రవర్తించని పక్షమున 'విసర్జనీయస్య సః' అను సూత్రముచే (103) సకారము— 'హరిస్ + శేతే,' ఇచట 'స్తోశ్చునా శ్చుః' అను సూత్రముచే శ్చుత్వము—సకారమునకు శకారము— 'హరిశ్శేతే' అను రూపము సిద్ధించును.

105. ససజుషో రుః. 8.2.66

పదాన్తస్య సస్య సజుషశ్చ రుః స్యాత్.

'పదస్య' అధికృతము. పదాన్తసకారమునకును 'సజుష్' శబ్దమునకును (అలోన్త్యపరిభాషచే (21) 'సజుష్' శబ్దాన్త్యవర్ణమునకు) 'రు' ఆదేశముగ వచ్చును. 'రు'లోని 'ఉ'కార మిత్సంజ్ఞకము.

'శివస్ + అర్చ్యః':-'శివస్' అనునది 'శివ'అను ప్రాతిపదికకు 'సుప్' అను ప్రథమావిభక్త్యేకవచనప్రత్యయమును చేర్చి నపు డేర్పడిన రూపము. ఇచట సకారము పదాన్త మగుటచే ఈసూత్రముచే రుత్వము చేయగా 'శివర్ + అర్చ్యః' అని యుండును.

106. అతో రోరప్లుతాదప్లుతే, 6.1.113

అప్లుతాదతః పరస్య రోరుః స్యాదప్లుతేఽతి. శివోఽర్చ్యః.

'ఋత ఉత్' నుండి 'ఉత్' 'ఏఙః పదాన్తాదతి' నుండి 'అతి' అనువర్తించును. అప్లుత మగు 'అత్'కంటె పర మగు 'రు'కు అప్లుత మగు 'అత్' పర మగునపుడు 'ఉ' ఆదేశముగ వచ్చును.

పై యుదాహరణమున నీ సూత్రముచే 'రు'కు 'ఉ'త్వము వచ్చి 'శివఉ + అర్చ్యః' అనియై, 'ఆద్గుణః' అను సూత్రముచే (27) 'అఉ'లకు గుణ మేకాదేశ మగుటచే 'శివో + అర్చ్యః' అని యై, పిదప 'ఏఙః పదాన్తాదతి'అను సూత్రముచే (43) పూర్వరూపము వచ్చి 'శివోఽర్చ్యః' అను రూప మేర్పడును.

107. హశి చ 6.1.114

తథా. శివో వన్ద్యః.

పై సూత్రమునుండి 'అతః' 'రోః', 'అప్లుతాత్', 'ఋత ఉత్' నుండి

"ఉత్" అనువర్తించును. అప్లుత మగు అత్ కంటె పరమగు 'రు'కు 'హశ్' పర మగునపుడు కూడ 'ఉ'కారము ఆదేశముగ వచ్చును.

శివో వన్ద్యః:- 'శివస్ + వన్ద్యః'. 'ససజుషోరుః' అను సూత్రముచే (105) రుత్వము- శివర్ + వన్ద్యః': ఈ సూత్రముచే 'రు'స్థానమున ఉత్వము. శివఉ + వన్ద్యః గుణముచే 'శివో + వన్ద్యః' అను రూపము సిద్ధించును.

108. భోభగో అఘోఅపూర్వస్య యోఽశి 8.3.17

ఏతత్పూర్వస్య రోర్యాదేశోఽశి. దేవా ఇహ, దేవాయిహ. భోస్, భగోస్, అఘోస్, ఇతి సాన్తా నిపాతాః, తేషాం రోర్యత్వే కృతే:-

'రోస్సుపి' నుండి 'రోః' అనువర్తించును. భో, భగో, అఘో అను నిపాతములను, అకారమును, పూర్వమునందు గల 'రు'కు 'అశ్' పర మగునపుడు యకారి మాదేశ మగును.

'దేవాస్ + ఇహ':- 'ససజుషోరుః' అను సూత్రముచే (105) రుత్వము 'దేవార్ + ఇహ': ఈ సూత్రముచే అకారపూర్వక మగు 'రు'కు 'అశ్' (ఇకారము) పరముగ నున్నది గాన యకారాదేశము– 'దేవాయ్ + ఇహ' 'లోపశ్శాకల్యస్య' అను సూత్రముచే (30) యకారమునకు లోపము వచ్చిన పక్షమున 'దేవా ఇహ' అనియు, లోపము రాని పక్షమున 'దేవాయిహ' అనియు రూపద్వయముసిద్ధించును .'లోపశ్శాకల్యస్య' అనునది త్రిపాదీస్థ మగుటచే యకార లోపము అసిద్ధము గాన మొదటి రూపమున గుణప్రసక్తి లేదు.

'భోస్', 'భగోస్', 'అఘోస్' అనునవి సకారాన్త నిపాతములు. 'భోస్ + దేవాః' 'భగోస్ + నమస్తే' 'అఘోస్ + యాహి' అను నుదాహరణములందు నిపాతాంతసకారములకు 'ససజుషోరుః' అను సూత్రముచే (105) రుత్వమును ఈ సూత్రముచే (108) యకారమును చేసిన పిదప 'భోయ్ + దేవాః' 'భగోయ్ + నమస్తే' 'అఘోయ్ + యాహి' అని యుండగా:-

109. హలి సర్వేషామ్. 8.3.22

భో, భగో, అఘో, అపూర్వస్య యస్య లోపః స్యాద్ధలి. భో దేవాః. భగో నమస్తే. అఘో యాహి.

పై సూత్రమునుండి 'భో భగో అఘో అపూర్వస్య' అను పదము, 'లోపః శాకల్యస్య' నుండి 'లోపః', 'వ్యోర్లఘు ప్రయత్నతరః శాకటాయనస్య' నుండి 'వ్యోః' పదైకదేశ మగు యకారమును అనువర్తించును. భో, భగో, అఘో, అ, పూర్వక మగు యకారమునకు హల్ పర మగునపుడు సర్వాచార్యులమతమునందును (నిత్యముగా) లోపము వచ్చును.

ఈ సూత్రముచే పై యుదాహరణములందు భోభగోఅఘోపూర్వక మగు యకారమునకు హల్లు పర మగుటచే నిత్యముగ లోపము వచ్చి 'భో దేవాః' 'భగో నమస్తే' 'అఘో యాహి' అను ప్రయోగములు సిద్ధించును.

'భో', 'భగో', 'అఘో'. అనునవి క్రమముగా 'భవత్' 'భగవత్' 'అఘవత్' అను శబ్దములకు సంబంధించిన సంబోధన వాచకావ్యయములు. కావున 'భో' అనునది సామాన్య సంబోధన వాచకము. 'భగో' అనునది ఆదర పూర్వక సంబోధనవాచకము. అఘో అనునది నీచసంబోధన వాచకము.

110. రోఽసుపి. 8.2.69

అహ్నో రేఫాదేశో న తు సుపి. అహరహః. అహర్గణః.

'అహన్' అను సూత్రము అనువర్తించును. అహన్ శబ్దమునకు రేఫాదేశము వచ్చును; సుప్ ప్రత్యయము పర మగునపుడు మాత్రము రాదు.

అలోన్త్యస్య పరిభాషచే (21) అహన్ శబ్దాంత్యవర్ణమున కీ యాదేశము వచ్చును. 'అహన్ + అహః' ఇచట నకారమునకు రేఫ ఆదేశముగ వచ్చుటచే అహర్ + అహః = 'అహరహః' అను రూప మేర్పడును. అట్లే 'అహన్ + గణః' అను స్థలమున నకారమునకు రేఫాదేశము వచ్చి 'అహర్గణః' అను ప్రయోగము సిద్ధించును.

111. రో రి 8.3.14

రేఫస్య రేఫే పరే లోపః.

'ఢో ఢే లోపః' నుండి 'లోపః' అనువర్తించును. రేఫకు రేఫ పర మగునపుడు లోపము వచ్చును.

112. ఢ్రలోపే పూర్వస్య దీర్ఘోఽణః 6.3.111

ఢరేఫయోర్లోపనిమిత్తయోః పూర్వస్యాణో దీర్ఘః. పునా రమతే. హరీ రమ్యః, శమ్భూ రాజతే. అణః కిమ్? తృఢః. వృఢః.

'ఢశ్చ రశ్చ ఢ్రౌ, ఢ్రౌ లోపయతీతి ఢ్రలోపః' అను విగ్రహముచే 'ఢ్రలోపః' అను పదమునకు ఢకారరేఫల లోపమునకు కారణభూత మైనది అని

యర్థము. ధకారమునకు ధకారము పర మగునపుడు 'ఢో ఢే లోపః' అను సూత్ర ముచే (553) లోపము వచ్చును. అట్లే రేఫకు రేఫ పర మగునపుడు 'రో రి' అను సూత్రముచే (111) లోపము వచ్చును. కావున ఢకారరేఫల లోపమునకు నిమిత్త మగు వర్ణము లనగా ఢకారరేఫ లని యర్థము.

ఢకారరేఫల లోపమునకు నిమిత్త మగు ఢకారరేఫలు పర మగునపుడు పూర్వమం దున్న 'అణ్'కు దీర్ఘము వచ్చును.

పునారమతే:- 'పునర్ + రమతే': ఇచట రేఫకు రేఫ పరముగా నుండుటచే 'రో రి' అను సూత్రముచే (111) మొదటి రేఫకు లోపము. 'పున + రమతే'- ఈ సూత్రముచే రేఫ పూర్వవర్తి యగు అణ్‌నకు (అకారమునకు) దీర్ఘము. 'పునా రమతే' అను రూపము సిద్ధించును.

హరీరమ్యః:- 'హరిస్ + రమ్యః'-'ససజుషోరుః' అను సూత్రముచే రుత్వము. 'హరిర్ + రమ్యః'-వెనుకటి యుదాహరణమందు వలె. రేఫలోప ఇకారదీర్ఘములు – 'హరీ రమ్యః'.

శమ్భూరాజతే - 'శమ్భుస్ + రాజతే' రుత్వ–రలోప–దీర్ఘములు వెనుకటి యుదాహరణమునందు వలె వచ్చును.

'అణః' అని యన నేల? 'అణః' అని కాక 'అచః' అని చెప్పి యున్నచో 'తృఢః' 'వృఢః' అను క్తప్రత్యయాంత పదము లందలి ఋకారమునకు కూడ దీర్ఘము వచ్చి యుండెడిది.

తృఢః (కొట్టబడిన):- 'తృఢ్ + ఢః'. ఇచట 'ఢో ఢే లోపః' అను సూత్రముచే మొదటి ఢకారమునకు లోపము. 'తృ + ఢః'. ఈ సూత్రమున 'అణ్'కు మాత్రమే దీర్ఘము విధింపబడుటచే తద్భిన్న మగు ఋకారమునకు దీర్ఘము రాలేదు. 'తృఢః' అను రూపము సిద్ధించినది. వృఢః (సన్నద్ధుడు) దీని రూపమును 'తృఢః'వలె నెరుగునది.

'మనస్‌రథః' ఇత్యత్ర రుత్వే కృతే 'హశి చ' ఇత్యుత్వే 'రో రి' ఇతి లోపే చ ప్రాప్తే-

113. విప్రతిషేధే పరం కార్యమ్ .1.4 2

తుల్యబలవిరోధే పరం కార్యం స్యాత్. ఇతి లోపే ప్రాప్తే 'పూర్వత్రాసిద్ధమ్' ఇతి 'రో రి' ఇత్యస్యాసిద్ధత్వాదుత్వమేవ. మనోరథః



మనోరథః:- 'మనస్ + రథః'- ఇచట 'ససజుషోరుః' అని రుత్వము చేయగా 'మనర్ + రథః' అని యుండగా 'హశి చ' అను సూత్రముచే (107) ఉత్వము వచ్చుట కవకాశ మున్నది. 'రో రి' అను సూత్రముచే (111) రేఫ లోపము కూడ రావలసి యున్నది. కావున ఏ సూత్రము ప్రవర్తించవలెనో నిర్ణయము చేయ వలసి యుండుటచే ఈ సూత్రము (113) చెప్పబడుచున్నది. తుల్యబలవిరోధము కలిగి నపుడు పర మైన కార్యము రావలెను.

విప్రతిషేధ మనగా తుల్యబలవిరోధము. అనగా ఇతర స్థలములందు చరితార్థము లగు రెండు శాస్త్రములకు ఒక లక్ష్యమునందు సమావేశము. (అన్యత్ర లబ్ధావకాశయోః శాస్త్రయోరేకస్మిన్ లక్ష్యే సమావేశః తుల్యబలవిరోధః.) ఉదాహరణకు—'రో రి' సూత్రము 'పునా రమతే' ఇత్యాదిస్థలములందు చరితార్థమైనది. ఇచట 'హశి చ' సూత్రమునకు అవకాశము లేదు. అట్లే 'హశి చ' సూత్రము 'శివో వన్ద్యః' ఇత్యాది స్థలములందు చరితార్థము. ఇచట 'రో రి' సూత్రమున కవకాశము లేదు. ఇప్పు డీ రెండు సూత్రములును 'మనర్ + రథః' అను స్థలమున ప్రవర్తించుచున్నవి. ఇట్టి విప్రతిషేధము వచ్చునపుడు పరశాస్త్రమును (అష్టాధ్యాయీ క్రమానుసారముగ) చేయవలెను గాని పూర్వశాస్త్రమును చేయరాదని ఈ సూత్రము నియమించుచున్నది.

ఈ సూత్రము ననుసరించి షష్ఠాధ్యాయగత మగు 'హశి చ' సూత్రము కంటె అష్టమాధ్యాయస్థ మగు 'రో రి' సూత్రము పర మగుటచే 'రో రి' సూత్రమే ప్రవర్తించి రేఫలోపము రావలసి యున్నది. కాని 'పూర్వత్రాసిద్ధమ్' అను సూత్రము (31) ననుసరించి 'హశి చ' సూత్రము దృష్టిలో 'రో రి' సూత్రము అసిద్ధము కావున 'హశి చ' సూత్రమే ప్రవర్తించు నని నిర్ణయము. దీనిచే 'విప్రతిషేధే పరం కార్యమ్' అనునది సపాదసప్తాధ్యాయీగత సూత్రముల బలాబలవిచారణ విషయముననే ఉపయోగించు నని తేలినది. 'హశి చ' అను సూత్రముచే (107) ఉత్వము చేయగా 'మనఉ + రథః'—పిమ్మట గుణముచే 'మనోరథః' అను రూపము సిద్ధించును.

114. ఏతత్తదోః సులోపోఽకోరనఞ్సమాసే హలి 6.1.132

అకకారయోరేతత్తదోర్యః సుస్తస్య లోపో హలి, న తు నఞ్సమాసే. ఏష విష్ణుః, స శమ్భుః. అకోః కిమ్? ఏషకో రుద్రః, అనఞ్సమాసే కిమ్? అసః శివః, హలి కిమ్? ఏషోఽత్ర.

కకారరహితము లగు ఏతచ్ఛబ్దతచ్ఛబ్దములకు 'సు'కు హల్ పర మగునపుడు లోపము వచ్చును; నఞ్ సమాసమునందు మాత్రము రాదు.

'ఏషసు + విష్ణుః' 'ససు + శమ్భుః' — ఇచట ప్రథమైకవచన ప్రత్యయ మగు 'సు'అనునది కకారరహితము లగు ఏతచ్ఛబ్దతచ్ఛబ్దములకు సంబంధించి యున్నది. దీనికి హల్లు పరముగ నున్నది. ఇది నఞ్ సమాసము కాదు. కావున అది లోపించుటచే 'ఏష విష్ణుః' 'స శమ్భుః' అను రూపములు సిద్ధించును.

పై శబ్దములు కకారసహితము లైనచో సులోపము రాకుండుటకై 'అకోః' అను నది చేర్చబడినది. కావుననే 'ఏష కసు + రుద్రః' అనునపుడు ఏతచ్ఛబ్దమున కకారముండుటచే ఈ సూత్రమున కవకాశము లేదు. 'ససజుషోరుః' అను సూత్రముచే (105) రుత్వము, 'హశి చ' సూత్రముచే (107) 'రు'కు ఉత్వము, 'ఆద్గుణః' సూత్రముచే (27) గుణము వచ్చి 'ఏషకో రుద్రః' అను ప్రయోగము సిద్ధించినది. 'ఏషకః' అనునది ఏతచ్ఛబ్దమునకు స్వార్థమున 'అకచ్' ప్రత్యయము చేర్చుటచే సిద్ధించిన రూపము.

'అనఞ్సమాసే' అని యననేల? అట్లనుటచే నఞ్ సమాసమున ఈ సూత్రము ప్రవర్తించదు. కావుననే 'అససు + శివః' అను స్థలమున నఞ్ సమాస మగుటచే సులోపము రాలేదు. రుత్వవిసర్గాదులచే 'అసః శివః' ఇత్యాది రూపములు సిద్ధించును.

'హలి' యనుటచే అచ్చు పర మగునపుడు ఈ సూత్రము ప్రవర్తించదు. 'ఏషసు + అత్ర' ఇచట 'సు'కు అచ్చు పర మగుటచే లోపము లేదు. కావున సకారమునకు రుత్వము, 'అతో రో రప్లుతాదప్లుతే' అను సూత్రముచే (106) ఉత్వము, గుణము, 'ఏఙః పదాన్తాదతి' సూత్రముచే (43) పూర్వరూపము వచ్చి 'ఏషోఽత్ర' అను రూప మేర్పడినది.

### 115. సోఽచి లోపే చేత్పాదపూరణమ్ 6.1.134

స ఇత్యస్య సోర్లోపః స్యాదచి, పాదశ్చేల్లోపే సత్యేవ పూర్యేత. సేమామవిడ్ఢి ప్రభృతిం య ఈశిషే. సైష దాశరథీ రామః.



ఇతి విసర్గసన్ధిః.

ఇతి పఞ్చసన్ధి ప్రకరణమ్.

వెనుకటి సూత్రమునుండి 'సు', 'లోపః' అనువర్తించును. 'స' అను దాని 'సు'ప్రత్యయమునకు అచ్చు పర మగునపుడు లోపము వచ్చును; ఇట్లు లోపము చేసిననే పాదపూర్తి యగు నను సందర్భములందే ఈ లోపము వచ్చును.

'సేమామవిడ్ఢి ప్రభృతిం య ఈశిషే' అనునది వైదికజగతీఛందఃపాదము, ఇచట 'ససు + ఇమామ్' అని యుండగా 'సు'కు లోపము 'స + ఇమామ్' అని యుండగా గుణముచే 'సేమామ్' అను రూపము సిద్ధించినది. జగతీఛందమున ప్రతిపాదమునందును పండ్రెండు అక్షరము లుండును. పై విధముగ సులోపము చేసిననే పండ్రెండు అక్షరము లుండును కాని లోపము చేయనిచో పదమూడక్షరము లుండి ఛందోభంగ మగును. కావున సులోపము చేయబడినది. 'సైష దాశరథీ రామః' అను అనుష్టుప్ఛందఃపాదమున పూర్వోక్తవిధముగ సులోపము చేసి వృద్ధి చేయుటచే 'సైష' అను రూప మేర్పడినది. అనుష్టుప్ఛందమున పాదమునకు ఎనిమిది అక్షరము లుండును. సులోపము చేయకున్నచో 'స ఏష దాశరథీ రామః' అని యుండి తొమ్మిది వర్ణము లుండుటచే ఛందోభంగము వచ్చి యుండెడిది.

విసర్గసంధి ప్రకరణము సమాప్తము.

పంచసంధి ప్రకరణము సమాప్తము.

Paper-II
Unit-II
VYAKARANAM
(Grammar)



ఓమ్ శ్రీ గురుభ్యో నమః

యేనాక్షర సమామ్నాయమధిగమ్య మహేశ్వరాత్ ।
కృత్స్నం వ్యాకరణం ప్రోక్తం తస్మై పాణినయే నమః ॥
యేన ధౌతా గిరః పుంసాం విమలైః శబ్దవారిభిః ।
తమశ్చాజ్ఞానజం భిన్నం తస్మై పాణినయే నమః ॥
వాక్యకారం వరరుచిం భాష్యకారం పతఞ్జలిమ్ ।
పాణినిం సూత్రకారం చ ప్రణతోఽస్మి మునిత్రయమ్ ॥
ఓమ్ నమః పాణిని-కాత్యాయన-పతఞ్జలిభ్యో శబ్ద విద్యా
సంప్రదాయ ప్రవర్తకేభ్యో మునిభ్యో మహద్భ్యో గురుభ్యః ॥
మునిత్రయం నమస్కృత్య తదుక్తీః పరిభావ్య చ ।
వైయాకరణ సిద్ధాన్తకౌముదీయం విరచ్యతే ॥
న్యాయవ్యాకరణాద్వైత వేదాన్తేషు విశారదమ్ ।
పుల్లెలాన్వయసమ్భూతం రామచంద్రగురుం భజే ॥
అస్తు నమః పాణినయే భూయో మునయే తథాస్తు వరరుచయే ।
కించాస్తు పతంజలయే భ్రాత్రే మృత్యుంజయాయ గురవే ॥

## సంజ్ఞా ప్రకరణమ్

గ్రంథారంభమున మంగళమును = ఇష్టదేవతా ప్రార్థన చేయుట మన ప్రాచీన సంప్రదాయము. గ్రంథరచనలో ఎటువంటి విఘ్నములు కలుగకుండా ఉండుటకై శాస్త్రకారులు, కవులు కూడ గ్రంథారంభమున భగవత్ ప్రార్థన చేసేవారు. ఇదే విధముగ గురువులు కూడ తమ శిష్యులకు శాస్త్రమును బోధించే ముందు భగవంతుని లేదా గురువుల యొక్క ప్రార్థన చేసే సంప్రదాయమును చెప్పేడివారు. ***"మంగళాదీని మంగళ మధ్యాని మంగళాన్తాని చ శాస్త్రాణి ప్రథన్తే, వీరపురుషాణి భవన్తి, ఆయుష్మత్ పురుషాణి చ, అధ్యేతారశ్చ వృద్ధియుక్తా యథా స్యుః "*** అని పతంజలి మహర్షి

మహాభాష్యారంభమున **"వృద్ధిరాదైచ్"** అను సూత్ర వ్యాఖ్యాన సందర్భమున వివరించెను. గ్రంథము యొక్క ఆది - మధ్య - అవసానముల యందు మంగళము = భగవత్ప్రార్థన చేయబడిన శాస్త్రగ్రంథములు వృద్ధి పొందుతాయని, ఆ శాస్త్రమును అధ్యయనం చేసినవారు వీరులు, ఆయుష్మన్తులు మఱియు అభివృద్ధి యుక్తులు కాగలరని పతంజలి మహర్షి వివరించియున్నాడు. అందుకే **' సిద్ధాన్తకౌముదీ '** కారుడైన భట్టోజీదీక్షితులు కూడ తన గ్రంథారంభమున సూత్ర-వార్తిక-మహాభాష్యకారులైన పాణిని-కాత్యాయన-పతంజలి మునులను నమస్కరించి, వారి యొక్క సూత్ర-వార్తిక-భాష్యములను బాగుగా అధ్యయనం చేసి " వైయాకరణసిద్ధాన్తకౌముదీ " గ్రంథమును రచించుచున్నానని సవినయముగ ప్రకటించియున్నాడు.

**(1) అఇఉణ్ (2) ఋఌక్ (3) ఏఓఙ్ (4) ఐఔచ్ (5) హయవరట్ (6) లణ్ (7) ఞమఙణనమ్ (8) ఝభఞ్ (9) ఘఢధష్ (10) జబగడదశ్ (11) ఖఫఛఠథచటతవ్ (12) కపయ్ (13) శషసర్ (14) హల్ ఇతి మాహేశ్వరాణి సూత్రాణి, అణాది సంజ్ఞార్థాని, ఏషామన్త్యా ఇతః, లణ్ సూత్రే అకారశ్చ । హకారాదిష్వకార ఉచ్చారణార్థః ॥**

**అఇఉణ్, ఋఌక్** అనే ఈ పదునాలుగు సూత్రములు మాహేశ్వర సూత్రములని అంటారు. పరమశివుడు తాండవనృత్యసమయమున తన డమరుకమును పదునాలుగు సార్లు వాయించెనని, ఆ శబ్దములనే పాణిని మహర్షి ప్రకృత సూత్రములుగ గ్రహించెనని శాస్త్రజ్ఞుల అభిప్రాయము.

**అణ్ అచ్ ఇక్ యణ్** మొదలగు ప్రత్యాహారములు చేయుటనే ఈ పదునాలుగు సూత్రముల ప్రధానోద్దేశ్యము. ఉదాహరణమునకు **" అఇఉణ్ "** అనే సూత్రమునుండి మొదటి అక్షరము మఱియు ణ్ అనే చివరి అక్షరమును **' అణ్ '** అనే ప్రత్యాహారముగ గ్రహించగ ఈ ప్రత్యాహారములో " అఇఉ " అనే మూడు అక్షరములుంటాయని గ్రహించవలసినది. ఈ విధముగా ఈ సూత్రముల నుండి సుమారుగ 48 ప్రత్యాహారములు ఏర్పడుతాయని వ్యాకరణజ్ఞులు తెల్పుచున్నారు.

ఈ పదునాలుగు సూత్రముల యొక్క చివరి అక్షరములకు ' ఇత్ ' లని పేరు. 'లణ్' సూత్రములోని లకారము మీదనున్న ' అ ' కారమునకు కూడ ' ఇత్ ' అని పేరు. "హయవరట్ " మొదలగు సూత్రములలో ' హ ' కారము మొదలగు వర్ణములతో పాటు పలుకబడుతున్న ' అకారము ' ఉచ్చారణ సౌలభ్యము కొఱకేనని గ్రహింపవలసినది.



## 1. హలన్త్యమ్ (1-3-3)

**హల్ ఇతి సూత్రే అన్త్యమ్ ఇత్ స్యాత్**

ఇది ' **హలన్త్యమ్** ' అని ఏకపద సూత్రము. హలి అన్త్యమ్ హలన్త్యమ్ అని సప్తమీ తత్పురుష సమాసము. పైన చెప్పబడిన 14 మహేశ్వర సూత్రములలో చివరిదైన హల్ అనే సూత్రములోని ల కారము ' ఇత్ ' అను సంజ్ఞ కలది యగును.

## 2. ఆదిరన్త్యేన సహేతా (1-1-71)

**అన్త్యేనేతా సహితః ఆదిర్మధ్యగానాం స్వస్య చ సంజ్ఞా స్యాత్. ఇతి హల్సంజ్ఞాయామ్.**

" **ఆదిః, అన్త్యేన, సహ, ఇతా** " అని పదచ్ఛేదము. ఇత్సంజ్ఞకమైన అంతిమ వర్ణముతో కూడుకొన్న ఆది వర్ణము మధ్యలో నున్న వర్ణములకు, తనకును అనగా ఆదివర్ణమునకూ ' సంజ్ఞ ' అగును. దీనినే ప్రత్యాహారమందురు. ఇది ప్రత్యాహార విధాయక సూత్రమని ప్రసిద్ధి. ఈ సూత్రము చేత ' హల్ ' అను సంజ్ఞ సిద్ధించినది.

## 3. హలన్త్యమ్ (1-3-3)

**ఉపదేశే అన్త్యమ్ హల్ ఇత్ స్యాత్. ఉపదేశ ఆద్యోచ్చారణమ్. తతః ' అణ్, అచ్' ఇత్యాది సంజ్ఞా సిద్ధా.**

హల్, అన్త్యమ్ అని పదచ్ఛేదము. ఉపదేశమందు చివరిగా ఉన్న హల్ అక్షరము ఇత్ సంజ్ఞ కలది యగును. ఉపదేశమనగా ఆద్యోచ్చారణము. అనగా మొదట ఉచ్చరింపబడినదని అర్థము.

ఉపదేశమనగా -

**" ధాతు సూత్ర గణోణాది వాక్యలింగానుశాసనమ్ ।**

**ఆగమ ప్రత్యయాదేశాః ఉపదేశాః ప్రకీర్తితాః ॥ "** అని

ప్రాచీనులు చెప్పియున్నారు. అనగా ధాతువులు, సూత్రములు, గణపాఠము, ఉణాదులు, వాక్యము, లింగానుశాసనము, ఆగమము, ప్రత్యయము, ఆదేశము మొదలగునవి ఉపదేశములుగా పరిగణింపబడినవి.

శాస్త్రములో హలన్త్యమ్, ఆదిరన్త్యేన సహేతా అను సూత్రముల విషయములో

అన్యోన్యాశ్రయదోషము ఆశంకింపబడి ఆ దోషము ' హలన్త్యమ్ ' అను సూత్రావృత్తిచే పరిహరింపబడినది. " హలన్త్యమ్ " అను సూత్రమునకు హల్, అన్త్యమ్ అను పదవిభాగము చేసి ఉపదేశమందు అన్త్యమందున్న హల్లు ఇత్సంజ్ఞకము అగును అని అర్థము చెప్పినచో హల్ ప్రత్యాహార జ్ఞానం కొరకు " ఆదిరన్త్యేన సహేతా " అను సూత్రార్థము దాని జ్ఞానము అవసరమైయున్నది. ఇక " ఆదిరన్త్యేన సహేతా " అను సూత్రములో " ఇతా " అను పదమునకు ఇత్సంజ్ఞక వర్ణముతో అని అర్థము. ఇత్సంజ్ఞా జ్ఞానము కొరకు "హలన్త్యమ్" అను సూత్రార్థజ్ఞానము అవసరమైయున్నది. ఈ విధంగా ఈ రెండు సూత్రములకు అన్యోన్యాశ్రయదోషము ప్రసక్తమయినది. ఈ దోషమును నివారించుటకై " హలన్త్యమ్ " అను సూత్రమును రెండుసార్లు చెప్పవలసివచ్చినది. ఇందులో మొదటి " హలన్త్యమ్ " అను దానికి అర్థము ఈ విధంగా చెప్పవలయును. హలి అన్త్యమ్ హలన్త్యమ్ అని సప్తమీ తత్పురుష సమాసము. " హల్ " అను 14వ మహేశ్వర సూత్రములో అన్త్యవర్ణము ల కారము ఇత్సంజ్ఞకమగునని అర్థము. ఇట్లు చెప్పుటచే ఇత్సంజ్ఞకవర్ణము ల కారము సిద్ధించినది. తరువాత " **ఆదిరన్త్యేన సహేతా** " అను సూత్రము. అన్త్యమందున్న ఇత్సంజ్ఞక వర్ణముతో అనగా ల కారముతో కూడుకున్న మొదటి వర్ణము అనగా " హల్ " అనునది య కారము మొదలగు (యవరట్ లణ్....హల్) మధ్యవర్ణములకు, తనకున్ను అనగా హ కారమునకు సంజ్ఞ అగునని అర్థము. ఇట్లు చెప్పుటచే హల్ ప్రత్యాహారము సిద్ధించినది. తరువాత " హలన్త్యమ్ " అను రెండవ సూత్రము. ఉపదేశమందు చివర ఉన్న హల్లు ఇత్సంజ్ఞకమగునని అర్థము. ఇట్లు చెప్పుటచే అఇఉణ్ మొదలగు సూత్రములలో ణకారాది అన్త్య (చివరి) హల్లులకు ఇత్సంజ్ఞ సిద్ధించినది. ఇందువలన " అణ్ ", " అచ్ " మొదలగు ప్రత్యాహారములు సిద్ధించును.

### 4. ఉపదేశేఽజనునాసిక ఇత్ (1-3-2)

**ఉపదేశే అనునాసికోఽచ్ ఇత్సంజ్ఞః స్యాత్ । ప్రతిజ్ఞానునాసిక్యాః పాణినీయాః । లణ్ సూత్రస్థావర్ణేన సహ ఉచ్చార్యమాణో రేఫో రలయోః సంజ్ఞా. ప్రత్యాహారేష్వితాం న గ్రహణమ్. " అనునాసికః " ఇత్యాది నిర్దేశాత్. న హ్యత్ర కకారే పరే అచ్కార్యం దృశ్యతే. " ఆదిరన్త్యేన ఇత్యేతత్సూత్రేణ కృతాః సంజ్ఞాః ప్రత్యాహారశబ్దేన వ్యవహ్రియన్తే**

, , .

"**ఉపదేశేఽజనునాసిక ఇత్** ". ఉపదేశే, అచ్, అనునాసికః, ఇత్ అని పదచ్ఛేదము.



ఉపదేశమందు అనునాసికమగు అచ్చు ఇత్సంజ్ఞకమగునని అర్థము. అయితే ఏ అచ్చు అనునాసికము, ఏ అచ్చు అననునాసికము అను సందేహమును నివారించుటకు చెప్పుచున్నాడు. " ప్రతిజ్ఞానునాసిక్యాః పాణినీయాః " అని. పాణిని శిష్యులు ఆనునాసిక్యజ్ఞానము కలవారని అర్థము. అనగా గురుశిష్యపరంపరచే ఏ అచ్చు అనునాసికము, ఏ అచ్చు అనునాసికము కాదు అను విషయము పాణిని శిష్యులకు తెలియునని స్పష్టము. " లణ్ " అను సూత్రములో ల కారము మీదనున్న అ కారము అనునాసికము, కావున ప్రకృత సూత్రముచే ఆ అ కారమునకు ఇత్సంజ్ఞ కలిగినది. ఆ అ కారముతో కూడా ఉచ్చరింపబడే మొదటి వర్ణము రేఫ (హయవరట్ అను సూత్రమందలి రేఫ) అనగా " ర " అను ప్రత్యాహారము (" ఆదిరన్త్యేన సహేతా " అను సూత్రముచే సిద్ధించినది) రేఫ ల కారములకు సంజ్ఞ అగును.

అణ్, అచ్ మొదలగు ప్రత్యాహారములలో ఇత్సంజ్ఞక వర్ణములు గ్రహింపబడవు. ఉదాహరణకు అచ్ అను ప్రత్యాహారము నందు " అఇఉణ్ " సూత్రములోని అ కారముతో మొదలుకొని " ఐఔచ్ " అను సూత్రములోని చ కారము వఱకు గ్రహింపబడును. ఈ ప్రత్యాహారములో ఇత్సంజ్ఞక వర్ణములు ణ కారము, క కారము, ఙ కారము, చ కారము నాలుగు ఉన్నవి. వీటికి అచ్ ప్రత్యాహారముతో స్థానముండునా ? లేదని సమాధానము. అట్లు చెప్పుటలో "అనునాసికః" మొదలగు నిర్దేశమే (ప్రయోగమే) ప్రమాణము. "ఇకోయణచి" అను సూత్రముచే ఇక్కునకు అచ్చు పరమగునపుడు యణ్ అను ఆదేశము విధింపబడినది. ఒకవేళ ఇత్సంజ్ఞక వర్ణములు కూడా ఆయా ప్రత్యాహారములచే గ్రహించబడినచో "అచ్ " ప్రత్యాహారములో క కారమును కూడా గ్రహింపబడవలసివచ్చును. అప్పుడు క కారము కూడా అచ్చు కావలసియుండును. అట్లయిన " అనునాసికః " అను ప్రయోగంలో సకారోత్తరవర్తి అనగా స కారముతో నున్న ఇకారము ఇక్ ఉన్నది. దానికి కకారము (అచ్చు) పరముగా ఉన్నది. కావున ఆ ఇకారమునకు పాణిని యణాదేశము చేసి యుండవలసినది. (" ఉపదేశేఽజనునాసిక ఇత్ " అను సూత్రమందు "అనునాసికః" అను ప్రయోగమందు) కాని అట్లు చేయలేదు. దీని ద్వారా ప్రత్యాహారములలో ఇత్సంజ్ఞక వర్ణములు గ్రహింపబడవని స్పష్టముగ తెలియుచున్నది. అందువలన అచ్ ప్రత్యాహారము చేత కకారము గ్రహింపబడదు కావున, కకారము అచ్చు కాదు కావున "అనునాసికః" అను ప్రయోగములో యణాదేశమును విధించే అవకాశమే లేదు. అందుచేతనే " ఆదిరన్త్యేన సహేతా " అను సూత్రము ద్వారా చేయబడిన అణ్, అచ్, హల్ మొదలగు సంజ్ఞలు ప్రత్యాహార

శబ్దము చేత వ్యవహరింపబడును.

## 5. " ఊకాలోఽజ్ఝ్రస్వదీర్ఘప్లుతః " (1-2-27)

**ఉశ్చ ఊశ్చ ఊశ్చవః । వాం కాల ఇవ కాలో యస్య సోఽచ్ క్రమాత్ హ్రస్వ దీర్ఘ ప్లుత సంజ్ఞః స్యాత్. స ప్రత్యేకముదాత్తాది భేదేన త్రిధా.**

"**ఊకాలోఽజ్ఝ్రస్వ దీర్ఘ ప్లుతః**". ఊకాలః, అచ్, హ్రస్వదీర్ఘప్లుతః అని పదచ్ఛేదము. ఉశ్చ ఊశ్చ ఊశ్చవః, వాం కాలః ఊకాలః, ఊకాల ఇవ కాలః యస్య సః. ఊకాలః అని బహువ్రీహిసమాసము. ఏక, ద్వి, త్రి మాత్రలు కలిగిన ఉకార, ఊకార, ఊకారములు ఇచ్చట గ్రహింపబడినవి. హ్రస్వశ్చ దీర్ఘశ్చ, ప్లుతశ్చ ఏతేషాం సమాహారః – హ్రస్వదీర్ఘప్లుతః అని సమాహారద్వంద్వము. హ్రస్వ దీర్ఘ ప్లుతం అని కావలసియుండగా హ్రస్వ దీర్ఘ ప్లుతః అని పుంలింగ ప్రయోగం సూత్రకారునిచే ప్రయోగింపబడినది. లేదా ఈ సమాసము ఇతరేతరయోగ ద్వంద్వమని చెప్పవచ్చును. అప్పుడు హ్రస్వదీర్ఘప్లుతాః అని బహువచనము ప్రయోగించవలసి యుండగా హ్రస్వదీర్ఘప్లుతః అని ఏకవచనము ఆర్ష ప్రయోగమని పండితుల అభిప్రాయము.

వరుసగా ఏక, ద్వి, త్రిమాత్రలు కలిగిన ఉకార, ఊకార, ఊకారముల యొక్క కాలము వంటి కాలము కలిగిన అచ్చు క్రమముగా హ్రస్వము, దీర్ఘము, ప్లుతము అను సంజ్ఞ కలిగినది యగును. ఏకమాత్రాకాలికములగు అచ్చులకు హ్రస్వమనియు ద్విమాత్రాకాలికములగు అచ్చులకు దీర్ఘమనియు, త్రిమాత్రాకాలికములగు అచ్చులకు ప్లుతమనియు పేరు. ఆ అచ్చు ప్రత్యేకముగా ఉదాత్తాది-భేదముతో మూడేసి రకములు. అనగా ఉదాహరణకు అకారమును తీసుకొందుము. అచ్చట హ్రస్వమను అచ్చు ఉదాత్తము, అనుదాత్తము, స్వరితము అని మూడు విధములు. దీర్ఘమను అచ్చు అట్లే పైన పేర్కొన్న విధముగా మూడు విధములు, మరియు ప్లుతము కూడా ఉదాత్త, అనుదాత్త, స్వరితములుగా మూడేసి విధములుగా ఉంటాయి. ఈ విధంగా చెప్పుటవలన ప్రస్తుతము అకారము 9 విధములని తేలినది. ఇంకనూ వాటి భేదములు స్పష్టముగా మున్ముందు మూలగ్రంథముల యొక్క ఆధారముగా తెలియును.

## 6. ఉచ్చైరుదాత్తః (1-2-29)

**తాల్వాదిషు సభాగేషు స్థానేషు ఊర్ధ్వభాగే నిష్పన్నోఽచ్ ఉదాత్తసంజ్ఞః స్యాత్.**



**ఉచ్చైరుదాత్తః** – " **ఊకాలోఽజ్ఝ్రస్వ దీర్ఘ ప్లుతః** " అను సూత్రం నుండి అచ్ అను పదము అనువర్తించును.

ఉచ్చైః – ఊర్ధ్వ భాగమందు (పైభాగమందు) అని, సభాగేషు = సావయవములయిన వానియందు అని అర్థము. అనగా అవయవములయిన తాలువు (దవడ) సహ మొదలగు స్థానములయందు ఊర్ధ్వభాగమందు పుట్టిన అచ్చు ఉదాత్త సంజ్ఞ కలది అగును. 'ఆయే' మొదలగు ఋగ్వేద మంత్రములందు ఆకారము, ఏకారము ఉదాత్తము.

## 7. నీచైరనుదాత్తః (1-2-30)

**స్పష్టమ్. అర్వాఙ్**

**నీచైరనుదాత్తః** – ఈ సూత్రార్థము స్పష్టము. అనగా సావయవములయిన తాలువు (దవడ) మొదలగు స్థానములందు నీచైః అనగా అధోభాగము ( క్రిందిభాగము) నందు నిష్పన్నమైన అచ్చు అనుదాత్త సంజ్ఞ కలది అగును. "**అర్వాఙ్**" మొదలగు ఋక్కునందు అకారము అనుదాత్తము.

## 8. సమాహారః స్వరితః (1-2-31)

**ఉదాత్తత్వానుదాత్తత్వే వర్ణధర్మౌ సమాహ్రియేతే యస్మిన్ సోఽచ్ స్వరితసంజ్ఞః స్యాత్. సమాహారస్వరితః** – " **ఊకాలోఽచ్** " అను సూత్రము నుండి అచ్ అను పదము అనువర్తించినది. పూర్వసూత్రముల నుండి ఉదాత్తః, అనుదాత్తః అని రెండు పదములు అనువర్తించినవి. ఉదాత్తత్వము, అనుదాత్తత్వము అను రెండు వర్ణధర్మములు ఏ అచ్చునందు సమాహరింపబడునో అనగా ఆ రెండు ధర్మములకు మేలనము కలుగునో ఆ అచ్చు " స్వరితము " అను సంజ్ఞ కలది అగును.

## 9. తస్యాదితః ఉదాత్తమర్ధహ్రస్వమ్ (1-2-32)

**హ్రస్వగ్రహణమతన్త్రమ్. స్వరితస్యాదితోఽర్ధముదాత్తం బోధ్యమ్. ఉత్తరార్ధం తు పరిశేషాదనుదాత్తమ్. తస్యచోదాత్తస్వరితపరత్వే శ్రవణం స్పష్టమ్. అన్యత్ర తూదాత్తశృతిః ప్రాతిశాఖ్యే ప్రసిద్ధా. క్వవోఽశ్వాః, రథానాం న యేఽరాః, – శతచక్రం యోఽహ్యః ఇత్యాదిష్వనుదాత్తః । " అగ్నిమీలే ...." ఇత్యాదావుదాత్తశ్రుతిః. న నవవిధోఽపి ప్రత్యేకమనునాసికాననునాసికత్వాభ్యాం ద్విధా.**

**తస్యాదిత ఉదాత్తమర్ధహ్రస్వమ్** – పూర్వ సూత్రమందు ఉదహరించిన ప్రకారం

స్వరితమందు ఉదాత్తత్వము, అనుదాత్తత్వము అను రెండు వర్ణధర్మముల మేలనముండునని చెప్పబడినది. అయితే ఏ భాగము ఉదాత్తత్వము ఏ భాగము అనుదాత్తత్వము అను విషయము. "తస్యాదిత......" అను సూత్రము చేత స్పష్టపరచబడుచున్నది. ఈ సూత్రమందు హ్రస్వగ్రహణమునకు వివక్ష లేదు. హ్రస్వమయిననూ, దీర్ఘమయిననూ, ప్లుతమయిననూ స్వరితమందలి మొదటి సగభాగము ఉదాత్తమగును. తర్వాతి సగభాగము అనుదాత్తమగును. ఆ రెండవభాగము అనుదాత్తమునకు ఉదాత్తముగాని, స్వరితముగాని పరముగా ఉన్నప్పుడు ఆ అనుదాత్త భాగము స్పష్టముగా వినబడును. ఉదాత్త స్వరితములు పరముగా లేనపుడు అనగా అనుదాత్తమే పరముగా ఉన్నప్పుడు ఆ అనుదాత్త భాగము ఉదాత్తముగా వినబడును. ఇది ఋగ్వేద ప్రాతిశాఖ్యయందు ప్రసిద్ధము.

" **క్వవోఽశ్వాః** " అను ఉదాహరణమందు " క్వ " అనుచోట అకారము హ్రస్వస్వరితమున్నది. దానికి "వో" అను ఓకారము ఉదాత్తము పరముగా ఉన్నది. కావున ఆ హ్రస్వస్వరితములో ఉన్న అనుదాత్తభాగము స్పష్టముగా వినబడును.

" **రథానాం న యేఽరాః** " అను ఉదాహరణమందు " యే " అనుచోట ఏకారము దీర్ఘస్వరితమున్నది. దానికి " రాః " అని ఆకారము ఉదాత్తము పరముగా ఉన్నది. కావున ఆ దీర్ఘస్వరితములో ఉన్న అనుదాత్తభాగము స్పష్టముగా వినబడును.

" **శతచక్రం యోఽహ్యః** " అను ఉదాహరణమందు " యో " అనుచోట ఓకారము ప్లుతస్వరితము. దానికి " హ్యః " అని అకారము స్వరితము పరముగా ఉన్నది. కావున ఆ ప్లుతస్వరితములో ఉన్న అనుదాత్త భాగము స్పష్టముగా వినబడును.

" **అగ్నిమీళే .....** " అను ఉదాహరణమందు " మీ " అనుచోట ఈ కారము దీర్ఘస్వరితము, దానికి " ళే " అను ఏ కారము అనుదాత్తము పరముగా నున్నది. కావున ఆ దీర్ఘస్వరితములో ఉన్న అనుదాత్తభాగము ఉదాత్తముగానే వినబడును.

ఈ విధముగా ఉదాహరణకు " అకారము " అను అచ్చుతీసుకున్నచో అది 3 విధములు. హ్రస్వము, దీర్ఘము, ప్లుతము అని, అందు మళ్ళీ హ్రస్వము 3 విధములు. ఉదాత్తహ్రస్వము, అనుదాత్తహ్రస్వము, మరియు స్వరితహ్రస్వము అని. దీర్ఘము 3 విధములు అవి ఉదాత్తదీర్ఘము, అనుదాత్తదీర్ఘము మరియు స్వరితదీర్ఘము అని. మరల ప్లుతము 3 విధములు అవి వరుసగా ఉదాత్తప్లుతము, అనుదాత్తప్లుతము మరియు స్వరితప్లుతము అని. ఈ విధముగా 9 విధములయిన " అకారము " అనునాసికము, అననునాసికము అను భేదముచే మొత్తం 18 విధములు. 9 అనునాసికములు, 9



అననునాసికములు అని భావము. ఇట్లే ఇకారాది అచ్చులు కూడా 18 విధములని గ్రహించవలెను.

## 10. ముఖనాసికావచనోఽనునాసికః (1-1-8)

**ముఖసహితనాసికయా ఉచ్చార్యమాణో వర్ణోఽనునాసిక సంజ్ఞః స్యాత్. తదిత్థమ్ – అ, ఇ, ఉ, ఋ, ఏషాం వర్ణానాం ప్రత్యేకమష్టాదశ భేదాః, ఌ వర్ణస్య (ఌ) ద్వాదశ. తస్య దీర్ఘాభావాత్. ఏచామపి ద్వాదశ. తేషాం హ్రస్వాభావాత్.**

**ముఖనాసికావచనోఽనునాసికః** – ముఖనాసికావచనః, అనునాసికః అని పదచ్ఛేదము. **ముఖసహితా నాసికా ముఖనాసికా, ఉచ్యతే ఇతి వచనః ముఖనాసికయా వచనః ముఖనాసికావచనః** అని విగ్రహవాక్యము. ముఖములో కూడుకొన్న ముక్కుతో ఉచ్చరించబడు వర్ణమునకు అనునాసికము అను సంజ్ఞ చెప్పబడును.

అచ్చులలో ఏయే వర్ణములు ఎన్నెన్ని విధములో చెప్పుచున్నాడు. అ, ఇ, ఉ, ఋ ఈ వర్ణములు ఒక్కొక్కటి పద్దెనిమిది విధములు. ఌ వర్ణము(ఌ) 12 విధములు, దానికి దీర్ఘము లేదు కావున దీర్ఘమునకున్న 6 విధములు ఉండవు. ఏచ్‌లు అనగా ఏ, ఓ, ఐ, ఔ లు. ఒక్కొక్కటి 12 విధములు. వాటికి హ్రస్వము లేదు. కావున హ్రస్వమున్న 6 విధములు ఉండవు.

## 11. తుల్యాస్యప్రయత్నం సవర్ణమ్ (1-1-9)

**తాల్వాదిస్థానమ్ ఆభ్యన్తరప్రయత్నశ్చ ఇత్యేతద్ద్వయం యస్య యేన తుల్యం తన్మిథః సవర్ణసంజ్ఞం స్యాత్. (1) అకుహవిసర్జనీయానాం కంఠః. (2) ఇచుయశానాం తాలు (3) ఋటురషాణాం మూర్ధా. (4) ఌ తులసానాం దన్తాః. (5) ఉ పూపధ్మానీయానామోష్ఠౌ. (6) ఞమఙణనానాం నాసికా చ. (7) ఏదైతోః కంఠతాలు. (8) ఓదౌతోః కంఠోష్ఠమ్. (9) వకారస్య దంతోష్ఠమ్. (10) జిహ్వామూలీయస్య జిహ్వామూలమ్. (11) నాసికానుస్వారస్య ఇతి స్థానాని.**

**తుల్యాస్యప్రయత్నం సవర్ణమ్** – తుల్యాస్య ప్రయత్నం, సవర్ణమ్ అని పదచ్ఛేదము. ఆస్యమనగా ముఖము. " ఆస్యే భవం ఆస్యం." ముఖమందు ఉండునది అనగా తాలువు మొదలగు స్థానములని అర్థము. ఆస్యంచ ప్రయత్నంచ ఆస్యప్రయత్నౌ. "తుల్యౌ ఆస్య ప్రయత్నౌ. యస్య తత్. తుల్యాస్య ప్రయత్నం " అని విగ్రహవాక్యము.

ఏ వర్ణములకు తాలువులు (దవడలు) మొదలగు వర్ణోత్పత్తి స్థానములు. ప్రయత్నములు సమానముగా ఉండునో అవి పరస్పరము సవర్ణ సంజ్ఞకములగును.

స్వరితమందు ఉదాత్తత్వము, అనుదాత్తత్వము అను రెండు వర్ణధర్మముల మేలనముండునని చెప్పబడినది. అయితే ఏ భాగము ఉదాత్తత్వము ఏ భాగము అనుదాత్తత్వము అను విషయము. "తస్యాదిత......" అను సూత్రము చేత స్పష్టపరచబడుచున్నది. ఈ సూత్రమందు హ్రస్వగ్రహణమునకు వివక్ష లేదు. హ్రస్వమయిననూ, దీర్ఘమయిననూ, ప్లుతమయిననూ స్వరితమందలి మొదటి సగభాగము ఉదాత్తమగును. తర్వాతి సగభాగము అనుదాత్తమగును. ఆ రెండవభాగము అనుదాత్తమునకు ఉదాత్తముగాని, స్వరితముగాని పరముగా ఉన్నప్పుడు ఆ అనుదాత్త భాగము స్పష్టముగా వినబడును. ఉదాత్త స్వరితములు పరముగా లేనపుడు అనగా అనుదాత్తమే పరముగా ఉన్నప్పుడు ఆ అనుదాత్త భాగము ఉదాత్తముగా వినబడును. ఇది ఋగ్వేద ప్రాతిశాఖ్యయందు ప్రసిద్ధము.

" **క్వవో౽శ్వాః** " అను ఉదాహరణమందు " క్వ " అనుచోట అకారము హ్రస్వస్వరితమున్నది. దానికి "వో" అను ఓకారము ఉదాత్తము పరముగా ఉన్నది. కావున ఆ హ్రస్వస్వరితములో ఉన్న అనుదాత్తభాగము స్పష్టముగా వినబడును.

" **రథానాం న యే౽రాః** " అను ఉదాహరణమందు " యే " అనుచోట ఏకారము దీర్ఘస్వరితమున్నది. దానికి " రాః " అని ఆకారము ఉదాత్తము పరముగా ఉన్నది. కావున ఆ దీర్ఘస్వరితములో ఉన్న అనుదాత్తభాగము స్పష్టముగా వినబడును.

" **శతచక్రం యో౽హ్యః** " అను ఉదాహరణమందు " యో " అనుచోట ఓకారము ప్లుతస్వరితము. దానికి " హ్యః " అని అకారము స్వరితము పరముగా ఉన్నది. కావున ఆ ప్లుతస్వరితములో ఉన్న అనుదాత్త భాగము స్పష్టముగా వినబడును.

" **అగ్నిమీళే .....** " అను ఉదాహరణమందు " మీ " అనుచోట ఈ కారము దీర్ఘస్వరితము, దానికి " ళే " అను ఏ కారము అనుదాత్తము పరముగా నున్నది. కావున ఆ దీర్ఘస్వరితములో ఉన్న అనుదాత్తభాగము ఉదాత్తముగానే వినబడును.

ఈ విధముగా ఉదాహరణకు " అకారము " అను అచ్చుతీసుకున్నచో అది 3 విధములు. హ్రస్వము, దీర్ఘము, ప్లుతము అని, అందు మళ్ళీ హ్రస్వము 3 విధములు. ఉదాత్తహ్రస్వము, అనుదాత్తహ్రస్వము, మరియు స్వరితహ్రస్వము అని. దీర్ఘము 3 విధములు అవి ఉదాత్తదీర్ఘము, అనుదాత్తదీర్ఘము మరియు స్వరితదీర్ఘము అని. మరల ప్లుతము 3 విధములు అవి వరుసగా ఉదాత్తప్లుతము, అనుదాత్తప్లుతము మరియు స్వరితప్లుతము అని. ఈ విధముగా 9 విధములయిన " అకారము " అనునాసికము, అననునాసికము అను భేదముచే మొత్తం 18 విధములు. 9 అనునాసికములు, 9



అననునాసికములు అని భావము. ఇట్లే ఇకారాది అచ్చులు కూడా 18 విధములని గ్రహించవలెను.

## 10. ముఖనాసికావచనో౽నునాసికః (1-1-8)

**ముఖసహితనాసికయా ఉచ్చార్యమాణో వర్ణో౽నునాసిక సంజ్ఞః స్యాత్. తదిత్థమ్ - అ, ఇ, ఉ, ఋ, ఏషాం వర్ణానాం ప్రత్యేకమష్టాదశ భేదాః, ఌ వర్ణస్య (ఌ) ద్వాదశ. తస్య దీర్ఘాభావాత్. ఏచామపి ద్వాదశ. తేషాం హ్రస్వాభావాత్.**

**ముఖనాసికావచనో౽నునాసికః** – ముఖనాసికావచనః, అనునాసికః అని పదచ్ఛేదము. **ముఖసహితా నాసికా ముఖనాసికా, ఉచ్యతే ఇతి వచనః ముఖనాసికయా వచనః ముఖనాసికావచనః** అని విగ్రహవాక్యము. ముఖములో కూడుకొన్న ముక్కుతో ఉచ్చరించబడు వర్ణమునకు అనునాసికము అను సంజ్ఞ చెప్పబడును.

అచ్చులలో ఏయే వర్ణములు ఎన్నెన్ని విధములో చెప్పుచున్నాడు. అ, ఇ, ఉ, ఋ ఈ వర్ణములు ఒక్కొక్కటి పద్దెనిమిది విధములు. ఌ వర్ణము(ఌ) 12 విధములు, దానికి దీర్ఘము లేదు కావున దీర్ఘమునకున్న 6 విధములు ఉండవు. ఏచ్‌లు అనగా ఏ, ఓ, ఐ, ఔ లు. ఒక్కొక్కటి 12 విధములు. వాటికి హ్రస్వము లేదు. కావున హ్రస్వమున్న 6 విధములు ఉండవు.

## 11. తుల్యాస్యప్రయత్నం సవర్ణమ్ (1-1-9)

**తాల్వాదిస్థానమ్ ఆభ్యన్తరప్రయత్నశ్చ ఇత్యేతద్ద్వయం యస్య యేన తుల్యం తన్మిథః సవర్ణసంజ్ఞం స్యాత్. (1) అకుహవిసర్జనీయానాం కంఠః. (2) ఇచుయశానాం తాలు (3) ఋటురషాణాం మూర్ధా. (4) ఌ తులసానాం దన్తాః. (5) ఉపూపధ్మానీయానామోష్ఠౌ. (6) ఞమఙణనానాం నాసికా చ. (7) ఏదైతోః కంఠతాలు. (8) ఓదౌతోః కంఠోష్ఠమ్. (9) వకారస్య దంతోష్ఠమ్. (10) జిహ్వామూలీయస్య జిహ్వామూలమ్. (11) నాసికానుస్వారస్య ఇతి స్థానాని.**

**తుల్యాస్యప్రయత్నం సవర్ణమ్** – తుల్యాస్య ప్రయత్నం, సవర్ణమ్ అని పద్ధచ్ఛేదము. ఆస్యమనగా ముఖము. " ఆస్యే భవం ఆస్యం." ముఖమందు ఉండునది అనగా తాలువు మొదలగు స్థానములని అర్థము. ఆస్యంచ ప్రయత్నంచ ఆస్యప్రయత్నౌ. "తుల్యౌ ఆస్య ప్రయత్నౌ యస్య తత్. తుల్యాస్య ప్రయత్నం " అని విగ్రహవాక్యము.

ఏ వర్ణములకు తాలువులు (దవడలు) మొదలగు వర్ణోత్పత్తి స్థానములు. ప్రయత్నములు సమానముగా ఉండునో అవి పరస్పరము సవర్ణ సంజ్ఞకములగును.

యత్నమనగా ఆభ్యన్తర, బాహ్యప్రయత్నములు. ఈ విధముగా ఏయే వర్ణములు ఏయే స్థానములందు పుట్టునో, మరియు ఏయే వర్ణములకు ఏ ప్రయత్నములో తర్వాత చెప్పబడ్డాయి. అవి :

(1) అవర్ణము, కు (కవర్గ = క, ఖ, గ, ఘ, ఙ), హ, విసర్గము. వీనికి కంఠము ఉత్పత్తి స్థానము. కనుక వీనిని కంఠ్యములందురు.

(2) ఇవర్ణము, చు (చవర్గ = చ, ఛ, జ, ఝ, ఞ), య, శ అను 8 వర్ణములకు తాలువులు (దవడలు) ఉత్పత్తి స్థానము. కనుక వీనిని తాలవ్యములందురు.

(3) ఋ, టు (టవర్గము = ట, ఠ, డ, ఢ,ణ), ర, ష అను ఈ 8 వర్ణములకు మూర్ధము (శిరస్సు) ఉత్పత్తి స్థానము. కనుక వీనిని మూర్ధన్యములందురు.

(4) లు ( ఌ ), తు (తవర్గము = త, థ, ద, ధ, న), ల, స అను ఎనిమిది వర్ణములకు దన్తములు ఉత్పత్తి స్థానము. కనుక ఈ వర్ణములను దంత్యములందురు.

(5) ఉవర్ణము, పు (పవర్గము = ప, ఫ, బ, భ, మ), ప, ఫ అని ఉపధ్మానీయములు (ప, ఫ లకు ముందు అర్థ విసర్గములు) ఈ అక్షరములకు ఓష్ఠములు (పెదవులు) ఉత్పత్తి స్థానము. కనుక ఇవి ఓష్ఠ్యములందురు.

(6) ఞ, మ, ఙ, ణ, న అను ఈ ఐదు వర్ణములు (వర్గాంతములు) అను నాసికాక్షరముల ఉత్పత్తి స్థానము నాసిక (ముక్కు).

(7) ఏకారమునకు, ఐకారమునకు కంఠము మరియు తాలువులు (కంఠము మరియు దవడలు) ఉత్పత్తి స్థానములు.

(8) ఓకారమునకు, ఔకారమునకు కంఠోష్ఠము (కంఠము మరియు పెదవులు) ఉత్పత్తి స్థానము.

(9) వకారమునకు దన్తోష్ఠము (దంతములు మరియు పెదవులు) ఉత్పత్తి స్థానము.

(10)జిహ్వామూలీయమునకు ( క, ఖ అని క, ఖ లను ముందు అర్థవిసర్గలుండిన) జిహ్వ యొక్క మూలస్థానము ఉత్పత్తి స్థానము. అందుకే జిహ్వామూలీయమనే సంజ్ఞ సార్థకము.

(11)అనుస్వారమునకు నాసిక (ముక్కు) ఉత్పత్తి స్థానము. (నిండు సున్నను అనుస్వారమని అందురు. ఇది స్వరము (అచ్చు) తో కూడా ఉచ్చరింపబడుటచే అనుస్వారము అను పేరు సార్థకము.)

పైన చెప్పిన విధముగా యత్నములు ఎన్ని విధములో ఉదహరించబడుతున్నాయి. అవి :



**యత్నో ద్విధా. ఆభ్యన్తరో బాహ్యశ్చ.**
**ఆద్యశ్చతుర్ధా. స్పృష్టేషత్స్పృష్ట వివృత సంవృత భేదాత్.**
**తత్ర స్పృష్టం ప్రయత్నం స్పర్శానామ్. ఈషత్స్పృష్ట మన్తఃస్థానామ్.**
**వివృతమూష్మణామ్ స్వరాణాం చ.**
**హ్రస్వస్యావర్ణస్య ప్రయోగే సంవృతమ్.**
**ప్రక్రియాదశాయాం తు వివృతమేవ. ఏతచ్చ సూత్రకారేణ జ్ఞాపితమ్. తథాహి -**

## 12. అ అ (8-4-68)

**వివృతమనూద్య సంవృతోఽనేన విధీయతే. అస్య చాష్టాధ్యాయీం సంపూర్ణాం ప్రత్యసిద్ధత్వాత్ శాస్త్ర దృష్ట్యా వివృతత్వమస్త్యేవ.**

" **తుల్యాస్యప్రయత్నమ్** " అను సూత్రములో నిర్దిష్టమైన ప్రయత్నము వివరింపబడుచున్నది. యత్నము (ప్రయత్నము) ఆభ్యంతరము, బాహ్యము అని రెండు విధములు. వర్ణములు ఉచ్చరించేటప్పుడు చేయు చేష్టనే యత్నమందురు.

ఒక వర్ణము ముఖము (నోటి) నుండి బయటికి వచ్చుటకు ముందు (వర్ణోచ్చారణమునకు పూర్వము) ముఖము (నోరు) నుండి బయల్వెడలు సమయమున అనగా వర్ణోచ్చారణ సమయమున జరుగు యత్నము అనేదే బాహ్యము అని అనబడును.

మొదటిది ఆభ్యంతర ప్రయత్నము నాలుగు విధములు. అవి : స్పృష్టము, ఈషత్స్పృష్టము, వివృతము, సంవృతము.

→ స్పర్శాక్షరములు ( క నుండి మ వరకు గల వర్గాక్షరములు ) అను అక్షరములకు స్పృష్టము ప్రయత్నము.

→ అన్తఃస్థ వర్ణములకు ( య, వ, ర, ల అను వర్ణములకు ) ఈషత్స్పృష్టము.

→ ఊష్మ వర్ణములకు ( శ, ష, స, హ ), స్వరములకు (అచ్చులకు) వివృతము ప్రయత్నము.

→ స్వరములన్నిటికి సామాన్యముగ చెప్పబడినది. కాని హ్రస్వమగు అవర్ణమునకు ప్రయోగకాలమందు సంవృతము ప్రయత్నము. అదే అవర్ణము (హ్రస్వమైనది) ప్రక్రియాదశ యందు మాత్రము వివృతమని చెప్పబడినది. ఈ విషయం సూత్రకారునిచే గుర్తుచేయబడినది. ఆ జ్ఞాపనము (గుర్తు) " అ అ " అను

సూత్రములో వివరింపబడును.

అ అ – పాణిని మహర్షి రచించిన " అష్టాధ్యాయి " సూత్రపాఠంలో చిట్టచివరి సూత్రమిది. అ,అ అని పదచ్ఛేదము. అందులో మొదటి ' అ ' అనునది లుప్తషష్ఠీ విభక్తి అంతము వివృతపరము. అస్య = వివృత అకారమునకు అని అర్థము. రెండవ ' అ ' అనునది లుప్త ప్రథమా విభక్త్యంతము సంవృతపరము. అః = సంవృతాకారము అని అర్థము. వివృత అకారమునకు సంవృత అకారము ఆదేశముగా వచ్చునని అర్థము. సంపూర్ణ అష్టాధ్యాయిని గురించి ఈ సూత్రము " అ అ " అను అష్టాధ్యాయి చిట్టచివరి సూత్రము అసిద్ధము అగును. కావున శాస్త్రమందలి ఆయా ప్రక్రియల దృష్టిలో అకారము వివృతముగానే ఉండును. ఇక్కడ ఈ ప్రక్రియలో " అ అ " అను సూత్రము ప్రవర్తించదు. ప్రక్రియా కార్యములు అన్నీ పూర్తయిన పిమ్మట ప్రయోగకాలమందు " అ అ " అను సూత్రము ప్రవర్తించుటచే వివృత అకారమునకు సంవృత అకారము వచ్చును. అందువలన ప్రయోగకాలమందే వివృతాకారమునకు సంవృతాకారము వచ్చునని సిద్ధించినది.

తథా చ సూత్రమ్ –

### 13. పూర్వత్రాసిద్ధమ్ (8–2–1) అధికారోఽయం.

**తేన సపాదసప్తాధ్యాయీం ప్రతి త్రిపాద్యసిద్ధా. త్రిపాద్యామపి పూర్వం ప్రతి పరం శాస్త్రమసిద్ధం స్యాత్.**

**బాహ్యప్రయత్నస్తు ఏకాదశధా. వివారః, సంవారః, శ్వాసో, నాదో, ఘోషో, అఘోషో, అల్పప్రాణో, మహాప్రాణ, ఉదాత్తోఽనుదాత్తః స్వరితశ్చేతి.**

ఖయాం యమాః ఖయః క పౌ విసర్గః శర ఏవచ ।
ఏతే శ్వాసానుప్రదానా అఘోషాశ్చ వివృణ్వతే ॥
కంఠమన్యే తు ఘోషాః స్యుః సంవృతా నాదభాగినః ।
అయుగ్మా వర్గయమగా యణశ్చాల్పాసవః స్మృతాః ॥

**వర్గేష్వాద్యానాం చతుర్ణాం పంచమే పరే మధ్యే యమో నామ పూర్వసదృశో వర్ణః ప్రాతిశాఖ్యే ప్రసిద్ధః. పలిక్క్నః, చఖ్ఖ్నతుః, అగ్గ్నిః, ఘ్ఘ్నన్తీత్యత్ర క్రమేణ కఖగఘేభ్యః పరే తత్సదృశా ఏవ యమాః, జిహ్వామూలీయోపధ్మానీయౌ, విసర్గఃచ శషసాశ్చ ఇత్యేతేషాం వివారః, శ్వాసోఽఘోషశ్చ. అన్యేషాం తు సంవారో, నాదో, ఘోషశ్చ. వర్గాణాం ప్రథమ తృతీయపంచమాః, ప్రథమతృతీయయమౌ, యరలవాశ్చ**



**అల్పప్రాణాః. అన్యే మహాప్రాణా ఇత్యర్థః. బాహ్యప్రయత్నాశ్చ యద్యపి సవర్ణసంజ్ఞాయామనుపయుక్తాః, తథాపి అన్తరతమ్య పరీక్షాయామ్ ఉపయోక్ష్యన్త ఇతి బోధ్యమ్.**

**కాదయో మావసానాః స్పర్శాః. యరలవా అన్తఃస్థాః. శషసహ ఊష్మాణః. అచః స్వరాః. క వ ఇతి కపాభ్యాం ప్రాగర్ధ విసర్గసదృశౌ జిహ్వామూలీయోపధ్మానీయౌ. అంఅః ఇత్యచః పరావనుస్వారవిసర్గౌ ఇతి స్థానయత్నవివేకః. ఋ ఌ వర్ణయోర్మిథః సావర్ణ్యం వాచ్యమ్. అకారహకారయోః, ఇకారశకారయోః, ఋకారషకారయోః, ఌ కార సకారయోశ్చ మిథః సావర్ణ్యే ప్రాప్తే –**

సంపూర్ణ అష్టాధ్యాయిని గురించి " అ అ " అను సూత్రము ఎట్లు అసిద్ధమగునో చెప్పుచున్నాడు.

పూర్వత్రాసిద్ధమ్ – పూర్వత్ర, అసిద్ధమ్ అని పదచ్ఛేదము. ఈ సూత్రమునకు అధికార సూత్రమని పేరు. ఈ సూత్రము అనంతర సూత్రములో అనువర్తించి వాటితో ఏకవాక్యతను పొంది వాక్యార్థబోధను కల్గించును. అష్టాధ్యాయిలో ఎనిమిదవ అధ్యాయము రెండవ పాదము మొదటి సూత్రము " పూర్వత్రాసిద్ధమ్ " అను సూత్రము. ఈ అష్టాధ్యాయి పూర్తిగా 8 అధ్యాయాలుగా విభాగం చేయబడి ఒక్కో అధ్యాయం 4 పాదములుగా మొత్తం 32 అధ్యాయములతో కూర్చబడినది. ఈ సూత్రమునకు ముందున్న అష్టాధ్యాయి భాగమంతయు సపాద సప్తాధ్యాయి అని వ్యవహరింపబడును. అనగా ఏడు అధ్యాయములు, ఏనిమిదవ అధ్యాయములో మొదటిపాదము. ఈ సూత్రమునకు తరువాత భాగమంతయు త్రిపాది అనగా ఎనిమిదవ అధ్యాయంలో 2,3,4 పాదములు. ఈ సూత్రము అధికార సూత్రము కావున అనంతర సూత్రములో అనువర్తించును.

ఈ సూత్రము ఆధారంగా సపాద సప్తాధ్యాయిని గురించి త్రిపాది అసిద్ధము. ఈ త్రిపాదిలో కూడా పూర్వశాస్త్రమును గురించి పరశాస్త్రము అసిద్ధము. " అ అ " అను సూత్రము అష్టాధ్యాయిలో చివరి సూత్రము అనగా ఇది త్రిపాది కావున ఈ సూత్రమును ముందున్న సంపూర్ణ సపాద సప్తాధ్యాయి గురించి అసిద్ధమగును.

ప్రయత్నములు రెండు విధములైనవి ఆభ్యంతరము మరియు బాహ్యము. ఆభ్యంతరము నాలుగు విధములుగా బాహ్యము 11 విధములుగా ఉండును. అవి :

వివారము, సంవారము, శ్వాసము, నాదము, ఘోషము, అఘోషము, అల్పప్రాణము, మహాప్రాణము, ఉదాత్తము, అనుదాత్తము, స్వరితము అని.

ఏయే అక్షరములు ఏయే ప్రయత్నములో వివరింపబడుతున్నాయి. " ఖయ్ " అనగా " **ఖఫఛఠథచటతవ్** " అను మాహేశ్వర సూత్రములో ఖకారము నుంచి "కపయ్ " అను సూత్రము (మాహేశ్వర)లోని యకారము వరకు. " ఖయ్ " ప్రత్యాహారము.

ఖయ్ ప్రత్యాహారము " ఆదిరన్త్యేన " ఆధారంగా చెప్పబడినను ఖయ్ అనగా – వర్గాక్షరములలో ప్రథమ, ద్వితీయ అక్షరములు అనగా "క, ఖ, చ, ఛ, ట, ఠ, త, థ, ప, ఫ " అను అక్షరములు చెప్పబడును.

" యమ్ " అనగా వర్గాక్షరములలో మొదటి నాలుగు అక్షరములకు అయిదవ అక్షరము అనగా నాసికాక్షరములు పరముగా ఉన్నప్పుడు మధ్యలోనున్న పూర్వసదృశమగు అక్షరమును (సమానమైన అక్షరమును) " యమ్ " అని అంటారు. ఉదాహరణకు – కవర్గము తీసుకున్నచో " పలిక్క్నీః " అను పదములో కకారము, కకారము, నకారములున్నవి. ఈ మూడింటిలో నకారమునకు ముందున్న కకారము పూర్వసదృశము కావున మధ్య కకారము యమ్ అని పేరు. అదే విధంగా " చఖ్ఖ్నతుః " అనుచోట ఖకారము, ఖకారము, నకారములున్నవి. మధ్యలోనున్న ఖకారము యమ్. అలాగే " అగ్గ్నిః " అను పదములో గకారము, గకారము, నకారములలో మధ్యనున్న గకారము యమ్. అలాగే " ఘ్ఘ్నన్తి " అనుచోట మధ్యనున్న ఘకారము యమ్. ఈ విధంగా యమ్ అను అక్షరములు ప్రాతిశాఖ్యములందు ప్రసిద్ధములు.

వర్గాక్షరములలో ప్రథమ, ద్వితీయములు వాటి యొక్క యమ్‌లు (అవే అక్షరములు) జిహ్వామూలీయము, ఉపధ్మానీయము, విసర్గము, శ,ష,స ఈ అక్షరములకు వివారము, శ్వాసము, అఘోషము ప్రయత్నములు. అనగా ఖర్ ప్రత్యాహార వర్ణములను (ఖ, ఫ, ఛ, ఠ, థ, చ, ట, త, క, ప, శ, స) వివారము, శ్వాసము, అఘోషము అను మూడు ప్రయత్నములుండును. మిగిలిన అక్షరాలు సంహారము, నాదము, ఘోషము. అనగా "హశ్" ప్రత్యాహార వర్ణములు (హ, య, వ, ర, ల, ఝ, భ, ఘ, ఢ, ధ, జ, బ, గ, డ, ద) సంవారము, నాదము, ఘోషము అను మూడు ప్రయత్నములు.

వర్గాక్షరములలో బేసి వర్ణములు అనగా ప్రథమ, తృతీయ, పంచమ అక్షరములు. యమ్‌లలో బేసి వర్ణములు అనగా ప్రథమ, తృతీయ అక్షరములు, యణ్ అక్షరములు (య, ర, ల, వ ) అల్ప ప్రాణములు. అనగా క, గ, ఙ, చ, జ, ఞ, ట, డ, ణ, త, ద, న, ప, బ, మ, య, ర, ల, వ అను అక్షరములు అల్పప్రాణములు. మిగిలినవి మహాప్రాణములుగా చెప్పబడుతాయి. అనగా వర్ణములో వర్గములలో రెండవ, నాలుగవ అక్షరములు, " శల్ " ప్రత్యాహార వర్ణములు అనగా ఖ, ఘ, ఛ, ఝ, ఠ, ఢ, థ, ధ, ఫ, భ, శల్ (శ, ష, స, హ) అక్షరములు మహాప్రాణములు అను ప్రయత్నముండును.

" తుల్యాస్యప్రయత్నం సవర్ణమ్ " అను సూత్రముచేత విధించిన సవర్ణ సంజ్ఞ ఆభ్యంతర ప్రయత్నములకే వర్తించును కాని బాహ్యప్రయత్నములకు వర్తించవు.

కావున సవర్ణసంజ్ఞలో బాహ్యప్రయత్నములకు ఉపయోగము లేకపోయిననూ " స్థానేఽన్తరతమః " (పరిభాషా ప్రకరణం) అను సూత్రములో చెప్పబడు ఆన్తరతమ్య పరీక్షలో అనగా మిక్కిలి సదృశము ఏది కలదు అన్న సదృశతమపరీక్షలో బాహ్యప్రయత్నములకు ఉపయోగం లేదు.

ప్రసిద్ధమగు వర్ణమాలలో " క " మొదలుకొని " మ " వరకు ఉండే వర్ణములు స్పర్శములు (వర్గాక్షరములు అనగా క, చ, ట, త, ప అను అయిదు వర్గముల అక్షరములు). ఇవి మొత్తం ఇరువదిఐదు వర్ణములు.

య, ర, ల, వ అను నాలుగు అక్షరములు అన్తఃస్తములు. శల్ వర్ణములు అనగా శ, ష, స, హ వర్ణములు ఊష్మములనబడును.

అచ్చులు స్వరములనబడును (అచ్ = అ నుండి మొదలుకొని అనగా అఇఉణ్ నుండి ఐఔచ్ లోని చివరి చకారమువరకు గల అక్షరములే అచ్చులు. వీటినే స్వరములందురు.

క, ఖ అనుచోట క, ఖ లకు పూర్వమందు అర్ధవిసర్గము ( ) వలె కనిపించినను అది జిహ్వామూలీయము.

ప, ఫ అనుచోట ప, ఫ లకు పూర్వమందు అర్ధవిసర్గ ( ) వలె కనిపించినచో అది ఉపధ్మానీయము.

" అం " మొదలగు చోట్ల అచ్చుల తర్వాత ఉన్న దానిని అనుస్వారము అని, " అః " మొదలగు చోట్ల అచ్చుల తర్వాత ఉన్న దానిని విసర్గము అని అందురు.

ఋకారమునకు మూర్థ (శిరస్సు) స్థానము, ఌ కారమునకు దంతములు స్థానము. కావున స్థానములు వేర్వేరుగా ఉన్నందున ఋ, ఌ వర్ణములకు " తుల్యాస్య

ప్రయత్నం........ " సూత్రముచే సవర్ణ సంజ్ఞ సిద్ధించును. కావున " ఋ ఌ వర్ణయోః" అనువార్తికము ఆరంభింపబడినది. కాని ఋ ఌ వర్ణములకు పరస్పరము సవర్ణ సంజ్ఞ చెప్పవలెనని ఈ వార్తికము యొక్క ఉద్దేశ్యము.

1. అకారము, హకారములకు కంఠము స్థానము, వివృతము ప్రయత్నము.
2. ఇకారము శకారములకు తాలువు (దవడ) స్థానము, వివృతము ప్రయత్నము.
3. ఌ (లు), సకారములకు దంతములు స్థానము, వివృతము ప్రయత్నము.
4. ఋకారము, షకారములకు మూర్థ (శిరస్సు) స్థానము, వివృతము ప్రయత్నము.

కాబట్టి అకారహకరములకు, ఇకారశకారములకు, ఋకారషకారములకు, ఌ కారసకారములకు స్థాన ప్రయత్నములు సమానముగా ఉన్నందున (వివృతము ప్రయత్నము) " తుల్యాస్య ప్రయత్నం ......." అను సూత్రము చేత సవర్ణ సంజ్ఞ ప్రాప్తించుచున్నది. ఈ నియమమును వారించుటకు పాణిని మహర్షి ఈ క్రింది సూత్రమును చెప్పెను.

## 14. నాజ్ఝలౌ (1-1-1)

**ఆకారసహితోఽచ్ ఆచ్, సచ, హల్ చేత్యేతౌ మిథస్సవర్ణౌ న స్తః. తేన దధీత్యస్య హరతి, శీతలమ్, షష్ఠమ్, సాన్ద్రమిత్యేతేషు పరేషు యణాదికం న. అన్యథా దీర్ఘాదీనామివ హకారాదీనామపి గ్రహణకశాస్త్రబలాదచ్త్వం స్యాత్. తథాహి.**

నాజ్ఝలౌ – న, ఆజ్ఝలౌ అని పదచ్ఛేదము. ఆ స్సహితః అచ్, ఆచ్, " ఆచ్ చ హల్ చ ఆజ్ఝలౌ " అని విగ్రహవాక్యము. అనగా ఆకారముతో కూడిన అచ్చులు ఆచ్ అని, ఈ ఆచ్‌లతో కూడిన హల్లులు ఆజ్ఝలౌ అని. ఇవి పరస్పరము సవర్ణములు కావు. ఎందుకనగా ప్రస్తుత సూత్రము అకారముతో కూడిన అచ్చులకు మరియు హల్లులకు పరస్పరము సవర్ణసంజ్ఞ లేదు అని తెలియజెప్పును. అందువల్ల –

1. " దధి + హరతి " అను స్థలమందు అకారహకారములకు సవర్ణ సంజ్ఞ లేదు కావున అకారము చేత హకారము గ్రహింపబడదు. అందుకు హకారము అచ్చుకాదు. ఈ కారణముచే పై ఉదాహరణలో " ఇకో యణచి " అను సూత్రముచే యణాదేశము ప్రవర్తించదు.

2. అలాగే ఇకార శకారములకు సవర్ణ సంజ్ఞ లేనందున ఇకారముచేత శకారము గ్రహింపబడదు. అందువల్ల శకారము అచ్చు గాదు. ఈ కారణంచే " దధి+శీతలం " అను ఉదాహరణలో " అకః సవర్ణే దీర్ఘః " అను సూత్రముచే సవర్ణదీర్ఘము ప్రవర్తించదు.



3. అట్లే ఋకార షకారములకు సవర్ణ సంజ్ఞ లేనందున ఋకారముచేత షకారము గ్రహింపబడదు. అందుచే షకారము అచ్చుకాదు ఈ కారణముచే " దధి + షష్ఠం " అను ఉదాహరణమున " ఇకోయణచి " సూత్రముచే యణాదేశము రాదు.

4. ఌ కార సకారములకు కూడా సవర్ణ సంజ్ఞ లేదు. కావున ఌ కారముచే సకారము గ్రహించబడదు. ఈ కారణంగా దధి + సాన్ద్రం అను ఉదాహరణలో యణాదేశం వర్తించదు.

పైన ఉదాహరించిన సంధి ప్రక్రియలయందు చెప్పినట్లుగా ప్రస్తుత సూత్రము "నాజ్ఝలౌ" అనునది సవర్ణసంజ్ఞా నిషేధక సూత్రము. ఈ సూత్రము లేనట్లయితే "అకారాదులచేత ఆకారాది దీర్ఘము మొదలగునవి గ్రహింపబడునట్లుగా హకారాదులు కూడా " అణుదిత్ సవర్ణస్య చాప్రత్యయః " అను సూత్రాదులచే గ్రహించినచో అచ్చులు కావలసివచ్చును. కాని పై నాలుగు ఉదాహరణలలో ప్రస్తుత సూత్రముచే అచ్చులుగా గ్రహించకుండా చేసెను. అయినను సూత్రకారుడు స్వ సవర్ణములను గ్రహించుటకు గ్రహణకశాస్త్రమును వివరిస్తున్నాడు.

## 15. అణుదిత్సవర్ణస్య చాప్రత్యయః (1-1-6)

**ప్రతీయతే విధీయతే ఇతి ప్రత్యయః. అవిధీయమానోఽణ్ ఉదిచ్చ సవర్ణస్య సంజ్ఞా స్యాత్. అత్రాణ్పరేణ ణకారేణ. కు చు టు తు పు ఏతే ఉదితః. తదేవం–అ ఇత్యష్టాదశానాం సంజ్ఞా. తథేకారోకారౌ. ఋకారస్త్రింశతః. ఏవం ఌ కారోపి. ఏచో ద్వాదశానామ్. ఎదైతోరోదౌతోశ్చ న మిథః సావర్ణ్యమ్, " ఐఔచ్ " ఇతి సూత్రారమ్భసామర్థ్యాత్. తేనైచశ్చతుర్వింశతేః సంజ్ఞాః స్యురితి నాపాదనీయమ్. "నాజ్ఝలౌ " ఇతి సావర్ణ్య నిషేధో యద్యప్యాక్షరసమామ్నాయికానామేవ, తథాపి హకరస్యా ఽఽకారో న సవర్ణః, తత్రాప్యాకారస్య ప్రశ్లిష్టత్వాత్. తేన " విశ్వపాభిః " ఇత్యత్ర " హెరా ఢః " ఇతి ఢత్వం న భవతి. అనునాసికానునాసిక భేదేన యవలా ద్విధా. తేనాననునాసికాస్తే ద్వయోర్ద్వయోస్సంజ్ఞా.**

**అణుదిత్సవర్ణస్య చాప్రత్యయః** – అణుదిత్. సవర్ణస్య, చ, అప్రత్యయః అని పదచ్ఛేదము. ప్రత్యయమనగా విధింపబడునది. అప్రత్యయము అనగా విధింపబడనిది. విధింపబడని అణ్ ప్రత్యాహార వర్ణములు, ఉదిత్తులును సవర్ణములకు అనగా సమానవర్ణములకు సంజ్ఞలగును. ఈ ఒక్కచోట అణ్ ప్రత్యాహారము అనగా " అఇఉ ణ్.....లణ్ " వరకు గల వర్ణములు (అ,ఇ, ఉ, ఋ, ఌ , ఏ, ఓ, ఐ, ఔ, హ, య, వ,

ర, ల), ఉదిత్తులనగా హ్రస్వ ఉకారము ఇత్సంజ్ఞ కలవి. అవి – కు, చు, టు, తు, పు లు గా చెప్పబడ్డాయి.

మాహేశ్వర సూత్రములో " అఇఉణ్ " అను సూత్రం ఆధారంగా " అణ్ " ప్రత్యాహరము విధించుచున్ననూ, " అత్రైవాణ్ పరేణ ణకారేణ ....... " అను నియమముచే ఇక్కడ మాత్రము పరముగా ఉన్న " లణ్ " సూత్రంలోని ణకారము వఱకు గ్రహించవలెనని ఈ ప్రత్యాహరము యొక్క నియమము.

అట్లే " కు " అను ఉదిత్తును గ్రహించినపుడు తత్సమ వర్ణములు ఖ, గ, ఘ, ఙ అను వర్ణములును గ్రహింపబడును. అనగా అణ్ ప్రత్యాహారము (అచ్చులు మరియు హ, య, వ, ర) లు మరియు ఉదిత్తులు (కు, చు, టు, తు, పు) విధింపబడకపోయిన యెడల వాని సవర్ణములు కూడా గ్రహింపబడును. అందుచే ఈ సూత్రమును గ్రహణకశాస్త్రము అని అందురు.

అణ్ ప్రత్యాహార వర్ణములచే వాని సవర్ణములన్నియు గ్రహింపబడునని చెప్పుటచే ఆయా వర్ణములకు సవర్ణాక్షరములు క్రింది విధముగా వివరింపబడుతున్నాయి. అవి– " అ " అనగా 18 సవర్ణములకు సంజ్ఞ అనగా హ్రస్వ, దీర్ఘ, ప్లుతము, ఉదాత్తము, అనుదాత్తము, స్వరితములు అనునాసిక మరియు అనునాసికములు మొత్తం కలిసి 18 వర్ణములు " అ " కు సవర్ణములు. అట్లే ఇకారము పద్దెనిమిది (18), ఉకారము 18 అక్షరములకు సంజ్ఞ, ఋకారము 30 స్వసవర్ణములకు సంజ్ఞ. అనగా అ, ఇ, ఉ, అను మూడు అచ్చులు ఒక్కొక్కటి 18 భేదాలు. ఋకారము, ఌ కారములలో ప్రతి వర్ణమునకు ముప్పది (30) భేదములు. ఎట్లనగా పూర్వము 18 భేదములుగా చెప్పబడినను " ఋ ఌ వర్ణయోర్మిథః సావర్ణ్యం వాచ్యమ్ " అను వార్తికముచే ఋ, ఌ వర్ణములు కనుక ఋవర్ణము గ్రహించినను పద్దెనిమిది భేదములతో పాటు ఌ కారము యొక్క పంద్రెండు (12) భేదములను కలిపి మొత్తం 30 భేదములకు సవర్ణ సంజ్ఞ.

ఏచ్ లనగా ఏ, ఓ, ఐ, ఔ లు ఒక్కొక్కటి 12 విధములు. ఏకార, ఐకారములు, ఒకార, ఔకారములకు పరస్పరము సవర్ణ సంజ్ఞ లేదు. అట్లయినచో ఏకారముచేత ఐకారము, ఓకారముచేత ఔకారము గ్రహింపబడుటచే " ఐఔచ్ " అను సూత్రము వ్యర్థము కావలసియుండును. కావున " ఐఔచ్ " అను సూత్రారంభ సామర్థ్యము వలన ఏకార ఐకారములకు, ఓకార ఔకారములకు సావర్ణ్యము లేదని సిద్ధించినది. అందువలన ఏచ్ (ఏ, ఓ, ఐ, ఔ) లు. ఒక్కొక్కటి 24 అక్షరములకు సంజ్ఞ అగునని ఆపాదించరాదు. 12 అక్షరములకు మాత్రమే సంజ్ఞ అగును.



" నాజ్ఝలౌ " అను సూత్రముచేత విధింపబడు సవర్ణ సంజ్ఞా నిషేధము అక్షర సమామ్నాయములో (" అఇఉణ్....." ఇత్యాది 14 మాహేశ్వర సూత్రములు) నిర్దేశించబడిన అ, ఇ, ఉ మొదలగు అక్షరములకు మాత్రమే. ఎందుచేత అనగా ఈ సూత్రారంభమునకు పూర్వం " అణుదిత్ ...... " మొదలుగాగల గ్రహణశాస్త్రము ఏర్పడలేదు. అయిననూ హకారమునకు ఆకారము స్థానప్రయత్నములు ఒక్కటయిననూ సవర్ణము కాదు. "నాజ్ఝలౌ" అను సూత్రములో ఆకారము కూడా ప్రశ్లిష్టమైనది. అందువలననే న, ఆజ్ఝలౌ అని పదవిభాగము. ఈ విధముగా చెప్పుటవలన హకారమునకు ఢకారమును ఆదేశముగా విధించు " హోఢః " అను సూత్రం " విశ్వపాభిః " అను స్థలమందు ఆకారమునకు ప్రవర్తించదు.

య, వ, ల అను మూడు వర్ణములు అనునాసికములు, అననునాసికములు అను రెండు విధములు. అనునాసికములు కాని యవలలు ఉచ్చరించునపుడు అనునాసికములగు యవలలు కూడా గ్రహింపబడును. అందువలన అననునాసికములగు అక్షరములు ఒక్కొక్కటి రెండేసి వర్ణములకు సంజ్ఞ యగును.

## 16. తపరస్తత్కాలస్య (1–1–70)

**తః పరో యస్మాత్స చ తాత్పరశ్చోచ్చార్యమాణః సమకాలస్యైవ సంజ్ఞా స్యాత్. తేన ' అత్ ', ' ఇత్ ', ' ఉత్ ' ఇత్యాదయః షణ్ణాం సంజ్ఞా. ఋత్ ఇతి ద్వాదశానామ్.**

**తపరస్తత్కాలస్య** – తపరః, తత్కాలస్య అని పదచ్ఛేదము. " తపరః " అను పదమును ఆవృత్తి చేయవలెను. మొదటిగా " తః పరః యస్మాత్ సః – తపరః అని బహువ్రీహి. రెండవ తపరశబ్దము " తాత్ పరః – తత్పరః " అని పఞ్చమీ తత్పురుష సమాసము. ఇచ్చట " అణుదిత్ ..... అను సూత్రము ద్వారా " అణ్ " పదము అనువర్తించును. "తస్య కాల ఇవ కాలః యస్య సః తత్కాలః, తస్య తత్కాలస్య " అని విగ్రహవాక్యము.

తకారము ఏ అక్షరము కంటే పరముగా ఉండునో ఆ అక్షరము, ఉచ్చరింపబడు వర్ణము యొక్క సమకాలములకు మాత్రమే సంజ్ఞ యగును. " అత్ " అనుచోట తకారము " అ " అను హ్రస్వాక్షరము కంటే పరముగా ఉచ్చరింపబడుచున్నది. కావున " అ " అను అక్షరము 6 విధములగు హ్రస్వములకు మాత్రమే సంజ్ఞ యగును. 18 వర్ణములకు కాదు. అట్లే ఇత్, ఉత్ కూడా 6 హ్రస్వములకు మాత్రమే సంజ్ఞ. అనగా అకారము అని కాకుండా " అచ్ " అని ఉచ్చరించిన 6 విధములుగానే అలాగే ఇత్, ఉ

త్లుగా చెప్పినను " ఋత్ " అయినచో 12 విధములుగా అనగా 6 హ్రస్వ ఋకారములు, 6 హ్రాన్వ ౡ కారములు మొత్తం 12 విధములుగా చెప్పబడును.

## 17. వృద్ధిరాదైచ్ (1-1-1)

**ఆదైచ్చ వృద్ధిసంజ్ఞః స్యాత్.**

**వృద్ధిరాదైచ్ – వృద్ధిః, ఆదైచ్** అని పదచ్ఛేదము. " ఆచ్చ ఐచ్చ అనయోః సమాహారః ఆదైచ్ అని విగ్రహవాక్యము. సమాహారద్వంద్వ సమాసము. ఆత్ అనగా దీర్ఘ ఆకారము అని అర్థము. ఐచ్ ప్రత్యాహారము అనగా ఐకార, ఔకారములు గ్రహించబడును. అనగా ఈ సూత్రము ప్రకారం ఆకారము మరియు ఐకారము, ఔకారములు వృద్ధిసంజ్ఞలు కలవి అగును అని అర్థము. ఈ సూత్రము పాణిని మహర్షి రచించిన మొట్టమొదటి సూత్రము. ఈ సూత్రములో మొదట వృద్ధి గ్రహింపబడింది. " వృద్ధి " అనగా మంగళసూచకమని కూడా మహాభాష్యకారుడు పతంజలి వాఖ్యానించెను. ఇక్కడ ఆకారము, ఐ, ఔ లు వృద్ధి సంజ్ఞ కలవి అని తెలిసికోవలసినది.

## 18. అదేజ్గుణః (1-1-2)

**అదేజ్ చ గుణసంజ్ఞః స్యాత్.**

అదేజ్, గుణః అని పదచ్ఛేదము. అత్ అనగా హ్రస్వ అకారము ఏజ్ ప్రత్యాహారముచేత ఏకారము, ఓకారము గ్రహింపబడును. అకారము, ఏకారము, ఓకారములు గుణసంజ్ఞ కలవి అని సూత్రార్థము. ఇది అష్టాధ్యాయిలో రెండవ సూత్రము.

## 19. భూవాదయో ధాతవః (1-3-1)

**క్రియావాచినో భ్వాదయో ధాతుసంజ్ఞాః స్యుః.**

భూవాదయః, ధాతవః అని పదచ్ఛేదము. భూశ్చ వాశ్చ భూవౌ, ఆదిశ్చ ఆదిశ్చ ఆదీ, భువౌ ఆదీ యేషాం తే భూవాదయః అని విగ్రహవాక్యము. " ఆది " శబ్దము ప్రభృత్యర్థకము అనగా మొదలగునవి అను అర్థం. మరొక ఆది శబ్దము ప్రకారార్థకము అనగా సదృశములైన అని అర్థం.

" భూ " మొదలుగాగల " వా " సదృశములైన అని అర్థము. క్రియావాచకత్వముతో సాదృశ్యమును తీసుకొనవలెను. కావున క్రియావాచకములగు భూ ఇత్యాదులు ధాతుసంజ్ఞ కలవి అగునని సూత్రార్థము.



## 20. ప్రాగ్రీశ్వరాన్నిపాతాః (1-4-56)

**ఇత్యధికృత్య.**

ప్రాక్, రీశ్వరాత్, నిపాతాః అని పదచ్ఛేదము. రీశ్వర శబ్దముచేత " అధిరీశ్వరే " అను సూత్రమందలి " రీశ్వర" శబ్దమును గ్రహించవలెను. "అధిరీశ్వరే " అను సూత్రమందలి రీశ్వర శబ్దము వరకు ఉన్నవి నిపాత సంజ్ఞ కలవి అగునని సూత్రార్థము. ఇది అధికారసూత్రము. అనంతర సూత్రములలో ఈ సూత్రము అనువర్తించి వాక్యార్థబోధను కలుగజేయును.

## 21. చాదయోఽసత్త్వే (1-4-57)

**అద్రవ్యార్థాః చాదయః నిపాత సంజ్ఞాః స్యుః**

చాదయః, అసత్త్వే అని పదచ్ఛేదము. చాదయః అనునది బహువ్రీహిసమాసము. చః ఆదిః యేషాం తే చాదయః అని విగ్రహవాక్యము. న సత్త్వం. అసత్త్వం. తస్మిన్ అసత్త్వే అని నఞ్ తత్పురుష సమాసము. సత్త్వ శబ్దము ద్రవ్యవాచకము. " నిపాతాః " అని అధికార సూత్రము అనువర్తించినది. అద్రవ్యార్థకములైన " చ " మొదలగునవన్ని నిపాత సంజ్ఞ కలవి అగునని ఈ సూత్రార్థము.

## 22. ప్రాదయః (1-4-58)

**అద్రవ్యార్థాః ప్రాదయః తథా.**

ప్రః ఆదిః యేషాం తే – ప్రాదయః అని విగ్రహవాక్యము. "చాదయోఽసత్త్వే " అను సూత్రము నుండి అసత్త్వే అను పదముతో పాటు " నిపాతాః " అని అధికారసూత్రము కూడ ఇక్కడ అనువర్తించును. అద్రవ్యార్థకములగు " ప్ర " మొదలగునవి నిపాత సంజ్ఞ కలవి అగునని ఈ సూత్రార్థము.

## 23. ఉపసర్గాః క్రియాయోగే (1-4-59)

## 24. గతిశ్చ (1-4-60)

**ప్రాదయః క్రియాయోగే ఉపసర్గసంజ్ఞా గతిసంజ్ఞాశ్చ స్యుః**, ప్ర, పరా, అప, సమ, అను, అవ, నిస్, నిర్, దుస్, దుర్, వి, ఆఙ్, ని, అధి, అపి, అతి, సు, ఉత్, అభి, ప్రతి, పరి, ఉప ఏతే ప్రాదయః.

ఉపసర్గాః క్రియాయోగే, గతిశ్చ అను రెండు సూత్రములకు వ్యాఖ్యానము క్రింది

విధంగా చెప్పబడుచున్నది.

“ ప్రాదయః ” అను సూత్రము ఇక్కడ అనువర్తించును. “ క్రియాయోగము ” అనగా క్రియతో అన్వయం అని అర్థము. ప్ర, పరా, అప, సమ, అను, అవ, నిస్, నిర్, దుస్, దుర్, వి, ఆజ్, ని, అధి, అపి, అతి, సు, ఉత్, అభి, ప్రతి, పరి, ఉప. ఈ ఇరవైరెండు ఉపసర్గలు క్రియతో అన్వయించబడతాయి. ఉదా : స్వాగతము అనుపదము “ సు + ఆగతము ” అని ఇచ్చుట “ ఆగత ” అను క్రియతో “ సు ” అన్వయించబడటంతో గతి సంజ్ఞను పొందును.

## 25. న వేతి విభాషా (1-1-44)

**నిషేధ వికల్పయోః విభాషా సంజ్ఞా స్యాత్.**

న, వా, ఇతి, విభాషా అని పదచ్ఛేదము. న అను పదము నిషేధార్థమును వా అను పదము వికల్పార్థమును బోధించును. ఈ సూత్రానుసారం నిషేధము మరియు వికల్పములకు రెండింటికి “ విభాషా ” అను సంజ్ఞ ప్రవర్తిస్తుంది. విభాషా అనగా ఒకచోట కార్యము ప్రవర్తించుట, మరొక చోట ప్రవర్తించక పోవడమే అని అర్థము.

## 26. స్వం రూపం శబ్దస్యాశబ్దసంజ్ఞా (1-1-68)

**శబ్దస్య స్వం రూపం సంజ్ఞి, శబ్ద శాస్త్రే యా సంజ్ఞా తాం వినా.**

స్వం, రూపం, శబ్దస్య, అశబ్దసంజ్ఞా అని పదచ్ఛేదము. శబ్దశాస్త్రమందు అనగా వ్యాకరణ శాస్త్రమందు వృద్ధ్యాది సంజ్ఞల విషయంలో తప్ప మిగిలిన స్థలములందు శబ్దమునకు స్వస్వరూపము సంజ్ఞి అగును. శబ్దము ఆ స్వస్వరూపమునకు మాత్రమే సంజ్ఞ అగును.

ఉదాహరణకు “ అగ్నేర్ఢక్ ” అను సూత్రముచేత “ అగ్ని ” శబ్దమునకు “ఢక్” అను ప్రత్యయము విధింపడి “ ఆగ్నేయః ” అనురూపము సిద్ధించినను, అగ్నివాచకమునకు సమానార్థకము అయిన “ వహ్ని ” శబ్దమునకు “ ఢక్ ” ప్రత్యయం విధించబడదు. ఎందుకనగా ప్రకృత సూత్రము చేత శబ్దమునకు తన యొక్క రూపము సంజ్ఞిగా చెప్పబడుచున్నది. కావున “ అగ్ని ” శబ్దమునకు మాత్రమే ఆనుపూర్వి సంజ్ఞి కాని “వహ్ని” శబ్దమునకు కాదు.

శబ్దశాస్త్రమందలి వృద్ధి, గుణము మొదలగు సంజ్ఞల విషయంలో మాత్రము ఈ



సూత్రము ప్రవర్తించదు. వృద్ధ్యాది విధులయందు వృద్ధిపదముచేత స్వస్వరూపము మాత్రమే గ్రహించబడదు. ఆకార ఐకారములు గ్రహింపబడును.

## 27. యేన విధిస్తదన్తస్య (1-1-27)

**విశేషణం తదన్తస్య సంజ్ఞా స్యాత్ స్వస్యచ రూపస్య. (వా) “ సమాసప్రత్యయవిధౌ ప్రతిషేధః ” (వా) ఉగిద్వర్ణ గ్రహణవర్జమ్.**

**యేన, విధిః, తదన్తస్య** అని పదచ్ఛేదము. “ స్వం రూపం ....... ” అను సంజ్ఞా సూత్రమునుండి స్వం అను పదము అనువర్తించును. అది స్వస్య అని షష్ఠ్యంతముగా విపరిణామము చెందును. (స్వస్య షష్ఠీ విభక్త్యంతముగా). “ యేన ” అని తృతీయా విభక్త్యంతము కరణార్థముతో విశేషణము గ్రహించవలెను. “ విధీయతే ఇతి విధిః ” అను వ్యుత్పత్తి . విధిః అనగా విధింపబడునది అని అర్థము.

ఏ విశేషణముచేత ఆయా కార్యములు విధింపబడునో ఆ విశేషణము తదన్తమునకు, తన యొక్క రూపమునకు సంజ్ఞ అగును. ఉదాహరణకు ‘ ఏరచ్ ’ అను సూత్రముచే ‘ అచ్ ’ అను ప్రత్యయము విధింపబడుచున్నది. ఏః అనునది ధాతోః అనుదానికి విశేషణము. కనుక ఇకారాంత ధాతువునకు “ అచ్ ” ప్రత్యయము వచ్చునని సూత్రార్థము ఫలించును.

సమాస విధి, ప్రత్యయవిధి ఈ రెండింటిలో తదన్త విధికి ప్రతిషేధము (నిషేధము) చెప్పవలెను. “ ద్వితీయా శ్రితాతీత............ ” మొదలగు ద్వితీయా తత్పురుష సమాస విధాయక సూత్రములోనున్న శ్రితాది శబ్దములచే శ్రితాది శబ్దములనే గ్రహించవలెను గాని పరమశ్రితము మొదలగు శ్రితాన్తాది శబ్దములు గ్రహించరాదు. అట్లే “ నడాదిభ్యః ఫక్ ” అను సూత్రముచే నడాది శబ్దములకు ఫక్ ప్రత్యయము వర్తిస్తుంది. కాని నడాన్తాది శబ్దములకు కాదని అర్థము.

అయితే ఈ తదన్త విధి ప్రతిషేదము ఉగిత్తును గ్రహించు శాస్త్రమందు, వర్ణమును గ్రహించు శాస్త్రమందు ప్రవర్తించదు. అందువలన “ ఉగితశ్చ ” అను స్త్రీప్రత్యయ సూత్రమందు “ఙీప్ ” ప్రత్యయము విధాయకమగు శాస్త్రమందు ఉగిద్గ్రహణము ఉ ండుటచే తదన్త విధి ప్రవర్తించును. అట్లే వర్ణగ్రహణము గల “ అత ఇఞ్ ” అను ఇఞ్ ప్రత్యయము ఈ విధాయకశాస్త్రములో కూడా తదన్తవిధి ప్రవర్తించును.

## 28. విరామోఽవసానమ్ (1-4-110)

**వర్ణానామభావః అవసానసంజ్ఞః స్యాత్.**

వర్ణములయొక్క అభావము అవసాన సంజ్ఞ కలది యగును. ఏ వర్ణమును ఉచ్చరించిన పిమ్మట వేరే మరొక వర్ణముల ఉచ్చారణము ఉండదో ఆ వర్ణము అవసాన సంజ్ఞ కలది యగునని భావము. ఉదాహరణకు " రామాన్ " అన పదములో " న్ " కు అవసాన సంజ్ఞ ఎందుకనగా " న్ " వర్ణము తర్వాత మరే వర్ణము ఉచ్చరించబడలేదు.

## 29. పరః సన్నికర్షః సంహితా (1-4-109)

**వర్ణానామతిశయితః సన్నిధిః సంహితాసంజ్ఞః స్యాత్.**

**పరః, సన్నికర్షః, సంహితా** అని పదచ్ఛేదము. పరః అనగా అతిశయితమైన అని అర్థము. సన్నికర్షః అనగా సామీప్యము అని అర్థము. వర్ణముల యొక్క మిక్కిలి సాన్నిధ్యము సంహిత యనబడును. ఒక వర్ణమునకు దాని తరువాతి వర్ణమునకును మధ్యలో అర్ధమాత్రా కాలము కూడా వ్యవధానము లేకుండా దగ్గరగా ఉండుటయే సంహితయనబడును. " దధి " అను పదము ఉచ్చరించిన రెండు నిమిషాలకు " ఓదనమ్ " అని ఉచ్చరించిన ఈ రెండింటికి ఎక్కువ వ్యవధానము ఉండుటచే సంహిత లేదు." దధి + ఓదనమ్ " అని వెంటనే చెప్పినట్లయితే సంధి జరుగును.

## 30. సుప్తిఙన్తం పదం (1-4-14)

**సుబన్తం తిఙన్తం చ పదసంజ్ఞం స్యాత్.**

సుప్తిఙన్తం, పదమ్ అని పదచ్ఛేదము. సుప్ అనగా శబ్దనిష్పాదనకు విధించు విభక్తి ప్రత్యయము. తిఙ్ అనగా క్రియాస్వరూప ధాతు ప్రక్రియలో ప్రథమాది పురుషలలో వచ్చు ప్రత్యయములు. అనగా సుప్ = సు, ఔ, జస్ ఇత్యాదులు. తిఙ్ = తిప్, తస్, ఝి మొదలగునవి. ఇట్టి సుప్ ప్రత్యయము తిఙ్ ప్రత్యయములును అంతమందు కల (చివరగా గల) శబ్ద స్వరూపము పదసంజ్ఞ కలదియగును. వీటినే పదములని చెప్పవచ్చును. ఉదాహరణకు రామః, భవతి ఇత్యాదులు.

## 31. హలోఽనన్తరాః సంయోగః (1-1-7)

**అజ్భిరవ్యవహితా హలః సంయోగ సంజ్ఞాః స్యుః.**

హలః అనన్తరాః, సంయోగః అని పదచ్ఛేదము. " అవిద్యమానం అన్తరం యేషాం తే అనన్తరాః " అని బహువ్రీహి. అన్తరమనగా వ్యవధానము. అనన్తరాః అనగా వ్యవధానము లేనివి అని అర్థము. అచ్చులతో వ్యవధానము లేని హల్లులు సంయోగ



సంజ్ఞకములు అగును. అనగా హల్లుల మధ్యలో అచ్చులేనిచో ఆ హల్లులకు సంయోగమని పేరు. " క్ష " అను వర్ణమును పరిశీలించిన ఇది వర్ణ సమూహం అనగా " క్ + ష్ + అ " అను మూడు వర్ణములతో కలిసినది. ఇక్కడ క + ష అను రెండు హల్లుల మధ్య అచ్చు లేకుండుటచే ఈ రెండు (క్, ష్) కలిసి సంయోగమగును. రెండింటికన్నా ఎక్కువ హల్లులు ఉండి మధ్యలో అచ్చులు లేనిచో ఆ హల్లులు కూడా సంయోగమగును.

## 32. హ్రస్వం లఘు (1-4-10)

హ్రస్వం, లఘు అని పదచ్ఛేదము. హ్రస్వమైన అచ్చునకు లఘు సంజ్ఞ అని పేరు. ఉదాహరణకు హరి శబ్దమందు అకారము, ఇకారము లఘు సంజ్ఞ కలవియగును.

## 33. సంయోగే గురు (1-4-11)

**సంయోగే పరే హ్రస్వం గురుసంజ్ఞం స్యాత్.**

సంయోగే, గురు అని పదచ్ఛేదము. పూర్వ సూత్రము " హ్రస్వం లఘు " అను సూత్రము నుండి " హ్రస్వము " అను పదము అనువర్తించును. " సంయోగము " పరముగా ఉన్నప్పుడు హ్రస్వము గురుసంజ్ఞకము అగును. పై సూత్రము హ్రస్వము లఘువని చెప్పబడింది. అట్టి హ్రస్వమే సంయోగము పరమగునపుడు గురువు అగును. ఉదాహరణకు " అక్ష " అను శబ్దములో "అకారము" అను హ్రస్వము (క్ష్ + అ ) " క్ష " అను సంయోగము పరముగా ఉండుటచే గురువు అగును.

## 34. దీర్ఘం చ (1-4-12)

**దీర్ఘం చ గురు సంజ్ఞం స్యాత్.**

దీర్ఘం, చ అని పదచ్ఛేదము. "సంయోగే గురు" అను సూత్రము నుండి గురు అను పదము అనువర్తించును. దీర్ఘము కూడా గురుసంజ్ఞకమగును. ఆ, ఈ, ఊ మొదలగు దీర్ఘములగు అచ్చులు గురువులు అగునని భావము. ఉదా " రామ " శబ్దమందు (ర్ ÷ ఆ) ఆకారము గురుసంజ్ఞ కలది అగును.

**ఇతి సంజ్ఞా ప్రకరణమ్**

**సంజ్ఞా ప్రకరణము సమాప్తము.**

" ఉప పరార్థే హరేః గుణాః " అనునది మొదటి ఉదాహరణము. ' పరార్థము' అనగా దేనికంటే ఇంక వేరే సంఖ్య ఉండదో అది అని అర్థము. పరార్థము కంటే హరిగుణములు అధికము అని అర్థము. పరార్థ శబ్దమునకు సప్తమీ వచ్చినది.

అవధిత్వము సప్తమ్యర్థము. " ఉపోఽధికే చ " అను సూత్రముచే " ఉప " శబ్దమునకు కర్మప్రవచనీయ సంజ్ఞ కలదు. " అధి భువి రామః, అది రామే భూః " అనునది రెండవ ఉదాహరణము. " యస్య చ ఈశ్వర వచనం " అనుదానికి రెండు విధముల అర్థము చెప్పవచ్చును.

1. యత్సంబంధి ఈశ్వరుడు చెప్పబడుచున్నాడో ఆ శబ్దమునకు సప్తమీ వచ్చునని అర్థము. భూసంబంధి ఈశ్వరుడు రాముడు కావున ' స్వ ' వాచకము భూ శబ్దమునకు సప్తమీ వచ్చి " భువి " అను రూపమేర్పడినది.

2. యన్నిష్ఠమైన ఐశ్వర్యమును చెప్పెదమో ఆ శబ్దమునకు సప్తమీ వచ్చును అని మరొక అర్థము. రామ నిష్ఠమైన ఈశ్వరత్వమును చెప్పుచున్నాము. కావున 'స్వామి' వాచక ' రామ ' శబ్దమునకు సప్తమీ వచ్చినది.

" అధిరీశ్వరే " అను సూత్రముచే ' అధి ' అను శబ్దమునకు కర్మ ప్రవచనీయ సంజ్ఞ కలదు. ' రామే ' అను సప్తమ్యంతమునకు అధి శబ్దముతో " సప్తమీ శౌణ్డైః " అను సూత్రముచేత సప్తమీ తత్పురుష సమాసము విధింపగా ' రామాధి ' అని కాగా, "అషడక్ష" ఇత్యాది సూత్రముచే రామాధి శబ్దముపై ' ఖ ' ప్రత్యయము, ఈనాదేశము చేయగా ' రామాధీనా ' అని అగును..

### 115. విభాషా కృఞి (1-4-98)

**అధిః కరోతౌ ప్రాక్సంజ్ఞో వా స్యాదీశ్వరేఽర్థే. యదత్ర మామధికరిష్యతి. వినియోక్ష్యత ఇత్యర్థః. ఇహ వినియోక్తురీశ్వరత్వం గమ్యతే. అగతిత్వాత్ "తిఙి చోదాత్తవతి" ఇతి నిఘాతో న.**

**విభాషా కృఞి :** విభాషా, కృఞి అని పదచ్ఛేదము. " అధిరీశ్వరే " అను సూత్రము, "కర్మప్రవచనీయాః" అను అధికార సూత్రము అనువర్తించినవి. ' కృఞ్ ' ధాతువు పరముగా ఉన్నచో ' అధి ' అనుదానికి వికల్పముగా కర్మప్రవచనీయ సంజ్ఞ వచ్చును. " యదత్ర మామ్ అధికరిష్యతి " అను ఉదాహరమున అధికరిష్యతి అనగా వినియోక్ష్యతే





(వినియోగించునో) అని అర్థము. ఎవరైతే ఈ పనియందు నన్ను వినియోగించెదరో ఆజ్ఞాపించెదరో అని అర్థము. ఇక్కడ వినియోగించువారికి ఈశ్వరత్వము తెలియబడుచున్నది. ఇచ్చట ' అధి ' శబ్దమునకు కర్మ ప్రవచనీయ సంజ్ఞచే గతిసంజ్ఞ బాధింపబడుట వలన దానికి " తిఙి చోదాత్తవతి " అను సూత్రముచే నిఘాత స్వరము ప్రవర్తించదు.

ఇతి సప్తమీ విభక్తిః,
ఇతి కారక ప్రకరణమ్.

## అవ్యయీభావసమాస ప్రకరణమ్

పూర్వపదము యొక్క అర్థము ప్రధానముగా గలది అవ్యయీభావ సమాసము. ఈ సమాసమున ఇతర సమాసములవలె విశేష్య నిఘ్న విభక్తి ప్రత్యయములనన్నింటిని తీసుకోకుండా కేవలం అవ్యయము మాత్రమే తీసుకొనబడును కావున దీనికి అవ్యయీభావ సమాసము అనుపేరు పెట్టబడినది. పూర్వపదమైన అవ్యయముచే విశిష్టమైన అర్థము భోదింపబడును కావున " పూర్వపదార్థ ప్రధానః అవ్యయీభావః " అని ఈ సమాసమునకు లక్షణము.
ఉదా – అధిహరి ఈ సమాసపదంలో ' అధి ' అను సప్తమీ విభక్త్యర్థము అవ్యయముచే చెప్పబడుచున్నది. అందువలన ' అధిహరి ' తరువాత సప్తమీ విభక్తి ప్రత్యయము చేర్చవలసిన అవసరంలేదు. అవ్యయీభావ సమాసమును నపుంసకలింగముగా పరిగణింపవలెను. విభక్తి రహిత భాషా పరిణామమునకు ఈ అవ్యయీభావసమాసము ఒక ఉదాహరణగా చెప్పవచ్చును.

### 116. సమర్థః పదవిధిః (2-1-1)

**పదసమ్బన్ధీ యో విధిః స సమర్థాశ్రితో బోధ్యః.**

పదములకు సంబంధించిన విధి సమర్థములైన పదములను ఆశ్రయించి ఉండునని తెలుసుకోవలసినది.

ఒక సుబన్తము మఱొక సుబన్తముతో కలిసినచో అది సమాసమగును. సుబన్తము పదము కావున సమాసాది విధులు (కార్యములు) పదములకు సంబంధించినవి. ఇట్లు

పదములకు సంబంధించిన సమాసాది విధులు సామర్థ్యముగల పదముల విషయమునందు మాత్రమే ప్రవర్తించును.

సామర్థ్యము వ్యపేక్షారూపము మఱియు ఏకార్థీభావ రూపమని రెండు విధములు. రాజ్ఞః పురుషః మొదలగు వాక్యములు వ్యపేక్షారూపసామర్థ్యమునకు, రాజపురుషః ఇత్యాది సమస్త పదములు ఏకార్థీభావ రూప సామర్థ్యమునకు ఉదాహరణములు. వాక్యములలో శబ్దములు సన్నిహితములును, అన్వయయోగ్యములునూ అగు శబ్దములతో అన్వయింపబడును, ఇదే వ్యపేక్షా సామర్థ్యము.. ఉదా :- "రాజ్ఞః పురుషః అశ్వశ్చ", "రాజ్ఞో దేవదత్తస్య చ పురుషః" ఇత్యాదులు. ఇక ప్రక్రియాదశ యందు విభిన్నార్థములుగా వేరు వేరుగా గ్రహింపబడిన పదములు సముదాయశక్తిచే ఒక విశిష్టార్థమును బోధించును. దీనికే ఏకార్థీ భావ సామర్థ్యమని పేరు. "రాజపురుషః" ఇత్యాదులు దీనికి ఉదాహరణములు.

అయితే "ద్వితీయాశ్రితాతీత" ఇత్యాది సూత్ర ప్రకారముగా ద్వితీయాంతము శ్రిత, అతీత ఇత్యాది శబ్దములు ప్రకృతిగా గల సుబన్తములతో సమసించును, దీని వలన 'కృష్ణం శ్రితః కృష్ణశ్రితః" ఇత్యాది సమాసపదములు సిద్ధించును. కాని శ్రిత ఇత్యాది శబ్దములు సమర్థములు కానిచో సమాసము రాదు. ఉదాహరణమనకు "పశ్య దేవదత్త కృష్ణమ్, శ్రితో విష్ణు మిత్రో గురుకులమ్" అను వాక్యములో కృష్ణ, శ్రిత శబ్దములు దగ్గఱగా ఉన్నప్పటికి అని సమర్థములు కాదు కావున సమాసము చెప్పబడలేదు.

### 117. ప్రాక్కడారాత్సమాసః (2-1-3)

**కడారాః కర్మధారయ ఇత్యతః ప్రాక్ సమాస ఇత్యధిక్రియతే.**

ఇది అధికార సూత్రము, ఈ సూత్రమును మొదలుకొని అష్టాధ్యాయీ సూత్రక్రమానుసారముగా ద్వితీయాధ్యాయములోని ద్వితీయ పాదముననున్న 'కడారాః కర్మధారయే' (2-2-38) అను సూత్రము వఱకు 'సమాసః' అనునది అధికార పదముగా అనువర్తించును.

### 118. సహ సుపా (2-1-4)

**సహ ఇతి యోగో విభజ్యతే. సుబన్తం సమర్థేన సహ సమస్యతే. యోగవిభాగస్య ఇష్టసిద్ధ్యర్థత్వాత్ కతిపయ తిఙన్తోత్తరపదోఽయం సమాసః. స చ ఛందస్యేవ. పర్యభూషయత్, అనువ్యచలత్.**



ఈ సూత్రము 'సహ' అని 'సుపా' అని రెండు సూత్రములుగా విభజించవచ్చును. సుబన్తము సమర్థమగు సుబన్తముతో సమసించును. సూత్రము విభజించుట వలన "పర్యభూషయత్, అనువ్యచలత్" ఇత్యాది తిఙన్తములతో కూడిన సమాసములు కూడ సిద్ధించును. కాని ఇటువంటి సమాసములు వైదిక సాహిత్యమునందే కనబడును.

### 119. సుపో ధాతుప్రాతిపదికయోః (2-1-7)

**ఏతయోరవయవస్య సుపో లుక్ స్యాత్. భూతపూర్వే చరడితి నిర్దేశాత్ భూత శబ్దస్య పూర్వనిపాతః, పూర్వం భూతః భూతపూర్వః.**

**(వా) ఇవేన సమాసో విభక్త్యలోపశ్చ. జీమూతస్యేవ.**

ధాతువునకును ప్రాతిపదికకును అవయవమగు 'సుప్' నకు లుక్ వచ్చునని సూత్రార్థము. "భూతపూర్వే చరట్" (6-3-53) అను సూత్రానుసారముగా 'పూర్వం భూతః' అనునప్పుడు 'భూత' శబ్దమును పూర్వము ప్రయోగించుట వలన "భూత పూర్వః" అను పదము సిద్ధించినది. ఇక్కడ "పూర్వ+అమ్, భూత+సు" అనే అలౌకిక విగ్రహవాక్యముననున్న అమ్, సు అను సుప్పులకు లుక్ ఈ సూత్రము ద్వారా విధింపబడును.

సుబన్తము ఇవ అను అవ్యయముతో సమసించును. కాని విభక్తి ప్రత్యయమునకు లోపము రాదు. 'జీమూతస్యేవ' 'వాగర్థావివ' ఇత్యాది పదములు దీనికుదాహరణములు.

### 120. అవ్యయీభావః (2-1-5)

**అధికారోఽయమ్, ప్రాక్ తత్పురుషాత్.**

**అవ్యయీభావః** : ఇది అధికార సూత్రము. " తత్పురుషః " అను సూత్రమునకు పూర్వసూత్రమగు " అనేకమన్యపదార్థే " (2-1-21) అను సూత్రము వరకు అధికారమై ఉండును అనుటచే " అనేకమన్యపదార్థే " అను సూత్రము వరకు చెప్పబడిన సమాసములు అవ్యయీభావసమాసములు అని చెప్పవచ్చును.

ఈ సూత్రములచే ఏర్పడిన సమాసములందు పూర్వపదార్థమేగాక, ఉత్తరపదార్థము, అన్యపదార్థములు కూడా ప్రధానముగా ఉండుటవలన అధికార సూత్రముచే అన్నింటికి విభక్తి ప్రత్యయములందు మార్పులను దృష్టియందు ఉంచుకొని "అవ్యయీభావము" అను సంజ్ఞ అధికారముగా చెప్పబడినది.

## 121. అవ్యయం విభక్తి - సమీప - సమృద్ధి - వ్యృద్ధ్యర్థాభావాత్యయాసంప్రతి - శబ్ద ప్రాదుర్భావ - పశ్చాత్ - యథానుపూర్వ్య - యౌగపద్య - సాదృశ్య - సంపత్తి - సాకల్యాంత వచనేషు (2-1-6)

**" అవ్యయమ్ " ఇతి యోగో విభజ్యతే. అవ్యయం సమర్థేన సహ సమస్యతే. సోఽవ్యయీభావః.**

" విభాషా " (2-1-11) అను సూత్రము తర్వాత ఉన్న సూత్రములచే ఏర్పడిన సమాసములకు వైకల్పికముగా సమాసవిధి ప్రవర్తించును అని విధించుచున్నది. అందువలన " అవ్యయీభావః " సూత్రము నుండి " అక్షశలాకాసంఖ్యాః పరిణాః " (2-1-10) అను సూత్రము వరకు ఉన్న సూత్రములచే ఏర్పడిన సమాసములు నిత్యములని గ్రహింపవలసినది. అందువలన ఈ సూత్రములు వృత్తి యందు నిత్యం అని చేర్చవలెను.

విభక్త్యర్థము, సమీపము, సమృద్ధి, సమృద్ధి వినాశము, అభావము, అతిక్రమము, అనుచితము, శబ్దాభివ్యక్తి, పిమ్మట, 'యథా' శబ్దార్థము, క్రమము, ఒక్కమారుగా, సమానము, కలిగియుండుట, సంపూర్ణము, అంతమువరకు అని పదహారు అర్థములను బోధించు 'అవ్యయము' సుబంతముతో నిత్యముగా సమసించును. అట్టి సమాసమే " అవ్యయీభావ సమాసము" అని చెప్పబడినది.

ఉదా – ' అధిహరి ' (హరియందు), ' అధి ' అను అవ్యయము హరిశబ్దముతో సప్తమీవిభక్త్యర్థమున ఈ ప్రస్తుత సూత్రముచే నిత్యసమాసము. ' హరౌ ' అని లౌకిక విగ్రహవాక్యము. ' అధి ' అను ' అవ్యయము ' సప్తమీవిభక్త్యర్థమున అధికరణార్థమును బోధించును. హరి + ఙి + అధి + సు అని అలౌకిక విగ్రహం.

పైవిధముగా సమాసము చేసిన తర్వాత సమసించిన రెండు పదములలో ఏ పదమును పూర్వపదముగా ప్రయోగింపవలెను. దేనిని ఉత్తరపదముగా ప్రయోగింపవలెను అను సంశయము కలుగును. ఆ సంశయమును నివారించుటకే ఈ క్రింది సూత్రము చెప్పబడినది.



## 122. ప్రథమానిర్దిష్టం సమాస ఉపసర్జనమ్ (1-2-43)

**సమాసశాస్త్రే ప్రథమానిర్దిష్టమ్ ఉపసర్జనసంజ్ఞం స్యాత్.**

" సమాస విధాయక సూత్రమునందు ప్రథమా విభక్త్యంతముచే నిర్దిష్టమగు పదమునకు ' ఉపసర్జన ' సంజ్ఞ విధింపవలసినది.

హరి + ఙి + అధి + సు అనుచోట " అవ్యయం విభక్తి సమీప ..... " అను సూత్రముచే సమాసము. ఈ సమాస విధాయక సూత్రమున ' అవ్యయం ' అనునది ప్రథమాంతము. ప్రస్తుత సూత్రమున " అవ్యయం విభక్తి ...... " అను ప్రథమాంతముచే బోధింపబడిన ' అధి ' అను అవ్యయమునకు ఉపసర్జనసంజ్ఞ విధింపబడును.

## 123. ఉపసర్జనం పూర్వమ్ (2-2-30)

**సమాసే ఉపసర్జనం ప్రాక్ ప్రయోజ్యమ్.**

సమాసమున ఉపసర్జన సంజ్ఞ కలిగిన పదము పూర్వపదముగా ప్రయోగింపవలెను.

' అధిహరి ' (హరియందు) హరి + ఙి + అధి + సు అనునపుడు ' అధి ' అనునది ఉపసర్జన సంజ్ఞకముగాన దానికి పూర్వనిపాతము విధించగ అధిహరి + ఙి అని యుండగా " సుపో ధాతు ప్రాతిపదికయోః " (2-4-71) అను సూత్రముచే ' ఙి ' కి లోపము. కావున " కృత్తద్ధితసమాసశ్చ " అను సూత్రముచే ప్రాతిపదిక సంజ్ఞ వచ్చి, "అవ్యయీభావశ్చ" (2-4-8) అను సూత్రముచే అవ్యయీభావమునకు అవ్యయసంజ్ఞ విధింపబడును. ప్రాతిపదికత్వము వలన దీనికి ' సుప్ ' ప్రత్యయములు విధించి "అవ్యయాదాప్సుపః" (1-4-81) అను సూత్రముచే లోపము కూడ చెప్పగ ' అధిహరి ' అను రూపము సిద్ధించును.

## 124. ఏకవిభక్తి చాపూర్వనిపాతే (1-2-44)

**విగ్రహే యన్నియతవిభక్తికం తదుపసర్జనసంజ్ఞం స్యాత్, నతు తస్య పూర్వనిపాతః.**

" ప్రథమానిర్దిష్టం సమాస ఉపసర్జనమ్ " (1-2-43) సూత్రము నుంచి "ఉపసర్జనమ్ " అనునది అనువర్తించును. పూర్వసూత్రమైన సమాసవిధాయక సూత్రము నందు ప్రథమావిభక్తిచే నిర్దిష్టమైన దానికి ఉపసర్జనసంజ్ఞ విధింపబడినది. ఈ సూత్రముచే విగ్రహవాక్యము నందు నియతముగా ఒక విభక్తి ప్రత్యయముతో నుండు పదమునకు ఉపసర్జనసంజ్ఞ విధింపబడినది.

1. నిష్క్రాన్తః కౌశాంబ్యా
2. నిష్క్రాన్తం కౌశాంబ్యా
3. నిష్క్రాన్తేన కౌశాంబ్యా
4. నిష్క్రాన్తాయ కౌశాంబ్యా

ఈ విగ్రహవాక్యములందు ' కౌశాంబ్యా ' అను తృతీయా విభక్త్యంతము అగు పదమునకు ఉపసర్జనసంజ్ఞ విధింపబడినది. ఇచ్చట కౌశాంబీ శబ్దము ఒకే విభక్తిలో ఉపయోగింపబడినది. ఈ సూత్రములోని రెండవ భాగమైన "అపూర్వనిపాతే" అను నియమము పూర్వపదత్వస్థితిని శాసించుటలేదు. అందువలన "కుగతిప్రాదయః" (2-3-30) అను సూత్రముచే రెండు పదములు సమసించగా "నిష్కౌశాంబిః" అను సమాసము ఏర్పడుచున్నది " ఉపసర్జనం పూర్వమ్ " (2-2-30) అను సూత్రము సమాసము నందు ప్రవర్తించునప్పుడు రెండవ ఉపసర్జనసంజ్ఞ వల్ల ప్రయోజనము ఏమి ? అను సందేహమును నివారించుటకు క్రింది సూత్రము చెప్పబడినది.

## 125. గోస్త్రియోరుపసర్జనస్య (1-2-48)

**ఉపసర్జనం యో గోశబ్దః స్త్రీప్రత్యయాన్తం చ తదన్తస్య ప్రాతిపదికస్య హ్రస్వః స్యాత్. " అవ్యయీభావశ్చ " ఇత్యవ్యయత్వమ్.**

స్త్రీ ప్రత్యయాంతశబ్దము, గో శబ్దము ఉపసర్జనసంజ్ఞను పొందినచో దీర్ఘాంతమైన ప్రాతిపదికకు హ్రస్వము వచ్చును. " చిత్రా గావో యస్య " అను విగ్రహవాక్యము నుండి " అనేకమన్యపదార్థే " (2-2-24) సూత్రముచే బహువ్రీహి సమాసము చెప్పినపుడు "ఏకవిభక్తి చాపూర్వనిపాతే " (1-2-44) అను సూత్రముచేత గో శబ్దమునకు ఉపసర్జనసంజ్ఞ వచ్చును.

ప్రస్తుత సూత్రముచే ' గో ' శబ్దమునందలి ' ఓ ' కారమునకు హ్రస్వము కాగా 'ఉ ' కారముగా మారి ' చిత్రగు ' అని ఏర్పడును. అలాగే "అతిక్రాంతః ఖట్వామ్ " అను విగ్రహవాక్యము ద్వారా " అతిఖట్వః " అని అగును. ఇక్కడ అతిమాలః అనునది కూడా గ్రహింపవచ్చును. ఖట్వా, మాలా శబ్దములు స్త్రీ ప్రత్యయాన్తములు.

## 126. నావ్యయీభావాదతోఽమ్త్వపఞ్చమ్యాః (2-4-83)

**అదన్తాదవ్యయీభావాత్ సుపో న లుక్, తస్య తు పఞ్చమీం వినా అమాదేశః స్యాత్. దిశయోర్మధ్యే అపదిశమ్. "క్లీబావ్యయం త్వపదిశం దిశోర్మధ్యే విదిక్ స్త్రియామ్" ఇత్యమరః.**





అకారాంతమగు అవ్యయీభావముపైనున్న ' సుప్ ' ప్రత్యయమునకు లోపము రాదు. కాని ఆ ' సుప్ ' నకు పంచమీవిభక్తి తప్ప ఇతర విభక్తుల యందు 'అమాదేశము' వచ్చును. ఇది " అవ్యయాదాప్సుపః " (2-4-82) అను సూత్రమునకు అపవాదము. "దిశయోః మధ్యే " (రెండు దిశల మధ్యన) అను విగ్రహవాక్యము నుండి " అవ్యయం విభక్తి ...... " (2-1-6) అను సూత్రముచే అవ్యయీభావసమాసము విధించగ సప్తమీ ద్వివచన ప్రత్యయమైన ' ఓస్ ' స్థానము నందు ' అమ్ ' రాగా " అపదిశమ్ " అని రూపము సిద్ధించును.

## 127. తృతీయాసప్తమ్యోర్బహులమ్ (2-4-84)

**అదన్తాదవ్యయీభావాత్ తృతీయా సప్తమ్యోర్బహులమమ్ భావః స్యాత్. అపదిశమ్. అపదిశేన. అపదిశమ్. అపదిశే. బహులగ్రహణాత్ సుమద్రమ్ ఉన్మత్తగఙ్గమ్ ఇత్యాదౌ సప్తమ్యాః నిత్యమమ్భావః. "విభక్తి" ఇత్యాదేరయమర్థ :. విభక్త్యర్థాదిషు వర్తమానమవ్యయం సుబన్తేన సహ సమస్యతే, సోఽవ్యయీభావః. విభక్తౌ తావత్. హరౌ ఇత్యధిహరి. సప్తమ్యర్థస్యైవాత్ర ద్యోతకోఽధిః. హరి ఙి అధి ఇత్యలౌకికం విగ్రహవాక్యమ్. అత్ర నిపాతేనాభిహితేఽవ్యధికరణే వచనసామర్థ్యాత్సప్తమీ.**

అదన్తమగు అవ్యయీభావ సమాసమున తృతీయ, సప్తమీ విభక్తులు పరమగునపుడు యీ సూత్రముచే బహులముగా అమ్ భావము వచ్చును. " దిశయోః మధ్యే " అను విగ్రహవాక్యము వలన అపదిశమ్, అపదిశేన, అపదిశే అను రూపములు సిద్ధించును. ఇక్కడ అమ్ భావము లేనప్పుడు తృతీయా, సప్తమీ విభక్తులు లోపింపకుండుట గమనించవలసినది. బహుల గ్రహణము వలన 'సుమద్రమ్, ఉన్మత్తగఙ్గమ్' ఇత్యాదులందు అమ్ భావము నిత్యముగా విధింపబడును. విభక్తి ఇత్యాద్యర్థములు గల వాటితోనున్న అవ్యయము సుబన్తముతో సమసించును. అది అవ్యయీభావ సమాసమగును. విభక్త్యర్థమందైతేను 'హరౌ ఇత్యధిహరి' అనునది సిద్ధించును. ఇచ్చట 'అధి' శబ్దము సప్తమ్యర్థద్యోతకమే. నిపాతమైన 'అధి' శబ్దము చేత అధికరణము సూచింపబడినప్పటికిని వచన సామర్థ్యము వలన సప్తమీ విధింపబడును.

అవ్యయీభావసమాసమునకు పరమైన విభక్తి ప్రత్యయముల విషయము చర్చించిన తర్వాత అవ్యయీభావసమాసము యొక్క లింగమేది అగును అను ప్రశ్నకు సమాధానముగా క్రింది సూత్రము ఉదహరించబడుచున్నది.

## 128. అవ్యయీభావశ్చ (2-4-18)

**అయం నపుంసకం స్యాత్. హ్రస్వో నపుంసకే ప్రాతిపదికస్య. గోపాయతీతి గాః పాతీతి వా గోపాః. తస్మిన్ ఇతి అధిగోపమ్. సమీపే-కృష్ణస్య సమీపమ్ ఉపకృష్ణమ్. సమయా గ్రామమ్, నికషా లఙ్కామ్, ఆరాత్ వనాత్ ఇత్యత్ర తు నావ్యయీభావః. 'అభితః పరితః', అన్యారాత్, ఇతి ద్వితీయాపఞ్చమ్యోర్విధానసామర్థ్యాత్, మద్రాణాం సమృద్ధిః, సుమద్రమ్. యవనానాం వ్యృద్ధిః – దుర్యవనమ్. విగతా ఋద్ధిః – వ్యృద్ధిః. మక్షికాణామభావో నిర్మక్షికమ్. హిమస్య అత్యయోఽతిహిమమ్. అత్యయో ధ్వంసః. నిద్రా సంప్రతి న యుజ్యతే ఇత్యతినిద్రమ్. హరిశబ్దస్య ప్రకాశః ఇతిహరి. విష్ణోః పశ్చాత్ అను విష్ణుః. పశ్చాత్ శబ్దస్య తు నాయం సమాసః. తతః పశ్చాత్ స్రంస్యతే ధ్వంస్యతే ఇతి భాష్య ప్రయోగాత్. యోగ్యతావీప్సా పదార్థానతివృత్తి సాదృశ్యాని యథార్థాః. అనురూపమ్. రూపస్య యోగ్యమిత్యర్థ. అర్థమర్థం ప్రతి ప్రత్యర్థమ్. ప్రతిశబ్దస్య వీప్సాయాం కర్మప్రవచనీయసంజ్ఞావిధాన సామర్థ్యాత్ తద్యోగే ద్వితీయాగర్భం వాక్యమపి. శక్తి మనతిక్రమ్య యథాశక్తి. హరేః సాదృశ్యం సహరి, వక్ష్యమాణేన సహస్య సః. జ్యేష్ఠస్య ఆనుపూర్వ్యేణ ఇతి అనుజ్యేష్ఠమ్. చక్రేణ యుగపదితి విగ్రహే.**

" స నపుంసకమ్ " (2-4-17) అను సూత్రము నుండి " నపుంసకమ్ " అను పదము అనువర్తించును. అందుచే ఈ సూత్రం " అవ్యయీభావసమాసము కూడా నపుంసకలింగమగును " అని తెలుపుచున్నది. నపుంసకలింగ ' సుప్ ' ప్రత్యయములను అవ్యయీభావమునకు చేర్చవలెను.

" అధిగోపమ్ " (గోవులను రక్షించువాడు) గాః పాతీతి గోపాః అనునది ఆకారాంత గోపా శబ్దము యొక్క ప్రథమా ఏకవచనము.

' గోపా + ఙి + అధి ' అను అలౌకిక విగ్రహవాక్యమున సప్తమ్యర్థమైన ' అధి' అను అవ్యయమునకు గోపా + ఙి అను సుబంతముతో సమాసము ' అధి ' అను శబ్దమునకు ఉపసర్జన సంజ్ఞ వచ్చుట వలన పూర్వనిపాతము వచ్చి అధి + గోపా + ఙి అని ఉండగా " సుపో ధాతు ప్రతిపదికయోః " అను సూత్రముచే ' సుప్ ' నకు లుక్ రాగా (లోపం కాగా) అధిగోపా అని యుండును. అపుడు " అధిగోపా " అనుదానికి ప్రస్తుత 'అవ్యయీభావశ్చ' సూత్రముచే నపుంసకత్వం విధించగ, " హ్రస్వో నపుంసకే ప్రాతిపదికస్య" అను సూత్రముచే ఆకారమునకు హ్రస్వము వచ్చి " అధిగోప " అని



కాగా ప్రథమైకవచనము " సుప్ " ప్రత్యయమునకు " అవ్యయాదాప్సుపః " అను సూత్రముచే లోపము ప్రాప్తించుచుండగా "నావ్యయీభావాదతోఽమ్త్వ పఞ్చమ్యాః " (2-4-88) అను సూత్రముచే ' అమ్ ' ఆదేశము వచ్చి " అమిపూర్వః " (6-1-107) అను సూత్రముచే పూర్వరూపము రాగా " అధిగోపమ్" అని సమాసము సిద్ధించును.

" అవ్యయం విభక్తి ....... " (2-6-6) అను సూత్రము ద్వారా భిన్నార్థములతో అవ్యయము సుబంతముగా సమసించి ఏర్పడిన సమాసములకు ఉదాహరణములు ఇక్కడ క్రమముగా ఇవ్వబడుచున్నవి.

అధిహరి – హరౌ (హరి యందు) – విభక్తి
ఉపకృష్ణమ్ – కృష్ణస్య సమీపమ్ (కృష్ణునికి సమీపమున) – సమీప
సుమద్రమ్ – మద్రాణాం సమృద్ధిః (మద్రదేశీయుల సమృద్ధి) – సమృద్ధి
దుర్యవనమ్ – యవనానాం వ్యృద్ధిః (యవనుల వృద్ధి లేకుండుట) – వ్యృద్ధి
నిర్మక్షికమ్ – మక్షికాణామ్ అభావః (ఈగలు లేకుండుట) – అభావము
అతిహిమమ్ – హిమస్య అత్యయః (హిమము యొక్క నాశము) – అత్యయము
అతినిద్రమ్ – నిద్రా సంప్రతి న యుజ్యతే (ఇప్పుడు నిద్ర ఉచితము కాదు) – అసంప్రతి వచనము
ఇతిహరి – హరేః ప్రకాశః (హరి శబ్దము యొక్క ప్రాదుర్భావము) – శబ్దప్రాదుర్భావ వచనము
అనువిష్ణు – విష్ణోః పశ్చాత్ (విష్ణువు తరువాత) – పశ్చాద్వచనము
అనురూపమ్ – రూపస్య యోగ్యమ్ (రూపమునకు యోగ్యమైనది) – యథార్థవచనము.
అనుజ్యేష్ఠమ్ – జ్యేష్ఠస్య ఆనుపూర్వ్యమ్ (పెద్ద (జ్యేష్ఠ) క్రమముగా) – అనుపూర్వ్య వచనము.
సచక్రమ్ – చక్రేణ యుగపత్ (చక్రముతో ఒక్కసారిగా) – యోగ్యపదవచనము.

## 129. అవ్యయీభావే చాకాలే (6-3-81)

**సహస్య సః స్యాదవ్యయీభావే న తు కాలే. సచక్రమ్. కాలే తు సహపూర్వాహ్ణమ్. సదృశస్సఖ్యా ససఖి. యథార్థత్వేనైవ సిద్ధే పునః సాదృశ్యగ్రహణం గుణభూతేఽపి సాదృశ్యే యథా స్యాదిత్యేవమర్థమ్. క్షత్రాణాం సంపత్తిః – సక్షత్రమ్. ఋద్ధేరాధిక్యం సమృద్ధిః. అనురూప ఆత్మభావస్సంపత్తిరితి భేదః. తృణమప్యపరిత్యజ్య**

**సతృణమత్తి. సాకల్యేనేత్యర్థః. న త్వత్ర తృణభక్షణే తాత్పర్యమ్. అన్తే, అగ్నిగ్రన్థపర్యన్తమధీతే సాగ్ని.**

" సహస్య సః సంజ్ఞాయామ్ " (6-3-78) సూత్రము నుండి " సహస్య సః " అను రెండు పదములు అనువర్తించును. అవ్యయీభావ సమాసమున కాలవాచక శబ్దము పరముగా లేనపుడు ' సహ ' అను శబ్దమునకు ' స ' అను ఆదేశము వచ్చును.

ఈ సూత్రముచే ' స ' ఆ దేశము రాగా సహరి (హరేః సాదృశమ్ ) అను రూపము సిద్ధించును.

సచక్రమ్ – చక్రేణ యుగపత్ (చక్రముతో ఒక్కసారిగా)
సహ + చక్రమ్ = సచక్రమ్ (దేహి)

ససఖి – సఖ్యా సదృశః (సఖునితో సదృశుడు)
సహ + సఖి = ససఖి (సాదృశ్యవచనము)

సతృణమ్ – తృణమపి అపరిత్యజ్య (తృణమును కూడా వదిలిపెట్టకుండా – అనగా మొత్తము)
సహ + తృణమ్ = సతృణమ్ (సాకల్యవచనము)

సాగ్ని – అగ్ని గ్రంథపర్యంతమ్ (అగ్ని చయనమును – ప్రతిపాదించు గ్రంథము వరకు) సహ + అగ్ని = సాగ్ని (అన్తవచనము)

సక్షత్రమ్ – క్షత్రాణాం సంపత్తిః (క్షత్రియుల సంపత్తి)
సహ + క్షత్ర = సక్షత్రమ్

సహ + పూర్వాహ్ణ అనునపుడు ' సహ ' అను అవ్యయము 'పూర్వాహ్ణ ' అను కాలవాచకముతో సమసించుటవలన ' స ' అను ఆదేశము రాదు కావున ' సహపూర్వాహ్ణమ్' అనియే ఉండును.

## 130. యథాఽసాదృశ్యే (2-1-7)

**అసాదృశ్య ఏవ యథాశబ్దస్సమస్యతే. తేనేహ న. యథా హరిస్తథా హరః. హరేరుపమానత్వం యథాశబ్దో ద్యోతయతి. తేన సాదృశ్య ఇతి వా యథార్థ ఇతి వా ప్రాప్తం నిషిధ్యతే.**

'యథా' అను అవ్యయము 'సాదృశ్య' వాచకము కానిచో సుబంతముతో నిత్యముగ సమసించును.





"యథా వృద్ధం బ్రాహ్మణానామన్త్రయస్వ" (వృద్ధులైన బ్రాహ్మణులందరిని ఆహ్వానింపుము) అనే వాక్యమందు 'యథావృద్ధమ్' అనునది ఈ సూత్రముచే ఏర్పడిన అవ్యయీభావ సమాసము.

## 131. యావదవధారణే (2-1-8)

**యావన్తః శ్లోకాః తావన్తోఽచ్యుత ప్రణామాః యావచ్ఛ్లోకమ్.**

"ఇంత ప్రమాణము" అని నిశ్చితార్థమునందు ప్రయోగింపబడిన 'యావత్' అను అవ్యయము సమర్థమగు సుబంతంతో నిత్యముగా సమసించి అవ్యయీభావ సమాసమగును.

"యావన్తః శ్లోకాస్తావన్తోఽచ్యుత ప్రణామాః" (ఎన్ని శ్లోకములున్నవో అన్ని అచ్యుతునికి ప్రణామములు చేయవలెను) అను అవధారణార్థమున 'యావత్' శబ్దము 'శ్లోకమ్' అను సుబంతముతో సమసింపగా "యావచ్ఛ్లోకమ్" అని సిద్ధించును.

## 132. సుప్ ప్రతినా మాత్రార్థే (2-1-9)

**శాకస్య లేశః శాకప్రతి. మాత్రార్థే కిమ్ ? వృక్షం వృక్షం ప్రతి విద్యోతతే విద్యుత్.** "సుబంతము కొంచెము (మాత్రము) అని అర్థమున ఉపయోగించినపుడు ప్రతి అను అవ్యయముతో నిత్యముగా సమసించి అవ్యయీభావ సమాసమగును.

"మాత్ర" అనగా ఒక చుక్క లేక కొంచెము అని అర్థము. 'శాకస్య లేశః' (కొంచెము కూర) – శాకప్రతి, సూత్రములో " ప్రతినా " అని తృతీయా విభక్తి యందున్నది కావున 'ప్రతి' శబ్దము ఉపసర్జనము కాదు. అవ్యయము ఉత్తరపదముగా కలిగిన అవ్యయీభావసమాసము ఏర్పడుచున్నది. ఇటువంటి నియమమే తరువాత సూత్రమున కూడా వర్తించును. సూత్రమున 'మాత్ర' శబ్దము చెప్పుట వలన 'వృక్షం వృక్షం ప్రతి విద్యోతతే' అనునపుడు నియన్త్రణము లేదు, కావున ఈ సూత్రము రాదు.

## 133. అక్షశలాకాసంఖ్యాః పరిణా (2-1-10)

**ద్యూతవ్యవహారే పరాజయే ఏవాయం సమాసః. అక్షేణ విపరీతం వృత్తమ్ అక్షపరి. శలాకాపరి, ఏకపరి.**

ద్యూత వ్యవహారమునందు ప్రయోగింపబడిన అక్ష, శలాకాపదములు,

సంఖ్యావాచకములు కూడ పరి అను అవ్యయముతో నిత్యముగా సమసించును.

అక్షపరి – అక్షేణ విపరీతం వృత్తమ్ (ఒక పాచికవల్ల జరిగిన పరాజయము)

శలాకపరి – (శలాకము వలన జరిగిన పరాజయము)

ఏకపరి – (ఒకసారి పడుట వలన జరిగిన పరాజయము)

## 134. విభాషా (2-1-11)

**అధికారోఽయమ్. ఏతత్ సామర్థ్యాదేవ ప్రాచీనానాం నిత్యసమాసత్వమ్. 'సుప్సుపా' ఇతి తు న నిత్యసమాసః. అవ్యయమ్ ఇత్యాదిసమాసవిధానాద్ జ్ఞాపకాత్.**

ఇది అధికార సూత్రము. అందువలన 'విభాషా' అనునది సమాసాధికారము వరకు పఠించిన సూత్రములన్నింటియందును అనువర్తించును. దీని మూలముగా ఇంతకు ముందు విధించిన సమాసములు నిత్యములు అని తెలియుచున్నది. విభాషా మూడు విధములు.

ప్రాప్త విభాషా – ముందు సామాన్య విధాయక సూత్రము చెప్పిన తర్వాత వికల్ప సూత్రము చెప్పిన ప్రాప్తవిభాష అగును.

అప్రాప్త విభాషా – సామాన్య విధాయక సూత్రము చెప్పకుండానే వికల్ప సూత్రము చెప్పిన అప్రాప్త విభాష అగును.

ప్రాప్తాప్రాప్త విభాషా – పై రెండు లక్షణములు కలిగిన యెడల ప్రాప్తాప్రాప్త విభాష అగును.

## 135. అపపరిబహిరఞ్చవః పఞ్చమ్యా (2-1-12)

**అపవిష్ణు-సంసారః అపవిష్ణోః. పరివిష్ణు పరివిష్ణోః. బహిర్వనమ్ – బహిర్వనాత్. ప్రాగ్వనమ్– ప్రాగ్వనాత్.**

అప, పరి, బహిః మరియు అఞ్చు అను దానితో అంతమగు అవ్యయములు పంచమీ విభక్త్యంత పదములతో వైకల్పికముగా సమసించి అవ్యయీభావసమాసత్వమును పొందును. " అపవిష్ణోః సంసారః " (విష్ణువు నుంచి బయటనే సంసారబంధము) అను వాక్యము నుంచి ' అపవిష్ణు ' అను అవ్యయీభావసమాసము ఏర్పడును. ఇట్లే పరివిష్ణు–పరివిష్ణోః ఇత్యాది ఉదాహరణములు కూడ సిద్ధించును.



## 136. ఆఙ్ మర్యాదాభివిధ్యోః (2-1-13)

**ఏతయోరాఙ్ పఞ్చమ్యన్తేన వా సమస్యతే, సోఽవ్యయీభావః. ఆముక్తి సంసారః. ఆ ముక్తేః. ఆబాలం హరిభక్తిః – ఆ బాలేభ్యః.**

మర్యాదా(కట్టుబాటు), అభివిధి (పొలిమేర) అను అర్థములను బోధించు 'ఆఙ్' అను అవ్యయము పంచమ్యంతముతో వైకల్పికముగా అవ్యయీభావ సమాసమగును.

ఆముక్తేః సంసారః (ముక్తి వచ్చు వరకు సంసారము యొక్క కట్టుబాటు) అను వాక్యము వలన సమాసపక్షమున 'ఆముక్తి సంసారః' అని సిద్ధించును.

అలాగే 'ఆబాలేభ్యః హరిభక్తిః' (బాల్యావస్థ నుంచి హరిభక్తి) అను అభివిధ్యర్థమున ఉపయోగింపబడిన 'ఆ' అను అవ్యయము బాల శబ్దముతో సమసించి 'ఆబాలం' అను అవ్యయీభావసమాసమగును.

## 137. లక్షణేనాభిప్రతీ ఆభిముఖ్యే (2-1-14)

**ఆభిముఖ్యద్యోతకావభిప్రతీ చిహ్నవాచినా సహ ప్రాగ్వత్. అభ్యగ్ని శలభాః పతన్తి, అగ్నిమభి. ప్రత్యగ్ని, అగ్నిం ప్రతి.**

'అభిముఖభావముతో లక్ష్యము వైపునకు వెళ్ళు' అను అర్థములో ప్రయోగింపబడిన అభి, ప్రతి అను అవ్యయములు వైకల్పిముగ సుబంతముతో సమసించును. అది అవ్యయీభావ సమాసము. లక్షణము (గుర్తు), గమ్యస్థానము.

"అనుర్లక్షణే" (1-4-84), "లక్షణేత్థంభూతాఖ్యానభాగవీప్సాసు ప్రతిపర్యనవః" (1-4-90) అను సూత్రములచే కారకత్వము, ద్వితీయావిభక్తి విధింపబడిన ఉదాహరణములలోని అభి, ప్రతి అను కర్మ ప్రవచనీయ సంజ్ఞకములు కూడ ఇందు గ్రాహ్యములు.

" అగ్నిమ్ అభి శలభాః పతన్తి" అను వాక్యములో 'అభి' శబ్దమును ఆశ్రయించుకొని ఉన్న 'అగ్ని' శబ్దమునకు ద్వితీయావిభక్తి ప్రయోగింపబడినది. "అగ్నిముఖముగా మిడతలు నిప్పులో పడుచున్నాయి " అను అర్థములో ఉపయోగించిన 'అభి' అను అవ్యయం అగ్ని శబ్దముతో సమసించి 'అభ్యగ్ని' అని వైకల్పికముగా అవ్యయీభావ సమాసము ఏర్పడును.

"ప్రత్యగ్ని" అను సమాసము లేదా 'అగ్నిం ప్రతి' అను వాక్యము పై అర్థములోనే ఉపయోగించవచ్చు.

### 138. అనుర్యత్సమయా (2-1-15)

**యం పదార్థం సమయా ద్యోత్యతే తేన లక్షణభూతేనానుః సమస్యతే సోఽవ్యయీభావః. అనువనమ్ అశనిర్గతః. వనస్య సమీపం గత ఇత్యర్థః.**

పూర్వ సూత్రము నుండి 'లక్షణేన' అనుపదము అనువర్తించును. సమీపబోధార్థకమైన 'అను' అను అవ్యయము వైకల్పికముగా సమర్థమైన సుబంతముతో సమసించి అవ్యయీభావసమాసముగా ఏర్పడును. సమయా అనగా 'దగ్గర' అని అర్థము.

'అనువనం అశనిర్గతః' (పిడుగు అడవికి చేరువున పడినది) అను అర్థములో 'అనువనమ్' (వనసమీపము) అని అవ్యయీభావసమాసము.

### 139. యస్య చాయామః (2-1-16)

**యస్య దైర్ఘ్యమనునా ద్యోత్యతే తేన లక్షణభూతేనానుః సమస్యతే. అనుగంగమ్ వారాణసీ. గంగాయా అను. గంగాదైర్ఘ్యసదృశదైర్ఘ్యోపలక్షితేత్యర్థః.**

పూర్వసూత్రము నుండి 'అను' అనుపదము ఈ సూత్రమున అనువర్తించును. ఆయామము అనగా పొడువు అని అర్థము. 'పొడువు' అను అర్థమున ప్రయోగింపబడిన 'అను' అను అవ్యయము సమర్థమగు సుబంతముతో సమసించి వైకల్పికముగా 'అవ్యయీభావసమాసము' అగును.

"గంగాయాః అను" (గంగానది ప్రవహించుచున్న పొడువున వారణాసి ఉన్నది) అను వాక్యము నుండి "అనుగంగమ్" అను అవ్యయీభావసమాసమేర్పడును. వారణాసి యొక్క పొడవు గంగానది పొడువుతో కొలువబడుచున్నదన్న అర్థము స్ఫురించుచున్నది.

### 140. తిష్ఠద్గుప్రభృతీని చ (2-1-17)

**ఏతాని నిపాత్యన్తే. తిష్ఠన్తి గావో యస్మిన్ కాలే స తిష్ఠద్గుః దోహనకాలః. ఆయతీగవమ్. ఇహ శత్రాదేశః పుంవద్భావవిరహః సమాసాన్తశ్చ నిపాత్యతే. ఖలేయవమ్ ఇత్యాది.**

"తిష్ఠద్గు" గణములో పఠింపబడిన సమాసములన్నియు అవ్యయీభావములే అని యీ సూత్రార్థము. కొన్ని ధాతువులు తిఙన్త లక్షణాలను కోల్పోయి సుబంతలక్షణాలైన లింగాన్ని, విభక్తిని కలిగి ఉంటాయి. లింగవిభక్తులనే సుబంత లక్షణాలు కలిగిన విశిష్ట ప్రయోగాలను పాణిని పరిగణనం చేసి ఒక గణంగా రూపొందించి వాటికి అవ్యయీభావసమాసమును అనువర్తింపచేశాడు. పాలు పితుకు సమయమునందు





నియతముగా ఆవులు నిలుచుకొని యుంటవి గాన 'తిష్ఠంతి గావః' అను వాక్యము నుండి 'తిష్ఠద్గు' అను అవ్యయీభావసమాసము కాలవాచకముగా ఏర్పడినది. ఆవులు అడవి నుంచి తిరిగి వచ్చు సమయమును బోధించుటకు "ఆయతీగవమ్" అనే అవ్యయీభావసమాసము ఏర్పడినది. అలాగే 'ఖలేయవమ్' అను అవ్యయీభావసమాసము బార్లీ పంట నూర్పుకాలమును బోధించును.

### 141. పారే మధ్యే షష్ఠ్యా వా (2-1-18)

**పారమధ్యశబ్దౌ షష్ఠ్యన్తేన సహ వా సమస్యేతే. ఏదన్తత్వం చానయోర్నిపాత్యతే. పక్షే షష్ఠీతత్పురుషః. పారేగఙ్గాదానయ. గఙ్గాపారాత్. మధ్యేగఙ్గాత్. గఙ్గామధ్యాత్. మహావిభాషయా వాక్యమపి. గఙ్గాయాః పారాత్. గఙ్గాయా మధ్యాత్.**

'ఆవలి దరి' అను అర్థబోధకమైన పారే అను సుబంతము 'నడుమ' అను అర్థబోధకమైన 'మధ్యే' అను సుబంతము వైకల్పికముగా 'షష్ఠీవిభక్త్యంత' పదముతో సమసించి అవ్యయీభావ సమాసముగా ఏర్పడును. పార, మధ్య అను పదములు పారే, మధ్యే అని సూత్రమున చెప్పబడుటవల్ల ఆ విధముగా సమాసమునందు నియమింపబడినది.

గంగాయాః పారాత్, గంగాయాః మధ్యాత్ అను వాక్యముల నుండి వైకల్పికముగా పారేగంగాత్, మధ్యేగంగాత్ అను అవ్యయీభావ సమాసములు ఏర్పడినవి. పారే, మధ్యే అను సుబంతములు సుబంతములతో కలిసి అవ్యయీభావసమాసములగుచున్నవి. 'విభాషా' అను సూత్రమునుసరించి "గంగాయాః పారాత్, గంగాయాః మధ్యాత్" ఇత్యాదులు కూడ ఉపయోగింపవచ్చును. ప్రస్తుత సూత్రము నుండి 2-1-21 (అన్య పదార్థే చ సంజ్ఞాయామ్) అనువరకు నాలుగు సూత్రములలో సుబంతముల మధ్య ఏర్పడు అవ్యయీభావసమాసములు వివరింపబడుచున్నవి.

### 142. సంఖ్యా వంశ్యేన (2-1-19)

**వంశో ద్విధా. విద్యయా జన్మనా చ. తత్ర భవో వంశ్యః. తద్వాచినా సహ సంఖ్యా వా సమస్యతే. ద్వౌ మునీ వంశ్యౌ ద్విముని. వ్యాకరణస్య త్రిముని. విద్యాతద్వతామభేదవివక్షాయామ్ త్రిముని వ్యాకరణమ్. ఏకవింశతి భారద్వాజమ్.**

వంశము రెండు విధములు, రక్తసంబంధమైన అనగా జన్మ సంబంధమైన తాతముత్తాతలను సూచించునది ఒకటైతే గురుపరంపరను సూచించునది రెండవది.

సంఖ్యావాచకమగు శబ్దము 'వంశమునకు సంబంధించినవాడు' అను అర్థమును బోధించు సుబంతముతో వైకల్పికముగా సమసించి అవ్యయీభావ సమాసము అగును.

'ద్విముని వ్యాకరణస్య' అను వాక్యమునందు 'ద్విముని' అను సమాసము అవ్యయీభావసమాసము. 'పాణిని, పతంజలి అను ఇద్దరు మునులు ప్రధాన ప్రవక్తలుగా కలిగిన వ్యాకరణ శాస్త్రము' అను అర్థమను ఈ సమాసమును బోధించును. అటులనే 'త్రిముని వ్యాకరణమ్' అను వాక్యము నందు 'త్రిముని' అను అవ్యయీభావసమాసము. 'త్రిముని' అనగా పాణిని, కాత్యాయనుడు, పతంజలి అను ముగ్గురు ప్రధాన ప్రవక్తలు కలగినది అని అర్థము.

'ఏకవింశతి భారద్వాజమ్' అని అవ్యయీభావసమాసము 'ఇరువదియొక్క' ఋషులు కలిగిన భారద్వాజవంశమును బోధించును. ఇది రక్తసంబంధము వలన బోధించుచున్న అవ్యయీభావసమాసము.

### 143. నదీభిశ్చ (2-1-20)

**నదీభిస్సహ సంఖ్యా ప్రాగ్వత్. సమాహారే చాయమిష్యతే (వా) సప్తగఙ్గమ్. ద్వియమునమ్.**

'సంఖ్యా' అను పదము పూర్వసూత్రము నుండి అనువర్తించును. సంఖ్యావాచకము నదీవాచకములతో సమసించి అవ్యయీభావసమాసమగును. సప్తగంగమ్ (ఏడు గంగలు కలిసిన కూడలి), ద్వియమునమ్ (రెండు యమునలు కలిసే కూడలి) అని (సప్తగంగమ్ – సప్తానాం గంగానాం సమాహారః), ద్వియమునమ్ – ద్వయోః యమునమో సమాహారః) అవ్యయీభావసమాసములు ఏర్పడినవి.

**(వా) సమాహారే చాయమిష్యతే**

**సప్తానాం గంగానాం సమాహారః – సప్తగంగమ్,**

**ద్వయోః యమునయోః సమాహారః – ద్వియమునమ్.**

ఇచ్చట 'తద్ధితార్థోత్తర పదసమాహారే చ' (2-1-51) అను సమాసమును బాధించి అవ్యయీభావసమాసమును వార్తికకారుడు విధించి విభక్తి ప్రత్యయరహితముగా ప్రయోగమున నున్న యీ సమాసములను సాధించవచ్చని నిరూపించాడు.

### 144. అన్యపదార్థే చ సంజ్ఞాయామ్ (2-1-21)



**అన్యపదార్థే విద్యమానం సుబన్తం నదీభిస్సహ నిత్యం సమస్యతే సంజ్ఞాయామ్. విభాషాఽధికారేఽపి వాక్యేన సంజ్ఞానవగమాదిహ నిత్యసమాసః. ఉన్మత్తగఙ్గం నామ దేశః. లోహిత గఙ్గమ్.**

పూర్వ సూత్రమునుండి 'నదీభిః' అను పదము అనువర్తించును. సంజ్ఞావాచకమును, అన్యపదార్థబోధకమును అగునట్టి ఒక సుబంతము నదీవాచకమైన సుబంతముతో సమసించి అవ్యయీభావసమాసమగును. ఉన్మత్తగంగమ్ అనునది ఒక ఉదాహరణ. 'ఉన్మత్తగఙ్గ' అనగా ఒక ప్రాంతం యొక్క పేరు. ఆ ప్రాంతములో గంగానదీ తీవ్రమైన రీతిలో ప్రవహించును. అటులనే లోహితగంగమ్, (దేశవాచకము), కృష్ణగంగమ్ (సంజ్ఞా వాచకము)లు నిత్యసమాసములు.

" అవ్యయం విభక్తి ....... " (2-1-6) నుండి అన్యపదార్థేచ సంజ్ఞాయామ్ (2-1-21) వరకు ఉన్న సూత్రములు అవ్యయీభావసమాస విధాయక సూత్రాలు.

### 145. సమాసాన్తాః (5-4-69)

ఇత్యధికృత్య – ఇది అధికార సూత్రము. పాణిని మహర్షి సమాసాంతమున వచ్చు మార్పులను తద్ధితప్రకరణమున ప్రత్యయము చేర్చుటవలన ఏర్పడినట్లు చూపెను. దీని వలన సమాసమునకు తద్ధితప్రత్యయ స్వరము సిద్ధించును. ఇది వైదిక ప్రక్రియ యందు స్పష్టముగా తెలియనగును. " సమాసాన్తః స్యాత్ " అని ప్రతిసూత్రము యొక్క వృత్తి యందును చేర్చుటవలన సూత్రమును పూర్ణవాక్యముగ ప్రదర్శించవచ్చు.

### 146. అవ్యయీభావే శరత్ప్రభృతిభ్యః (5-4-107)

**శరదాదిభ్యష్టచ్ స్యాత్సమాసాన్తోఽవ్యయీభావే. శరదస్సమీపమ్ ఉపశరదమ్. ప్రతివిపాశమ్. శరద్, విపాశ్, అనస్, మనస్, ఉపానహ్, దివ్, హిమవత్, అనడుహ్, దిశ్, దృశ్, చేతస్, చతుర్, త్యద్, తద్, యద్, కియత్. 'జరాయాజరస్ చ'. (గణసూ) ఉపజరసమ్. ప్రతిపరసమనుభ్యోఽక్ష్ణః (గణసూ). 'యస్యేతి చ'. ప్రత్యక్షమ్. అక్ష్ణః పరమ్ ఇతి విగ్రహే సమాసాన్తవిధానసామర్థ్యాదవ్యయీభావః. 'పరోక్షే లిట్' ఇతి నిపాతనాత్ పరస్యోకారాదేశః. పరోక్షమ్. పరోక్షా క్రియా ఇత్యాది తు అర్శ ఆద్యచి. సమక్షమ్. అన్వక్షమ్.**

శరదాది గణంలోని అవ్యయీభావ సమాసములకు చివర 'టచ్' అను ప్రత్యయము చేరును. ఉపశరదమ్ - శరదః సమీపమ్, 'అవ్యయం విభక్తి..... ' (2-1-6) అను సూత్రముచే సమీపము అను అర్థములో సమసించి 'టచ్' ప్రత్యయమునందలి 'అ' చేరగా ఉపశరదమ్ అని సిద్ధించును. ఇట్లే 'జరాయాః సమీపమ్' ఉపజరసమ్ అనునది సిద్ధించును. 'జర' అను దాని స్థానమున 'జరస్' ఆదేశము వచ్చును.

పరోక్షమ్ - అక్ష్ణః పరమ్ అని విగ్రహవాక్యము. 'అక్షి' శబ్దము శరదాది గణమున లేకపోవుటచే ప్రస్తుతసూత్రముచే 'టచ్' ప్రత్యయం రావటానికి అవకాశం లేదు. ఇకారాన్తము. అకారాన్తముగా మారిన గాని పరోక్షమ్ అను సమాసము రాదు.

'పరోక్షే లిట్' (3-2-115) అను సూత్రమున పరోక్షమ్ అను సమాసమును పాణిని చెప్పెను. అవ్యయీభావ సమాస సూత్రం వలన 'పరోక్షమ్' అనునది సిద్ధింపకపోయినప్పటికి పాణిని ప్రయోగమును ప్రమాణముగా చూపి 'పరోక్షమ్' అను సమాసం యొక్క సాధుత్వమును సాధింపవలెనని భట్టోజి దీక్షితుల అభిప్రాయము. సూత్రములలోని ప్రయోగములవల్ల కూడా సాధుత్వమును సాధింపవచ్చని బాలమనోరమా వాఖ్యాత వాసుదేవ దీక్షితులు స్పష్టం చేసియున్నాడు.

ఇదే విధంగా ప్రత్యక్షమ్, సమక్షమ్, అన్వక్షమ్ అను అవ్యయీభావ ప్రయోగములను పాణిని ప్రయోగములచే సాధింపవలెను. ఇది వ్యాఖ్యాన సంప్రదాయ పద్ధతి.

## 147. అనశ్చ (5-4-108)

**అన్నన్తాదవ్యయీభావాట్టచ్ స్యాత్.**

'అన్' అను శబ్దముతో అంతముగా కలిగిన అవ్యయీభావ సమాసమునకు 'టచ్' అను సమాసాంత ప్రత్యయము చేరును. ఉప+రాజన్+టచ్ అని ఉండగా 'రాజన్' శబ్దములోని 'అన్' నకు క్రింది సూత్రముచేత లోపము చెప్పబడినది.

## 148. నస్తద్ధితే (6-4-144)

**నాన్తస్య భస్య టేర్లోపః స్యాత్తద్ధితే. ఉపరాజమ్. అధ్యాత్మమ్.**

నకారాంతమై 'భ' సంజ్ఞ కలిగిన ప్రాతిపదిక అంత్యనకారమునకు తద్ధితప్రత్యయం పరమైనపుడు లోపము వచ్చును.



ఉపరాజమ్ అధ్యాత్మమ్ - అచ్చుతోగాని యకారముతోగాని ప్రారంభించు 'సుప్' ప్రత్యయము, తద్ధితప్రత్యయమునకు ముందున్న ప్రాతిపదికకు 'భమ్' అను సంజ్ఞ వచ్చును (యచిభమ్ (1-4-18), తద్ధితాః (4-1-76) అను అధికారము నందు సమాసాంతములను పఠించుటవలన ప్రాతిపదికకు భసంజ్ఞ వచ్చును.

## 149. నపుంసకాదన్యతరస్యామ్ (5-4-109)

**అన్నన్తం యత్ క్లీబం తదన్తాదవ్యయీభావాట్టజ్వా స్యాత్. ఉపచర్మమ్. ఉపచర్మ.**

'అన్' అను శబ్దముతో అంతమగుచు నపుంసకలింగమైన అవ్యయీభావ సమాసమునకు వికల్పముగా 'టచ్' ప్రత్యయము చేరును. ముందు సూత్రము నుండి అన్నంత శబ్దము అనువర్తించును. ఉపచర్మ (నకారాంత అవ్యయీభావము) ఉపచర్మమ్ (టజంతము).

## 150. నదీపౌర్ణమాస్యాగ్రహాయణీభ్యః (5-4-110)

**వా టచ్ స్యాత్. ఉపనదమ్. ఉపనది. ఉపపౌర్ణమాసమ్. ఉపపౌర్ణమాసి. ఉపాగ్రహాయణమ్. ఉపాగ్రహాయణి.**

నదీ, పౌర్ణమాసీ, ఆగ్రహాయణీ అను పదములు ఉత్తర పదములుగా గలిగిన అవ్యయీభావసమాసములకు సమాసాంతమైన 'టచ్' ప్రత్యయము వైకల్పికముగా విధింపబడును. 'నద్యాః సమీపమ్' - ఉపనదమ్ ('టచ్' చేరగా ఏర్పడిన అవ్యయీభావసమాసము), ఉపనది (టచ్ చేరని సమాసము). ఉపపౌర్ణమాసమ్, ఉపపౌర్ణమాసి, ఉపాగ్రహాయణమ్ మరియు ఉపాగ్రహాయణి అనునవి ఉదాహరణములు.

## 151. ఝయః (5-4-111)

**ఝయన్తాదవ్యయీభావాట్టజ్వా స్యాత్. ఉపసమిధమ్. ఉపసమిత్.**

'ఝయ్' ప్రత్యాహారవర్ణములతో అంతమగు అవ్యయీభావసమాసములకు వైకల్పికముగా సమాసాంతమున టచ్ ప్రత్యయము వచ్చును.

ఉదా - ఉపసమిధమ్ (టచ్), ఉపసమిత్ (టచ్ ప్రత్యయం లేకుండా).

### 152. గిరేశ్చ సేనకస్య (5-4-112)

**గిర్యన్తాదవ్యయీభావాట్టజ్వా స్యాత్. సేనకగ్రహణం పూజార్థమ్. ఉపగిరమ్. ఉపగిరి.**

'సేనకుడు' అను పూర్వవైయాకరణుని గౌరవార్థము పాణిని ఈ సూత్రము పేర్కొని వైయాకరణుల అభిప్రాయములను వైకల్పికముగా గ్రహింపవలెనని చూపెను.

పూర్వసూత్రము నుండి 'అన్యతరస్యామ్' అనునది అనువర్తించుటచే పూర్వాచార్యుల స్మరణము గౌరవార్థమేనని తెలిచుయున్నది.

ఉపగిరమ్ (టచ్ ప్రత్యయంతో కూడిన అవ్యయీభావము), ఉపగిరి (వైకల్పికముగా 'టచ్' ప్రత్యయం చేరని అవ్యయీభావము).

ఇత్యవ్యయీభావసమాసప్రకరణమ్

## అథ తత్పురుషసమాస ప్రకరణమ్

"తస్య పురుషః" – "తత్పురుషః". ఈ తత్పురుష సమాసమున రెండు పదములుండును. అవి నామవాచకములై ఉండును. రెండు పదములు పూర్వ, ఉత్తర పదములుగా చెప్పబడును. వాటిలో ఒక పదం 'విభక్తి' ప్రత్యయం కలిగి విశేషణమై రెండవ పదముతో అన్వయిస్తూ ఉంటుంది. పూర్వపదము ప్రథమావిభక్తి తప్ప మిగిలిన విభక్తులయందు, ఉత్తరపదము ప్రథమావిభక్తి యందు ఉండును.

### 153. తత్పురుషః (2-1-22)

**అధికారోఽయం. ప్రాగ్బహువ్రీహేః.**

ఇది అధికార సూత్రము. "శేషో బహువ్రీహిః" (2-2-23) అను సూత్రము వరకు తత్పురుషసమాసములుగా చెప్పబడుతాయి. ఈ సూత్రమువల్ల ఏర్పడ్డ ప్రతిసమాసమునకు సమాససంజ్ఞతోపాటుగా తత్పురుష సంజ్ఞ కూడా విధింపబడును.

### 154. ద్విగుశ్చ (2-1-23)

**ద్విగురపి తత్పురుషసంజ్ఞః స్యాత్. ఇదం సూత్రం త్యక్తుం శక్యమ్. సంఖ్యాపూర్వో**



**ద్విగుశ్చేతి పఠిత్వా చకార బలేన సంజ్ఞాద్వయసమావేశస్య సువచత్వాత్. సమాసాన్తః ప్రయోజనమ్. పఞ్చరాజమ్.**

ద్విగు సమాసము కూడా తత్పురుష సంజ్ఞకమగును. "తద్ధితార్థోత్తరపదసమాహారే చ" (2-1-51) అను సూత్రముచే విధింపబడు సమాసమునకు "సంఖ్యాపూర్వో ద్విగుః" (2-1-52) అను సూత్రముచే ద్విగు సంజ్ఞ వచ్చును. అట్టి ద్విగు సంజ్ఞకములైన సమాసములు తత్పురుషసంజ్ఞకములు కూడా అవుతాయి.

ఈ సూత్రము చెప్పబడనిచో ద్విగుసంజ్ఞ చేత తత్పురుష సంజ్ఞ బాధింపబడి ద్విగు సమాసమునకు తత్పురుష సంజ్ఞ లేకుండెడిది. పంచానాం రాజ్ఞాం సమాహారః 'పంచరాజమ్' ఇత్యాదులందు సమాసాన్తములైన టచ్ ప్రత్యయాదుల అవసరమును ఈ సూత్రము తెలుపుచున్నది.

## ద్వితీయా తత్పురుషః

### 155. ద్వితీయా శ్రితాతీతపతితగతాత్యస్తప్రాప్తాపన్నైః (2-1-24)

**ద్వితీయాన్తం శ్రితాదిప్రకృతికైః సుబన్తైస్సహ వా సమస్యతే, స తత్పురుషః. కృష్ణం శ్రితః – కృష్ణశ్రితః. దుఃఖమతీతః – దుఃఖాతీతః.**

**(వా) గమ్యాదీనాముపసంఖ్యానమ్**

**గ్రామం గమీ – గ్రామగమీ. అన్నం బుభుక్షుః – అన్నబుభుక్షుః.**

ద్వితీయా విభక్త్యంతమగు పదము శ్రిత, అతీత, పతిత, గత, అత్యస్త, ప్రాప్త, ఆపన్న మొదలగు శబ్దములు ప్రకృతులుగా గల సుబంతముతో వికల్పముగా సమసించును. అది తత్పురుష సమాసమగును. "ప్రాక్ కడారాత్ సమాసః" (2-1-3) అను సూత్రము నుండి "సమాసః" అను పదము, "సహ సుపా" (2-1-4) అను సూత్రము నుండి 'సుపా' అను పదము, "తత్పురుషః" (2-1-22) అను సూత్రం నుండి 'తత్పురుష' అను పదములు అనువర్తించును. "విభాషా" (2-1-11) అను సూత్రము నుండి 'విభాషా' అను పదము కూడా అనువర్తించును. "సమర్థః పదవిధిః" (2-1-1) అను సూత్రముచే సమస్యమాన పదముల రెండింటికి మధ్య ఏకార్థీభావము కాని వ్యపేక్షా సామర్థ్యము గాని ఉండవలెనని నిర్ధారితమై ఉన్నది.

ఉదా – కృష్ణశ్రితః – కృష్ణం శ్రితః అని లౌకిక విగ్రహవాక్యము. కృష్ణ + అమ్,

శ్రిత+సు అని అలౌకిక విగ్రహవాక్యము. 'కృష్ణ +అమ్' అను ద్వితీయాంతమగు పదమునకు 'శ్రిత+సు' అను సుబంతముతో ఈ సూత్రముచే సమాసము. సమాసమును విధించు ఈ సూత్రమున "ద్వితీయా" అనునది ప్రథమానిర్దిష్టమగుటచే "ప్రథమానిర్దిష్టం సమాసముపసర్జనమ్" అను సూత్రముచే 'కృష్ణ' శబ్దమునకు ఉపసర్జన సంజ్ఞ వచ్చి "ఉపసర్జనం పూర్వమ్" అను సూత్రముచే పూర్వ నిపాతమును పొందును. 'సుపో ధాతు ప్రాతిపదికయోః' అను సూత్రముచే 'సుప్'లకు లోపం విధించినా, సమాసత్వము వలన మరల 'సు' ప్రత్యయం విధించి, రుత్వ విసర్గలు కూడ విధించగ "కృష్ణశ్రితః" అని ప్రథమైకవచనము రూపమేర్పడును.

అలాగే దుఃఖాతీతః – "దుఃఖమ్ అతీతః" అని లౌకికవిగ్రహవాక్యము. పైవిధముగానే 'దుఃఖాతీతః' అని రూపమగును. గ్రామగతః – గ్రామం గతః, గ్రామాత్యస్తః – గ్రామం అత్యస్తః, గ్రామప్రాప్తః – గ్రామం ప్రాప్తః ఇత్యాది ఉదాహరణములు ఇక్కడ చెప్పవచ్చును.

**(వా) గమ్యాదీనాముపసంఖ్యానమ్**

గ్రామగమీ - గ్రామం గమీ, అన్న బుభుక్షుః - అన్నం బుభుక్షుః. అను ఉదాహరణములు "ద్వితీయా శ్రితాతీత...." (2-1-24) ఇత్యాది సూత్రముచే సిద్ధింపబడకపోవుట వలన ఈ వార్తికముచే వార్తికకారుడు సిద్ధింపజేసెను.

## 156. స్వయం క్తేన (2-1-25)

**'ద్వితీయా' ఇతి న సమ్బధ్యతే, అయోగత్వాత్. స్వయంకృతస్యాపత్యం - స్వాయంకృతిః.**

"స్వయం" అనునది అవ్యయము. అందుచే "ద్వితీయా....." (2-1-24) ఇత్యాది సూత్రము నుండి 'ద్వితీయా' శబ్దము అనువర్తించదు.

'స్వయం' అను అవ్యయము సమర్థమై 'క్త' ప్రత్యయాంతమైన పదముతో సమసించును. అది తత్పురుష సమాసము. ఉదా – స్వయం కృతిః. సమాసము చేయుటవల్ల 'ఆదివృద్ధి' వచ్చును. ఉదా – స్వాయంకృతిః – స్వయం కృతస్య అపత్యం.

## 157. ఖట్వా క్షేపే (2-1-26)

**ఖట్వాప్రకృతికం ద్వితీయాన్తం క్తాన్తప్రకృతికేన సుబన్తేన సమస్యతే నిందాయామ్. ఖట్వారూఢో జాల్మః. నిత్య సమాసోఽయమ్. న హి వాక్యేన నిందా అవగమ్యతే.** 'క్తేన' అను పదము పూర్వసూత్రమునుండి అనువర్తించును. సమాసము చేత నింద గమ్యమానమైనపుడు ద్వితీయా విభక్త్యంత 'ఖట్వా' శబ్దము 'క్తా' న్త శబ్దముతో సమసించి తత్పురుషమగును.

ఖట్వా రూఢః (జాల్మః) – ఖట్వామ్ ఆరూఢః. 'ఖట్వారూఢుడు' అనగా జాల్ముడు. (చక్కగా యోచింపక పనిచేయువాడు, (క్రూరుడు) అని అర్థము. 'విభాషా' (2-1-11) అను అధికారము ఈ సూత్రమున అనువర్తిస్తున్ననూ ఫలించదు. వాక్యము చేత 'నింద' అవగతము కాదు కావున యీ సమాసము నిత్యసమాసము.

బ్రహ్మచారి మంచముపై నిద్రింపకూడదు. మంచముపై నిద్రించుట భోగములననుభవించుటను సూచించును. విద్యార్థి దశయందే వివాహాదికముల ద్వారా భోగముల యందు ఆసక్తుడయిన వ్యక్తి నిందార్హుడు. ఈ నిందను తెలుపుటకే ద్వితీయాతత్పురుష సమాసము విధింపబడినది.

## 158. సామి (2-1-27)

**సామికృతమ్.** 'అర్ధము' అను అర్థమును బోధించు 'సామి' అను అవ్యయము 'క్తా' న్తముతో సమసించి తత్పురుషయగును. 'సామికృతమ్' - అనగా సగము చేయబడినది.

## 159. కాలాః (2-1-28)

**క్తేనేత్యేవ. అనత్యన్తసంయోగార్థం వచనమ్. మాసప్రమితః ప్రతిపచ్చన్ద్రః. మాసం పరిచ్ఛేత్తుమారబ్ధవానిత్యర్థః.**

ద్వితీయా విభక్త్యన్తమైన కాలవాచక పదము సమర్థమైన క్తా న్త పదముతో వైకల్పికముగా సమసించి తత్పురుష సమాసమగునని భావము. ఈ సూత్రము యొక్క సంపూర్ణార్థమును నిర్ణయించుటకు దీని తర్వాత సూత్రము "అత్యన్తసంయోగే చ" (2-1-29) అను దానితో కలిపి వ్యాఖ్యానింపవలెను. రెండు సూత్రములందును ద్వితీయా విభక్త్యన్త కాలవాచకములే 'క్తా' న్త పదముతో సమసించునని తెలుపుచున్నది. అందువలన "అత్యన్త సంయోగే చ" (2-1-29) సూత్రములోని 'అత్యన్తసంయోగే' అను నియమమును అనుమాన బలముచే 'కాలాః' (2-1-28) అను సూత్రములో చేర్చవలెను. అపుడే 'కాలాః' అను సూత్రమునకు సార్థకత ఏర్పడును. ఉత్తరసూత్రము నుండి పూర్వ సూత్రమునకు నియమము అనువర్తించుటకు ఇది ఉదాహరణము.

ద్వితీయా విభక్త్యంత పదము అత్యంత సంయోగమున ప్రయోగింపబడినదా లేక అనత్యంత సంయోగమున ప్రయోగింపబడినదా అను విషయమును తత్ ప్రయోగానుసారమే గ్రహింపవలెను.

'వ్యాకరణ కర్తలు ఉన్నదానిని వివరించగలరే కాని తమ సూత్రములచే అర్థనియమము చేయలేరు' అను సత్యాన్ని ఈ సూత్రము తెలుపుచున్నది.

"మాసప్రమితః ప్రతిపచ్చంద్రః" అను ప్రయోగము నందు 'మాసప్రమితః' అను ప్రయోగము ద్వితీయా తత్పురుష అనత్యంత సంయోగార్థమున ఏర్పడినది. 'పాడ్యమి నాటి చంద్రుడు మాసమును కొలుచుటకు ప్రారంభించెను.' అని అనత్యంత సంయోగార్థము.

### 160. అత్యన్తసంయోగే చ (2-1-29)

**'కాలాః' ఇత్యేవ. అక్తాన్తార్థం వచనమ్. ముహూర్తం సుఖమ్ ముహూర్తసుఖమ్.**

"కాలాః" (2-1-28) అను పూర్వసూత్రము నుండి కాలాః, క్తేన అను పదములు అనువర్తించును. అవ్యవచ్ఛిన్న సంపర్కము కలిగిన కాలవాచకమైన ద్వితీయాంతపదము సమర్థమగు క్తాన్తముతో సమసించి వైకల్పికముగా తత్పురుష సమాసమగును.

ముహూర్తసుఖమ్ - ముహూర్తం సుఖమ్ (ముహూర్త కాలపరిమితి కలిగిన సుఖం) అను ద్వితీయా తత్పురుష అత్యంతసంయోగార్థమును బోధించును. ముహూర్తసమయము మొత్తం ప్రారంభం నుంచి అంతం (చివర) వరకు సుఖము వ్యాపించుచున్నది.

## తృతీయా తత్పురుషః

### 161. తృతీయా తత్కృతార్థేన గుణవచనేన (2-1-30)

**తత్కృతేతి లుప్తతృతీయాకమ్. తృతీయాన్తం తృతీయాన్తార్థకృతగుణవచనేన, అర్థశబ్దేన చ సహ ప్రాగ్వత్. శఙ్కులయా ఖణ్డః శఙ్కులాఖణ్డః. ధాన్యేనార్థో ధాన్యార్థః. తత్కృతేతి కిమ్ ? అక్ష్ణా కాణః.**

'తృతీయా, తత్కృత, అర్థేన, గుణవచనేన' అని పదవిభాగము. తత్కృత అనునది తృతీయాన్తకృత అను సమాసమునందు ఏర్పడిన మధ్యమ పదలోపి సమాసము.





అందువలన ఈ సూత్రము రెండు వాక్యములుగా విభజింపబడుచున్నది.

'తృతీయాన్తార్థకృతో యో గుణః తద్వాచినా సమస్యతే. అర్థశబ్దేన చ తృతీయాన్తం సమస్యతే.' 'తత్' అని దానిచే తృతీయాంతపదము గ్రహింపబడును.

తృతీయాంతము, తృతీయాంతమగు పదముయొక్క అర్థముచే ఏర్పడు 'గుణమును' తెలియబరిచే పదముతోను, 'అర్థ' శబ్దముతోను సమసించునని భావము.

శంకులాఖండః - శంకులయా ఖండః అని లౌకిక విగ్రహవాక్యము అనగా శంకులచే (కత్తెరచే) కావింపబడిన ఖండనము గలవాడు అని అర్థము. ఇచట 'ఖండ' శబ్దము గుణవాచకమున శంకులా + టా + ఖండ + సు అనే అలౌకిక విగ్రహవాక్యములో ఖండనమగు గుణము తృతీయాంతమగు శంకులా శబ్దార్థముచే ఏర్పడినది. కావున తృతీయాంత "శంకులా" శబ్దమునకు ఖండ + సు అను సుబంతముతో సమాసము, పూర్వనిపాత 'సుప్' లోపములు రాగా శంకులాఖండః అని సిద్ధించును.

ధాన్యార్థః - ధాన్యేన అర్థః అని లౌకిక విగ్రహము. ధాన్య + టా + అర్థ +సు అనునది అలౌకిక విగ్రహము. తృతీయాంతమగు ధాన్య శబ్దమునకు ఈ సూత్రముచే 'అర్థ' శబ్దముతో సమాసము, పూర్త నిపాత, సుబ్లోపములు విధింపగా ధాన్యార్థః అని సిద్ధించును.

తృతీయాంతమగు పదము యొక్క అర్థముచే ఏర్పడు గుణమును తెలుపు పదముతో తృతీయాంతమునకు సమానము అనుటచే 'అక్ష్ణా కాణః' అనునపుడు కాణత్వము (గ్రుడ్డితనము) అను గుణము అక్ష్ణా (కన్నుచే) అను తృతీయాంతపదముయొక్క అర్థముచే ఏర్పడినది. కావున ఈ సూత్రము ద్వారా తత్పురుష సమాసము రాదు. గ్రుడ్డితనమునకు రోగాదికము కారణమగునుకాని కన్ను కారణం కాదు. అందువలన 'అక్షికాణః' అని ఏర్పడదు. 'అక్ష్ణా కాణః' అని వ్యస్తముగానే ప్రయోగింపవలెను.

### 162. పూర్వసదృశసమోనార్థకలహనిపుణమిశ్రశ్లక్ష్ణైః (2-1-31)

**తృతీయాన్తమేతైః ప్రాగ్వత్. మాసపూర్వః. మాతృసదృశః. పితృసమః. ఊనార్థే. మాషోనం కార్షాపణమ్. మాషవికలమ్. వాక్కలహః. ఆచారనిపుణః. గుడమిశ్రః. ఆచారశ్లక్ష్ణః.**

**(వా) మిశ్రగ్రహణే సోపసర్గస్యాఽపి గ్రహణమ్. "మిశ్రం చానుపసర్గమసన్ధౌ"**

**ఇత్యత్రాఽనుపసర్గ గ్రహణాత్. గుడసమ్మిశ్రా ధానాః.**
**(వా) అవరస్యోపసంఖ్యానమ్ మాసేనావరో మాసావరః.**

తృతీయావిభక్త్యన్తమగు పదము సమర్థమగు పూర్వ, సదృశ, సమ, ఊనార్థ (తక్కువ అని అర్థవాచకములు), కలహ, నిపుణ, మిశ్ర, శ్లక్ష్ణ అను పదములతో వైకల్పికముగా సమసించి తత్పురుష సమాసమగును. మాసేన పూర్వః – మాసపూర్వః (నెల ముందువాడు) మాతృసదృశః, పితృసమః, మాషోనం (కార్షాపణమ్), వాక్కలహః, ఆచారనిపుణః, గుడమిశ్రః (బెల్లముతో కలిసినది), ఆచారశ్లక్ష్ణః అనునవి ఇతర ఉదాహరణములు.

'గుడసంమిశ్రః' అను సమాసములాంటివి ఈ సూత్రము చేత సాధింపబడవు. అందుకని వాటి కొరకు (వా) 'మిశ్రగ్రహణే సోఽపసర్గస్యాపి గ్రహణమ్' అను వార్తికముచే గుడసమ్మిశ్రమమనునది సాధింపబడును.

(వా) అవరస్యోపసంఖ్యానమ్. అవర శబ్దమును కూడ ఇచ్చట చేర్చవలసినది అని వార్తికము తెలుపుతున్నది. ఉదా – మాసేన అవరః మాసావరః.

## 163. కర్తృకరణే కృతా బహులమ్ (2-1-32)

**కర్తరి కరణే చ తృతీయా కృదన్తేన బహులం ప్రాగ్వత్. హరిణా త్రాతో – హరిత్రాతః. నఖైర్భిన్నో – నఖభిన్నః. "కృద్గ్రహణే గతికారకపూర్వస్యాపి గ్రహణమ్". (పరిభాష) నఖనిర్భిన్నః. కర్తృకరణే ఇతి కిమ్ ? భిక్షాభిరుషితః. హేతావేషా తృతీయా. బహులగ్రహణం సర్వోపాధివ్యభిచారార్థమ్. తేన " దాత్రేణ లూనవాని"త్యాదౌ న. కృతా కిమ్ ? కాష్ఠైః పచతితరామ్.**

కర్త్రర్థకమగు తృతీయాంతము, కరణార్థకమగు తృతీయాంతము సమర్థమగు కృదంత పదముతో బహుళముగా సమసించును, తత్పురుష సమాసమగును.

హరిత్రాతః – హరిణా త్రాతః అని అలౌకిక విగ్రహవాక్యము. హరి + టా అనునది కర్త్రర్థక తృతీయాంతమగుటచే దానికి 'త్రాత' అను కృదంతముతో సమాసము, ఉపసర్జన సంజ్ఞ ద్వారా హరిణా అను తృతీయాంతమునకు పూర్వనిపాతము, సుబ్లోపము, ప్రస్తుత సూత్రముచే సమాసము, సుబుత్పత్తి విధించి, రుత్వ విసర్గలు విధించగా 'హరిత్రాతః' అని సిద్ధించును. నఖభిన్నః – నఖైః భిన్నః (గోళ్లచే చీల్చబడిన–పండు) అని లౌకిక విగ్రహము. నఖ + భిస్ + భిన్న + సు అనునది అలౌకిక విగ్రహము. కరణార్థక తృతీయాంతమగు నఖ + భిస్ అనుదానికి భిన్న + సు అను కృదంతముతో సమాసము.





'కృద్గ్రహణే గతికారకపూర్వస్యాపి గ్రహణమ్' అను పరిభాషా సూత్రమునందలి 'కృత్' పదం కృదంతమును మాత్రమే కాక దానికి అనుబంధితములైన గతి, కారకములను కూడా గ్రహించును. అందువలన నఖైః నిర్భిన్నః – 'నఖనిర్భిన్నః' అను సమాసము సిద్ధించినది.

నఖనిర్భిన్నః – నఖైః నిర్భిన్నః అని లౌకిక విగ్రహము. 'భిన్న' అనునది కృదంతము, కాని 'నిర్భిన్న' అనునది కృదంతం కాదు అది కృదంతాంతము కనుక 'కర్తృకరణే' అను సూత్రము ద్వారా తృతీయాంతమగు 'నఖ' శబ్దమునకు 'నిర్భిన్న' శబ్దముతో సమాసము రాదు కావున పరిభాష చెప్పబడింది. ఇచట 'నిర్' అనునది 'గతి' సంజ్ఞకము. కావున తత్పూర్వకమగు 'భిన్న' శబ్దముతో (కృదంతం) కూడా తృతీయాంతమునకు సమాసము చెప్పగా "నఖనిర్భిన్నః" అని ఏర్పడును. సూత్రమున 'కర్తృకరణే' అని ఉండుటవలన 'భిక్షాభిరుషితః' ఇత్యాదులందు ఈ సూత్రము ప్రవర్తించదు.

'బహుళమ్' అను పదమును సూత్రమున గ్రహించుటచే ఈ సూత్రము కొన్ని చోట్ల నిత్యముగాను, కొన్ని చోట్లు వైకల్పికముగాను, మఱికొన్ని సంధర్భములందు సమాసము లేకుండ కూడ చెప్పవచ్చును. అందుకే "దాత్రేణ లూనవాన్" అనునపుడు సమాసము చెప్పబడలేదు. అట్లే 'కృతా' అను ప్రయోగమువలన కృదన్తములు సూచింపబడినవి కావున 'కాష్ఠైః పచతితరామ్' ఇత్యాదులందు కూడ ఈ సూత్రము ప్రవర్తించదు.

## 164. కృత్యైరధికార్థవచనే (2-1-33)

**స్తుతినిన్దాఫలకమర్థవాదవచనమధికార్థవచనమ్. తత్ర కర్తరి కరణే చ తృతీయా కృత్యైః సహ ప్రాగ్వత్. వాతచ్ఛేద్యం తృణమ్. కాకపేయా నదీ.**

'కర్తృకరణే కృతా బహులమ్' (2-1-32) అను పూర్వసూత్రమున తృతీయా విభక్త్యంతము పూర్వపదమైనపుడు, కృదంతము ఉత్తరపదముగా ఎట్లు సమసించునో తెలుపబడినది. ప్రస్తుత సూత్రమున కృత్యప్రత్యయాంతపదము ఉత్తరపదముగా ఎట్లు సమసించునో వివరింపబడుచున్నది.

'కర్తను కాని కరణమును కాని బోధించు తృతీయాంతపదము అర్థవాదమున గమ్యమానము చేయు కృత్యప్రత్యయాంత పదముతో వికల్పముగా సమసించును.

'వాతచ్ఛేద్యం తృణమ్' (గాలిచేతనే ఛేదింపబడు తృణమ్) అను వాక్యము నందు

'వాతచ్ఛేద్యం' అనునది తృతీయా తత్పురుషసమాసము. అంత అత్యంతసుకుమారమనే స్తుతి ఇందు గమ్యమానమగుచున్నది. 'కాకపేయా నదీ' అనుచోట సందర్భమును బట్టి నిందను గమ్యమానార్థముగా చెప్పవచ్చును. నది యందు నీళ్ళులేకపోవడం వల్ల కాకులు ముక్కును ముంచి నీరు త్రాగుచున్నవి అను అర్థమునందు నిందగమ్యమానము అగును. నీరు పూర్తిగా ఉండుటవలన నది ఒడ్డునుండియే కాకి నీరు త్రాగుచున్నది అను అర్థము కూడ గమ్యమానమగుచున్నదని చెప్పిన స్తుత్యర్థవాదమగును. ప్రకరణము ఆధారముగా స్తుతి, నిందలను గ్రహించవలసినది.

### 165. అన్నేన వ్యంజనమ్ (2-1-34)

**సంస్కారకద్రవ్యవాచకం తృతీయాన్తమన్నేన ప్రాగ్వత్. దధ్నా ఓదనో – దధ్యోదనః. ఇహాన్తర్భూతోపసేకక్రియాద్వారా సామర్థ్యమ్.**

వ్యంజనము అనగా రుచిగా అన్నం తినుటకు ఉపయోగపడే కూరలు మొదలైన వంటకాలు, పెరుగు, కూరలు, బెల్లం, పచ్చళ్ళు మొదలైనవి వ్యంజనములు.

తృతీయా విభక్త్యంతములయిన వ్యంజన వాచకములగు పదములు, అన్నవాచక శబ్దముతో వైకల్పికముగా సమసించి తత్పురుషమగునని సూత్రార్థము. దధ్యోదనః –దధ్నా ఓదనః (పెరుగన్నము).

ఈ సమాసమునందు మిశ్రము 'కలుపుట' అని అర్థము. పెరుగు కలిపిన అన్నము – పెరుగన్నము. పెరుగు, అన్నం రెండు కలవక ఉన్నచో అన్నమునకు రుచిరాదు కాన వ్యంజకత్వము ద్యోతకము కాదు.

### 166. భక్ష్యేణ మిశ్రీకరణమ్ (2-1-35)

**గుడేన ధానాః – గుడధానాః. మిశ్రణక్రియాద్వారా సామర్థ్యమ్.**

తినుటకు యోగ్యమైన ఘనపదార్థముగాని, ద్రవపదార్థము గాని భక్ష్యం. అటుకులు బెల్లముతో చేర్చినగాని వాటిని తినలేము. బెల్లం మిశ్రీకరణకు ఉపయోగించిన పదార్థము. తృతీయాంతమగు మిశ్రీకరణ పదార్థమును బోధించు భక్ష్యపదము సమర్థమగు అన్నవాచక పదముతో వైకల్పికముగా సమసించును. తత్పురుషమగును. గుడేన ధానాః – గుడధానాః (బెల్లపు బొరుగులు).

బొరుగులను బెల్లముతో కలిపిన గాని అది భక్ష్యం కాదు. అందువలన బొరుగులు తినుటకు యోగ్యముగా చేయు ప్రక్రియను మిశ్రీకరణం అని అంటారు. అందువలన





'మిశ్రీకరణం' అని యీ పదం పూర్వసూత్రమునందు కూడ సమన్వయించి 'దధ్యోదనః' అను తృతీయాతత్పురుషము సమర్థింపబడినది.

## చతుర్థీ తత్పురుషః

### 167. చతుర్థీతదర్థార్థబలిహితసుఖరక్షితైః (2-1-36)

**చతుర్థ్యన్తార్థాయ యత్తద్వాచినా అర్థాదిభిశ్చ చతుర్థ్యన్తం వా ప్రాగ్వత్. తదర్థేన ప్రకృతివికృతిభావ ఏవ గృహ్యతే. బలిరక్షితగ్రహణాజ్జ్ఞాపకాత్, యూపాయ దారు – యూపదారు, నేహ, రన్ధనాయ స్థాలీ. అశ్వఘాసాదయస్తు షష్ఠీ సమాసాః.**

**(వా) అర్థేన నిత్యసమాసో విశేష్యలిఙ్గతా చేతి వక్తవ్యమ్.**

**ద్విజాయాఽయం – ద్విజార్థః సూపః. ద్విజార్థా యవాగూః. ద్విజార్థం పయః. భూతబలిః. గోహితమ్. గోసుఖమ్. గోరక్షితమ్.**

ఇచట 'తత్' అనగా చతుర్థ్యంతము. తదర్థమనగా చతుర్థ్యంతముచే బోధింపబడునది అను అర్థము. తదర్థార్థమనగా చతుర్థ్యంతముచే బోధింపబడు అర్థము కొరకైన వస్తువు.

చతుర్థ్యంత సుబంతపదము సమర్థమగు చతుర్థ్యంతార్థముతోడను అర్థ, బలి, హిత, సుఖ, రక్షిత అనుపదములతోడను సమసించి తత్పురుషమగును.

'చతుర్థ్యంత పదముచే బోధింపబడునది ప్రయోజనముగా = నిమిత్తముగా గలదానిని బోధించుపదము' అని అర్థము. ప్రకృతి – వికృతి భావము ఇందు ద్యోతకమగును.

యూపదారు – యూపాయ దారు (యూపస్తంభము కొరకు దారువు) అని లౌకిక విగ్రహము. దారువు చతుర్థ్యంతమగు యూపస్తంభము కొరకు – కనుక యూప + ఙే అను చతుర్థ్యంతము దారు + సు అను సుబంతముతో సమసించును. దారువు యూపస్తంభమునకు నిమిత్తము లేక ప్రకృతి. యూపస్తంభము కొరకు నిర్దిష్టమైనది. అనగా యూపము దారువు యొక్క వికృతి లేక ప్రయోజనము. ఇట్టి ప్రకృతి – వికృతి భావము లేనిచోట ఈ సూత్రము ద్వారా సమాసము రాదు అని గ్రహింపవలసినది. రన్ధనాయ స్థాలీ (వంటకొరకు పాత్ర) అనుచోట స్థాలికి రంధనమునకు ప్రకృతి వికృతి భావము లేనందున సమాసము రాదు.

**(వా) అర్థేన నిత్యసమాసో విశేష్యలింగతా చేతి వక్తవ్యమ్**

అర్థ శబ్దముతో ఏర్పడు చతుర్థీ తత్పురుషకు ఈ వార్తికము ద్వారా నియమము

చెప్పబడినది. పూర్వ సూత్రముచే అర్థశబ్దముతో విధింపబడిన సమాసము నిత్యసమాసమనియు, అట్టి సమస్త పదము రాని విశేష్యము ఏ లింగముగ ఉండునో ఆ లింగమునందే ఉండునని చెప్పవలెను. అనగా –

విభాషా (2-1-11) అను అధికార సూత్రము 'అర్థ' అను పదముతో సమసించినపుడు వర్తింపదు. అంతేగాక విశేష్యము యొక్క లింగమునే గ్రహించును. ఉదా – ద్విజార్థః సూపః – 'ద్విజాయ అయం' అని లౌకిక విగ్రహవాక్యము. ద్విజ +ఙే అని అలౌకిక విగ్రహము. పూర్వసూత్రము ద్వారా ద్విజ + ఙే అను చతుర్థ్యంతమునకు 'అర్థ' శబ్దమునకు నిత్యసమాసము, సుప్ లోపము (ద్విజ + అర్థ) ఇచట విశేష్యము 'సూపః' అనునది కావున దానిననుసరించి (ద్విజ + అర్థ) 'ద్విజార్థః' అనునది కూడ పుంలింగము అయినది. 'యవాగూః' స్త్రీలింగ పదము విశేష్యమగునపుడు ద్విజార్థ అనియు, పయః అను నపుంసకలింగ పదము విశేష్యమగునపుడు 'ద్విజార్థమ్' అనియు రూపమేర్పడునని తెలుసుకోవలసినది.

భూతబలిః – భూతేభ్యః బలిః (భూతముల కొరకు బలి) అని లౌకిక విగ్రహవాక్యము. భూత + భ్యస్ + బలి + సు అనునది అలౌకిక విగ్రహవాక్యము. చతుర్థ్యంత భూత శబ్దమునకు పూర్వ సూత్రం ద్వారా బలి శబ్దముతో సమాసము.

గోహితమ్ – గవే హితమ్,

గోసుఖమ్ – గవే సుఖమ్,

గోరక్షితమ్ – గోభ్యః రక్షితమ్ అనునవి ఇతర ఉదాహరణలు.

## పంచమీ తత్పురుషః

### 168. పంచమీ భయేన (2-1-37)

**చోరాద్భయమ్, చోరభయమ్.**

**(వా) భయభీతభీతిభీభిరితి వాచ్యమ్**

**వృకభీతః, వృకభీతిః, వృకభీః.**

పంచమ్యంత పదము సుబంతమగు 'భయ' శబ్దముతో వికల్పముగా సమసించి తత్పురుషమగును.

'సుప్ సుపా' అను సమాసవిధాయక సూత్రము ఈ సూత్రమున అనువర్తించును.

'సుప్' స్థానమందు పంచమీ, సుపాస్థానమునందు భయేన అను శబ్దములను





సంధించగా ఈ సూత్రము లభ్యమగును. 'విభాషా' (2-1-11) అనునది కూడా అనువర్తించును. చోరభయమ్ – చోరాత్ భయమ్ అని లౌకిక విగ్రహవాక్యము. చోర+ఙసి+భయ+సు అని అలౌకిక విగ్రహవాక్యము. ప్రస్తుత సూత్రముచే పంచమ్యంతమగు చోర శబ్దము భయ శబ్దముతో సమసించి తత్పురుషమగును.

భయభీతభీతిభీభిరితి వాచ్యమ్ (వా)

భయ, భీత, భీతి, భీ మొదలగు భయార్థ ద్యోతక శబ్దములతో పంచమ్యంత సుబంతము సమసించును. అందువలన

వృకభీతః – వృకాత్ భీతః,

వృకభీతిః – వృకాత్ భీతిః

వృకభీః – వృకాత్ భీః అను సమాసములు సిద్ధించును.

### 169. అపేతాపోఢముక్తపతితాపత్రస్తైరల్పశః (2-1-38)

**ఏభిః సహాల్పం పంచమ్యన్తం సమస్యతే, స తత్పురుషః. సుఖాపేతః. కల్పనాపోఢః. చక్రముక్తః. స్వర్గపతితః. తరఙ్గాపత్రస్తః. అల్పశః కిమ్ ? ప్రాసాదాత్పతితః.**

పంచమ్యంతపదము అపేత, అపోఢ, ముక్త, పతిత, అపత్రస్త అనుపదములచే బోధింపబడు క్రియ అల్పశః అనగా కొంచెం కొంచెంగా, అంచెలంచెలుగా జరుగుతున్నదను అర్థము నందు, వికల్పముగా సమసించి తత్పురుష అగును.

సుఖాపేతః (కొంచెం కొంచెంగా సుఖాన్ని కోల్పోతున్నవాడు)

కల్పనాపోఢః (కొంచెం కొంచెంగా ఊహాలోకంలోనికి వెళ్తున్నాడు)

చక్రముక్తః (క్రమముగా తొలగిపోతున్న చక్రము కలిగిన రథం)

స్వర్గపతితః ( నెమ్మదిగా స్వర్గం నుంచి భూమిమీదకి దిగుతున్నవాడు)

'ప్రాసాదాత్ పతితః' అనునప్పుడు 'మేడమీది నుండి క్రింది పడటం క్షణకాలంలోనే' – జరుగుతుంది. కావున తత్పురుష సమాసము ఏర్పడదు. ఈ ఉదాహరణలను బట్టి క్రియను విభజించవచ్చు. అవి :

1. క్షణిక క్రియ
2. దీర్ఘ క్రియ అని రెండు విధములు.

క్షణిక క్రియ = కనురెప్పవాల్చు కాలంలో జరిగేది. దీర్ఘ క్రియ = దీర్ఘకాలంలో అంచెలుగా

జరిగేది. దీర్ఘక్రియను బోధించు అపేతాది పదములు పంచమీ విభక్త్యంతముతో ఏర్పడు సమాసములు ఈప్రస్తుత సూత్రమున వివరింపబడినవి.

## 170. స్తోకాన్తికదూరార్థకృచ్ఛ్రాణి క్తేన (2-1-39)

**స్తోకాన్ముక్తః. అల్పాన్ముక్తః. అన్తికాదాగతః. అభ్యాశాదాగతః. దూరాదాగతః. విప్రకృష్టాదాగతః. కృచ్ఛ్రాదాగతః. "పఞ్చమ్యాః స్తోకాదిభ్యః" ఇత్యలుక్.**

స్తోకార్థకములు (కొంచెము అను అర్థము కలవి), అన్తిక (సమీప), దూర (దూరము) అను పంచమ్యంత శబ్దములు, కృచ్ఛ్ర శబ్దముకూడ పంచమ్యంత 'క్త' ప్రత్యయాంతమగు సుబంతముతో (వికల్పముగా) సమసించును. ఇచ్చట 'పంచమీ' అను పదము అనువర్తించును.

స్తోకాన్ముక్తః – స్తోకాత్ ముక్తః (కొంచెముతో ముక్తుడయ్యెను), స్తోక + ఙసి, ముక్త + సు అని అలౌకిక విగ్రహవాక్యము. స్తోక + ఙసి అను పంచమ్యంతము 'ముక్త' అను 'క్త' ప్రత్యయాంతముతో ప్రస్తుత సూత్రము ద్వారా సమసించును.

" పంచమ్యాః స్తోకాదిభ్యః " (6-3-2) అను సూత్రం ద్వారా పూర్వపదవిభక్తికి అలుక్ అనగా విభక్తి లోపం రాదు.

పంచమీ విభక్తి లోపింపకపోవుటచే వ్యస్త పదములా కనిబడిననూ సమాసత్వమును పొంది స్తోకాన్ముక్తః అని అగును. అదేవిధంగా అల్పాన్ముక్తః, అన్తికాదాగతః, అభ్యాశాదాగతః, దూరాదాగతః. విప్రకృష్టాదాగతః, కృచ్ఛ్రాదాగతః ఇత్యాది సమాసరూపములు సిద్ధించును.

# షష్ఠీ తత్పురుషః

## 171. షష్ఠీ (2-2-8)

**రాజ్ఞః పురుషో రాజపురుషః.**

షష్ఠ్యంతము సమర్థమగు సుబంతముతో సమసించును, దానికి తత్పురుషమని పేరు.

రాజపురుషః – రాజ్ఞః పురుషః అని లౌకిక విగ్రహవాక్యము. రాజన్ + ఙస్ + పురుష + సు అని అలౌకిక విగ్రహము. రాజన్ + ఙస్ షష్ఠ్యంతమునకు పురుష + సు అను సుబంతముతో సమాసము.





## 172. యాజకాదిభిశ్చ (2-2-9)

**ఏభిః షష్ఠ్యన్తం సమస్యతే. " తృజకాభ్యాం కర్తరి " (2-2-15) ఇత్యస్య ప్రతిప్రసవోఽయమ్. బ్రాహ్మణయాజకః. దేవపూజకః.**

**(వా) గుణాత్తరేణ తరలోపశ్చేతి వక్తవ్యమ్**

**తరబన్తం యత్ గుణవాచి తేన సహ సమాసస్తరప్రత్యయ లోపశ్చ. "న నిర్ధారణే " (2-2-10) ఇతి "పూరణగుణ..... " (2-2-11) ఇతి చ నిషేధస్య ప్రతి ప్రసవోఽయమ్. సర్వేషాం శ్వేతతరః – సర్వశ్వేతః. సర్వేషాం మహత్తరః – సర్వమహాన్. (వా) కృద్యోగా చ షష్ఠీ సమస్యత ఇతి వాచ్యమ్ – ఇధ్మస్య ప్రవ్రశ్చనః – ఇధ్మప్రవ్రశ్చనః.**

షష్ఠ్యంతము యాజకాది గణములోని సుబంతములతో సమసించి తత్పురుషమగును. బ్రాహ్మణయాజకః – బ్రాహ్మణస్య యాజకః (బ్రాహ్మణుని యొక్క యాజకుడు). దేవతానాం పూజకః (దేవతలు యొక్క పూజకుడు)

రెండు శబ్దార్థముల మధ్య ఏదో ఒక సంబంధము కల్పించి ఏ రెండు పదాలనైనను 'షష్ఠీ' (2-2-8) అను సూత్రము ద్వారా సమసింపజేయవచ్చు. అలా చేయుటవలన షష్ఠీ తత్పురుష యొక్క అర్థనిర్ధారణము క్లిష్టమగును.

ఈ స్థితిని అదుపు చేయుటకు పాణిని మహర్షి 'న నిర్ధారణే' (2-2-10) అను సూత్రము నుండి 'కర్తరి చ' (2-2-16) అను సూత్రము వరకు గల సూత్రములతో షష్ఠీ తత్పురుష నిషేధాలను విధించెను. ఉదా – 'తృజకాభ్యాం కర్తరి' (2-2-15) అను సూత్రము షష్ఠీ విభక్త్యంతము 'తృచ్' మరియు 'అకచ్' ప్రత్యయములతో ఏర్పడిన సుబంతముతో సమాసమును నిషేధించుచున్నది. ఆ సూత్రము యొక్క పరిధి యందు షష్ఠ్యంతమైన 'బ్రాహ్మణ' శబ్దము 'తృచ్' ప్రత్యయాంతమైన 'యాజక' శబ్దముతో సమసించును. అందువలన బ్రాహ్మణయాజకః అని తత్పురుష సమాసము చెప్పబడదు. కాని బ్రాహ్మణ యాజకః, దేవపూజకః మొదలగు షష్ఠీ తత్పురుషములు శిష్ట ప్రయోగము నందు సాధువులుగా ఉన్నవి. "షష్ఠీ (2-2-8) సూత్రము ద్వారా విధింపబడిన షష్ఠీసమాస విధి "తృజకాభ్యాం కర్తరి' (2-2-15) సూత్రము ద్వారా నిషేధింపబడుచుండగా "యాజకాదిభిశ్చ" (2-2-9) సూత్రం ద్వారా "తృజకాభ్యాం కర్తరి" (2-2-15) సూత్రమునకు నిషేధమును విధించుచున్నది. సాధువులుగానున్న 'బ్రాహ్మణయాజక" అను సమాసమునందలి తృజకాంతములను ఒక గణముగా ఏర్పరచి సమాసవిధిని 'షష్ఠీ' అను సూత్రము యొక్క విస్తరణ రూపంలో పాణిని రూపొందించెను. ఈ విధానమునే

'ప్రతిప్రసవము' అని చెప్పవచ్చు. అనగా నిషేధమునకు నిషేధమును చేయుట అని అర్థము. ఇపుడు షష్ఠీ సమాస నిషేధసూత్రములు చెప్పబడుచున్నాయి.

**గుణాత్తరేణ తరలోపశ్చేతి వక్తవ్యమ్ (వా)**

'తరప్' ప్రత్యయాంతమైన గుణవచనము సమర్థమైన సుబంతముతో సమసించి 'తరప్' ప్రత్యయము లోపించును.

ఉదా – సర్వేషాం శ్వేతతరః – సర్వశ్వేతః

సర్వేషాం మహత్తరః – సర్వమహాన్.

ఇచట 'న నిర్ధారణే' (2–2–10) మరియు 'పూరణగుణసుహితార్థసదవ్యయతవ్య సమానాధికరణేన" (2–2–11) అను సూత్రములకు ఈ వార్తికము ప్రతిప్రసవము.

**కృద్యోగా చ షష్ఠీ సమస్యత ఇతి వాచ్యమ్ (వా)**

కృదంతమైన శబ్దముతో, సామర్థ్యము కల్గిన షష్ఠ్యంత శబ్దము సమసించునని చెప్పవలెను. అందువలన ఇధ్మస్య ప్రవ్రశ్చనః – ఇధ్మప్రవ్రశ్చనః అని సిద్ధించును. (ఇధ్మమును=కఱ్ఱను చీల్చు సాధనము)

## 173. న నిర్ధారణే (2–2–10)

**నిర్ధారణే యా షష్ఠీ సా న సమస్యతే. నృణాం ద్విజః శ్రేష్ఠః.**

**(వా) ప్రతిపదవిధానా షష్ఠీ న సమస్యత ఇత వాచ్యమ్. సర్పిషో జ్ఞానమ్.**

"యతశ్చ నిర్ధారణమ్" (2–3–41) అను సూత్రము ద్వారా విధింపబడిన షష్ఠ్యంతపదము సుబంతములో సమసింపదు. 'నృణాం ద్విజః శ్రేష్ఠః' అను వాక్యమున 'నృ' శబ్దము 'ద్విజ' శబ్దముతో సమసింపదు.

'నిర్ధారణము' అనగా 'నిశ్చయించుట' అని అర్థం. "మానవులలో ద్విజులు శ్రేష్ఠులు" అని నిర్ధారించుటచే 'యతశ్చ నిర్ధారణమ్' (2–3–41) సూత్రము ద్వారా షష్ఠీవిభక్తి ప్రత్యయము 'నృ' శబ్దమునకు వచ్చినది. అందువలన సమాసము నిషిద్ధము.

ఈ నిషేధసూత్రము యొక్క తాత్పర్యమును వార్తికకారుడు "ప్రతిపదవిధానా షష్ఠీ న సమస్యత ఇతి వాచ్యమ్" అని వాఖ్యానించెను. 'షష్ఠీ శేషే' (2–3–50) అను ఉత్సర్గ సూత్రముచే కాకుండా విశేషసూత్రములచే విధింపబడిన షష్ఠీవిభక్తి ప్రత్యయములు కలిగిన శబ్దములు సుబంతములతో సమసింపవు అని దీనికి అర్థము. అందువలన



"సర్పిషో జ్ఞానమ్" అనునపుడు కూడ సమాసము సాధ్యము కాదు.

## 174. పూరణగుణసుహితార్థసదవ్యయతవ్యసమానాధికరణేన (2–2–11)

**పూరణాద్యర్థైః, సదాదిభిశ్చ షష్ఠీ న సమస్యతే. పూరణే – సతాం షష్ఠః. గుణే – కాకస్య కార్ష్ణ్యమ్, బ్రాహ్మణస్య శుక్లాః. యదా ప్రకరణాదినా దన్తా ఇతి విశేష్యం జ్ఞాతం తదేదముదాహరణమ్. అనిత్యోఽయం గుణేన నిషేధః. "తదశిష్యం సంజ్ఞా ప్రమాణత్వాత్" ఇత్యాది నిర్దేశాత్. తేన ' అర్థగౌరవమ్ ', ' బుద్ధిమాన్ద్యమ్ ' ఇత్యాది సిద్ధమ్." సుహితార్థాస్తృప్త్యర్థాః ". ఫలానాం సుహితః. తృతీయాసమాసస్తు స్యాదేవ. స్వరే విశేషః. సత్ – ద్విజస్య కుర్వన్, కుర్వాణో వా. కిఙ్కర ఇత్యర్థః. అవ్యయమ్ – బ్రాహ్మణస్య కృత్వా. పూర్వోత్తరసాహచర్యాత్కృదవ్యయమేవ గృహ్యతే. తేన 'తదుపరి' ఇత్యాది సిద్ధమితి రక్షితః. తవ్యః – బ్రాహ్మణస్య కర్తవ్యమ్. తవ్యతా తు భవత్యేవ, స్వకర్తవ్యమ్. స్వరే భేదః. సమానాధికరణే, తక్షకస్య సర్పస్య. విశేషణసమాసస్త్విహ బహులగ్రహణాన్న. 'గోర్థేనోః' ఇత్యాదిషు 'పోటాయువతి......" ఇత్యాదీనాం విభక్త్యన్తరే చరితార్థానాం పరత్వాద్బాధకః షష్ఠీసమాసః ప్రాప్తః సోఽవ్యనేన వార్యతే.**

' న నిర్ధారణే ' (2–2–10) అను పూర్వసూత్రము ఈ సూత్రములోనికి అనువర్తించును.

షష్ఠ్యంతపదము పూరణార్థము, గుణార్థము, సుహితార్థములను బోధించు సుబంతములోను, శతృ, శానచ్ ప్రత్యయములతో ఏర్పడిన కృదంతములతోను, అవ్యయములతోను, తవ్యప్రత్యయాంతములతోను, సమానాధికరణమును ప్రతిపాదించు శబ్దములతోను సమసింపదు.

1. పూరణార్థమున – సతాం షష్ఠః (సత్పురుషులతో ఆరవవాడు)
2. గుణార్థమున – కాకస్య కార్ష్ణ్యమ్ (కార్ష్ణ్యమ్) (కాకి నలుపు)

(బ్రాహ్మణస్య శుక్లాః (దన్తాః) (బ్రాహ్మణుని తెల్లని దన్తములు)

గుణార్థమున నిషేధము అనిత్యము. ఏలయనగా "తదశిష్యం సంజ్ఞా ప్రమాణత్వాత్" ఇత్యాది విషయము పాణినిచే స్వయముగా నిర్దేశింపబడినది. సంజ్ఞాయాః ప్రమాణత్వాత్ సంజ్ఞా ప్రమాణత్వాత్ అని చెప్పబడినది. ఇట్లే "అర్థగౌరవమ్, బుద్ధిమాన్ద్యమ్" మొదలగు పదములు కూడ సిద్ధించును.

3. సుహితార్థమున – ఫలానాం సుహితః (ఫలములతో తృప్తి కలిగినది)

సుహిత అను పదమునకు తృప్తియను అర్థమున్నది కావున 'ఫలానాం తృప్తః' అనునపుడు కూడ సమాసము రాదు కాని 'ఫలేన తృప్తః ఫలతృప్తః' అను తృతీయా తత్పురుషము సాధురూపమే.

సూత్రమునందలి ' సత్ ' అను పదము ' తౌ సత్ ' (3-2-127) సూత్రముచేత సంకేతింపబడిన శతృశానచ్ ప్రత్యయములను చెప్పును. 'షష్ఠీ' (2-2-8) సూత్రము ద్వారా షష్ఠీ తత్పురుష ఏర్పడుటకు ఉన్న అవకాశమును ఈ సూత్రము నిషేధించుచున్నది. కావున ద్విజస్య కుర్వన్ కుర్వాణోవా, బ్రాహ్మణస్య కృత్వా, రాజ్ఞః పాటలీపుత్రస్య, తక్షకస్య సర్పస్య ఇత్యాది ఉదాహరణములో షష్ఠ్యంత పదము సుబంతముతో సమసింపదు. సూత్రమున 'సత్ అవ్యయ తవ్య' అని కృత్ ప్రత్యయములైన సత్ మరియు తవ్యముల మధ్యలోనున్న అవ్యయశబ్దము కృత్ప్రత్యయగతమైన అవ్యయమే అని తెలిసికోవలసినది. అందుకే 'బ్రాహ్మణస్య కృత్వా' ఇత్యాదులందు ఈ సూత్ర ప్రకారము షష్ఠీ రాదు. కాని 'తస్య ఉపరి=తదుపరి అనునపుడు అది సామాన్య అవ్యయము కావున షష్ఠీ సమాసము వచ్చును.

తవ్య మరియు తవ్యత్ అను రెండు ప్రత్యయములున్నప్పటికీ 'తవ్య' ప్రత్యయాంతమైన శబ్దముతో మాత్రమే సమాసము నిషిద్ధము. 'స్వకర్తవ్యమ్' అనునపుడు తవ్యత్ ప్రత్యయముతో నున్నది కావున ఈ రూపము సాధువే. అట్లే "పోటాయువతి" ఇత్యాది సూత్రము చేత "గోధేనుః" అను సమాసములు సిద్ధించినప్పటికి ప్రస్తుత సూత్రము చేత "గోర్థినో" అను వాటి యందు కూడ సమాసము నిషేధింపబడినది.

## 175. క్తేన చ పూజాయామ్ (2-2-12)

**మతిబుద్ధీతి సూత్రేణ విహితో యః క్తః తదన్తేన షష్ఠీ న సమస్యతే. రాజ్ఞాం మతో బుద్ధః పూజితో వా. రాజపూజిత ఇత్యాదౌ తు భూతే క్తాన్తేన సహ తృతీయాన్తస్య సమాసః.**

" మతిబుద్ధి పూజార్థేభ్యః ", (3-2-188) అను సూత్రము ద్వారా గౌరవించు, పూజించు అను అర్థమునందు 'క్త' ప్రత్యయము విధింపబడినది. అట్టి క్తాన్తపదము షష్ఠ్యన్త పదముతో సమసింపదు. 'రాజ్ఞాం పూజితః' అనునపుడు పూజిత శబ్దము పూజార్థమున ఏర్పడిన 'క్త' అంతముగా కలది, కావున షష్ఠీ తత్పురుషం రాదు. అయితే 'రాజపూజితః' అనునపుడు మాత్రము, భూతకాలార్థములో 'రాజ్ఞా పూజితః' అని తృతీయాన్తముతో విగ్రహవాక్యము చెప్పబడును.



## 176. అధికరణవాచినా చ (2-2-13)

**క్తేన షష్ఠీ న సమస్యతే, ఇదమేషామాసితం గతం భుక్తం వా.**

పూర్వసూత్రములనుండి 'న' మరియు 'క్తేన' అను పదములు అనువర్తించును.

అధికరణార్థము నందు విధింపబడిన 'క్త' ప్రత్యయాంత శబ్దముతో కూడ షష్ఠీ సమసింపదు. 'ఇదమేషామ్ ఆసితం', గతం, భుక్తం అనుచోట 'క్తోఽధికరణే చ ధ్రౌవ్యగతి ప్రత్యవసానేభ్యః" (3-4-76) అనుసూత్రము చేత 'క్త' ప్రత్యయము విధింపబడినది. అందువలన ఏషామ్ ఆసితం, ఏషాం గతం, ఏషాం భుక్తమ్ అనునపుడు తత్పురుషము రాదు.

## 177. కర్మణి చ (2-2-14)

**ఉభయప్రాప్తౌ కర్మణీతి యా షష్ఠీ సా న సమస్యతే. ఆశ్చర్యో గవాం దోహోఽగోపేన.**

" ఉభయ ప్రాప్తౌ కర్మణి " (2-3-66) అను సూత్రము ద్వారా కర్మకారకము నందు విహితమైన షష్ఠీవిభక్త్యంత ప్రత్యయము కలిగిన శబ్దము సుబంతముతో సమసింపదు. " ఉభయప్రాప్తౌ కర్మణి " అను సూత్రము ద్వారా 'కృత్' ప్రత్యయము కర్తను, కర్మను బోధించునపుడు కర్మవాచకమైన శబ్దమునకు షష్ఠీ విభక్తి విధింపబడునని ఇతః పూర్వమే వివరింపబడినది.

" ఆశ్చర్యో గవాం దోహః అగోపేన " (గోపాలకుడుకాని వాడిచేత పాలు పితకబడుట ఆశ్చర్యము) అనుచోట 'గవాం', 'దోహః' అను పదములు సమసింపవు.

## 178. తృజకాభ్యాం కర్తరి (2-2-15)

**కర్త్రర్థతృజకాభ్యాం షష్ఠ్యా న సమాసః. అపాం స్రష్టా. వజ్రస్య భర్తా. ఓదనస్య పాచకః. కర్తరి కిమ్ ? ఇక్షూణాం భక్షణమిక్షుభక్షికా. పత్యర్థ భర్తృశబ్దస్య తు యాజకాదిత్వాత్ సమాసః. భూభర్తా. కథం తర్హి " ఘటానాం నిర్మాతుః త్రిభువనవిధాతుశ్చ కలహః" ఇతి. శేషషష్ఠ్యా సమాస ఇతి కైయటః.**

షష్ఠ్యంత శబ్దము కర్త్రర్థక తృచ్, అక అను కృదంత ప్రత్యయాలతో ఏర్పడిన సుబంతముతో సమసింపదు. ఉదా – ' అపాం స్రష్టా ' 'వజ్రస్యభర్తా' అనునపుడు

సమాసము రాదు. సూత్రమున కర్తరి పదముపయోగించినందువలన "ఇక్షుభికికా" అనునది సాధురూపమే అగును. అట్లే 'భువః భర్తాః భూభర్తా' అనునపుడు కూడ ప్రత్యర్థక భర్త ృ శబ్దముండుట మఱియు ఈ పదము "యాజకాదిభ్యశ్చ" అను గణసూత్రమున పఠించినందున కూడ సమాసము చెప్పబడినది. " ఘటానాం నిర్మాతుః త్రిభువనవిధాతుశ్చ కలహః " అను ప్రయోగమునందు 'త్రిభువనవిధాతుః' అను షష్ఠీ తత్పురుష సమాసము శాస్త్ర విరుద్ధము. కాని ప్రసిద్ధ కవి ప్రయుక్తమై యున్నది. కైయటుడు మహాభాష్య వ్యాఖ్య యందు శేషషష్ఠి ద్వారా ఈ సమాసమును సమర్థించుట తప్ప మరో మార్గం లేదని సూచించెను. ప్రతిపదవిధాన షష్ఠిని గ్రహించినచో ఈ ప్రయోగము అసాధువే అగును.

### 179. కర్తరి చ (2-2-16)

**కర్తరి షష్ఠ్యా అకేన న సమాసః. భవతః శాయికా. నేహ తృజనువర్తతే. తద్యోగే కర్తురభిహితత్వేన కర్త ృషష్ఠ్యా అభావాత్.**

కర్త్రర్థమున చెప్పబడిన 'అక' ప్రత్యయము కలిగిన కృదంతంతో షష్ఠీ సమసింపదు.

భవతః శాయికా (గౌరవనీయులైన మీ యొక్క పాన్పు) అనుచోట "కర్తృకర్మణోః కృతి" (2-3-65) అను సూత్రము ద్వారా కర్త్రర్థమున షష్ఠీ విభక్తి చెప్పబడుట వలన షష్ఠీ తత్పురుషము రాదు.

సూచన : ( న నిర్ధారణే (2-2-10) నుండి కర్తరి చ (2-2-16) వరకు గల సూత్రములు 'షష్ఠీ' (2-2-8) సూత్రము యొక్క ప్రవృత్తిని నిషేధరూపమున విధింపబడుటవలన, వీటిని 'నియమసూత్రాలు' అని అంటారు. నిషేధ విధులు చెప్పి తరువాత ఇపుడు నిత్యసమాసముగా ఏర్పడు షష్ఠీతత్పురుషకు సంబంధించిన సూత్రం వర్ణింపబడుచున్నది.

### 180. నిత్యం క్రీడాజీవికయోః (2-2-17)

**ఏతయోరర్థయోరకేన షష్ఠీ నిత్యం సమస్యతే. ఉద్దాలకపుష్పభంజికా. క్రీడావిశేషస్య సంజ్ఞా. సంజ్ఞాయామితి భావే ణ్వుల్. జీవికాయామ్ – దన్తలేఖకః. తత్ర క్రీడాయాం వికల్పే జీవికాయాం 'తృజకాభ్యాం కర్తరి' ఇతి నిషేధే ప్రాప్తే వచనమ్.**

'తృజకాభ్యాం కర్తరి' (2-2-15) అను సూత్రము నుండి 'అక' అనువర్తించి 'అకేన' గా పరిణమించును. 'నిత్యం' అని చెప్పుటచే సమాసము నిత్యసమాసమై సంజ్ఞావాచకమగును. షష్ఠ్యంత శబ్దము అక ప్రత్యయముతో ఏర్పడిన కృదంతముతో



క్రీడ లేక జీవనోపాధిని సంజ్ఞారూపమున తెలుపుటచే నిత్యముగా సమసించి తత్పురుషమగును. 'ఉద్దాలక పుష్పభంజికా' అనునది ఒక క్రీడకు పేరు. ఆర్యావర్తపు తూర్పు ప్రాంతములో ఉద్దాలక పూలు విఱుచుటను ఒక రకమైన ఆటగా ఆడుకుంటారని ప్రసిద్ధి. 'దంతలేఖకః' అనేది ఒక జీవనోపాధికి పేరు. భంజికా మరియు లేఖక శబ్దములు 'అకచ్' ప్రత్యయాంతకృదంతములు. 'తృజకాభ్యాం కర్తరి' అను సూత్రమునకు ఈ ప్రస్తుత సూత్రము ప్రతిప్రసవము.

### 181. పూర్వాపరాధరోత్తరమేకదేశినైకాధికరణే (2-2-1)

**అవయవినా సహ పూర్వాదయః సమస్యన్తే, ఏకత్వసంఖ్యావిశిష్టశ్చేదవయవీ. షష్ఠీసమాసాపవాదః. పూర్వం కాయస్య పూర్వకాయః. అపరకాయః. 'ఏకదేశినా' కిమ్? పూర్వం నాభేః కాయస్య. 'ఏకాధికరణే' కిమ్ ? పూర్వశ్ఛాత్రాణామ్. సర్వోఽప్యేకదేశోఽహ్నా సమస్యతే, "సంఖ్యావిసాయ....." ఇతి జ్ఞాపకాత్. మధ్యాహ్నః. సాయాహ్నః. కేచిత్తు సర్వఏకాదేశః కాలేన సమస్యతే న త్వహ్నైవ, జ్ఞాపకస్య సామాన్యాపేక్షత్వాత్. తేన 'మధ్యరాత్రః', 'ఉపరతాః పశ్చిమరాత్రగోచరాత్' ఇత్యాది సిద్ధమిత్యాహుః.**

'ఏకదేశము' అనగా అవయవము, 'ఏకదేశి' యనగా అవయవి (అవయవము కలది) అని అర్థము. 'ఏకాధికరణము' అనగా ఏకద్రవ్యము.

పూర్వ, అపర, అధర, ఉత్తర అను పదములు ఏకద్రవ్యరూపమగు అవయవిని బోధించు సుబంతముతో సమసించును. పూర్వకాయః – పూర్వం కాయస్య (శరీరము యొక్క పూర్వభాగము) అని లౌకిక విగ్రహవాక్యము. పూర్వ + సు + కాయ + జస్ అని అలౌకిక విగ్రహవాక్యము. ఇక్కడ పూర్వ శబ్దమునకు ఏకత్వసంఖ్యా విశిష్టమగు అవయవిని తెలుపు కాయ శబ్దముతో సమాసము.

ఈ సూత్రంలో " పూర్వాపరాధరోత్తరమ్ " అనునది ప్రథమానిర్దిష్టము కావున పూర్వ, అపర ఇత్యాదులన్ని ఉపసర్జన సంజ్ఞకములు. వానికి సమాసమున పూర్వనిపాతము.

ఈ ప్రస్తుత సూత్రము తత్పురుష విధాయక " షష్ఠీ " అను సూత్రమునకు అపవాదసూత్రము. 'షష్ఠీ' అను సూత్రము ద్వారా సమాసము చెప్పినయెడల 'షష్ఠీ' అను సమాసవిధాయక సూత్రమున షష్ఠ్యంతమునకే ప్రథమానిర్దేశముండుటచే ఉపసర్జన

సంజ్ఞ, పూర్వనిపాతము, 'కాయ పూర్వ' అని అనిష్ట రూపములు సిద్ధించెడివి. అలాగే అపరకాయః (అపరం కాయస్య), అధరకాయః (అధరం కాయస్య) ఇత్యాది సమాసములు సిద్ధించును.

'పూర్వః ఛాత్రాణామ్' అనుచోట 'ఛాత్ర' అను అవయవ వాచకశబ్దము ఏకత్వసంఖ్యావిశిష్టము కాదు. ఇది బహుత్వసంఖ్యా విశిష్టము అయినందున ఈ సూత్రము ద్వారా సమాసము సిద్ధించదు. మఱియు 'ఏకదేశినా' అని చెప్పుట వలన 'పూర్వం నాభేః కాయస్య' అనునపుడు కూడ సమాసము రాదు.

మధ్యాహ్నః, సాయాహ్నః అనుసమాసములు " సంఖ్యావిసాయపూర్వస్యాహ్న స్యాహన్నన్యతరస్యామ్ " (6-3-110) అను సూత్రములోని 'అహన్' శబ్దమునకు 'అహ్న' అను ఆదేశమును పురస్కరించుకొని సమర్థింపవలెను. అందువలన భట్టోజిదీక్షితులు "సర్వోఽప్యేకదేశోఽహ్నా సమస్యతే", 'సంఖ్యావిసాయ' అని వ్యాఖ్యానించెను. ఈ రూపసాదృశ్యము ద్వారా మధ్యరాత్రః, పశ్చిమ రాత్రః అను సమాసములు కూడా సిద్ధించును.

## 182. అర్ధం నపుంసకమ్ (2-2-2)

**సమాంశవాచ్యర్ధశబ్దో నిత్యం క్లీబే స ప్రాగ్వత్.**

(వా) ఏకవిభక్తావషష్ఠ్యన్తవచనమ్

**ఏకదేశిసమాసవిషయకోఽయముపసర్జన సంజ్ఞా నిషేధః. తేన పంచఖట్వీత్యాది సిధ్యతి. అర్ధం పిప్పల్యాః – అర్ధపిప్పలీ. క్లీబే కిమ్ ? గ్రామార్ధః. ద్రవ్యైక్య ఏవ. అర్ధం పిప్పలీనామ్.**

పూర్వసూత్రమునుండి "ఏకదేశినైకాధికరణే" అనుపదము అనువర్తించును.

అర్ధ శబ్దమునకు 'అంశము' అనియు 'సగభాగము' అనియు అర్థములు గలవు. అంశవాచకము అగు 'అర్ధశబ్దము' పుంలింగ, నపుంసకముల యందుండును. సమాంశ (సగభాగము) వాచకమగు అర్ధశబ్దము నపుంసకలింగమున మాత్రమే ఉండును. నిత్యనపుంసకలింగమందుండు సమాంశవాచియగు అర్ధ శబ్దము ఏకత్వ సంఖ్యా విశిష్టమగు అవయవి వాచకము అగు సుబంతముతో సమసించి తత్పురుషమగును.
అర్ధపిప్పలీ – అర్ధం పిప్పల్యాః అని లౌకిక విగ్రహవాక్యము. అర్ధ + సు + పిప్పలీ +



జస్ అని యుండగా ఈ సూత్రముచే సమాసము, సుప్‌నకు లోపము, పూర్వనిపాతం వచ్చి 'అర్ధపిప్పలీ అని అగును. ' అర్ధ ' శబ్దమునకు పూర్వనిపాతము చెప్పుట వలన యీ సూత్రము కూడా 'షష్ఠీ' (2-2-8) సూత్రమునకు అపవాదమే. నిత్యనపుంసకమగు అర్ధశబ్దమే ఏకత్వసంఖ్యా విశిష్టమగు అవయవి వాచకముతో సమసించుట వలన, 'గ్రామస్య అర్ధః' అనునపుడు 'షష్ఠీ' అను సూత్రము ద్వారా సమాసము వచ్చును. ఈ సూత్రము చేత సమాసము వచ్చిన యెడల అర్ధగ్రామః అనే విరుద్ధరూపం సిద్ధించును. నిత్యనపుంసకమగు అర్ధ శబ్దము అవయవి వాచకము, ఏకత్వసంఖ్యా విశిష్టము అయినపుడే సమసించినచో అర్ధం పిప్పలీనాం ఇత్యాదులందు ఈ సూత్రము ద్వారా సమాసము రాదు.

## 183. ద్వితీయతృతీయచతుర్థతుర్యాణ్యన్యతరస్యామ్ (2-2-3)

**ఏతాన్యేకదేశినా సహ ప్రాగ్వద్వా. ద్వితీయం భిక్షాయాః ద్వితీయభిక్షా. ఏకదేశినా కిమ్ ? ద్వితీయం భిక్షాయా భిక్షుకస్య. అన్యతరస్యామ్ గ్రహణసామర్థ్యాత్ 'పూరణగుణే' తి నిషేధం బాధిత్వా పక్షే షష్ఠీసమాసః. భిక్షాద్వితీయమ్.**

ద్వితీయ, తృతీయ, చతుర్థ, తుర్య అను పదములు అవయవములు కలిగిన అవయవిని బోధించు సుబంతముతో వైకల్పికముగా సమసించి తత్పురుషములగును. ద్వితీయం భిక్షాయాః – ద్వితీయభిక్షా (ద్వితీయ అర్థమగు భిక్ష) ఏకదేశినా అని చెప్పడము వలన "ద్వితీయం భిక్షాయా భిక్షుకస్య" అనునపుడు సమాసము చెప్పబడదు. "అన్యతరస్యామ్" గ్రహణసామర్థ్యము వలన "పూరణగుణ" ఇత్యాది సూత్రముచే విధింపబడిన నిషేధమును బాధించిన పక్షమున 'భిక్షాద్వితీయం' అనుచోట షష్ఠీ సమాసము వచ్చును.

## 184. ప్రాప్తాపన్నే చ ద్వితీయయా (2-2-4)

**పక్షే 'ద్వితీయా శ్రిత......' ఇత్యాదినా సమాసః. ప్రాప్తో జీవికాం – ప్రాప్తజీవికః. జీవికాప్రాప్తః. ఆపన్నజీవికః. జీవికాపన్నః. ఇహ సూత్రే " ద్వితీయయా, అ " ఇతి ఛిత్వా అకారోఽపి విధీయతే. తేన జీవికాం ప్రాప్తా స్త్రీ–ప్రాప్తజీవికా. ఆపన్నజీవికా.** ప్రాప్త, ఆపన్న అను శబ్దములు వైకల్పికముగా ద్వితీయా విభక్త్యంత పదములతో సమసించి తత్పురుషమగును. ఈ సూత్రమున 'ఏకదేశిన్', 'ఏకాధికరణ' పదములు అనువర్తించును. ఇందువలన ఈ సూత్రము ద్వారా సమాసము

ఏర్పడకపోయిన యెడల "ద్వితీయాశ్రితాతీత పతితగతాత్యస్త ప్రాప్తాపన్నైః" (2-1-24) అను సూత్రసహాయముతో ద్వితీయాతత్పురుషము ఏర్పడును.

ప్రాప్తో జీవికామ్ - ప్రాప్తజీవికః (జీవనోపాయమును పొందినవాడు) అని ప్రథమాతత్పురుషము ఏర్పడును. వైకల్పికంగా 'జీవికాప్రాప్త' అని "ద్వితీయాశ్రితాతీత...." (2-1-24) సూత్రము ద్వారా ద్వితీయాతత్పురుషము ఏర్పడును.

'ప్రాప్తజీవికా' అని స్త్రీలింగసమాసము. ప్రయోగములో ఆకారాన్తము ఎలా సిద్ధించును అను సంశయమునకు భట్టోజి దీక్షితులు " ఇహ సూత్రం " ద్వితీయయా అ ఇతి ఛిత్వా అకారోऽపి విధీయతే " అని సూచించారు. ద్వితీయయా అను పదమును 'ద్వితీయయా అ ' అని పదచ్ఛేదము చేయవలెను. ద్వితీయాంత పదముతో సమసించును అని ఒక భాగార్థము. ' అ ' అను అచ్చు సమాసము చివర చేరును అని రెండవ భాగార్థము. అందువలన 'ప్రాప్తజీవికా' అను ఆకారాన్త సమాసము కూడ ఏర్పడును.

### 185. కాలాః పరిమాణినా (2-2-5)

**పరిచ్ఛేద్యవాచినా సుబన్తేన సహ కాలాః సమస్యన్తే. మాసో జాతస్య యస్య సః మాసజాతః. ద్వ్యహజాతః. ద్వయోరహ్నోస్సమాహారో ద్వ్యహః. ద్వ్యహో జాతస్య యస్య స ఇతి విగ్రహః.**

**(వా) ఉత్తరపదేన పరిమాణినా ద్విగోః సిద్ధయే బహూనాం తత్పురుషస్యోపసంఖ్యానమ్**

**ద్వే అహనీ జాతస్య యస్య సః - ద్వ్యహ్నజాతః. "అహ్నోऽహ్న " ఇతి వక్ష్యమాణోऽహ్నాదేశః. పూర్వత్ర తు " న సంఖ్యాదేస్సమాహారే" ఇతి నిషేధః.**

పరిచ్ఛేద్య (కొలువబడు) వాచకములైన సుబంతములతో కాలవాచక శబ్దములు సమసించును అని సూత్రార్థము. మాసోజాతస్య - మాసజాతః (ఒక నెల ముందు పుట్టినవాడు) ఇచ్చట 'జాతః' అను పదముచే బోధింపబడు వాడు 'మాస' అను కాలవాచకము ద్వారా కొలువబడుచున్నాడు కావున 'మాసజాతః' అనునది సిద్ధించును.

'ద్వే అహనీ జాతస్య యస్య సః ' అను విగ్రహవాక్యమున 'ద్వే', 'అహని' అను పదములు సమసించగా "అహ్నోऽహ్న" అను సూత్రము ద్వారా అహ్నాదేశము వచ్చి 'ద్వ్యహ్నజాతః' అని సమసించును.

'ద్వ్యహజాతః' అనునపుడు 'ద్వయోరహ్నోస్సమాహారః" అని ద్విగుసమాసము కావున 'న సంఖ్యాదేస్సమాహారే" అను సూత్రము ద్వారా అహ్నాదేశము నిషేధింపబడినది.



ఇచట పరిమాణవాచకమైన ఉత్తరపదముతో ద్విగుసమాసం సిద్ధించుటకు బహుపద తత్పురుష సమాసమును అంగీకరింపవలెనని ఈ వార్తికము చెప్పుచున్నది. శిష్ట ప్రయోగముల సాధుత్వాన్ని నిరూపించడమే వార్తికకారుని ఉద్దేశము.

## సప్తమీ తత్పురుషః

### 186. సప్తమీ శౌణ్డైః (2-1-40)

**సప్తమ్యన్తం శౌణ్డాదిభిః ప్రాగ్వద్వా. అక్షేషు శౌణ్డః - అక్షశౌణ్డః. అధిశబ్దోऽత్ర పఠ్యతే. "అధ్యుత్తరపదాత్........" ఇతి ఖః. ఈశ్వరాధీనః.**

సప్తమ్యంతమగు పదము "శౌండ" మొదలగు సుబంతములతో సమసించి తత్పురుషమగును. 'శౌండైః' అను బహువచన ప్రయోగము ద్వారా "శౌండ" గణములోని పదములు అను అర్థము గ్రహింపవలసినది.

అక్షశౌండః - అక్షేషు శౌండః (పాచికల ఆటలో నేర్పరి) అని లౌకికవిగ్రహము. అక్ష + సుప్ + శౌండ + సు అని అలౌకిక విగ్రహము. ప్రస్తుత సూత్రము ద్వారా అక్ష + సుప్ అను సప్తమ్యంతమునకు శౌండ + సు అను సుబంతముతో సమసించును.

ఇక్కడ శౌండాది గణమున 'అధి' అను అవ్యయము కూడా ఇవ్వబడినది. "అధ్యుత్తరపదాత్ ఖః" (5-4-7) అను సూత్రముచే 'ఖ' అను తద్ధిత ప్రత్యయము నిత్యముగా చేరును. 'ఖ' కారస్థానమున 'ఈన' (ఆయనేయీనీయియః ఫఢఖఛఘాం ప్రత్య....." అను సూత్రాధారంగా) అని ఆదేశము రాగా 'ఈశ్వరాధీనః' అని సప్తమీ తత్పురుషము సిద్ధించును.

### 187. సిద్ధశుష్కపక్వబన్ధైశ్చ (2-1-41)

**ఏతైః సప్తమ్యన్తం ప్రాగ్వత్. సాఙ్కాశ్యసిద్ధః. ఆతపశుష్కః. స్థాలీపక్వః. చక్రబన్ధః.**

సప్తమ్యన్త పదము సమర్థములైన సిద్ధ, శుష్క, పక్వ, బన్ధ అను పదములతో సమసించి తత్పురుషయగును.

సాంకాశ్యసిద్ధః - సాంకాశ్యే సిద్ధః (సాంకాశ్య దేశమున ఉత్పన్నమైనది)
ఆతపశుష్కః - ఆతపే శుష్కః (ఎండలో ఎండినది)
స్థాలీపక్వః - స్థాల్యాం పక్వః (పాత్రయందు వండినది)

చక్రబంధః - చక్రే బంధః (చక్రము నందు అమర్చబడినది)

## 188. ధ్వాఙ్క్షేణ క్షేపే (2-1-42)

**ధ్వాఙ్క్షవాచినా సహ సప్తమ్యన్తం సమస్యతే నిందాయామ్. తీర్థే ధ్వాఙ్క్ష ఇవ తీర్థధ్వాఙ్క్షః. తీర్థకాక ఇత్యర్థః.**

నింద గమ్యమానమైనపుడు సప్తమ్యంతపదము ధ్వాఙ్క్షపదముతో, దాని పర్యాయపదములతో సమసించి తత్పురుషమగును. తీర్థధ్వాఙ్క్షః - తీర్థే ధ్వాఙ్క్షః (తీర్థస్థలమునందున్న కాకి). ఈ సమాసమును 'అత్యాశపరుడైన' వాని నిందలో చెప్పబడినది.

తీర్థస్థానమున ఉన్న కాకి ఎక్కువ కాలము అక్కడ నిలవదు. అలాగే ఆశాపరుడైన శిష్యుడు ఒక గురువుగారి వద్ద విద్యాభ్యాసము పూర్తయ్యేంతవరకు ఉండు స్థలమును మార్చుచుండును, అందువలన వాడు ఏ శాస్త్రములోను పట్టు సాధించలేడు. ఈ విధమైన వారి నుద్దేశించి తీర్థకాకః, తీర్థవాయసః, తీర్థధ్వాంక్షః ఇత్యాది సప్తమీ తత్పురుషలు ఏర్పడినవి. నింద వాక్యము వలన ప్రకటితము కాదు కావున ఈ సమాసములు నిత్య సమాసములు. 'తీర్థే ధ్వాంక్షః తిష్ఠతి' అనునపుడు నింద లేదు కావున ఈ సమాసము రాదు.

ఖట్వాక్షేపే (2-1-26) సూత్రము ద్వారా సాధింపబడిన 'ఖట్వారూఢః' అనునది కూడా నిత్యసమాసము.

## 189. కృత్యైరృణే (2-1-43)

**సప్తమ్యన్తం కృత్యప్రత్యయాన్తైస్సహ ప్రాగ్వదావశ్యకే. మాసేదేయమ్ ఋణమ్. ఋణగ్రహణం నియోగోపలక్షణార్థమ్. పూర్వాహ్ణే గేయం సామ.**

ఋణము (అప్పు) అను అర్థము గమ్యమానమైనపుడు సప్తమ్యంతము కృత్య ప్రత్యయాంత పదముతో సమసించి తత్పురుషమగును. మాసే దేయమ్ (నెలరోజుల పరిమితిలో తిరిగి చెల్లించవలసిన ఋణము)
ఇచట సప్తమ్యంత విభక్తి ప్రత్యయము " తత్పురుషే కృతి బహులమ్ " (6-3-14) అను సూత్ర సహాయముతో లోపింపదు. 'ఋణము' అను పదమునకు కేవలం



ఆర్థికపరమైన విషయమే కాక మతసంబంధమైన ఋణము కూడా గ్రహించ వచ్చునని తెలియుచున్నది.

'పూర్వాహ్ణే గేయం సామ' అనగా ఉదయకాలంలో పఠించవలసిన సామమంత్రములు అను అర్థమున 'పూర్వాహ్ణే గేయం' అను సప్తమీ తత్పురుష సమాసము ఏర్పడినది.

ఉదయము గానం చేయవలసిన సామమంత్రములను పఠించనిచో పాపమును పొందును. అందుచే సామగానం మతపరమైన ఋణముగా చెప్పబడినది.

## 190. సంజ్ఞాయామ్ (2-1-44)

**సప్తమ్యన్తం సుపా ప్రాగ్వత్సంజ్ఞాయామ్. వాక్యేన సంజ్ఞాఽనవగమాన్నిత్యసమాసోఽయమ్. అరణ్యేతిలకాః. వనేకసేరుకాః. "హలదన్తాత్సప్తమ్యాః......" ఇత్యలుక్.**

సప్తమ్యంతపదము సమర్థమగు సుబంతముతో ఏర్పడిన సమాసము సంజ్ఞగా ఉపయోగించబడు సందర్భమున నిత్యముగా సమసించును.
అరణ్యే తిలకాః ('నూనెను ఇవ్వని అడవి నువ్వుల' కు సంజ్ఞ)
వనేకశేరుకాః (అనపేక్షితముగా దొరికిన వస్తువునకు సంజ్ఞ)
"హలదన్తాత్సప్తమ్యాః సంజ్ఞాయామ్" (6-3-9) అను సూత్రముచే పూర్వపదము యొక్క సప్తమీ విభక్తికి లోపము రాదు.(అలుక్ - లోపము లేకుండుట)

## 191. క్తేనాహోరాత్రావయవాః (2-1-45)

**అహ్నో రాత్రేశ్చావయవాః సప్తమ్యన్తాః క్తాన్తేన సహ ప్రాగ్వత్. పూర్వాహ్ణకృతమ్. అపరరాత్రకృతమ్. అవయవగ్రహణం కిమ్ ? అహ్ని దృష్టమ్.**

సప్తమ్యంతమగు రాత్రింబవలు యొక్క విభాగములను బోధించు పదములు క్తాన్తముతో సమసించును. అది తత్పురుషము.
పూర్వాహ్ణకృతమ్ - పూర్వాహ్ణే కృతమ్ (రోజులోని ముందుభాగం (పూర్వభాగం) లో చేయబడినది) పూర్వాహ్ణమనగా దినపూర్వభాగమునకు కాలవాచకము అలాగే అపరరాత్రమ్ అనునవి కూడా ఇతర ఉదాహరణలు.

కాని సూత్రములో "అవయవము" అని గ్రహించటమెందుకు అని ప్రశ్నిస్తే కనుక 'అహ్నా' అను సంపూర్ణ రాత్రి లేదా పగటి కాలములో కూడదని నిర్దేశించడమైనది. అందువలననే 'అహ్నాకృతమ్' అనునపుడు సమాసము రాదు.

## 192. తత్ర (2-1-46)

**'తత్ర' ఇత్యేతత్సప్తమ్యన్తం క్తాన్తేన సహ ప్రాగ్వత్. తత్రభుక్తమ్.**

'తత్ర' అను అవ్యయము క్తాంతముతో సమసించి తత్పురుష యగును.

'సప్తమ్యాస్త్రల్' (5-3-10) అను సూత్రము ద్వారా సప్తమ్యర్థ బోధకమైన క్రియతో అన్వయించు అవ్యయము క్తాంతముతో సమాసము చేసినపుడు పూర్వపదములో ఎటువంటి మార్పురాదు. ఉదా : తత్రభుక్తమ్ అనునది.

తత్ర, భుక్తమ్ అని వ్యస్తముగా చెప్పినయెడల 'తత్ర' శబ్దమునకు ఒక ఉదాత్త స్వరము, 'భుక్తమ్' నకు ఒక ఉదాత్తస్వరములుగా ఉండును. స్వరప్రక్రియ యందు ఉన్న వైశిష్ట్యమును గమనించి 'తత్రభుక్తమ్' అను దానిని సమాసముగా పరిగణింపబడినది. కాని అర్థమున ఎటువంటి మార్పులేదు.

## 193. క్షేపే (2-1-47)

**సప్తమ్యన్తం క్తాన్తేన ప్రాగ్వన్నిందాయామ్. అవతప్తేనకులస్థితం త ఏతత్.**

క్తేన' అనునది పూర్వసూత్రమునుండి అనువర్తించును. నింద గమ్యమాన మైనప్పుడు సప్తమ్యంతము క్తాన్తముతో సమసించి తత్పురుషమగును.

అవతప్తేనకులస్థితమ్ – అవతప్తే నకులస్థితమ్ అని ఉదాహరణమున 'తత్పురుషే కృతి బహులమ్' (6-3-14) అను సూత్రము చేత పూర్వపదవిభక్తి లోపించదు.

'అవతప్తేనకులస్థితమ్ త ఏతత్' అనునది ఒక దేవదత్తుడికి ఉద్దేశించి చెప్పబడినది.

' ఓ దేవదత్తా నీవు చేసిన పని కాలుతున్న భూమిమీద ఉన్న ముంగిసవలె ఉన్నది.' అనగా దేవదత్తుడు చేసినట్టి పనిలో పరిపూర్ణతలేదు అను నింద తెలుస్తున్నది.

## 194. పాత్రేసమితాదయశ్చ (2-1-48)

**ఏతే నిపాత్యంతే క్షేపే. పాత్రేసమితాః. భోజనసమయే ఏవ సంగతా న తు కార్యే. గేహేశూరః. గేహేనర్దీ. ఆకృతిగణోఽయమ్. చకారోఽవధారణార్థః. తేనైషాం సమాసాంతరే ఘటకతయా ప్రవేశో న. పరమాః పాత్రేసమితాః.**



'పాత్రేసమితాదయః' అను బహువచనముచే గణము అను అర్థము లభించినది. ఈ గణమున పఠించిన 'పాత్రేసమితాః' మొదలగు సమాసములు తత్పురుషములు. సూత్రములోని చకారము ' ఈ గణమున పేర్కొన్న సమాసములకు తప్ప వేరే వాటికి సాధుత్వం లేదు.' అని తెలుపును. అనగా ఇంతవరకు ప్రయోగములోనున్న ఈ సప్తమీ తత్పురుష సమాసములను తప్ప క్రొత్తగా చేయకూడదని పాణిని నిర్దేశించి యున్నాడు.

ఉదా : 'పాత్రేసమితః' (కంచం దగ్గర తినడంలో మాత్రము చురుకయినవాడు, అంటే అది తప్ప ఇతర విషయాలలో ఏమీ చేయలేని వాడు అని అర్థము).

ఈగణమున పూర్వపదము యొక్క సప్తమీ విభక్తి ప్రత్యయమునకు లోపము లేదు.

గేహేశూరః (ఇంట్లోనే వీరుడు, కాని బయట పిరికివాడు), గేహేనర్దీ, గేహే విజయీ ఇత్యాది ఇతర ఉదాహరణములు కూడ చెప్పబడినవి.

# కర్మధారయ సమాసము

కర్మధారయ సమాసము తత్పురుషము యొక్క అంతర్భాగమే. ఆ సమాసము ఇపుడు వివరింపబడుచున్నది. ఈ సమాన నిర్మాణము, అర్థవిశేషములను తెలుసుకొనుటకును, పాణిని మహర్షి యొక్క అసామాన్యమైన భాషాశాస్త్రపు అవగాహనకు ఈ క్రింది సూత్రములు ఉదాహరణములు.

1. పూర్వకాలైకసర్వజరత్పురాణనవకేవలాః సమానాధికరణేన (2-1-49)
2. సుప్ సుపా (2-1-4)
3. ప్రథమానిర్దిష్టం సమాస ఉపసర్జనమ్ (1-2-43)
4. ఉపసర్జనం పూర్వమ్ (2-2-30)
5. తత్పురుషః సమానాధికరణః కర్మధారయః (1-2-43)
6. విశేషణం విశేష్యేణ బహులమ్ (2-1-57)

1. " **పూర్వకాలైకసర్వజరత్పురాణనవకేవలాః సమానాధికరణేన** " అను సూత్రాధారముగా పూర్వకాలవాచకము, ఏక, సర్వ, జరత్, పురాణ, నవ, కేవల శబ్దములు సమానాధికరణమునందున్న సమర్థమైన సుబంతముతో సమసించును.

2. " **సుప్ సుపా** " అను సూత్రం ద్వారానే సమాసవిధాయక సూత్రమును గూర్చి

చెప్పబడినది. కావున ఇది ఒక సమాసవిధాయక సామాన్య సూత్రము.

3. " **ప్రథమా నిర్దిష్టం సమాస ఉపసర్జనమ్** " అను సూత్రము సమాసవిధాయక సూత్రమున ప్రథమా విభక్తి చేత నిర్దేశించబడిన పదమునకు ఉపసర్జన సంజ్ఞను విధించును.

4. " **ఉపసర్జనం పూర్వమ్** " అను సూత్రము ఉపసర్జన సంజ్ఞను పొందిన పదమునకు పూర్వనిపాతము విధించును.

5. " **తత్పురుషః సమానాధికరణః కర్మధారయః** " సూత్రము కర్మధారయమనెడి విశిష్ట సంజ్ఞను తత్పురుషమందలి కొన్నింటికి విధింపజేయును.

6. " **విశేషణం విశేష్యేణ బహులమ్** " సూత్రము బహులముగా విశేషణం విశేష్యముతో సమసించును అని చెప్పును.

" తత్పురుషః " (2-1-22) అను సూత్రము నుండి "పాత్రేసమితాదయశ్చ " (2-1-48) అను సూత్రము వరకు ఏర్పడిన సమాసములందున్న పదముల మధ్యనున్న సంబంధము విభక్తి ప్రత్యయార్థముల చేత నిర్ణయింపబడినది కావున వీటిని " శుద్ధ తత్పురుష సమాసము" అని అంటారు.

" పూర్వ కాలైక ......... " (2-1-49) అను సూత్రము నుండి " మయూర వ్యంసకాదయశ్చ " (2-1-72) అను సూత్రము వరకు గల సూత్రముల ద్వారా ఏర్పడిన సమాసపదముల మధ్య " విశేషణ-విశేష్యభావ " సంబంధమున్నది. అనగా ఒక పదము రెండవపదముతో విశేషణముగానో విశేష్యముగానో సంబంధము కలిసి ఉన్నది. విశేషణ - విశేష్య భావమున్నప్పుడు ఆ రెండు పదములు సమాన విభక్తికములై ఉండును. సమాన విభక్తికములుగా ఉన్నట్లైతే ఆ రెండు పదములు కూడా సమానాధికరణ సంబంధమును కలిగి ఉంటాయి.

" నీలమ్ ఉత్పలమ్ " అను ఉదాహరణములో నీలము, ఉత్పలము అను పదములు ఒకే పదార్థమును బోధించుచున్నవి. నీలశబ్దము ఉత్పలములోని నీలంరంగును, ఉత్పల శబ్దము ఉత్పలములోని ఉత్పల జాతిని తెలుపుచున్నవి. గుణిగుణముల సమవాయ సంబంధము ఉండుటచే వాటిని విడదీయుట కుదరదు. అనగా ఉత్పలత్వమును నీలపు రంగును విడదీయుట కుదరదు. కావున ఈ అర్థైక్యమును తెలుపుటకు రెండు పదములను



ఒకే విభక్తితో ప్రయోగించి వాక్యనిర్మాణము చేయబడును. దీనికే ' సామానాధికరణ్యమ్ ' అని పేరు.

' విశేషణం విశేష్యేణ బహులమ్ ' (2-1-57) అను సూత్రముచేత విశేషణము విశేష్యముతో సమసించగా " సమానాధికరణః " (1-2-42) అను సూత్రము సామానాధికరణ్యము కలిగిన పదముల వలన ఏర్పడిన తత్పురుషకు కర్మధారయమనెడి ప్రత్యేక సంజ్ఞను విధిస్తున్నది. కర్మధారయ సంజ్ఞ తత్పురుష సంజ్ఞకు ప్రతిబంధకము కాదు. కర్మధారయమను పేరుతో విధించిన వ్యాకరణకార్యములు ఈ వర్గమునకు చెందిన తత్పురుష సమాసములకు మాత్రమే అనువర్తించును. ఇదే సంజ్ఞాంతరము యొక్క ప్రయోజనము. " విశేషణం విశేష్యేణ బహులమ్ " అను సూత్రములో ' విశేషణం ' అను పదము ప్రథమా విభక్తి యందుండుటచే ఆ పదము ద్వారా అభిహితమైన పదమునకు ఉపసర్జన సంజ్ఞ మఱియు పూర్వనిపాతము కూడ లభించును.

' బహులమ్ ' అనే పదము వలన మరొక విషయము బోధపడుతున్నది. వ్యాకరణము సూత్రములతో భాషను చెప్పునే కాని ప్రయోగములను శాసించలేదు. శిష్టప్రయోగమును బట్టి సమాసగత పదముల పూర్వ-ఉత్తర పదత్వములను నిర్ణయింపవలెను. ఈ విషయము నిర్ధారించుటకై శుద్ధతత్పురుషములను చెప్పిన పిమ్మట పాణిని క్రింది వాటిని ఉదాహరిస్తున్నాడు.

## 195. పూర్వకాలైకసర్వజరత్పురాణనవకేవలాః సమానాధికరణేన (2-1-49)

**" విశేషణం విశేష్యేణ ......" ఇతి సిద్ధే పూర్వనిపాతనియమార్థం సూత్రమ్. ఏకశబ్దస్య దిక్సంఖ్యే ' సంజ్ఞాయామ్ ' ఇతి నియమబాధనార్థం చ. పూర్వం స్నాతః. పశ్చాదనులిప్తః. స్నాతానులిప్తః. ఏకనాథః. సర్వయాజ్ఞికాః. జరన్నైయాయికాః. పురాణమీమాంసకాః. నవపాఠకాః. కేవలవైయాకరణాః.**

పూర్వకాలవాచకమైన శబ్దము, ఏక, సర్వ, జరత్, పురాణ, నవ, కేవల శబ్దములు సమానాధికరణములైన శబ్దములతో సమసించును. అది తత్పురుషసమాసము. సమానాధికరణేన అనుపదం ఈ సూత్రం నుండి రెండవ అధ్యాయం మొదటి పాదాంతం వరకు అనువర్తించును.

" విశేషణం విశేష్యేణ బహులమ్ " (2-1-57) అను సూత్రముచేతనే సమసిస్తున్నప్పటికీ ప్రథమా విభక్త్యంత పదములు ఉపసర్జన సంజ్ఞను పూర్వనిపాతత్వమును కూడ పొందుటకుగాను ఈ సూత్రము చెప్పబడినది.

పూర్వవాచకము అనగా ముందు జరుగు క్రియను బోధించు పదము. " పూర్వం స్నాతః పశ్చాదనులిప్తః " అను విగ్రహవాక్యమున " స్నానక్రియ జరిగిన పిమ్మట అనులిప్త క్రియ జరుగును. ఎవడు స్నాతుడో వాడే అనులిప్తుడగుట వలన స్నాత అనులిప్త శబ్దములు సామానాధికరణ్యమున అన్వయించియున్నవి. అందువలన 'స్నాతానులిప్తః' అని తత్పురుష సమాసమేర్పడినది. ఇచట పరసూత్రమైన " దిక్సంఖ్యే సంజ్ఞాయామ్ " (2-1-50) అను సూత్రం ద్వారానే 'ఏకనాథః' - ఏకశ్చ అసౌ నాథశ్చ అని సమాసమేర్పడుచుండగా పాణిని ఏక పదము ఎందుకు చేర్చెను ? " దిక్సంఖ్యే సంజ్ఞాయామ్ " (2-1-50) సూత్రము ద్వారా ఏర్పడిన తత్పురుషము సంజ్ఞ అయి ఉండవలెను. ' ఏకనాథః ' అనునది సంజ్ఞ కాదు. అందువలన ఈ సూత్రమున ' ఏక ' శబ్దమును చేర్చెను. రాబోవు ఉత్సర్గ సూత్రము యొక్క అపవాదమును ముందు సూత్రముగనే తెల్పెను.

కర్మధారయమున సామానాధికరణ్యమును తెలుపుటకు గాను విగ్రహవాక్యమున రెండు పదములు ఏకవిభక్తి యందుంచి రెండింటిని సర్వనామశబ్దము మఱియు రెండు చకారములతో చూపడం జరుగుతుంది.

| | |
|---|---|
| సర్వయాజ్ఞికాః | - సర్వే చ తే యాజ్ఞికాశ్చ |
| జరన్నైయాయికాః | - జరన్తశ్చ తే నైయాయికాశ్చ |
| పురాణ మీమాంసకాః | - పురాణాశ్చ తే మీమాంసకాశ్చ |
| నవపాఠకాః | - నవాశ్చ తే పాఠకాశ్చ |
| కేవల వైయాకరణాః | - కేవలాశ్చ తే వైయాకరణాశ్చ |

## 196. దిక్సంఖ్యే సంజ్ఞాయామ్ (2-1-50)

**' సమానాధికరణేన ' ఇత్యాపాదపరిసమాప్తేరధికారః. ' సంజ్ఞాయామేవ ' ఇతి నియమార్థం సూత్రమ్. పూర్వేషుకామశమీ. సప్తర్షయః. నేహ - ఉత్తరా వృక్షాః, పంచ బ్రాహ్మణాః.**



"దిగ్వాచకములు మరియు సంఖ్యావాచకములు సమానాధికరణమగు సుబంతముతో సంజ్ఞార్థమున సమసించును. అది కర్మధారయమగు తత్పురుషసమాసము." అని సూత్రార్థము.

**పూర్వేషుకామశమీ** : " పూర్వశ్చాసౌ ఇషుకామశమీ చ " ఇది ఒక దేశము పేరు.
పూర్వ + సు + ఇషుకామశమీ + సు అను ఉదాహరణమున దిగ్వాచకము అగు పూర్వ శబ్దమునకు ఇషుకామశమీ + సు అను సుబంతముతో సమాసము.
సప్తర్షయః - సప్త చ తే ఋషయశ్చ అని లౌకిక విగ్రహవాక్యము.
సప్తన్ + జస్ + ఋషి + జస్ అను విగ్రహవాక్యములో సప్తన్ అను సంఖ్యావాచక శబ్దమునకు ఈ సూత్రముచే ఋషి + సు అను సుబంతంతో సమాసము వచ్చును.

' విశేషణం విశేష్యేణ బహులమ్ ' అను సూత్రము చేతనే ఈ సమాసములు సిద్ధించుచుండగా మరల ఈ సూత్రముచే సమాసము విధించుట సమాసపదము సంజ్ఞావాచకమైనపుడే దిగ్వాచకములు, సంఖ్యావాచకములు సమానాధికరణ సుబంతములతో సమసించును అనెడి నియమం కొరకు కావున -

ఉత్తరాః వృక్షాః (ఉత్తరమున ఉన్న వృక్షములు)
పంచ బ్రాహ్మణాః (ఐదుగురు బ్రాహ్మణులు) ఇత్యాది ఉదాహరణములందు సంజ్ఞార్థము లేకపోవుటచే ఈ సూత్రము చేత సమాసము రాదు.

## 197. తద్ధితార్థోత్తరపదసమాహారే చ (2-1-51)

**తద్ధితార్థే విషయే, ఉత్తరపదే చ పరతః, సమాహారే చ వాచ్యే, దిక్సంఖ్యే ప్రాగ్వద్వా పూర్వస్యాం శాలాయాం భవః పౌర్వశాలః. సమాసే కృతే 'దిక్పూర్వపదాదసంజ్ఞాయామ్' ఇతి ఞః.**
**(వా) సర్వనామ్నో వృత్తిమాత్రే పుంవద్భావః**

**ఆపరశాలః. పూర్వా శాలా ప్రియా యస్యేతి త్రిపదే బహువ్రీహౌ కృతే ప్రియాశబ్దే ఉత్తరపదే పూర్వయోస్తత్పురుషః. తేన శాలాశబ్దే ఆకారః ఉదాత్తః. పూర్వశాలాప్రియః. దిక్షు సమాహారో నాస్త్యనభిధానాత్. సంఖ్యాయాస్తద్ధితార్థే - షణ్ణాం మాతౄణామ్ - అపత్యం షాణ్మాతురః. పఞ్చ గావో ధనం యస్యేతి త్రిపదే బహువ్రీహౌ అవాన్తర తత్పురుషస్య వికల్పే ప్రాప్తే.**

**' ద్వన్ద్వతత్పురుషయోరుత్తరపదే నిత్యసమాసవచనమ్ '**

" విశేషణం విశేష్యేణ బహులమ్ " (2-1-57) అను సూత్రముచేతనే సమసిస్తున్నప్పటికీ ప్రథమా విభక్త్యంత పదములు ఉపసర్జన సంజ్ఞను పూర్వనిపాతత్వమును కూడ పొందుటకుగాను ఈ సూత్రము చెప్పబడినది.

పూర్వవాచకము అనగా ముందు జరుగు క్రియను బోధించు పదము. " పూర్వం స్నాతః పశ్చాదనులిప్తః " అను విగ్రహవాక్యమున " స్నానక్రియ జరిగిన పిమ్మట అనులిప్త క్రియ జరుగును. ఎవడు స్నాతుడో వాడే అనులిప్తుడగుట వలన స్నాత అనులిప్త శబ్దములు సామానాధికరణ్యమున అన్వయించియున్నవి. అందువలన 'స్నాతానులిప్తః' అని తత్పురుష సమాసమేర్పడినది. ఇచట పరసూత్రమైన " దిక్సంఖ్యే సంజ్ఞాయామ్ " (2-1-50) అను సూత్రం ద్వారానే 'ఏకనాథః' - ఏకశ్చ అసౌ నాథశ్చ అని సమాసమేర్పడుచుండగా పాణిని ఏక పదము ఎందుకు చేర్చెను ? " దిక్సంఖ్యే సంజ్ఞాయామ్ " (2-1-50) సూత్రము ద్వారా ఏర్పడిన తత్పురుషము సంజ్ఞ అయి ఉండవలెను. ' ఏకనాథః ' అనునది సంజ్ఞ కాదు. అందువలన ఈ సూత్రమున ' ఏక ' శబ్దమును చేర్చెను. రాబోవు ఉత్సర్గ సూత్రము యొక్క అపవాదమును ముందు సూత్రముగనే తెల్పెను.

కర్మధారయమున సామానాధికరణ్యమును తెలుపుటకు గాను విగ్రహవాక్యమున రెండు పదములు ఏకవిభక్తి యందుంచి రెండింటిని సర్వనామశబ్దము మఱియు రెండు చకారములతో చూపడం జరుగుతుంది.

| | |
|---|---|
| సర్వయాజ్ఞికాః | - సర్వే చ తే యాజ్ఞికాశ్చ |
| జరన్నైయాయికాః | - జరన్తశ్చ తే నైయాయికాశ్చ |
| పురాణ మీమాంసకాః | - పురాణాశ్చ తే మీమాంసకాశ్చ |
| నవపాఠకాః | - నవాశ్చ తే పాఠకాశ్చ |
| కేవల వైయాకరణాః | - కేవలాశ్చ తే వైయాకరణాశ్చ |

### 196. దిక్సంఖ్యే సంజ్ఞాయామ్ (2-1-50)

**' సమానాధికరణేన ' ఇత్యాపాదపరిసమాప్తేరధికారః. ' సంజ్ఞాయామేవ ' ఇతి నియమార్థం సూత్రమ్. పూర్వేషుకామశమీ. సప్తర్షయః. నేహ - ఉత్తరా వృక్షాః, పఞ్చ బ్రాహ్మణాః.**



" దిగ్వాచకములు మరియు సంఖ్యావాచకములు సమానాధికరణమగు సుబంతముతో సంజ్ఞార్థమున సమసించును. అది కర్మధారయమగు తత్పురుషసమాసము." అని సూత్రార్థము.

**పూర్వేషుకామశమీ** : " పూర్వశ్చాసౌ ఇషుకామశమీ చ " ఇది ఒక దేశము పేరు. పూర్వ + సు + ఇషుకామశమీ + సు అను ఉదాహరణమున దిగ్వాచకము అగు పూర్వ శబ్దమునకు ఇషుకామశమీ + సు అను సుబంతముతో సమాసము.
సప్తర్షయః - సప్త చ తే ఋషయశ్చ అని లౌకిక విగ్రహవాక్యము.
సప్తన్ + జస్ + ఋషి + జస్ అను విగ్రహవాక్యములో సప్తన్ అను సంఖ్యావాచక శబ్దమునకు ఈ సూత్రముచే ఋషి + సు అను సుబంతంతో సమాసము వచ్చును.

' విశేషణం విశేష్యేణ బహులమ్ ' అను సూత్రము చేతనే ఈ సమాసములు సిద్ధించుచుండగా మరల ఈ సూత్రముచే సమాసము విధించుట సమాసపదము సంజ్ఞావాచకమైనపుడే దిగ్వాచకములు, సంఖ్యావాచకములు సమానాధికరణ సుబంతములతో సమసించును అనెడి నియమం కొరకు కావున -

ఉత్తరాః వృక్షాః (ఉత్తరమున ఉన్న వృక్షములు)
పంచ బ్రాహ్మణాః (ఐదుగురు బ్రాహ్మణులు) ఇత్యాది ఉదాహరణములందు సంజ్ఞార్థము లేకపోవుటచే ఈ సూత్రము చేత సమాసము రాదు.

### 197. తద్ధితార్థోత్తరపదసమాహారే చ (2-1-51)

**తద్ధితార్థే విషయే, ఉత్తరపదే చ పరతః, సమాహారే చ వాచ్యే, దిక్సంఖ్యే ప్రాగ్వద్వా. పూర్వస్యాం శాలాయాం భవః పౌర్వశాలః. సమాసే కృతే 'దిక్పూర్వపదాదసంజ్ఞాయామ్' ఇతి ఞః.**
**(వా) సర్వనామ్నో వృత్తిమాత్రే పుంవద్భావః**

**అపరశాలః. పూర్వా శాలా ప్రియా యస్యేతి త్రిపదే బహుబ్రీహౌ కృతే ప్రియాశబ్దే ఉత్తరపదే పూర్వయోస్తత్పురుషః. తేన శాలాశబ్దే ఆకారః ఉదాత్తః. పూర్వశాలాప్రియః. దిక్షు సమాహారో నాస్త్యనభిధానాత్. సంఖ్యాయాస్తద్ధితార్థే - షణ్ణాం మాతౄణామ్ - అపత్యం షాణ్మాతురః. పఞ్చ గావో ధనం యస్యేతి త్రిపదే బహుబ్రీహౌ అవాన్తర తత్పురుషస్య వికల్పే ప్రాప్తే.**

**' ద్వన్ద్వతత్పురుషయోరుత్తరపదే నిత్యసమాసవచనమ్ '**

తద్ధితార్థము (తత్ర భవః ఇత్యాదికము) విషయమైనపుడు, ఉత్తరపదము పరమైనపుడు, సమాహారము వాచ్యమైనపుడు దిగ్వాచకములు మరియు సంఖ్యావాచకములు సమానాధికరణములతో సమసించును అని సూత్రానికి అర్థము.

పూర్వసూత్రముల నుండి ' దిక్సంఖ్యే ', ' సమానాధికరణేన ' అని పదములు అనువర్తించును. ఈ సూత్రములో మూడు విశేషణములున్నవని ప్రత్యేకముగా సమన్వయింపవలయును. అందుచే ఈ సూత్రము మూడు వాక్యములుగా మారును. సమాసాంతమునందున్న సప్తమి మూడు వేర్వేరు అర్థములలో అనువర్తించును.

1. **తద్ధితార్థే విషయే దిక్సంఖ్యే సమానాధికరణేన సమస్యతే,**
2. **ఉత్తరపదే చ పరతః దిక్సంఖ్యే సమానాధికరణేన సమస్యతే,**
3. **సమాహారే చ వాచ్యే దిక్సంఖ్యే సమానాధికరణేన సమస్యతే.**

క్రమముగా ఉదాహరణములు –

**(అ) పౌర్వశాలః** – " పూర్వస్యాం శాలాయాం భవః " (తూర్పుశాలలో ఉన్నవాడు) అనే అర్థములో తత్ర భవః (అచట నుండువాడు) అను తద్ధితార్థమున " దిక్పూర్వపదాదసంజ్ఞాయాం ఞః " (4-2-107) " దిగ్వాచకముగా గల సమాసము కంటే అది సంజ్ఞావాచకము కానిచో అచ్చట ఉన్నది. " అను అర్థమున ' ఞ ' ప్రత్యయం (తద్ధిత) చేరడంతో " తద్ధితార్థోత్తర ..............." (2-1-51) అను ప్రస్తుత సూత్రముచేత పూర్వశాలా శబ్దమునకు సమాసము సిద్ధించును. పూర్వ + ఙి + శాలా + ఙి అని అలౌకిక విగ్రహవాక్యమున రెండు పదములకు సమాసము సిద్ధించగా, ఞ ప్రత్యయ సహాయమున పూర్వశాలా + ఞ అని కాగా ' పూర్వ ' శబ్దమునకు ఆదివృద్ధి వచ్చి పౌర్వశాలః అని సిద్ధించును.

ఇక్కడ 'పూర్వాశాలా' అని కాగా " సర్వనామ్నో వృత్తిమాత్రే పుంవద్భావః " అనే వార్తికముతో ఐదు వృత్తులందు అంటే కృత్ తద్ధిత సమాసైకశేష సనాద్యన్త ధాతురూప వృత్తులు సర్వనామ శబ్దమునకు పుంవద్భావము విధింపబడును.

' పూర్వాశాలా ' అనుచోట పూర్వా శబ్దము సర్వనామము కావున దానికి ఈ ప్రస్తుత వార్తికముతో పుంవద్భావం విధించగ, ' పూర్వశాలా ' అని ఏర్పడి ' ఞ ' ప్రత్యయం సహాయముతో ' పౌర్వశాలః ' అని అగును. ఇక్కడ " తద్ధితేష్వచామాదేః " (7-2-117) అను సూత్రము ద్వారా ఆదివృద్ధి విధింపబడును. 'ఆపరశాలః' (అపరస్యాం శాలాయాం భవః) అనునది కూడ ఇట్లే సిద్ధించును.



**(ఆ) పూర్వశాలాప్రియః** – " పూర్వా శాలా ప్రియా యస్య అనే విగ్రహవాక్యమును ఆధారంగా చేసుకుని పూర్వ, శాల, ప్రియ శబ్దములకు త్రిపదబహువ్రీహి చేయుచుండగా (ఉత్తరపదము ప్రియా శబ్దము పరమగుచుండగా) పూర్వశాల శబ్దములకు "విశేషణం విశేష్యేణ బహులమ్" (2-1-57) అను సూత్రము ద్వారా కర్మధారయ తత్పురుష సమాసము సిద్ధించగా 'పూర్వశాలా + ప్రియః యస్య' అని విగ్రహవాక్యము నుండి " అనేకమన్య పదార్థే " (2-2-24) అను సూత్రముచే బహువ్రీహి సమాసము ఏర్పడి ' పూర్వశాలాప్రియః ' అని రూపమేర్పడును.

' అనేకమన్యపదార్థే ' అను సూత్రంలోని ' అనేకం ' అను పదము వలన త్రిపద బహువ్రీహిని ముందు కర్మధారయము చేయకుండా కూడా ' పూర్వశాలాప్రియః' అని సాధించవచ్చును. కాని ఈ రెండు విధానాలలో స్వరభేదమున్నది. త్రిపద బహువ్రీహి చేసిన పూర్వపద ప్రకృతి స్వరము బహువ్రీహికి రాగా ' పూర్వశాలాప్రియః ' అని అగును. ముందు కర్మధారయము చేసిన యెడల సమాసస్వరము శాలాశబ్దముపై పడును. అందువలన స్వరము నందలి భేదమును గమనించిన పాణిని ' ఉత్తరపదే ' అని చేర్చెను. అది ఉత్తర పదే చ పరతః కు ఉదాహరణము.

**(ఇ) షాణ్మాతురః** – " షణ్ణాం మాతౄణాం అపత్యం పుమాన్ " అనే లౌకిక విగ్రహవాక్యము నుండి రూపమును సాధించదలచినచో " మాతురుత్సంఖ్యా సంభద్రపూర్వాయాః " (4-1-115) అను సూత్రము ద్వారా ' అణ్ ' ప్రత్యయం చేర్చినచో షట్ మాతృ శబ్దములకు తత్పురుష సమాసము జరుగును. ' తద్ధితార్థోత్తరపదసమాహారే చ ' (2-1-51) అను సూత్రం ముందుగా ప్రవర్తించినగాని " మాతురుత్సంఖ్యా....... " (4-1-115) సూత్రము ప్రవర్తించదు కావున ఈ సమాసము నిత్యమగుచున్నది. అది సమాహారే చ వాచ్యే అను దానికి ఉదాహరణము.

**పంచగవధనః** – " పంచ గావో ధనం యస్య సః " అని త్రిపదబహువ్రీహి. 'పంచగావః' అను అవాంతరసమాసము తత్పురుషము. పంచన్ + జస్ + గో + జస్ + ధన + సు అని విగ్రహవాక్యము. ఇచ్చట ధన శబ్దము ఉత్తరపదము. అది పరముగా ఉన్నందున "తద్ధితార్థోత్తరపదసమాహారే చ " (2-1-51) అను సూత్రముచే సంఖ్యావాచకమగు పంచన్ శబ్దమునకు గో శబ్దముతో వచ్చు సమాసము వికల్పముగా రావలసి యున్నది, కాని " ద్వంద్వతత్పురుషయోరుత్తరపదే నిత్యసమాసవచనమ్ " అను వార్తికము ద్వారా నిత్యసమాసముగా చెప్పబడినది. అనగా " ఉత్తరపదము పరమగునపుడు ద్వంద్వ తత్పురుషములకు నిత్యసమాసముగా చెప్పవలెను. " అని,

కావున ఇక్కడ ' ధన ' అను ఉత్తరపదము పరముగా ఉన్నందున ఈ వార్తిక సహాయము చేత పంచన్ శబ్దమునకు గో శబ్దముతో సమాసము (తత్పురుష) నిత్యముగా చెప్పబడినది.

## 198. గోరతద్ధితలుకి (5-4-92)

**గోఽన్తాత్తత్పురుషాత్ టచ్ స్యాత్సమాసాంతో న తద్ధితలుకి. పఞ్చగవధనః – పంచానాం గవాం సమాహారః.**

గోశబ్దాంతమగు తత్పురుషముపై సమాసాంతముగా ' టచ్ ' ప్రత్యయము వచ్చును. తద్ధిత ప్రత్యయం లోపించినచో రాదు అని సూత్రార్థము. " సమాసాన్తాః " (5-4-68) సూత్రం నుండి " సమాసాన్తాః " అను పదము, " తత్పురుషస్యాంగులేః సంఖ్యావ్యయాదేః" (5-4-86) సూత్రం నుండి తత్పురుషపదము, " రాజాహః సఖిభ్యష్టచ్ " (5-4-91) సూత్రం నుండి ' టచ్ ' పదములు ఇచ్చట అనువర్తించును.

**పంచగవధనః** – పంచన్ + గో అను అవాంతర తత్పురుషము గో శబ్దాంతముగా ఉన్నందున ' గోరతద్ధితలుకి ' అను సూత్రం ద్వారా ' టచ్ ' (అ) ప్రత్యయం చేరి పంచన్ + గో + అ అని యగును. పంచన్ శబ్దములోని న కారమునకు ' న లోపః ప్రాతిపదికాన్తస్య' (8-2-7) అను సూత్రముచే లోపము, " ఏచోఽయవాయావః " (6-1-78) అను సూత్రముచే అవాదేశము వచ్చి ' పంచగవ ' అని సమాసాంత ప్రత్యయముతో కూడిన తత్పురుష సమాసము ఏర్పడును. దీనికి ధన శబ్దముతో (పంచగవ + ధన) సమసించి పంచగవధనః అని బహువ్రీహి సమాసమేర్పడును.

# ద్విగు సమాసము

## 199. సంఖ్యాపూర్వో ద్విగుః (2-1-52)

**' తద్ధితార్థే .......' ఇత్యత్రోక్తః త్రివిధః సంఖ్యాపూర్వో ద్విగుఃస్యాత్.**

' తద్ధితార్థోత్తరపదసమాహారే చ ' (2-1-51) అను సూత్రము ద్వారా విహితమైన సంఖ్యావాచక పూర్వమగు సమాసములకు ద్విగుసమాసమని పేరు. ఈ సూత్రానుసారం తద్ధితార్థమున, ఉత్తరపదము పరమైనపుడు, సమాహారము వాచ్యమగునపుడు కూడ



సంఖ్యావాచకమునకు సమానాధికరణముతో సమాసము విధింపబడినది. సంఖ్యాపూర్వక ఈ త్రివిధమగు సమాసము ద్విగుసమాసము.

1. తద్ధితార్థ విషయమున – పంచకపాలః – పంచసు కపాలేషు సంస్కృతః
2. ఉత్తరపదము పరమయిన – పంచనావ ప్రియః
3. సమాహార వాచ్యమయిన – పంచగవమ్ – పంచానా గవాం సమాహారః

## 200. ద్విగురేకవచనమ్ (2-4-1)

**ద్విగ్వర్థస్సమాహార ఏకవత్స్యాత్. స నపుంసకమితి నపుంసకత్వమ్. పంచానాం గవాం సమాహారః – పఞ్చగవమ్.**

ద్విగుసమాసార్థమగు సమాహారము ఏకవద్భావమును పొందును. అనగా సమాహారము ఒక వస్తువుగా పరిగణింపబడును. సమాహారార్థమగు ద్విగువు ఏకవచనమున ఉండునని ఫలితార్థము. ' సమాహారగ్రహణం కర్తవ్యమ్ ' అనువార్తికం నుండి 'సమాహారః' అనుపదము ఇక్కడ గ్రహించవలసినది.

పంచగవమ్ – పంచానాం గవాం సమాహారః అని లౌకిక విగ్రహము. పంచన్ + ఆమ్ + గో + అమ్ అని అలౌకిక విగ్రహమున " తద్ధితార్థోత్తర " అను సూత్రము ద్వారా సమాసము, సుబ్లోపము. పంచన్ + గో అని యుండగా ' గోరతద్ధితలుకి ' సూత్రముచే ' టచ్ ' (అ) ప్రత్యయం చేరి పంచన్ + గో + అ అని కాగా నలోపము, అవాదేశము వచ్చి ' పంచగవ ' అనునది ద్విగుయగుటచే " స నపుంసకమ్ " (2-4-17) సూత్రం ద్వారా నపుంసకలింగము, ప్రస్తుత సూత్రముచే ఏకవద్భావము రాగా ' పంచగవమ్ ' అని సిద్ధించును.

## 201. కుత్సితాని కుత్సనైః (2-1-53)

**కుత్స్యమానాని కుత్సనైస్సహ ప్రాగ్వత్. వైయాకరణఖసూచిః. మీమాంసక దుర్దురూఢః.**

' కుత్సితము ' అనగా నికృష్టము, నీచము, కుత్సితుడనగా నిందింపబడేవాడు. కృత్సనము అంటే నింద. కుత్సనార్థములు గల శబ్దములు నిందింపబడే వ్యక్తిని బోధించు సుబంత శబ్దముతో సమసించును. అది తత్పురుషము. వైయాకరణఖసూచిః –

వైయాకరణశ్చ అసౌ ఖసూచిశ్చ. (ఏ ప్రశ్నను అడిగినా ఆకాశమును చూచు అసమర్థుడైన వైయాకరుణుడు) ప్రక్రియను మరుచువాడు నిందార్హుడు. ఆకాశమును చూడటం నిందకు హేతువు. అలాగే మీమాంసకదర్దురూఢః (వేద ప్రామాణ్యమును ప్రతిపాదించు మీమాంసకుడైన నాస్తికుడు) అని ఇతర ఉదాహరణము.

## 202. పాపాణకే కుత్సితైః (2-1-54)

**పూర్వసూత్రాపవాదః. పాపనాపితః. అణకకులాలః.**

" కుత్సితాని కుత్సనైః" (2-1-53) సూత్రము నందు, " ప్రథమా నిర్దిష్టం సమాస ఉపసర్జనమ్ " (1-2-43) అను సూత్రం ద్వారా కుత్సితవాచకములు ఉపసర్జన సంజ్ఞను పొంది "ఉపసర్జనం పూర్వమ్ " (2-2-30) అను సూత్రం ద్వారా పూర్వపదస్థానమును పొందుచున్నవి. ఇచ్చట 'కుత్సితైః' అని తృతీయావిభక్తి యందుండుట వలన కుత్సితవాచకములకు ఉపసర్జన సంజ్ఞ వర్తింపకపోవుటచే ఉత్తరపదస్థానమునే పొందుచున్నవి.

నిందావాచకములైన పాప, అణక శబ్దములు సమానాధికరణములైన కుత్సిత శబ్దములతో సమసించి తత్పురుషలగును అని సూత్రార్థము.

పాపనాపితః – పాపశ్చాసౌ నాపితశ్చ (నిందుడైన నాపితుడు)

అణక కులాలః – అణకశ్చాసౌ కులాలశ్చ (దూష్యుడైన కులాలుడు)

## 203. ఉపమానాని సామాన్యవచనైః (2-1-55)

**ఘన ఇవ శ్యామో – ఘనశ్యామః. ఇహ పూర్వపదం తత్పురుశే లాక్షణికమితి సూచయితుం లౌకికవిగ్రహే ఇవశబ్దః ప్రయుజ్యతే. పూర్వనిపాతనియమార్థం సూత్రమ్.**

ఉపమాన వాచకపదములు సమానాధికరణములగు సమానధర్మవిశిష్టవాచక పదములతో సమసించును. అవి తత్పురుష సమాసములగును.

ఘనశ్యామః – ఘన ఇవ శ్యామః (మేఘమువలె నల్లనివాడు). ఇచట ' ఘన ' అనునది ఉపమావాచకము. ' శ్యామః ' అనగా " శ్యామత్వము కలవాడు " అని అర్థము. 'శ్యామత్వము' సమానధర్మమును బోధించుచున్నది. ఉపమానము పూర్వపదముగానున్నది కావున ఈ సమాసములను ఉపమాన పూర్వపద కర్మధారయములని అందురు. ఉపమాన వాచకపదముతోపాటు లౌకిక విగ్రహవాక్యమున 'ఇవ' శబ్దము ప్రయోగింపబడును.



## 204. ఉపమితం వ్యాఘ్రాదిభిః సామాన్యాప్రయోగే (2-1-56)

**ఉపమేయం వ్యాఘ్రాదిభిస్సహ ప్రాగ్వత్సాధారణధర్మస్యాఽప్రయోగే సతి. విశేష్యస్య పూర్వనిపాతార్థం సూత్రమ్. పురుషవ్యాఘ్రః. నృసోమః. వ్యాఘ్రాదిరాకృతిగణః. సామాన్యాఽప్రయోగే కిమ్ ? పురుషో వ్యాఘ్ర ఇవ శూరః.**

సామాన్యవాచకము ప్రయోగింపనిచోట ఉపమేయము సమానాధికరణమైన ఉపమానముతో సమసించి తత్పురుషసమాసమగును. 'వ్యాఘ్రాదిభిః' అను పదము వ్యాఘ్రాది గణమును సూచించుచున్నది. ఈ గణములో ఉపమానముగా ఉపయోగించుటకు యోగ్యములైన వ్యాఘ్ర, సింహ మొదలగు శబ్దాలు చేర్చబడినవి. ఇవి ప్రసిద్ధమగుట వలన శ్రేష్ఠవాచకములైన సామాన్య ధర్మము చెప్పినప్పటికి ఆ అర్థమును స్ఫురింపజేయును. అనగా సామాన్యధర్మము లక్ష్యార్థముగా ఉండును. పురుషో వ్యాఘ్ర ఇవ పురుషవ్యాఘ్రః ఇత్యాదులు ఇచ్చట ఉదాహరణములు.

' పురుషో వ్యాఘ్ర ఇవ శూరః ' అనునపుడు ఈ సమాసముత్పన్నము కాదు. శూరశబ్ద ప్రయోగమువలన సామాన్య వచనము నిర్దిష్టమై సమాసమును నిషేధించుచున్నది.

## 205. విశేషణం విశేష్యేణ బహులమ్ (2-1-57)

**భేదకం సమానాధికరణేన భేద్యేన బహులమ్ ప్రాగ్వత్. నీలముత్పలం – నీలోత్పలమ్. బహులగ్రహణాత్క్వచిన్నిత్యమ్. కృష్ణసర్పః. క్వచిన్న. రామో జామదగ్న్యః.**

" పూర్వకాలైకసర్వజరత్పురాణనవకేవలాః సమానాధికరణేన " అను సూత్రము నుండి ' సమానాధికరణేన ' అనునది అనువర్తించును.

విశేషణము విశేష్యముతో బహులముగా సమసించును. విశిష్యతే అనేనేతి – విశేషణం. దేనిచేత విశేష్యము ఇతర వస్తువుల నుండి వేరుచేయబడునో అది విశేషణము. ' నీలం ఉత్పలం ' అనుచోట ' నీలం ' అనునది విశేషణము, ఇది నల్లనివి, కాని ఉత్తములైన శుక్లరక్త ఉత్పలాదులనుంచి వేరుచేయుచున్నవి. కావున 'నీలం' విశేషణము దీనికే 'భేదకము' అని అంటారు. విశేషణము దేనియందలి విశేషమును చెప్పుచున్నదో అది విశేష్యం (భేద్యము).

భేదకము (విశేషణము) సమానాధికరణముతో అనగా భేద్యముతో (విశేష్యముతో) బహులముగా సమసించును.

నీలోత్పలమ్ – నీలం చ తత్ ఉత్పలం చ (నీలవర్ణముగల కమలం) నీల + సు + ఉత్పల + సు అని అలౌకిక విగ్రహవాక్యమున భేదక (విశేషణ) మగు నీలశబ్దమునకు సమానాధికరణ (భేద్య) మగు ఉత్పల శబ్దముతో సమాసము, సుబ్లోపము రాగా ప్రథమైకవచనమున నీలోత్పలమ్ అను రూపము సిద్ధించును.

సూత్రములో 'బహులమ్' అను పదముండుటచే కొన్ని చోట్ల ఈ సూత్రము నిత్యముగా ప్రవర్తించును. మరి కొన్ని చోట్ల అసలే ప్రవర్తించదు. కొన్ని చోట్ల వైకల్పికముగా ప్రవర్తించును. అందువలన 'కృష్ణసర్పః' అని మాత్రముండును కాని 'కృష్ణః సర్పః' అని వ్యస్తముగా రూపముండదు. 'కృష్ణసర్ప' శబ్దము సర్పములలోని ఒక విశిష్ట జాతి వాచకమగుటవలన వాక్యము నిషిద్ధము.

' రామోజామదగ్న్యః ' అనునపుడు జామదగ్న్య శబ్దము విశేషణమేయైనను బహులగ్రహణముచే రామశబ్దముతో సమసింపదు.

విశేషణము ఉపసర్జనమైనందువలన ఈ సమాసములను విశేషణ పూర్వపద కర్మధారయములని వ్యవహరింతురు.

## 206. పూర్వాపరప్రథమచరమజఘన్యసమానమధ్యమధ్యమవీరాశ్చ (2-1-58)

**పూర్వనిపాతనియమార్థమిదమ్. పూర్వవైయాకరణః. అపరాధ్యాపకః.**

**(వా) అపరస్యార్ధే పశ్చభావో వక్తవ్యః**

**అపరశ్చాసౌ అర్ధశ్చ పశ్చార్ధః. కథమ్ 'ఏకవీర' ఇతి. 'పూర్వకాలైక....' ఇతి బాధిత్వా పరత్వాదనేన సమాసే "వీరైక" ఇతి హి స్యాత్. బహులగ్రహణాద్భవిష్యతి.**

విభక్తి ప్రత్యయాంతమైన (సుప్) పూర్వ, అపర, ప్రథమ, చరమ, జఘన్య, సమాన, మధ్య, మధ్యమ, వీర శబ్దములు సమానాధికరణమలైన విభక్త్యంత శబ్దములతో సమసించి తత్పురుషమగును.



పూర్వాది వీరాశ్చ అని శబ్దములన్ని ప్రథమా విభక్తిలో ఉండుటచే ఉపసర్జనములై సమాసమున ప్రథమస్థానమును పొందుచున్నవి. ఈ సూత్రం చేత పూర్వాది పదములకు పూర్వపదత్వము సాధింపబడినది. పూర్వసూత్రమువల్లనే సమాసవిధి నిర్ణీతమయినది.

పూర్వవైయాకరణః, అపరాధ్యాపకః అనునవి ఇక్కడ ఉదాహరణములు. కాని 'ఏకవీర' అనునది ఎట్లు సమసించును ?

'ఏకవీర' అనునది " పూర్వకాలైకసర్వజరత్పురాణనవకేవలాః సమానాధికరణేన" (2-1-49) అను సూత్రం సహాయముతో సాధించాలి. బహులగ్రహణం చేత ఈ రూపము సాధువు.

**(వా) అపరస్యార్ధే పశ్చభావో వక్తవ్యః**

అనగా 'అపర' శబ్దము స్థానములో అదే అర్థమును బోధించు 'పశ్చ' అను పదము వచ్చును. ఉదా – పశ్చార్థః – అపరశ్చ అసౌ అర్ధశ్చ అని ఇక్కడ 'అపర' శబ్దము స్థానమున 'పశ్చ' అనునది ఈ వార్తికానుసారమే అని చెప్పవలెను.

## 207. శ్రేణ్యాదయః కృతాదిభిః (2-1-59)

**(వా) శ్రేణ్యాదిషు చ్వ్యర్థవచనం కర్తవ్యమ్ – అశ్రేణయః శ్రేణయః కృతాః శ్రేణీకృతాః.**

'శ్రేణీ' గణములోని సుబంత శబ్దములు కృదంత శబ్దములతో సమసించి తత్పురుషలగును.

**శ్రేణీకృతాః – అశ్రేణయః శ్రేణయః కృతాః**

'శ్రేణులుగా లేనివాటిని శ్రేణులుగా చక్కదిద్దబడినవి' అను అర్థములో 'చ్వి' ప్రత్యయం చేర్చబడింది. ఈ లక్ష్యసాధనకు వార్తికకారుడు "శ్రేణ్యాదిషు చ్వ్యర్థవచనం కర్తవ్యమ్" అని సవరించాడు. 'చ్వి' ప్రత్యయము చేరుతుండగా "కుగతిప్రాదయః" (2-2-18) అను సూత్రము ప్రవర్తించును, అందువలనే ఈ సమాసము నిత్యముగా ఉండును.

## 208. క్తేన నఞ్ విశిష్టేనానఞ్ (2-1-60)

**నఞ్ విశిష్టేన క్తాన్తేనానఞ్ క్తాన్తం సమస్యతే. కృతం చ తదకృతం చ కృతాకృతం.**

**(వా) శాకపార్థివాదీనాం సిద్ధయే ఉత్తరపదలోపస్యోపసంఖ్యానమ్. శాకప్రియః పార్థివః – శాకపార్థివః. దేవబ్రాహ్మణః.**

క్తాన్తమైన విభక్త్యంతపదము నఞ్ విశిష్టమైన క్తాన్త విభక్త్యన్తపదముతో సమసించి తత్పురుషయగును.

కృతాకృతమ్ - కృతం చ తద్ అకృతం చ (కొంత చేయబడినది కొంత చేయబడనిది)

శాకపార్థివాదీనాం సిద్ధయే ఉత్తరపదలోపస్యోపసంఖ్యానమ్. (వా)

"శాకప్రియః పార్థివః" లాంటి సమాసములను ఇక్కడ తత్పురుషయందు చేర్చవలెను, మరియు పూర్వపదము ప్రక్కన విగ్రహవాక్యమున ఉన్న మధ్యమపదమునకు లోపం విధింపవలెను.

శాకపార్థివః – శాకప్రియశ్చాసౌ పార్థివశ్చ
(వార్తికంద్వారా ప్రియశబ్దమునకు లోపము)

దేవబ్రాహ్మణః – దేవపూజకశ్చాసౌ బ్రాహ్మణశ్చ
(వార్తికం ద్వారా పూజక శబ్దము లోపించును)

శాకప్రియః, దేవబ్రాహ్మణః అనునవి బహువ్రీహి సమాసములు. ఈ బహువ్రీహి సమాసములు తిరిగి వేరే పదముతో సమసించగా బహువ్రీహి సమాసములోని ఉత్తరపదమునకు లోపము వచ్చును. కర్మధారయ సమాసమున మధ్యమ పదమునకు లోపము వచ్చును.

శాకప్రియః – శాకఃప్రియో యస్యసః అని.

శాకపార్థివః – శాకప్రియః పార్థివః

## 209. సన్మహత్పరమోత్తమోత్కృష్టాః పూజ్యమానైః (2-1-61)

**సద్వైద్యః, వక్ష్యమాణేన మహతః అకారః. మహావైయాకరణః. 'పూజ్యమానైః' కిమ్? ఉత్కృష్టో గౌః. పఙ్కాదుద్ధృత ఇత్యర్థః.**

సత్, మహత్, పరమ, ఉత్తమ, ఉత్కృష్ట పదములు పూజనీయులైన వ్యక్తులనుద్దేశించిన పదములతో సమసించి తత్పురుషలగును.

సద్వైద్యః – సన్ వైద్యః (ఉత్తమ వైద్యుడు)

మాహావైయాకరణః – మహాన్ చాసౌ వైయాకరణశ్చ

'మహత్' అను పదములోని అత్తునకు "అన్మహతః సమానాధికరణ జాతీయయోః" (6-3-46) అను సూత్రము ద్వారా 'ఆకారము' ఆదేశముగా వచ్చును.



పూజ్యమానైః అని చెప్పుట వలన "ఉత్కృష్టో గౌః" అనునపుడు ఉత్కృష్ట శబ్దము బురద నుండి ఉద్ధరింపబడినది అను అర్థమున వాడబడినది కావున ఈ సూత్రము ద్వారా సమాసము రాదు.

## 210. వృన్దారకనాగకుంజరైః పూజ్యమానమ్ (2-1-62)

**గోవృన్దారకః. వ్యాఘ్రాదేః ఆకృతిగణత్వాదేవ సిద్ధే సామాన్యప్రయోగార్థం వచనమ్.**

**గౌః వృందారక ఇవ గోవృందారకః, గౌః నాగ ఇవ గోనాగః, గౌః కుంజర ఇవ గోకుంజరః**

విభక్త్యంతమైనదియు, పూజనీయులైన వ్యక్తులనుద్దేశించి ఉపయోగించిన పదములు వృందారక, నాగ, కుంజర శబ్దములతో తత్పురుషములుగా సమసించును.

"ఉపమితం వ్యాఘ్రాదిభిః సామాన్యాప్రయోగే" (2-1-56) సూత్రం విధించిన నియమము వలే కాకుండా ఇక్కడ సామాన్య ప్రయోగము ఉన్నను వృందారక మొదలగు వాటియందు వాడబడినది.

## 211. కతరకతమౌ జాతిపరిప్రశ్నే (2-1-63)

**కతరకఠః. కతమకలాపః. గోత్రం చ చరణైః సహ ఇతి జాతిత్వమ్.**

జాతికి సంబంధించిన ప్రశ్నార్థకములందు కతరకతమ శబ్దములు సమానాధికరణములైన విభక్త్యంత పదములతో సమసించును.

కతరకఠః – అనయోః కః కఠః (అ ఇద్దరిలో ఎవరు కఠ శాఖీయుడు)
అను ప్రశ్నార్థక సమాసము చెప్పబడుచున్నది.

కతమకపాలః – ఏషాం కః కపాలః (ఈ ముగ్గురిలో ఎవరు కపాలశాఖీయుడు).

## 212. కిం క్షేపే (2-1-64)

**కుత్సితో రాజా కిం రాజా. యో న రక్షతి.**

నిందగమ్యమానమగుచున్న 'కిం' శబ్దము విభక్త్యంతముతో సమసించి తత్పురుషమగును.

కింరాజా (దుష్టుడైన రాజు), నింద వాక్యము వలన తెలియదు సమాసమైనపుడే ఈ అర్థము తెలియును. అందుచే ఈ సమాసార్థమును విగ్రహముచేత ప్రదర్శింప శక్యం కాదు. 'కిం రాజా' అంటే యో న రక్షతి (ఎవడైతే ప్రజలను రక్షించడో) అని అర్థము. అలాగే కింసఖా (స్నేహితుని దూషించేవాడు).

## 213. పోటాయువతిస్తోకకతిపయగృష్టిధేనువశావేహద్వష్కయణీ ప్రవక్తృ శ్రోత్రియాధ్యాపకధూర్తైర్జాతిః (2-1-65)

జాతి వాచకములైన విభక్త్యంతములు పోటా, యువతి, స్తోక, కతిపయ, గృష్టి, ధేను, వశా, వేహద్, వష్కయణీ, ప్రవక్తృ, శ్రోత్రియ, అధ్యాపక, ధూర్త పదములతో సమసించి, తత్పురుష సమాసములగును.

ఇభపోటా – పోటా చాసౌ ఇభీ చ (చిన్న ఆడ ఏనుగు)

జాతివాచకములు వ్యక్తులలోని జాతిని మాత్రమే చెప్పును. 'ఇభ' అనునది జాతివాచకము స్త్రీలింగమైనచో స్త్రీ ప్రత్యయాంతమును తీసుకుని 'ఇభీ' అని జాతివాచకము అగును. 'ఇభీ' రూపం పోట శబ్దముతో సమానాధికరణమందున్నప్పుడు ఇది కూడా స్త్రీ ప్రత్యయముతోను చేర్చుకుని 'పోటా' అని అగును. రెండు స్త్రీప్రత్యయాంతములు గల విభక్త్యంతపదములు సమసించినపుడు 'ఇభీ' శబ్దము పులింగమైన 'ఇభ' శబ్దముగా ఎట్లు మారునో ఈ రాబోవు సూత్రము ద్వారా వివరింపబడినది.

## 214. తత్పురుషః సమానాధికరణః కర్మధారయః (1-2-42)

సమానాధికరణమున ఏర్పడిన తత్పురుషసమాసములను కర్మధారయమందురు. " పూర్వకాలైక సర్వజరత్పు ......" (2-1-49) సూత్రం ద్వారా చెప్పిన సమానాధికరణేన అను అధికారముతో విధింపబడిన సమాసములన్నింటికి 'తత్పురుష' సంజ్ఞతోపాటు 'కర్మధారయము' అను సంజ్ఞ కూడా వర్తించును. ఈ కర్మధారయ సంజ్ఞ విధించుటవలన, కర్మధారయమను సంజ్ఞ కలిగిన తత్పురుషములకు పూర్వసూత్రము (6-3-42) వర్తించును.

## 215. పుంవత్కర్మధారయజాతీయదేశీయేషు (6-3-42)

**కర్మధారయే జాతీయదేశీయయోశ్చ పరతః భాషితపుంస్కాత్పర ఊఙభావో యస్మింస్తథాభూతం పూర్వం పుంవత్. పూరణీ ప్రియాదిష్వప్రాప్తః పుంవద్భావోఽనేన విధీయతే. మహానవమీ. కృష్ణచతుర్దశీ. మహాప్రియా. తథా కోపధాదేః ప్రతిషిద్ధః. పుంవద్భావః కర్మధారయాదౌ ప్రతిప్రసూయతే. పాచకస్త్రీ. దత్తభార్యా. పఞ్చమభార్యా. స్రౌఘ్నభార్యా. సుకేశభార్యా. బ్రాహ్మణభార్యా ఏవం పాచకజాతీయా, పాచకదేశీయా ఇత్యాది. ఇభపోటా. 'పోటా స్త్రీపుంసలక్షణా'. ఇభయువతిః. అగ్నిస్తోకః. ఉదశ్విత్కతిపయమ్. గృష్టిః సకృత్ప్రసూతా. గోగృష్టిః. ధేనుర్నవప్రసూతా గోధేనుః.**





**వశా వంధ్యా, గోవశా. వేహద్ గర్భఘాతినీ. గోవేహత్, వష్కయణీ అతరుణవత్సా, గోవష్కయణీ. కఠప్రవక్తా. కఠశ్రోత్రియః. కఠాధ్యాపకః. కఠధూర్తః.**

ఈ సూత్రమును ముందు బహువ్రీహి సమాస ప్రకరణమున గల " స్త్రియాః పుంవద్భాషితపుంస్కాదనూఙ్ సమానాధికరణే స్త్రియామపూరణీ ప్రియాదిషు" (6-3-34) అను సూత్రముతో కలిపి చదువవలసినది. ఈ సూత్రం నుండి స్త్రియాః, భాషిత పుంస్కాత్, అనూఙ్, సమానాధికరణే అను నాలుగు పదాలు ఈ సూత్రంలోనికి అనువర్తిస్తాయి. "స్త్రియాః పుంవద్భా............" (6-3-34) అనే సూత్రమున తుల్య ప్రవృత్తి నిమిత్తము కలిగిన స్త్రీవాచక శబ్దములు. వాటికి సంబంధించిన పుంశబ్దములున్నపుడు సమానాధికరణము నందు స్త్రీవాచకమునకు పుంస్త్వము విధింపబడును. మహాన్ అనునది పుంలింగమైనను యీ విశేషణ శబ్దము స్త్రీలింగవిశేష్యముతో సమానాధికరణము నందున్నప్పుడు 'మహతీ' గా మారును. మహతీనవమీ అనునపుడు స్త్రీలింగనవమీ శబ్దమునకు విశేషణమైన మహాన్ శబ్దము స్త్రీప్రత్యయాంతమును పొంది మహతీగా పరిణామము చెందినది. ఈ సందర్భమున మహతీ శబ్దమును " భాషితపుంస్కము " అని అందురు. సమానాధికరణమున విశేషణ విశేష్యములు రెండును సమాన లింగములందుండవలెనను నియమం ప్రకారం కర్మధారయమునందు స్త్రీలింగ శబ్దాలు ఎలా మారుతాయి అనే విషయం ఇక్కడ చర్చనీయమైనది. ఈ సూత్రము కర్మధారయ సమాసమున స్త్రీలింగ శబ్దాల స్థానంలో పుంలింగరూపాలను విధించుచున్నది. పుంలింగ-స్త్రీలింగ శబ్దాల యొక్క ప్రాతిపదికములు సమానముగా ఉండి సామానాధికరణ్యమువలనే స్త్రీ రూపముగా మారి విగ్రహవాక్యములో ప్రదర్శింపబడు వాటికే ఈ మార్పు పరిమితం అనే నియమాన్ని భాషిత పుంస్కాత్ అనే పదం వల్ల అని తెలుస్తున్నది. ఈ సందర్భమున మఱొక నియమం కూడా తెలుపబడినది. " ఊఙ్ " అనే స్త్రీ ప్రత్యయాంతము కలిగిన భాషిత పుంస్కములైన స్త్రీలింగ శబ్దాలకు ఈ మార్పు వర్తింపదు. ఇంతవరకు " విశేషణం విశేష్యేణ బహులమ్ " అను సూత్రము ద్వారా ఏర్పడ్డ సమాసాలకు " తత్పురుష" సంజ్ఞ మాత్రమే విధింపబడియున్నది. ఇప్పుడు ఈ స్త్రీలింగ శబ్దాల స్థానములో పుంలింగ శబ్దాలను నియమించుటకు కర్మధారయము అను మరొక సంజ్ఞను విధించుట అవసరము. ప్రస్తుత సూత్రములో ఉన్న 'కర్మధారయ' పదమునకు అర్థం తెలిసిన గాని దీని సంబంధిత వ్యాకరణ కార్యాలు తెలియవు.

' పోటా చాసౌ ఇభీ చ ' అను విగ్రహవాక్యమున పోటా ఇభీ అని రెండు సమానాధికరణము నందున్నవి. పోటా అంటే స్త్రీపుంలక్షణములు కలిగినది అని అర్థం. 'పోటా' స్త్రీలింగము. అందువలన 'ఇభ' శబ్దము పుంలింగమయినప్పటికీ 'ఇభీ' అనునది స్త్రీలింగముగా మారినది. 'పోటా' అను స్త్రీలింగ శబ్దముతోనున్న 'ఇభీ' అనునది కూడ స్త్రీలింగముగా మారుట వలన ఇది భాషితపుంస్కము. ఇది ' ఊఙ్ ' అంతము కాదు కావున పూర్వసూత్రము (6-3-42) ప్రవర్తించును. " పోటాయువతిస్తోకకతి......." (2-1-65) సూత్రమున పోటా శబ్దమునకు ఉపసర్జన సంజ్ఞ లేనందున జాతి శబ్దము పూర్వపదమగుచున్నది. 'జాతి' అని ప్రథమాంతమగుట వలన ఉపసర్జన వర్తించి ఇభ శబ్దము పూర్వపదమగును. 'ఇభపోటా' అను కర్మధారయ సమాసము సిద్ధించినది. "మహతీ చాసౌ నవమీ చ" అను విగ్రహవాక్యము నుండి " సన్మహత్పరమోత్తమోత్కృష్టాః పూజ్యమానైః" (2-1-61) అను సూత్రము ద్వారా సమాసము. పూర్వసూత్రము (6-3-42) చే పుంవద్భావమును పొంది 'మహత్' అని అయినది. మహత్ + నవమీ అని యుండగా "ఆన్మహతః సమానాధికరణజాతీయయోః" (6-3-46) అను సూత్రము ద్వారా ఆకారము అంతము నందు ఆదేశము దాగా 'మహా' అను సమాసమేర్పడినది. అలాగే ,

కృష్ణచతుర్థశీ – కృష్ణా చాసౌ చతుర్థశీ చ

మహాప్రియా – మహతీ చాసౌ ప్రియా చ

పాచకస్త్రీ – పాచికా చాసౌ స్త్రీ చ

దత్తభార్యా – దత్తా చాసౌ భార్యా చ

పంచమ భార్యా – పంచమీ చాసౌ భార్యా చ

ఇభయువతిః – యువతీ చాసౌ ఇభీ చ

అగ్ని స్తోకః – స్తోకశ్చాసౌ అగ్నిశ్చ

ఉదశ్విత్ కతిపయమ్ – కతిపయం చ తదుదశ్విచ్చ

గోగృష్టిః – గృష్టి శ్చాసౌ గౌశ్చేతి (గృష్టిః సకృత్ప్రసూత్రా)

గోధేనుః – ధేనుశ్చాసౌ గౌశ్చేతి (ధేనుః నవప్రసూతా)

గోవశా – వశా చాసౌ గౌశ్చేతి (వశా వన్ధ్యా)

గోవేహత్ – వేహచ్చాసౌ గౌశ్చేతి (వేహద్ గర్భఘాతినీ)

గోవష్కయణీ – వష్కయణీ చాసౌ గౌశ్చేతి (వష్కయణీ = అతరుణవత్సా)

కఠప్రవక్తా – ప్రవక్తా చాసౌ కఠశ్చ

కఠశ్రోత్రియః – శ్రోత్రియ శ్చాసౌ కఠశ్చ



కఠాధ్యాపకః – అధ్యాపకశ్చాసౌ కఠశ్చ

కఠధూదూర్తః – – ధూర్తశ్చాసౌ కఠశ్చ

## 216. ప్రశంసావచనైశ్చ (2-1-66)

**ఏభైస్సహ జాతిః ప్రాగ్వత్. గోమతల్లికా. గోమచర్చికా. గోప్రకాణ్డమ్. గవోద్ధః. గోతల్లజః. ప్రశస్తా గౌరిత్యర్థః. మతల్లికాదయో నియతలింగాః న తు విశేష్యనిఘ్నాః. జాతిః కిమ్ ? కుమారీ మతల్లికా.**

పూర్వసూత్రము నుండి 'జాతి' అనునది అనువర్తించును. సమానాధికరణములైన విభక్త్యంతమైన జాతివాచకపదము స్తోత్రరూప పదములతో సమసించును అది తత్పురుష సమాసము.

ఈ కర్మధారయ సమాసములో మొదటి పదము జాతివాచక పదము "పోటా యువతిస్తోక........ ధూర్తైర్జాతిః" (2-1-65) సూత్రములోని 'జాతిః' అని ప్రథమా విభక్తి అయినందున దీనికి ఉపసర్జన సంజ్ఞ, పూర్వపదత్వము సిద్ధించినవి. మతల్లికా, మచర్చికా, ప్రకాండమ్, ఉద్ధః, తల్లజః ఇత్యాదులు ప్రశంసావాచకములు, నియతలింగములు. అందువలన విశేష్యమును బట్టి ఈ పదముల లింగములు మారవు. అందువలన వీటితో ఏర్పడిన సమాసములు కూడా విశేషలింగముతోనే ఉండును.

గోమతల్లికా – మతల్లికా చాసౌ గౌశ్చ (మంచి ఆవు)

గోమచర్చికా – మచర్చికా చాసౌ గౌశ్చ

గోప్రకాండమ్ – ప్రకాండం చాసౌ గౌశ్చ

గవోద్ధః – ఉద్ధశ్చ అసౌ గౌశ్చ

## 217. యువా ఖలతిపలితవలినజరతీభిః (2-1-67)

**పూర్వనిపాతనియమార్థం సూత్రమ్. లిఙ్గవిశిష్టపరిభాషయా యువతి శబ్దోఽపి సమస్యతే. యువా ఖలతిః. యువఖలతిః యువతిః ఖలతీ – యువఖలతీ. యువజరతీ. యువత్యామేవ జరతీ ధర్మోపావలంభేన తద్రూపారోపాత్సామానాధికరణ్యమ్.**

విభక్త్యంతమైన యువా శబ్దము సమానాధికరణములోనున్న యువా, ఖలతి, ఫలిత, వలిన, జరతి పదములతో సమసించును. అది తత్పురుష సమాసమగును.

యువాశబ్దమునకు ఉపసర్జనము పూర్వనిపాతము కూడ నియమించుటకై యీ సూత్రము చెప్పబడినది. పుంలింగమైన యువశబ్దము, భాషితపుంస్కము అయిన యువతి శబ్దమును కూడా గ్రహించును. "ప్రాతిపదిక గ్రహణే లింగవిశిష్టస్యాపి గ్రహణమ్"– ప్రాతిపదికను సూత్రములో చెప్పినపుడు లింగవిశిష్టమైనదిగా తీసుకొనవలెను అను పరిభాష ఇందు వర్తించును.

| | | |
|---|---|---|
| యువఖలతిః | - | యువా చాసౌ ఖలతిశ్చ (బట్టతల గల యువకుడు) |
| యువఖలతీ | - | యువతీ చాసౌ ఖలతీ చ (బట్టతల గల యువతి) |
| యువజరతీ | - | యువతిశ్చాసౌ జరతీ చ (వృద్ధురాలు వలె కనపడు యువతి) |

## 218. కృత్యతుల్యాఖ్యా అజాత్యా (2-1-68)

**భోజ్యోష్ణమ్. తుల్యశ్వేతః. సదృశశ్వేతః. అజాత్యా కిమ్ ? భోజ్య ఓదనః. ప్రతిషేధసామర్థ్యాద్విశేషణసమాసోఽపి న.**

కృత్యంతపదములు మరియు తుల్యపదమునకు పర్యాయపదములు సమానాధికరణములైన జాతివాచకములు కాని పదములతో సమసించి తత్పురుషములగును. భోజ్యం చ తద్ ఉష్ణం చ – భోజ్యోష్ణమ్ (వేడి భోజనము) ' భోజ్యమ్ ' అనునది కృత్యంతపదము. ఇది మరియు 'ఉష్ణ' శబ్దము రెండూ విశేషణములే. రెండింటిలో ఏదో ఒకటి పూర్వపదముగా ఉండే వికల్పము సంభవింపగా కృత్య పదమైన 'భోజ్యం' మాత్రమే పూర్వపదత్వమును పొందునని నిర్దేశించుటకు యీ సూత్రము చెప్పబడినది. " విశేషణం విశేష్యేణ బహులమ్ " (2-1-57) వలన విధింపబడిన సమాసమునకు ప్రస్తుత సూత్రము వలన పూర్వోత్తరపదనిర్ణయం చేయబడినది.

## 219. వర్ణో వర్ణేన ( 2-1-69 )

**సమానాధికరణేన సహ ప్రాగ్వత్. కృష్ణసారంగః - కృష్ణశ్చాసౌ సారంగశ్చ**

సుబన్తమైన వర్ణవాచకపదము సమానాధికరణమైన పదముతో సమసించును, అది తత్పురుషసమాసమగును. 'కృష్ణసారంగః' (నలుపు చిత్రవర్ణము గలగిన జింక)

## 220. కడారాః కర్మధారయే (2-2-38)

**కడారాదయః శబ్దాః కర్మధారయే వా పూర్వం ప్రయోజ్యాః. కడారజైమినిః. జైమినికడారః.**



కడార, గడుల, ఖంజ, ఖోడ, కాణ మొదలగు పదములు కడార గణమునకు చెందినవి. ఇవి అన్నీ విశేషణములే. ఈ విశేషణములు సమానాధికరణములైన పదములతో సమసించినపుడు ఇవి వైకల్పికముగా పూర్వపదంగా ఉంటాయి. అంటే యీ సూత్రము ఉపసర్జనసంజ్ఞా ప్రవృత్తికి అపవాదసూత్రము అని గమనించవలెను.

కడారశ్చాసౌ జైమినిశ్చ – కడారజైమినిః, లేక జైమినికడారః

(గోరోజనము వంటి రంగుగల జైమిని)

## 221. కుమారః శ్రమణాదిభిః (2-1-70)

**కుమారీ శ్రమణా - కుమారశ్రమణా. ఇహ గణే శ్రమణా, ప్రవ్రజితా, గర్భిణీత్యాదయః స్త్రీలిఙ్గాః పఠ్యన్తే. లిఙ్గవిశిష్టపరిభాషాయా ఏతదేవ జ్ఞాపకం బోధ్యమ్.**

కుమారపదము సమానాధికరణములైన శ్రమణాదిగణములోని పదములతో సమసించి తత్పురుషమగును. శ్రమణ, ప్రవ్రజితా, కులటా, గర్భిణీ, తాపసీ, దాసీ, బన్ధకీ, అధ్యాపక, అభిరూపక, పండిత, పటు, మృదు, కుశల, చపల, నిపుణ అను పదములు శ్రమణాది గణములో ఉన్నాయి.

ఈ గణంలోని పదాల లింగ వైవిధ్యాన్ని గమనిస్తే శ్రమణా, ప్రవ్రజితా లాంటివి స్త్రీలింగ ప్రత్యయాంతములయిన స్త్రీవాచకములు. అధ్యాపక, అభిరూపక, పండిత మొదలగునవి పుంలింగ శబ్దాలు. పటు, మృదు, చపల, నిపుణలాంటి శబ్దాలు విశేషణాలు. వాటికి విశేష్యమును బట్టి లింగ గ్రహణం చేయబడుతుంది. ఈ వైవిధ్యాన్ని యీ గణంలో ప్రదర్శించటానికి ఏదో ఒక నియమము ఉండాలి. ఆ దానిని ఒక పరిభాషా రూపంగా నిర్దేశించవచ్చు. " ప్రాతిపదికగ్రహణే లింగవిశిష్టస్యాపి గ్రహణమ్ " అని వ్యాకరణ శాస్త్రంలో ఉపయోగించిన ప్రాతిపదిక లింగ విశిష్టమైన ప్రాతిపదికను కూడా గ్రహించును. ఈ సూత్రమే యీ పరిభాషకు మూలము.

కుమారశ్రమణా – కుమారీ చాసౌ శ్రమణా చ

'కుమారీ' శబ్దమునకు "పుంవత్కర్మధారయ జాతీయదేశీయేషు" అను సూత్రముచే పుంలింగము.

## 222. చతుష్పాదో గర్భిణ్యా (2-1-71)

**చతుష్పాజ్జాతివాచినో గర్భిణీశబ్దేన సహ ప్రాగ్వత్. గోగర్భిణీ.**
**(వా) చతుష్పాజ్జాతిరితి వక్తవ్యమ్. నేహ. స్వస్తిమతీ గర్భిణీ.**

చతుష్పాదమైన జంతువాచకపదము సమానాధికరణమైన గర్భిణీ శబ్దముతో సమసించి తత్పురుషమగును.

గర్భిణీ చాసౌ గౌశ్చ – గోగర్భిణీ (చూలి ఆవు)

ఇచట గర్భిణీ శబ్దము విశేషణము, గో శబ్దము విశేష్యము. 'విశేషణం విశేష్యేణ బహులమ్ ' (2-1-57) అను సూత్రముచే విశేషణమునకు పూర్వపదత్వం రావలసి ఉండగా యీ సూత్రముతో విశేష్యమునకు పూర్వపదత్వం విశేషణమునకు ఉత్తరపదత్వము చెప్పబడినది.

ఇట్లు విశేష్యము పూర్వపదముగా సాధింపబడిన సమాసములను విశేష్య పూర్వపద కర్మధారయములు లేదా విశేషణోత్తరపద కర్మధారయములని అంటారు.

**(వా) చతుష్పాజ్జాతిరితి వక్తవ్యమ్**

స్వస్తిమతీ చాసౌ గర్భిణీ చ ' కాలక్షీ చాసౌ గర్భిణీ చ ' అను విగ్రహవాక్యముల నుండి విశేష్య పూర్వపద కర్మధారయమును నివర్తించుటకై ఈ వార్తికం చెప్పబడినది. విశేష్యము జాతివాచకము కావలయును. 'గోగర్భిణీ' అనునపుడు గోశబ్దము జాతివాచకము కావున సమాసము. స్వస్తిమతీ కాలాక్షి అనునవి వ్యక్తి వాచకములు కావున సమాసము లేదు. కావున స్వస్తిమతీ గర్భిణీ, కాలాక్షీ గర్భిణీ అని మాత్రమే ఉంటాయి.

## 223. మయూరవ్యంసకాదయశ్చ (2-1-72)

**ఏతే నిపాత్యంతే. మయూరో వ్యంసకః – మయూరవ్యంసకః. వ్యంసకో ధూర్తః. ఉదక్చావాక్చ – ఉచ్చావచమ్. నిశ్చితం చ ప్రచితం చ నిశ్చప్రచమ్. నాస్తి కించన యస్య సః – అకించనః. నాస్తి కుతోభయం యస్య సః అకుతోభయః, అన్యో రాజా రాజాన్తరమ్, చిదేవ చిన్మాత్రమ్.**

**ఆఖ్యాతమాఖ్యాతేన క్రియాసాతత్యే**

**అశ్నీత పిబతేత్యేవం సతతం యత్రాభిధీయతే సా అశ్నీతపిబతా. పచతభృజ్జతా. ఖాదతమోదతా.**

**ఏహీడాదయోఽన్యపదార్థే**

**ఏహీడ ఇతి యస్మిన్కర్మణి తదేహీడం. ఏహియవమ్. ఉద్ధర కోష్ఠాదుత్సృజ దేహీతి యస్యాం క్రియాయాం సా ఉద్ధరోత్సృజా. ఉద్ధమవిధమా. అసాతత్యార్థమిహ పాఠః.**



**జహికర్మణా బహులమాభీక్ష్ణ్యే కర్తారం చాభిదధాతి**

**జహీత్యేతత్కర్మణా బహులం సమస్యతే అభీక్ష్ణ్యే గమ్యే సమాసేన చేత్కర్తాఽభిధీయత ఇత్యర్థః. జహిజోడః. జహిస్తంబః. నాస్తికుతో భయం యస్య సః – అకుతోభయః. అన్యోరాజా – రాజాన్తరం. చిదేవ – చిన్మాత్రమ్.**

ఇంతవరకు కర్మధారయసూత్రాల పరిధిలోకి రానట్టి క్లిష్టమైన సమాసాలను కొన్నింటిని ఒక గణముగా ఏర్పాటు చేసుకుని దానికి మయూరవ్యంసకాది గణం అని పాణిని పేరుపెట్టాడు. ఈ గణంలో ఉదహరించిన మొదటి సమాసము మయూరవ్యంసకాది గణంలోని సమాసాలనన్నింటిని తత్పురుషగాను, కర్మధారయంగాను సాధువులుగా ప్రమాణీకరిస్తుంది.

**1. ఆఖ్యాతమ్ ఆఖ్యాతేన క్రియాసాతత్యే.**

'తిజంతక్రియాపదము మరొక తిజంత క్రియాపదముతో నిరవచ్ఛిన్నంగా జరుగుచున్న ప్రక్రియ' అను అర్థము క్రియావాచకములు బోధించునపుడు సమసించును. ఉదాహరముగా 'అశ్నీత పిబత' (విందు ఇచట తినండి, త్రాగండి అని సతతం అరుస్తూ ఉంటారు) అని చెప్పవచ్చు.

**2. ఏహీడాదయోఽన్యపదార్థే**

ఏహీడాదులు అన్యపదార్థమునందు సాధువులు. ఏహీడమ్ – ఏహి ఈడే.

(ఏహి – ఆ అను ఉపసర్గతో కూడిన 'ఇ' ధాతువుకు లోట్ మధ్యమ పురుష ఏకవచనము) ఈడే – లట్ ఉత్తమ పురుష ఏకవచనము)

**3. జహికర్మణా బహులమాభీక్ష్ణ్యే కర్తారం చాభిదధాతి.**

జహి అను క్రియాపదము పౌనఃపున్యార్థమును ప్రకటించునప్పుడు అది కర్తకు సంబంధించిన విషయమైనపుడు కర్మవాచకమైన సుబన్తముతో సమసించును. ఉదా :– జహిజోడః, జహిస్తంభః= జోడం జహి, స్తంబంజహి అని మరల మరల చెప్పువాడని అర్థము.

## 224. ఈషదకృతా (2-2-7)

**ఈషత్పిఙ్గలః**

**(వా) ఈషద్గుణవచనేనేతి వాచ్యమ్**

ఈషద్రక్తమ్ 'ఈషత్' అను అవ్యయం కృదంతముగాని విభక్త్యంత పదముతో సమసించి తత్పురుషమగును.

వార్తికకారుడు "ఈషద్గుణవచనేనేతి వాచ్యమ్ " అను వార్తికము ద్వారా ఈ సూత్రప్రవృత్తిని నియమించుచున్నాడు. 'ఈషత్' శబ్దము గుణవచనములతోనే సమసించును ఈషత్ పింగలః (కొంచెము గోరోజనము వంటి వర్ణము), ఈషద్రక్తమ్ (కొంచెము రక్త వర్ణము) అను ఈ సమాసములు గుణవాచకములే.

# నఞ్ తత్పురుషము

## 225. నఞ్ (2-2-6)

**నఞ్ సుపా సహ సమస్యతే.**

" పూర్వకాలైక సర్వజరత్పురాణ ..........సమానాధికరణేన" (2-1-49) సూత్రములోని ' సమానాధికరణేన ' అనుపదము అధికారికంగా రెండవ అధ్యాయం ప్రథమ పాదము చివరి వరకే అనువర్తించును. కావున " మయూరవ్యంసకాదయశ్చ " (2-1-72) సూత్రము వరకు సిద్ధించిన సమాసములకు మాత్రమే కర్మధారయ సంజ్ఞ అనువర్తించును. కాని ఈ రెండవ పాదమునకు తత్పురుష సంజ్ఞ మాత్రమే అనువర్తించును.

"సహసుపా" (2-1-4) సూత్రము నుండి 'సుపా' అనునది అనువర్తించును. 'సుబామన్త్రితే' (2-1-2) నుండి 'సుప్' అనువర్తించును. 'సుప్సుపా' అనునది సమాసవిధాయక సూత్రం. ఇందు సుప్ స్థానమందు 'నఞ్' చెప్పబడినది. అందువలన, 'నఞ్' అనునది సమర్థవంతమైన సుబంతముతో నమసించును.' 'నఞ్' స్వరాదులయందును, నిపాతాదులయందు చేరుటచే ఇది అవ్యయము. ఇది నిషేధార్థకము. 'నఞ్' లోని ఞ కారమునకు ఇత్సంజ్ఞకము, లోపము. " న బ్రాహ్మణః " అను విగ్రహవాక్యమున రెండు పదములకు మధ్య సామర్థ్యముండుట వలన సమాసము. 'న + బ్రాహ్మణః' అని యుండగా–

## 226. నలోపో నఞః (6-3-73)

**నఞో నస్య లోపస్స్యాదుత్తరపదే. న బ్రాహ్మణః, అబ్రాహ్మణః.**

ఉత్తరపదము పరమగునపుడు 'నఞ్' లోని నకారమునకు లోపము వచ్చి 'అ' కారము మాత్రమే మిగులును.

'నబ్రాహ్మణః' అని ఉండగా 'న' కారములోని 'న్' ఈ సూత్రముచే లోపించి 'అబ్రాహ్మణః' అని అగును. ఈ సూత్రంలో "అలుగుత్తరపదే" (6-3-1) అను సూత్రం





నుండి 'ఉత్తరపదే' అనునది అధికారికంగా అనువర్తించును. " న + అశ్వ " అను సందర్భమున ఉత్తరపదము అచ్చుతో ప్రారంభమైనపుడు ఉత్తరపదములోని అకారము, నఞ్ లోని అకారమునకు పరమైనపుడు ఏమి చేయవలెనో అను ప్రశ్నకు సమాధానము రాబోవు సూత్రము ద్వారా తెలుపును.

## 227. తస్మాన్నుడచి (6-3-74)

**లుప్తనకారాన్నఞ ఉత్తరపదస్యాజాదేర్నుడాగమస్స్యాత్. అనశ్వః. అర్థాభావేఽవ్యయీభావేన సహాయం వికల్ప్యతే. " రక్షోహాగమలఘ్వసందేహాః ప్రయోజనమ్" ఇతి, 'అద్రుతాయామసంహితమ్', ఇతి చ భాష్యవార్తిక ప్రయోగాత్. తేన అనుపలబ్ధిః. అవివాదః. అవిఘ్నమ్ ఇత్యాది సిద్ధమ్.**

**(వా)నఞో నలోపస్తిఙి క్షేపే**

**అపచసి త్వం జాల్మ. నైకధేత్యాదౌ తు నశబ్దేన సహ సుపేతి సమాసః.**

నకారము లోపించిన నఞ్ కు పరమైన అజాదియైన ఉత్తరపదమునకు 'నుట్' ఆగమముగా వచ్చును. నుట్ లోని టకార – ఉకారములు లోపించగా 'న్' మిగులును. అ + న్ + అశ్వః – అనశ్వః ఇచట 'అలుగుత్తరపదే' అను సూత్రము నుండి 'ఉత్తరపదే' అనువర్తించును. ఈ సూత్రము 'న లోపో నఞః' అను సూత్రమునకు తర్వాత వచ్చుటచే 'తస్మాత్' అనుదానికి 'లుప్తనకారాత్' అని అర్థము చెప్పవలసినది. అభావార్థమున అవ్యయీభావసమాసము వచ్చును కదా అనుకున్నప్పుడు "అసందేహాః, అసంహితం" ఇత్యాది ప్రయోగాలు భాష్యవార్తికకారులు స్వయంగా ఉపయోగించినందువల్ల నఞ్ తత్పురుషములే అని చెప్పబడినది అందువలననే 'అనుపలబ్ధిః' 'అవివాదః' మొదలగు పదములు కూడ సిద్ధించినవి. న +ఏకధా – అనేకధా ఎట్లు సాధువగును అను ప్రశ్నకు సమాధానంగా 'సహ సుపా' అని 'యోగవిభక్త' సూత్రముచే న ఏకధా – నైకధా అని ఏర్పడును. అందువలన 'నైకధా' అనునది నఞ్ తత్పురుష సమాసము కాదు. ఇది కేవలసమాసము. నుడాగము వచ్చినపుడు 'అనేకధా' అని అగును. ఇది నఞ్ తత్పురుష. ఇక్కడ 'నలోపో నఞః', 'తస్మాన్నుడచి' అను సూత్రములు 'నఞ్' తో సమాసము చెప్పినపుడే ప్రవర్తించును.

**నఞో నలోపస్తిఙి క్షేపే (వా)**

'అపచసి త్వం జాల్మ' అను ఉదాహరణమున 'పచసి' అను ధాతువు నఞ్ తో సమసింపగా నకారమునకు లోపము వచ్చినది. అందుచే అపచసి అని సిద్ధించినది.

**228. నభ్రాణ్నపాన్నవేదానాసత్యానముచినకుల నఖనపుంసకనక్షత్ర నక్ర నాకేషు ప్రకృత్యా (6-3-75)**

**'పాద్' ఇతి శత్రన్తః. 'వేదాః' ఇత్యసున్నన్తః. నసత్యా-అసత్యాః, న అసత్యాః – నాసత్యాః, న ముఞ్చతీతి – నముచిః. న కులమస్య – నకులమ్. న ఖమస్య – నఖమ్. న స్త్రీ పుమాన్ – నపుంసకమ్. స్త్రీపుంసయోః పుంసకభావో నిపాతనాత్. న క్షరతీతి – నక్షత్రమ్. క్షీయతేః. క్షరతేర్వా క్షత్రమ్ ఇతి నిపాత్యతే. న క్రామతి – ఇతి – నక్రః. క్రమేర్డః. న అకమస్మిన్నితి – నాకః.**

నభ్రాజ్, నపాత్, నవేదస్, నాసత్యా (ద్వివచనము), నముచి, నకుల, నఖ, నపుంసక, నక్షత్ర, నక్ర మరియు నాక శబ్దములందున్న నకారము లోపింపక న కారముగానే ఉండునని ఈ సూత్రమునకు అర్థము.

| | | |
|---|---|---|
| నభ్రాట్ | – | న భ్రాజతే (నల్లని మేఘము) |
| నపాత్ | – | న పాతి (మనుమడు) – శతృప్రత్యయాంతము |
| నవేదా | – | న వేత్తి (అసున్ ప్రత్యయాంతము) |
| సత్యాః | – | సత్సు సాధవః |
| అసత్యాః | – | న సత్యాః |
| నాసత్యాః | – | న అసత్యాః (అశ్వినులు) |
| నముచిః | – | న ముంచతి (ఇంద్రునిచే చంపబడ్డ రాక్షసుడి పేరు) |
| నకులః | – | నాస్య కులమస్తి (ముంగిస) |
| నఖమ్ | – | నాస్య ఖమస్తి (గోరు) |
| నపుంసకమ్ | – | న స్త్రీ పుమాన్ |
| నక్షత్రమ్ | – | న క్షరతే క్షీయతే వా |
| నక్రః | – | న క్రామతి (మొసలి) |

**229. నగోఽప్రాణిష్వన్యతరస్యామ్ (6-3-77)**

**నగ ఇత్యత్ర నఞ్ ప్రకృత్యా వా. నగాః, అగాః పర్వతాః. అప్రాణిష్వితి కిమ్? అగో వృషలశ్శీతేన. నిత్యం క్రీడా ఇత్యతో నిత్యమిత్యనువర్తమానే.**

'నగ' అను నఞ్ తత్పురుషమందు, ప్రాణివాచకము కానిచో నకారమునకు





వైకల్పికముగా లోపము రాదు నగాః, అగాః అప్రాణివాచకములైన చెట్లు, పర్వతాలనుద్దేశించిన సమాసములు కావున సాధువులు.

'ప్రాణి' వాచకమైనపుడు నఞ్ లోని నకారమునకు లోపము వచ్చి తీరును.
ఉదా – అగో వృషలః శీతేన (కదలలేని వృషలుడు చలిచేత).

**230. కుగతి ప్రాదయః (2-2-18)**

**ఏతే సమర్థేన నిత్యం సమస్యన్తే. కుత్సితః పురుషః – కుపురుషః. గతిశ్చేత్యను వర్తమానే.**

కుత్సితార్థకమగు 'కు' అను అవ్యయమును, గతిసంజ్ఞకములును ప్రాదులును సమర్థమగు పదముతో సమసించును. అది తత్పురుషసంజ్ఞకము. ఈ సూత్రము ద్వారా ఏర్పడిన సమాసములు నిత్యసమాసములు. కుపురుషః – కుత్సితః పురుషః (నికృష్ట మానవుడు).

**231. ఊర్యాదిచ్విడాచశ్చ (1-4-61)**

**ఏతే క్రియాయోగే గతిసంజ్ఞాః స్యుః. ఊరీకృత్య, శుక్లీకృత్య. పటపటాకృత్య. (వా)కారికాశబ్దస్యోపసంఖ్యానమ్. కారికా క్రియా. కారికాకృత్య.**
ఇదిగతిసంజ్ఞా విధాయక సూత్రము

'ఊరీ' మొదలగు పదములు, చ్వి ప్రత్యయాంత పదము, డాచ్ ప్రత్యయాంత పదములు క్రియతో సంబంధించినపుడు గతి సంజ్ఞకములగును.

ఊరీకృత్య – ఊరీకృత్వా అని లౌకిక విగ్రహవాక్యము. అంగీకారార్థమగు 'ఊరీ' అను అవ్యయమునకు కృ ధాతువుతో సంబంధముండుటచే ప్రస్తుత సూత్రము చేత గతి సంజ్ఞ. దీనికి ప్రస్తుత సూత్రముచే సమర్థమగు కృత్వా అను పదముతో సమాసము. "సమాసేఽనఞ్ పూర్వే క్త్వో ల్యప్ (7-1-37) అను సూత్రముచే 'క్త్వా' ప్రత్యయమునకు "ల్యప్" (య) ఆదేశము రాగా 'ఊరీకృత్య' అను తత్పురుష సమాసము సిద్ధించును.

శుక్లీకృత్య – " అశుక్లం శుక్లం కృత్వా (తెల్లగా లేనిదానిని తెల్లగాచేసి) శుక్లంకృత్వా అనుచోట "కృభ్వస్తి యోగే సంపద్యకర్తరిచ్విః" అను సూత్రముద్వారా శుక్ల శబ్దమునకు అభూత తద్భావార్థము అనగా అట్లుకానిది అట్టైనది అను అర్థమున 'చ్వి' ప్రత్యయము, అనుబంధలోపము. " అస్య చ్వౌ " అను సూత్రముచే ఆకారమునకు ఈకారాదేశము

(శుక్లీ + కృత్వా) చ్వి ప్రత్యయాంతమగు 'శుక్లీ' అనుదానికి కృ ధాతువుతో యోగముండుటచే గతిసంజ్ఞ, మఱియు దీనికి కృత్వా అను సమర్థపదముతో 'కుగతిప్రాదయః' అను సూత్రముద్వారా సమాసము " సమాసేఽనఞ్ పూర్వే " అను సూత్రముచే 'క్త్వా' ప్రత్యయమునకు 'ల్యప్' (య) ఆదేశము రాగా 'శుక్లీకృత్య' అని సిద్ధించును.

పటపటాకృత్య (పటపటా అను శబ్దము చేసి)
పటత్ కృత్వా అనుచోట అవ్యక్త ధ్వన్యనుకరణ శబ్దమగు పటత్ శబ్దమునకు "అవ్యక్తానుకరణాద్ ద్వ్యజవరార్ధాదనితౌ డాచ్" అను సూత్రముతో 'డాచ్' (ఆ) ప్రత్యయ రాగా "డాచి ద్వే బహులమ్" అను వార్తికముతో పటత్ శబ్దమునకు ద్విత్వము, (పటత్ పటత్ ఆ కృత్వా) టి లోపము, " నిత్య మామ్రేడితే డాచి " అను సూత్రముచే తకారమునకు లోపము వచ్చి ఆకారాదేశము రాగా పటపటాకృత్వా అని కాగా, కృధాతువుతో యోగముండుటచే గతి సంజ్ఞ, మఱియు 'ల్యప్' ప్రత్యయం రాగా పటపటాకృత్య అని సిద్ధించినది.

**(వా) కారికాశబ్దస్యోపసంఖ్యానమ్**

కారికాకృత్య అను సాధురూపమును సిద్ధింపజేయుటకై ఈ వార్తికము చెప్పబడినది. కారికా అంటే క్రియ అని అర్థం. 'క్రియను చేసే' అనే అర్థమున ఈ సమాసము చెప్పబడును.

## 232. అనుకరణం చానితిపరమ్ (1-4-62)

**ఖాట్ కృత్య. అనితిపరం కిమ్ ? ఖాడితి కృత్వా నిరష్ఠీవత్.**

'ఇతి' అను అవ్యయముతో చెప్పబడిన అనుకరణ శబ్దమునకు గతిసంజ్ఞ వచ్చునని సూత్రానికి అర్థము.

ఖాట్కృత్య (ఖాట్ అను శబ్దముచేసి) అని తత్పురుషము. 'ఇతి' అను శబ్దముతో చెప్పకపోవుటవలన ఖాట్ శబ్దమునకు 'కుగతి ప్రాదయః' సూత్రం ద్వారా సమాసము సిద్ధించును.

## 233. ఆదరాऽనాదరయోః సదసతీ (1-4-63)

**సత్కృత్య. అసత్కృత్య.**

సత్ మఱియు అసత్ శబ్దములు గౌరవ, అగౌరవార్థములలో ఉపయోగించి నప్పుడు, మఱియు క్రియావాచకములతో సంబంధించినపుడు గతిసంజ్ఞ వచ్చునని సూత్రార్థము. సత్కృత్య (సత్కరించి, గౌరవించి), అసత్కృత్య (అగౌరవపరచి) అను అర్థములలో



కృత్య అను క్రియావాచకములతో సంబంధించుటవలన 'సత్' మఱియు 'అసత్' అను అవ్యయములకు గతిసంజ్ఞ ప్రస్తుత సూత్రం ద్వారా సిద్ధించి 'కుగతి ప్రాదయః' సూత్రం ద్వారా సమాసమేర్పడును.

## 234. భూషణేఽలమ్ (1-4-64)

**అలంకృత్య. భూషణే కిమ్ ? అలం కృత్వౌదనం గతః. పర్యాప్తమిత్యర్థః. అనుకరణమిత్యాది త్రిసూత్రీ స్వభావాత్ కృఞ్ విషయా.**

క్రియావాచకముతో కూడుకొని అలంకరణార్థమున ప్రయోగించిన 'అలమ్' అను అవ్యయమునకు గతి సంజ్ఞ వచ్చును.

'కటకాద్యాభరణములచే అలంకరించి' అను అర్థమున కృత్య అను క్రియా వాచకముతో 'అలం' అను అవ్యయము సమసించుటచే "అలంకృత్య" అను గతి సమాసము సిద్ధించినది.

కాని "అలంకృత్వా ఓదనం గతః" అనునపుడు 'అలం' అను అవ్యయము అలంకరణార్థమున కాకుండ 'చాలు' అను అర్థమున వాడబడినది కావున ఈ సూత్రము ప్రవర్తింపదు. "భోజనము చాలించి అతను వెళ్ళిపోయెను" అని ఈ ఉదాహరణమునకు అర్థము.

## 235. అన్తరపరిగ్రహే (1-4-65)

**అన్తర్హత్య. మధ్యే హత్వేత్యర్థః అపరిగ్రహే కిమ్ ? అన్తర్హత్వా గతః. హతం పరిగృహ్య గత ఇత్యర్థః.**

క్రియావాచకముతో కూడుకొని 'పరిత్యజించి' అను అర్థమున ప్రయోగించిన 'అంతర్' అను అవ్యయమునకు గతిసంజ్ఞ వచ్చును.

"అన్తర్హత్య గృహం గతః" అను గృహమును వదిలి అతను వెళ్ళిపోయెను అను అర్థమున ఈ సూత్రముచే గతి సమాసము సిద్ధించినది కాని "అన్తర్హత్వా గతః" హతం పరిగృహ్య గతః అనగా చనిపోయిన దానిని తీసుకుని వెళ్ళిపోయేనని చెప్పబడినది కావున ఈ సూత్రము రాదు.

## 236. కణేమనసీ శ్రద్ధాప్రతీఘాతే (1-4-66)

**కణేహత్య పయః పిబతి. మనోహత్య. కణేశబ్దః సప్తమీ ప్రతిరూపకో నిపాతః అభిలాషాతిశయే వర్తతే. మనశ్శబ్దోపి అత్రైవ.**

క్రియావాచకముతో పాటు 'ఆసక్తి నశించు' అను అర్థమున ప్రయోగించిన 'కణే', 'మనస్' శబ్దములకు గతి సంజ్ఞ వచ్చును.

అత్యంతాభిలాష శ్రద్ధ, దానినుంచి నివృత్తిని "కణే" అను అవ్యయము బోధించును. కోరిక పూర్తిగా తీరిన తరువాత ఏర్పడు అభిలాషారాహిత్యమును "కణే" అనునది బోధించును.

'కణేహత్య పయః పిబతి' (పాల మీద ప్రీతి పోవు వరకు పాలను త్రాగుచున్నాడు) అనే వాక్యములో 'కణేహత్య' అనునది తత్పురుషము.

'మనోహత్య పయః పిబతి' అను వాక్యములో కూడా 'మనోహత్య' అనునది తత్పురుషము.

### 237. పురోఽవ్యయమ్ (1-4-67)

**పురస్కృత్య**

క్రియా వాచకములతో పాటు ఉపయోగించిన పురస్ అను అవ్యయమునకు గతి సంజ్ఞ వచ్చును. "పురం పురౌ పురః" అను విభక్త్యన్త శబ్దమున్నపుడు ఈ సూత్రము రాదు.

పురస్కృతమ్ (పూజింపబడినది)

పురస్కృత్య (పూజించి, సన్మానించి)

### 238. అస్తం చ (1-4-68)

**అస్తమితి మాన్తమవ్యయం గతిసంజ్ఞం స్యాత్. అస్తంగత్య.**

మకారాంతమైన 'అస్తమ్' అను అవ్యయము క్రియావాచకముతో ఉపయోగించినపుడు గతి సంజ్ఞను పొందును.

అస్తంగత్య (అస్తమించి)

అస్తం గతాని ధనాని (డబ్బులన్ని అయిపోయాయి)

### 239. అచ్ఛగత్యర్థవదేషు (1-4-69)

**అవ్యయమిత్యేవ. అచ్ఛగత్య. అచ్ఛోద్య. అభిముఖం గత్వా ఉక్త్వా చేత్యర్థః. అవ్యయం కిమ్ ? జలమచ్ఛం గచ్ఛతి.**



'కంటికి ఎదురుగా' అను అర్థములో ప్రయోగింపబడిన 'అచ్ఛ' అను అవ్యయము క్రియావాచకముతో ముఖ్యముగా గత్యర్థ ధాతువు మరియు 'వద్' ధాతువుతో నున్నప్పుడు గతిసంజ్ఞను పొందును.

'అచ్ఛ' అను అవ్యయము 'అభి' అను అర్థములో ఉపయోగింపబడును.

అచ్ఛగత్యమ్ (కంటి ముందు ప్రత్యక్షమై) (గమ్ - ధాతువు)

అచ్ఛోద్య (సమక్షంలో మాట్లాడి) (వద్ - ధాతువు)

### 240. అదోఽనుపదేశే (1-4-70)

**అద కృత్య, అద కృతమ్. పరం ప్రత్యుపదేశే ప్రత్యుదాహరణమ్. అదః కృత్వా.**

"ఉపదేశము చేయు" అను అర్థములో ప్రయోగింపబడని 'అదస్' అను శబ్దము క్రియావాచకముతోనున్నప్పుడు గతి సంజ్ఞను పొందును.

అద కృత్య (ఈపనిని (యజ్ఞం) చేసి)

అద కృతమ్ (ఈ పని జరిగినది) 'గతిరనన్తరః' అని గతి స్వరము వచ్చుటచే దీనిని సమాసముగా పరిగణింపవలసి వచ్చునని భావము.

### 241. తిరోఽన్తర్ధౌ (1-4-71)

**తిరోభూయ.**

'అదృశ్యమగు' అను అర్థములో ప్రయోగింపబడిన 'తిరస్' అను అవ్యయము క్రియావాచకముతో నున్నప్పుడు గతిసంజ్ఞను పొందును.

తిరోభూయ (అంతర్ధానమై)

### 242. విభాషా కృఞి (1-4-72)

**తిరస్కృత్య. తిర కృత్య. తిరః కృత్వా**

"తిరోఽన్తర్ధౌ" (1-4-71) సూత్రం నుండి 'తిరస్' అను పదము అనువర్తించును. 'విభాషా' అనుపదము ఈ ప్రస్తుత సూత్రం నుండి "మధ్యే పదే నివచనే చ" (1-4-76) వరకు అనువర్తించును. అందువలన ఈ సూత్రములందు విధించిన గతి సంజ్ఞ వైకల్పికముగా వచ్చును.

కృధాతు జనిత క్రియావాచకముతో, 'అదృశ్యమగు' అను అర్థములో ప్రయోగించిన 'తిరస్' అను అవ్యయమునకు గతి సంజ్ఞ వైకల్పికముగా వచ్చును.

తిరః కృత్య – గతి సమాసము. వైకల్పికమైనందున సమాసము లేక, తిరః కృత్వా లేక తిరస్కృత్వా అను రూపములు ఏర్పడును. ఇచ్చట 'అంతర్థానమగు' అనియే అన్నింటికి అర్థము.

## 243. ఉపాజే౽న్వాజే (1-4-73)

**ఏతౌ కృఞి వా గతిసంజ్ఞౌ స్తః. ఉపాజేకృత్య, ఉపాజేకృత్వా. అన్వాజేకృత్య. అన్వాజేకృత్వా. దుర్బలస్య బలమాధాయేత్యర్థః.**

'దుర్బలునకు బలము చేకూర్చుట' అను అర్థము నందుపయోగింపబడు ఉపాజే, అన్వాజే అను రెండు అవ్యయములు కృధాతు జనిత క్రియావాచకములతో నున్నప్పుడు వైకల్పికముగా గతి సంజ్ఞను పొందును.

ఉపాజే కృత్య (గతి సమాసము) లేక ఉపాజే కృత్వా

అన్వాజేకృత్య (గతి సమాసము) లేక అన్వాజేకృత్వా

గతి సమాసమైనచో 'క్త్వా' ప్రత్యయమునకు 'ల్యప్' వచ్చును. లేనిచో క్త్వాంతముగానే ఉండును.

## 244. సాక్షాత్ప్రభృతీని చ (1-4-74)

**కృఞి వా గతిసంజ్ఞాని స్యుః.**

**(వా)చ్వ్యర్థ ఇతి వాచ్యమ్**

**సాక్షాత్ కృత్య. సాక్షాత్ కృత్వా. లవణంకృత్య. లవణంకృత్వా. మాన్తత్వం నిపాతనాత్.**

పూర్వసూత్రము నుండి 'కృఞి', 'విభాషా' అను పదములు వర్తించును. కృధాతు జనిత క్రియావాచకములతోపాటు సాక్షాత్ గణములోని సాక్షాత్ మొదలగు అవ్యయములకు గతిసంజ్ఞ వైకల్పికముగా వచ్చును.

సాక్షాత్ కృత్య (గతిసమాసం-ల్యప్), సాక్షాత్ కృత్వా (వాక్యము).



## 245. అనత్యాధాన ఉరసిమనసీ (1-4-75)

**ఉరసికృత్య. ఉరసి కృత్వా. అభ్యుపగమ్యేత్యర్థః. మనసి కృత్య. మనసి కృత్వా. నిశ్చిత్యేత్యర్థః. అత్యాధానముపశ్లేషణం తత్ర న. ఉరసి కృత్వా పాణిం శేతే.**

అత్యాధానము అను వాచ్యార్థమునందు ప్రయోగింపబడిన ఉరసి, మనసి అను విభక్తి ప్రతిరూపక అవ్యయములు కృధాతు జనిత క్రియావాచకములతో నున్నప్పుడు వైకల్పికముగా గతిసంజ్ఞను పొందును.

ఉరసికృత్య (గతి సమాసము), ఉరసి కృత్వా (వాక్యము) 'అవగాహన చేసుకొని' మనసికృత్య, మనసికృత్వా (మనస్సున నిశ్చయించుకొని, అత్యాధానార్థమున గతి సమాసముండదు. ఉదా – ఉరసి కృత్వా పాణిం శేతే (వక్షః స్థలముపై చెయ్యిపెట్టుకొని నిద్రించుచున్నాడు)

## 246. మధ్యే పదే నివచనే చ (1-4-76)

**ఏతే కృఞి వా గతిసంజ్ఞాః స్యురనత్యాధానే. మధ్యేకృత్య. మధ్యే కృత్వా. పదేకృత్య, పదే కృత్వా. నివచనే కృత్య. నివచనేకృత్వా వాచం నియమ్యేత్యర్థః.**

మధ్యే, పదే, నివచనే అనే విభక్తి ప్రతిరూపక అవ్యయములు కృధాతు జనిత క్రియావాచకములతో నున్నప్పుడు వైకల్పికముగా గతి సంజ్ఞను పొందునని సూత్రార్థము.

మధ్యేకృత్య (గతి సమాసం) , మధ్యేకృత్వా (మధ్యలో చేసి)

పదేకృత్య (గతి సమాసం) , పదేకృత్వా (పదం పెట్టి)

నివచనేకృత్య (గతి సమాసం) , నివచనేకృత్వా (మాట్లాడుటను నియంత్రించి)

## 247. నిత్యం హస్తే పాణావుపయమనే (1-4-77)

**కృఞి. ఉయమనం వివాహః. స్వీకార మాత్రమిత్యన్యే. హస్తేకృత్య పాణౌకృత్య.**

ఉపయమనం అనగా పాణిగ్రహణం. పాణిగ్రహణార్థమున ఉపయోగించిన 'హస్తే' మరియు 'పాణౌ' అను విభక్తి ప్రతిరూపక అవ్యయములు కృధాతు జనిత క్రియావాచకముతో నున్నప్పుడు నిత్యముగా గతిసంజ్ఞను పొందును.

సూత్రములోని 'నిత్యశబ్దము' చే ఇందు సాధింపబడిన సమాసములు నిత్యములని గ్రహించవలెను.

పాణౌకృత్య , హస్తేకృత్య అనునవి నిత్యగతి సమాసములు

పాణౌకృత్య, హస్తేకృత్య అనువాటికి 'వివాహము చేసుకొని' అని అర్థము 'చేతిని తీసుకొనుట' అని కొందరు చెప్పుదురు.

**248. ప్రాధ్వం బన్ధనే (1-4-78)**

**ప్రాధ్వమిత్యవ్యయమ్. ప్రాధ్వంకృత్య. బన్ధనేనాఽనుకూలం కృత్వేత్యర్థః. ప్రార్థనాదినా త్వానుకూల్యకరణే. ప్రాధ్వం కృత్వా.**

పూర్వసూత్రం నుండి 'నిత్యం' అను పదము ఈ సూత్రము లోనికి అనువర్తించును. 'బంధించు' అను అర్థమున ప్రయోగింపబడిన విభక్తిప్రతిరూపమైన 'ప్రాధ్వం' అను అవ్యయం, కృధాతుజనిత క్రియావాచకముతోనున్నప్పుడు గతిసంజ్ఞను నిత్యముగా పొందును అని సూత్రార్థము.

ప్రాధ్వంకృత్య (చక్కగా బంధించి)

**249. జీవికోపనిషదావౌపమ్యే (1-4-79)**

**జీవికామివ కృత్వా జీవికాకృత్య. ఉపనిషదమివ కృత్వా ఉపనిషద్కృత్య. ఔపమ్యే కిమ్ ? జీవికాం కృత్వా. ప్రాదిగ్రహణమగత్యర్థమ్. సుపురుషః.**

ఉపమానముగా ప్రయోగించిన 'జీవిక', 'ఉపనిషత్' శబ్దములు కృధాతుజనిత క్రియా వాచకముతోపాటు ఉపయోగించినపుడు గతి సంజ్ఞను పొందును.

జీవికాకృత్య – జీవికామివ కృత్వా

(అశనపానాది జీవనోపాయమనగా చేసికొని వానివలె చేసి)

ఉపనిషదమివ కృత్వా – ఉపనిషద్కృత్య

(రహస్యగ్రాహ్యమైన ఉపనిషత్తువలె రహస్యముగా ఉంచి)

## ప్రాదిసమాసములు

**1. ప్రాదయో గతాద్యర్థే ప్రథమయా**

'ప్ర' మొదలగునవి, గత మొదలగు అర్థములందు ప్రథమాంత పదముతో సమసించును.

ప్రాచార్యః – ప్రగతః ఆచార్యః (పూర్వాచార్యుడు)



**2. అత్యాదయః క్రాన్తాద్యర్థే ద్వితీయయా**

'అతి' మొదలగునవి క్రాన్తాద్యర్థములందు ద్వితీయాంత పదముతో సమసించును.

అతిమాలః – అతిక్రాన్తః మాలామ్.

**3. అవాదయః క్రుష్టాద్యర్థే తృతీయయా**

'అవ' మొదలగునవి, 'క్రుష్ట' (పిలుచు) మొదలగు అర్థములందు తృతీయాంత పదముతో సమసించును.

అవకోకిలః – అవకృష్టః కోకిలయా (కోకిల ధ్వనిచే తెలుపబడిన వసంతఋతువు)

**4. పర్యాదయో గ్లానాద్యర్థే చతుర్థ్యా**

'పరి' మొదలగునవి గ్లానము (అలసట) మొదలగు అర్థములందు చతుర్థ్యంత పదముతో సమసించును.

పర్యధ్యయనః – పరిగ్లానో అధ్యయనాయ (చదువు కొరకు అలసినవాడు).

**5. నిరాదయః క్రాన్తాద్యర్థే పంచమ్యా**

'నిర్' మొదలగునవి 'క్రాంతము' (పోయినది) మొదలగు అర్థములందు పంచమ్యంత పదములతో సమసించును.

నిష్కౌశాంబిః – నిష్క్రాన్తః కౌశాంబ్యాః (కౌశాంబి నగరము నుండి వెడలినవాడు)

**6. కర్మప్రవచనీయానాం ప్రతిషేధః**

"కర్మ ప్రవచనీయాః" (1-4-93) సూత్రం ద్వారా కర్మ ప్రవచన సంజ్ఞను పొందిన ప్రాదులు సుబంతములతో సమసింపవు.

'వనం ప్రతి విద్యోతతే విద్యుత్' అను వాక్యము నుండి ప్రతి అను ప్రాది శబ్దము వన శబ్దముతో సమసింపదు.

## ఉపపదసమాసములు

**250. తత్రోపపదం సప్తమీస్థమ్ (3-1-92)**

**సప్తమ్యన్తే పదే కర్మణీత్యాదౌ వాచ్యత్వేన స్థితమ్ కుమ్భాది తద్వాచకం పదముపపద సంజ్ఞం స్యాత్. తస్మింశ్చ సత్యేవ వక్ష్యమాణః ప్రత్యయః స్యాత్.**

తత్ర, ఉపపదమ్, సప్తమీస్థమ్ అని పదవిభాగము. ఇది 'ధాతోః' అను అధికార సూత్రమునకు తర్వాతనున్న అధికార సూత్రము. సప్తమ్యంత పదము నందు వాచ్యవాచక సంబంధముతో ఉన్నది అని అర్థం అనగా సప్తమ్యంతపదవాచ్యమని భావము.

"ధాతోః" (3-1-91) అను అధికారసూత్రాంతర్గతములగు "కర్మణ్యణ్" (3-2-1) ఇత్యాది సూత్రములతో సప్తమ్యంతపదముచే వాచ్యమగు కుంభాదికమును తెలుపు పదము ఉపపదము అని అనబడును. అట్టి ఉపపదము సమీపమున ఉన్నప్పుడు మాత్రమే చెప్పబోవు ఆయాప్రత్యయములు వచ్చును.

'కుంభం కరోతి' అను అర్థము 'కర్మణ్యణ్' అను సూత్రమునందలి 'కర్మణి' అను సప్తమీ పదముచే వాచ్యమగునది. కుంభము - తద్వాచకమగు కుంభశబ్దమిచట ఉపపదసంజ్ఞకము.

ప్రస్తుతం సూత్రం నందు 'ఉపపదం సప్తమీస్థమ్' అను భాగమునకు పూర్వోక్తార్థము చెప్పిన తర్వాత 'తత్ర' అను దానికి "అట్టి ఉపపదము సమీపముననున్నప్పుడు మాత్రము ఆయా ప్రత్యయములు వచ్చుననే" భావము వ్యక్తమగును.

## 251. ఉపపదమతిజ్ (2-2-19)

**ఉపపదం సుబన్తం సమర్థేన నిత్యం సమస్యతే. అతిఙన్తశ్చాయం సమాసః. కుమ్భం కరోతీతి కుమ్భకారః. ఇహ కుమ్భ + అస్ + కార ఇత్యలౌకికం విగ్రహవాక్యమ్. అతిజ్ కిమ్ ? మా భవాన్ భూత్. 'మాఙి లుఙ్' ఇతి ' సప్తమీ నిర్దేశాన్మాఙుపపదమ్. అతిఙ్ గ్రహణం జ్ఞాపయతి సుపేత్యేతన్నేహాఽనువర్తత ఇతి. పూర్వసూత్రేఽపి గతిగ్రహణం పృథక్ కృత్య అతిఙ్ గ్రహణం తత్రాపకృష్యతే. సుపేతి చ నివృత్తమ్. తథా చ 'గతికారకో పపదానాం కృద్భిస్సహ సమాసవచనం ప్రాక్సుబుత్పత్తే ' రితి సిద్ధమ్. వ్యాఘ్రీ. అశ్వక్రీతీ. కచ్ఛపీ.**

ఉపపద సంజ్ఞకమగు సుబంతము సమర్థమగు పదముతో నిత్యముగా సమసించును. తిజంతము కాదు.





కుంభకారః (కుండలను చేయువాడు) కుంభం కరోతి అను అర్థమున కర్మ వాచకమగు కుంభ శబ్దముపపదముగా ఉండుటచే కృధాతువుపై కర్త్రర్థమున "కర్మణ్యణ్" (3-2-1) అను సూత్రముచే 'అణ్' ప్రత్యయము. "అచోఞ్ణితి" అను సూత్రముచే వృద్ధి వచ్చి 'కార' అని ఏర్పడును. 'కుంభ + అమ్ + కార' అని అలౌకిక విగ్రహవాక్యము. ఇపుడు 'తత్రోపపదమ్' అను సూత్రము ద్వారా 'కుంభ + అమ్' అను దానికి 'కార' అను సమర్థ పదముతో సమాసము, సుబ్లోపము, 'కుంభకార' అని అగును.

'కార' అను కృత్య ప్రత్యయాంతముతో కలిసి ఉన్నందున "కర్తృ కరణయోః కృతి" అను సూత్రముచేత 'కుంభ' శబ్దమునకు షష్ఠీవిభక్తియే వచ్చుటచే కుంభ + అమ్ + కార అని అలౌకిక విగ్రహవాక్యము చెప్పుట తప్పు. 'కుంభం కరోతి' అనునది అర్థప్రదర్శనమునకు మాత్రమే.

ఈ సమాసము తిజంతముతో రాదు. అతిజ్ అని చెప్పడం వలన 'మా భవాన్ భూత్' అనుచోట మా అనుదానికి భూత్ అను తిజంతముతో సమాసము రాదు. 'మాఙి లుఙ్' అను సూత్రమునందలి 'మాఙి' అను సప్తమ్యంత పదము వాచ్యమగుటచే మాఙ్ అనుదానికి "తత్రోపపదం సప్తమీస్థమ్." అను సూత్రముచే ఉపపదసంజ్ఞ వచ్చును. ఉపపదము సమర్థముతో సమసించును అని చెప్పినందున 'మా భవాన్ భూత్' అనుచోట ఉపపద సంజ్ఞకమగు 'మా' అనుదానికి 'భూత్' అనుదానితో సమాసము వచ్చెడిది. కాని తిజంతముతో రాదు అని చెప్పడం వలన 'భూత్' అను తిజంతముతో ఉపపదమైనను 'మాఙ్' నకు సమాసము రాదు. ఇక్కడ సమాసము రాదని తెలియజేయుటకే రెండింటి మధ్య 'భవాన్' అనునది ప్రయోగింపబడినది అని గ్రహింపవలెను.

**'గతికారకోపపదానాం కృద్భిస్సహ సమాసవచనం ప్రాగ్సుబుత్పత్తేః'.** గతి సంజ్ఞకము, కారకము, ఉపపదము వీనికి కృదంతముతో వచ్చు సమాసము కృదంతముపై సుబుత్పత్తికి పూర్వమే వచ్చును. వ్యాఘ్రీ అనునది గతి సమాసమునకు ఉదాహరణము.

వ్యాఘ్రీ – వ్యాజిఘ్రతి ఇతి (విశేషముగా నలుదిక్కులందు వాసన చూచునది). 'వ్యాఘ్ర' శబ్దము జాతివాచకమగును. అందుచే "జాతేరస్త్రీ విషయాదయోపధాత్" (4-1-63) అను సూత్రముచే 'ఙీష్' ప్రత్యయము వచ్చి 'వ్యాఘ్రీ' అను రూపము సిద్ధించును. కృదంతమగు 'ఘ' శబ్దము జాతి వాచకము కానట్లయితే వి, ఆఙ్ అను ఉపసర్గలతో కూడి టాప్ (ఆ) ప్రత్యయం వచ్చి 'వ్యాఘ్రా' అను రూపము ఏర్పడును.

అశ్వక్రీతీ – అశ్వేన క్రీతా (గుర్రము ద్వారా కొనబడినది). ఇచ్చట అశ్వ + టా అను

తృతీయాంతమునకు 'క్రీత' అను 'క్త' ప్రత్యయాంతముతో 'సుప్' ప్రత్యయము చేర్చుటకు ముందే 'క్రీత' అను కేవల ప్రాతిపదికముతో " కర్తృకరణే కృతా బహులమ్" అను సూత్రముచే సమాసము, సుబ్లోపము కూడ రాగా 'అశ్వక్రీత' అను ప్రాతిపదికమేర్పడగా "క్రీతాత్ కరణపూర్వాత్" అను సూత్రముచే 'అశ్వ' అను కరణవాచక శబ్దము పూర్వమునందుండుట వలన క్రీత శబ్దమునకు 'ఙీష్' (ఈ) ప్రత్యయము వచ్చి 'అశ్వక్రీతీ' అను సిద్ధించును.

క్రీత శబ్దమునకు సుప్ ప్రత్యయము చెప్పకముందే సమాసము విధింప వచ్చునని చెప్పినచో పూర్వము వలె ఇక్కడ కూడ 'టాప్' ప్రత్యయం వచ్చి 'అశ్వక్రీతా' అని అగును. అలాగే కచ్ఛపీ - కచ్ఛేన పిబతి లేక కచ్ఛే వా పిబతి. అను మరొక ఉదాహరణము కూడా ఇవ్వబడినది.

కావున వ్యాఘ్రీం ఇత్యాది గతి సమాసములలో, అశ్వక్రీతి ఇత్యాది కారక సమాసములందు, కచ్ఛపీ ఇత్యాది ఉపపద సమాసములలో కూడ కృదంతమునకు సుప్ ప్రత్యయం రాకపూర్వమే సమాసము చెప్పవలెను.

ఇటువంటి పరిణామమును దృష్టిలో ఉంచుకొని "కుగతి ప్రాదయః" అను సూత్రమున కు, మఱియు ప్రాదులకు పరమైన సుబంతము సమసించునని చెప్పవలెను.

"పూర్వసూత్రేఽ పి గతిగ్రహణం పృథక్ కృత్వా తిఙ్ గ్రహణం తత్రాపకృష్యతే" అని (భట్టోజిదీక్షితులు) తెలిపియున్నారు.

"సుపా" అనునది నివృత్తమై సమర్థమయిన దానితో అనువర్తించును. ఇక్కడ 'అపకర్ష', 'అనువృత్తి' అను రెండు పారిభాషికపదముల గురించి తెలుసుకోవలసియున్నది.

ఉత్తరసూత్రము నుండి పూర్వసూత్రమునకు అనువర్తమయినచో అది అపకర్ష పూర్వసూత్రము నుండి ఉత్తరసూత్రమునకు అనువృత్తమయినచో అది అనువృత్తి.

"ఉపపదమతిఙ్" (2-2-19) అను సూత్రము నుండి సమర్థేన అను పదము "కుగతిప్రాదయః" (2-2-18) అను సూత్రములో గతి అనుపదమునకు అనువర్తించును కావున ఇది అపకర్ష. ఇది వ్యాకరణ శాస్త్రపు వ్యాఖ్యాన ప్రక్రియలో కనబడే అసాధారణమైన అంశము.

**252. అమైవావ్యయేన (2-2-20)**



**అమైవ తుల్యవిధానం యదుపపదం తదేవాఽవ్యయేన సహ సమస్యతే. స్వాదుఙ్కారమ్. నేహ. కాలసమయవేలాసు తుమున్. కాలస్సమయో వేలా వా భోక్తుమ్. అమై వేతి కిమ్ ? అగ్రే భోజమ్. అగ్రే భుక్త్వా. విభాషాగ్రే ప్రథమ పూర్వేష్వితి క్త్వాణములౌ. అమా చాన్యేన చ తుల్యవిధానమేతత్.**

అమా ఏవ అవ్యయేన అని పదవిభాగము. 'అమా' అను పదమునకు "తుల్యార్థైరతులోపమాభ్యాం తృతీయాన్యతరస్యామ్" (2-3-72) అను సూత్రము ద్వారా తుల్యార్థమున తృతీయావిభక్తి వచ్చినది. కావున "అమైవ తుల్యవిధానం యదుపపదం తదేవావ్యయేన సహ సమస్యతే." అనే వృత్తి 'అమ్' అను శబ్దము ణముల్ (ణ్ + అమ్ + ఉల్) మరియు ఖముఞ్ (ఖ్ + అమ్ + ఉఞ్) అను ప్రత్యయములకు సంకేతము. అందుచే ఈ రెండు ప్రత్యయములు విధించు సూత్రములలో ఏ ఉపపదమున్నదో ఆ ఉపపదములకు పరమైన ధాతువు సమసించు విధానమును తెలుపుచున్నది. ఇది నియమవిధి. అందువలన "ఉపపదమతిఙ్" (2-2-19) అని సూత్రము యొక్క ప్రవృత్తిని నియమించుచున్నది.

ఉదా ॥ "స్వాదుమి ణముల్" (3-4-26) అను సూత్రము స్వాదర్థకములైన స్వాదుమ్, సంపన్నం, లవణమ్ అను ఉపపదములు పరమైనపుడు 'కృఞ్' ధాతువుకు 'ణముల్' ప్రత్యయమును విధించుచున్నది. "ఉపపదమతిఙ్" (2-2-19) అను సూత్రము ద్వారా ఉపపద సమాసము సిద్ధించుచుండగా, కేవలం కొన్ని సందర్భములలో మాత్రమే సమాసము విధింపబడునని ఈ సూత్రము వివరిస్తున్నది.

సూత్రము నందలి 'ఏవ' కారము 'అమ్' విధాయక సూత్రముల యందు 'అమ్' అని మాత్రమే విధించియుండవలెనను నియమము సూచించుచున్నది.

ఉదా ॥ 'కాలసమయవేలాసు తుమున్' (3-3-167) అను సూత్రము నందు తుమున్ అనేది 'అమ్' కాదు. అందువలన "కాల భోక్తుమ్" అను చోట కాలపదమైనప్పటికీ "భుజ్" ధాతువుతో ఉపపద సమాసము రాదు.

"స్వాదుమిణముల్" అను సూత్రములో 'స్వాదుమ్' అను ఉపపదము పరమైనపుడు 'కృఞ్' ధాతువునకు 'అమ్' అయిన 'ణముల్' ప్రత్యయం పరమగుటవలన 'స్వాదుమ్' కు కృఞ్ ధాతువుతో ఉపపదసమాసము ఏర్పడి, "స్వాదుంకారమ్" అను రూపము సిద్ధించినది.

'అవ్యయేన' అనే నియమము వలన 'ణముల్' ప్రత్యయము చేరినందువలన ఏర్పడిన కృదంతము అవ్యయము అయి ఉండవలెను. స్వాదుంకారమ్ అనునది "కృన్మేజన్తః" (1-1-39) అను సూత్రము వలన అవ్యయమైనది. అందువలన "అమ్" శబ్దములు కలిగిన ప్రత్యయములు ణముల్, ఖముచ్ చేత ప్రత్యేకముగా విధింపబడిన ఉపపదము ఈ ప్రత్యయముల చేత ఏర్పడు కృదంతమవ్యయమగునపుడు, సూత్రవిహిత ధాతువుతో నిత్యముగా సమసించును. అది తత్పురుషసమాసము అగునని అర్థము.

స్వాదుంకారమ్, సంపన్నంకారమ్, లవణంకారమ్ అనునవి ఉపపద సమాసములు. 'స్వాదుంకారం భుంక్తే' (రుచిగా వండబడిన దానిని భుజిస్తున్నాడు). 'స్వాదుం' అని సూత్రమున 'మాంతముగా' స్వాదు శబ్దము విహితమైనది.

## 253. తృతీయాప్రభృతీన్యన్యతరస్యామ్ (2-2-21)

**ఉపదంశస్తృతీయాయామిత్యాదీన్యుపపదాన్యమన్తేనాఽవ్యయేన సహ వా సమస్యన్తే. మూలకేనోపదంశం భుఙ్క్తే. మూలకోపదంశమ్.**

పూర్వసూత్రమైన "అమైవావ్యయేన" అను సూత్రము నుండి 'అమా', 'అవ్యయేన' అను పదములనువర్తమగును. ఏవకారము మాత్రము అనువర్తింపదు. "ఉపదంశస్తృతీయాయామ్" (3-4-47) మొదలగు కృత్ప్రత్యయ విధాయక సూత్రములందు ఈ సూత్రము యొక్క ఉపయోగము. ఈ సూత్రములందు అమ్ (ణముల్, ఖముచ్) కలిగిన ప్రత్యయములు ధాతువులకు విధింపబడినవి. ఈ ప్రత్యయాంత కృదంతములు అవ్యయములు.

'ఉపదంశస్తృతీయాయామ్' (3-4-47) మొదలగు సూత్రములలో తృతీయాది ప్రత్యయాంతములైన ఉపపదములు అమ్ కలిగిన ప్రత్యయాలకు విహితమైనవియు, రూపసిద్ధి తరువాత అవ్యయములగు ధాతువులతో వైకల్పికముగా సమసించును. ధాతువుతో సమసించినచో తత్పురుషమగును.

మూలకోపదంశమ్ – మూలకేన ఉపదంశం భుంక్తే. (కందమూలములతో రుచిగా చేయబడిన ఆహారమును తింటాడు.

## 254. క్త్వాచ (2-2-22)

**తృతీయా ప్రభృతీన్యుపపదాని క్త్వాన్తేన సహ సమస్యన్తే. ఉచ్చైః కృత్య. ఉచ్చైః కృత్వా. అవ్యయే యథాభిప్రేతేతి క్త్వా. తృతీయా ప్రభృతీనీతి కిమ్ ? అలంకృత్వా. ఖలు కృత్వా.**



పూర్వ సూత్రము నుండి "తృతీయా ప్రభృతీని", 'అన్యతరస్యామ్' అను పదములు అనువర్తించును. తృతీయాది ప్రత్యయాంతములైన ఉపపదాలు క్త్వాన్తముతో వైకల్పికముగా సమసించును అని సూత్రార్థము. ధాతువుతో సమసించినది కావున 'ఉచ్చైఃకృత్య' అను ఉపపదసమాసము సిద్ధించును. ఉచ్చైః కృత్వా అనునది వాక్యము. ఇది వైకల్పికము కావున సిద్ధించినది.

## 255. తత్పురుషస్యాంగులేః సంఖ్యావ్యయాదేః (5-4-86)

**సంఖ్యాఽవ్యయాదేరఙ్గుల్యన్తస్య తత్పురుషస్య సమాసాన్తోఽచ్ స్యాత్. ద్వే అఙ్గులీ ప్రమాణమస్య ద్వ్యఙ్గులం దారు. నిర్గతమఙ్గులిభ్యో నిరఙ్గులమ్.**

తత్పురుషసమాసము ఏర్పడిన తర్వాత విభక్తి ప్రత్యయము చేర్చుటకు ముందు సమాసాంతమునందున్న అచ్చుకుగాని హల్లుకుగాని వచ్చు మార్పులను ఒకానొక ప్రత్యయము చేరుటచే ఏర్పడునట్లుగా పాణిని వివరించాడు. ఈ ప్రత్యయములు సమాసమునకు హితమైనవగుటచే తద్ధితమను నామము అన్వర్థమగుచున్నది.

సంఖ్యావాచకావ్యయములు ఆదియందు కలదియు, అంగులి శబ్దము అంతమునందు కలవియునగు తత్పురుషసమాసములకు సమాసాంత ప్రత్యయమగు 'అచ్' వచ్చును అని సూత్రార్థము.

ద్వ్యంగులమ్ – ద్వే అంగులీ ప్రమాణమ్ అస్య అని లౌకిక విగ్రహవాక్యము.

"తద్ధితార్థోత్తరపదసమాహారే చ" అను సూత్రముచే సమాసము, తర్వాత అచ్ ప్రత్యయము. 'యస్యేతి చ' సూత్రము ద్వారా ఇకారమునకు లోపము. నపుంసకలింగ ప్రథమైకవచనరూపము.

## 256. అహః సర్వైకదేశసంఖ్యాతపుణ్యాచ్చ రాత్రేః (5-4-87)

**ఏభ్యో రాత్రేరచ్ స్యాచ్చాత్సంఖ్యావ్యయాదేః. అహర్గ్రహణం ద్వన్ద్వార్థమ్. అహశ్చ రాత్రిశ్చాహోరాత్రః. సర్వారాత్రిస్సర్వరాత్రః. పూర్వం రాత్రేః పూర్వరాత్రః. సంఖ్యాత రాత్రః. పుణ్యరాత్రః. ద్వయో రాత్ర్యోస్సమాహారో ద్విరాత్రమ్. అతిక్రాన్తో రాత్రిమతిరాత్రః.**

అహన్, సర్వ, ఏకదేశవాచకము, సంఖ్యాత, పుణ్య శబ్దములు పూర్వమందుగల రాత్రి శబ్దమునకు, సంఖ్యావాచకములు, అవ్యయములు, పూర్వమందుగల రాత్రి శబ్దమునకు కూడ తత్పురుషమున సమాసాంతమగు 'అచ్' ప్రత్యయము వచ్చును అని సూత్రార్థము.

అహెూరాత్రః – అహశ్చ రాత్రిశ్చ తయోః సమాహారః అని లౌకికవిగ్రహము. ద్వంద్వ సమాసము వచ్చిన తర్వాత 'అహెూరాత్రి' అని ఉండగా "అహః సర్వైక......" అను ప్రస్తుత సూత్రముచే 'అచ్', ప్రత్యయము, 'యస్యేతి చ' అను సూత్రముచే ఇకార లోపము (అహోరాత్ + అ) అని కాగా రాత్రి శబ్దము చివరగాగల ద్వంద్వ సమాసమగుటచే ఈ "రాత్రాహ్నాహాః పుంసి" (2-4-29) అను సూత్రముచే పుంలింగమురాగా 'అహెూరాత్రః' అని యగును.

సర్వరాత్రః – సర్వశ్చాసౌ రాత్రిశ్చ అని విగ్రహవాక్యము. కర్మధారయసమాసము వచ్చి సర్వరాత్రి అని కాగా ప్రస్తుతసూత్రం ద్వారా 'అచ్' ప్రత్యయము. ఇకార లోపముతో సర్వరాత్రః అని అగును.

పూర్వరాత్రః – పూర్వం రాత్రేః,

అపరరాత్రః – అపరం రాత్రేః అనునవి కూడా పై ఉదాహరణముల వలె పూర్వ, అపర వాచకములు రాత్రి శబ్దమునకు ముందుండుటచే 'అచ్' వచ్చి సాధువులగును.

సంఖ్యారాత్రః – సంఖ్యాతా చ సా రాత్రిశ్చ

పుణ్యరాత్రః – పుణ్యా రాత్రిః. ఇత్యాదులు ఈ సూత్రసిద్ధములు.

**(వా) సంఖ్యాపూర్వం రాత్రం క్లీబమ్**

సంఖ్యావాచక శబ్దము పూర్వమందుగల రాత్రి శబ్దమునకు నపుంసకలింగము విధించబడును.

ద్వి రాత్రమ్ – 'ద్వయోః రాత్ర్యోః సమాహారః' అని విగ్రహము "తద్ధితార్థోత్తరపదసమాహారే చ" సూత్రముచే సమాసము రాగా 'ద్విరాత్రి' అని కాగా "సంఖ్యావ్యయాదేః" అనుపదమను వర్తించి ప్రస్తుత సూత్రముచే 'అచ్' ప్రత్యయము, ఇకార లోపము కూడ వచ్చి 'ద్విరాత్ర' అని కాగా, "రాత్రాహ్నాహాః పుంసి" అను సూత్రము నుండి పుంలింగము ప్రాప్తించుచుండగా ఈ వార్తికము ద్వారా నపుంసకలింగము వచ్చి ద్విరాత్రమ్ అని ఏర్పడును.

త్రిరాత్రమ్ – తిసృణాం రాత్రీణాం సమాహారః అని లౌకిక విగ్రహ వాక్యము

అతిరాత్రః – అతిక్రాన్తః రాత్రిమ్



## 257. రాజాహస్సఖిభ్యష్టచ్ (5-4-91)

**ఏతదన్తాత్తత్పురుషాత్ టచ్ స్యాత్. పరమరాజః. అతిరాజీ. కృష్ణసఖః.**

రాజన్, అహన్, సఖా అను శబ్దములు చివరిగా కలిగిన తత్పురుషసమాసములకు 'టచ్' (అ) ప్రత్యయము వచ్చును. ఇచట "తత్పురుషస్యాంగులేః సంఖ్యావ్యయాదేః" (5-4-86) సూత్రము నుండి 'తత్పురుషస్య' అనునది అనువర్తించును.

పరమ రాజః – పరమశ్చాసౌ రాజా చ అని లౌకిక విగ్రహ వాక్యము

'విశేషణం విశేష్యేణ బహులమ్' అను సూత్రముచే సమాసము, ప్రస్తుత సూత్రముచే 'టచ్' ప్రత్యయం వచ్చి 'పరమ రాజన్ + అ' అని ఉండగా "నస్తద్ధితే" (6-4-144) అను సూత్రముచే టి (అన్) లోపము వచ్చి పరమరాజః అని సిద్ధించును.

కృష్ణసఖః – కృష్ణస్య సఖా (సఖిన్ – సఖ) అని లౌకిక విగ్రహ వాక్యము.

## 258. అహ్నష్టఖోరేవ (6-4-145)

**ఏతయోరేవ పరతః అహ్నః టి లోపః స్యాత్, నాన్యత్ర. ఉత్తమాహః. ద్వే అహనీ భృతో ద్వ్యహీనః క్రతుః. తద్ధితార్థే ద్విగుః. "తమధీష్టోభృతోభూతో భావీ"ఇత్యధికారే ఇతి 'ద్విగోర్వా ' ఇత్యనువృత్తౌ "రాత్ర్యహస్సంవత్సరాచ్చే" తి ఖః. లిఙ్గవిశిష్ట పరిభాషాయా అనిత్యత్వాన్నేహ. మద్రాణాం రాజ్ఞీ మద్రరాజ్ఞీ.**

ఇది 'టి' లోపవిధాయకసూత్రము. ఇది సమాసాంత ప్రత్యయము పరమగునపుడు వచ్చు మార్పులను విధించు సూత్రము. 'ఉత్తమం చ తదహశ్చ' అని ఉండగా "విశేషణం విశేష్యేణ బహులమ్" అను సూత్రముచే సమాసము, "రాజాహస్సఖిభ్యష్టచ్" (5-4-91) సూత్రముచే సమాసాంతముగా టచ్ వచ్చి "ఉత్తమాహన్ + అ" అని కాగా ఈ సూత్రముతో అహన్ శబ్దమునకు 'టి' లోపము వచ్చి 'ఉత్తమాహః' అని సిద్ధించును.

ద్వే అహనీ భృతః క్రతుః = ద్వ్యహీనః (రెండు రోజులు జరుగు యజ్ఞము) ఇక్కడ "రాత్ర్యహస్సంవత్సరాచ్చ" అను సూత్రముచే 'ఖ' ప్రత్యయము మరల దాని స్థానమున 'ఈనా' దేశము తదుపరి యణాదేశాదులు విధించబడగా 'ద్వ్యహీనః' అని సిద్ధించును.

మద్రాణాం రాజ్ఞీ మద్రరాజ్ఞీ అనునప్పుడు "ప్రాతిపదికగ్రహణే" ఇత్యాది పరిభాష అనిత్యత్వము వలన 'టచ్' ప్రత్యయం టి లోపము ఇత్యాదులు రావు.

## 259. అహ్నోఽహ్న ఏతేభ్యః (5-4-88)

**సర్వాదిభ్యః పరస్యాహన్ శబ్దస్యాహ్నాదేశస్స్యాత్సమాసాన్తే పరే.**

"ఏతేభ్యః" అనునది "అహస్సర్వైకదేశ సంఖ్యాత పుణ్యాచ్చ" (5-4-87) సూత్రములోని అహన్, సర్వ, ఏకదేశ, సంఖ్యాత, పుణ్య శబ్దాలకు అనువర్తించును. ఈ శబ్దముల కంటే పరమైన అహన్ శబ్దమునకు సమాసాంతము పరమైనపుడు 'అహ్న' శబ్దము ఆదేశముగా వచ్చును.

సర్వాహః - సర్వం చ అహశ్చ ("పూర్వకాలైక....." సమాసము)

సర్వాహ + టచ్ - ("రాజాహసఖి ......." టచ్ ప్రత్యయం)

సర్వాహ్న + సుప్ ("అహ్నోఽహ ఏత్యేభ్యః" - అహ్నాదేశము)

## 260. అహ్నోఽదన్తాత్ (8-4-71)

**అదన్త పూర్వపదస్థాద్రేఫాత్పరస్యాహ్నా దేశస్య నస్య ణః స్యాత్. సర్వాహ్ణః. పూర్వాహ్ణః. సంఖ్యాతాహ్నః. ద్వయోరహ్నోర్భవః. 'కాలాట్ఠఞ్'. 'ద్విగోర్లుగనపత్యే' ఇతి ఠఞో లుక్. ద్వ్యహ్నః. స్త్రియామదన్తత్వాట్టాప్. ద్వ్యహ్నా. ద్వ్యహ్నప్రియః. అత్యహ్నః.**

అదంతమైన పూర్వపదములోనున్న రేఫకు పరమైన అహన్ శబ్దములోని నకారమునకు ణకారము వచ్చును అని సూత్రార్థము.

'పూర్వాహ్న' అను సమాసమునందలి ఉత్తరపదమైన అహ్నలో నకారమునకు ణకారము రాగా 'పూర్వాహ్ణః' అని సిద్ధించును. అట్లే 'సర్వాహ్ణః' అనుచోట కూడ ణకారము వచ్చును. 'సంఖ్యాతాహ్నః' అను ఉదాహరణములో నకారము ణకారముగా మార్చుటకు కారణములైన రేఫ, షకారములు లేనందున ణకారము సిద్ధింపక 'సంఖ్యాతాహ్నః' అనియే ఉండును. ద్వ్యహ్నః, ద్వ్యహ్నా, ద్వ్యహ్నప్రియః, అత్యహ్నః అను ఇతర పదములు కూడ కలవు. వీటికి ణత్వము రాదు.

## 261. క్షుభ్నాదిషు చ (8-4-39)

**ఏషు ణత్వం న స్యాత్. దీర్ఘాహ్నీ ప్రావృట్. ఏవం చైతదర్థమహ్న ఇత్యదన్తాను కరణక్లేశో న కర్తవ్యః. "ప్రాతిపదికాన్త " ఇతి ణత్వవారణాయ క్షుభ్నాదిషు పాఠస్యా వశ్యకత్వాత్. అదన్తాదితి తపరకరణాన్నేహ. పరాగతమహః పరాహ్నః.**



"న భాభూపూకమిగమిప్యాయీవేపామ్" (8-4-34) అను సూత్రము నుండి 'న' అనునది అనువర్తించుట వలన నకారమునకు రానున్న ణకారమును నిషేధించు సూత్రమై యున్నది. రేఫ, షకారములకు పరమైనపుడు నకారస్థానములో రావలసిన ణకారము రాదు. అందువలన నకారము మాత్రమే ఉండును.

దీర్ఘాణ్యహాని యస్మిన్ = దీర్ఘాహ్నీ (స్త్రీ) ప్రావృట్ (బహుప్రీహి సమాసము. ఙీప్, ఉపధాదీర్ఘము).

"అహ్నోఽహ్న ఏతేభ్యః" (5-4-88) అను సూత్రము ద్వారా 'అహన్' శబ్దమునకు అహ్నాదేశము జరుగు సందర్భంలో నకారమునకు ణకారము వచ్చును. కావున ఇచట 'క్షుభ్నాదిషు చ' (8-4-39) అను సూత్రము చర్చించడమైనది. 'పరాహ్నః' అనునపుడు దీర్ఘమున్నందున ణత్వము రాదు.

## 262. న సంఖ్యాదేః సమాహారే (5-4-89)

**సమాహారే వర్తమానస్య సంఖ్యాదేరహ్నాదేశో న స్యాత్. సంఖ్యాదేరితి స్పష్టార్థమ్. ద్వయోరహ్నోస్సమాహారో ద్వ్యహః, త్ర్యహః.**

'అహ్నోఽహ్న ఏతేభ్యః' సూత్రము నుండి 'అహ్నోఽహ్నః' అనునవి అనువృత్త మగుచున్నవి. నిషేధము ప్రధానాంశము. సమాహార సంఖ్యావాచకమైన పదముతో 'అహన్' శబ్దము పరమైనపుడు 'అహన్' శబ్దస్థానములో అహ్న శబ్దము రాదు. 'తద్ధితార్థోత్తర పదసమాహారే చ' (2-1-51) అను సూత్రము వల్ల సమాహారార్థములలో ఏర్పడ్డ సమాసములో మొదటి పదము సంఖ్యావాచకము మరియు చివరిపదము అహన్ అయినచో అహ్నాదేశము ఉండదు.

ద్వయోః అహ్నోః సమాహారః = ద్వ్యహః (రెండు రోజులు)

రెండు రోజుల కాలమునకు ఒక సమాహారముగా పరిగణింపబడుట వలన ఇది సమాహార సంఖ్య అయినది. ఇక్కడ అహన్ శబ్దము అహ్నగా మారదు. అట్లే "త్రయాణామహ్నాం సమాహారః త్ర్యహః" అని సిద్ధించును.

## 263. ఉత్తమైకాభ్యాం చ (5-4-91)

**ఆభ్యాం అహ్నాదేశో న, ఉత్తమశబ్దోఽన్త్యార్థః, పుణ్య శబ్దమాహ. 'పుణ్యైకాభ్యామ్' ఇత్యేవ సూత్రయితుముచితమ్. పుణ్యాహమ్. సుదినాహమ్. సుదినశబ్దః ప్రశస్తవాచీ. ఏకాహః. 'ఉత్తమగ్రహణముపాన్త్యస్యాపి సంగ్రహార్థమ్' ఇత్యేకే. సంఖ్యాతాహః.**

ఈ సూత్రములోని 'ఉత్తమ' శబ్దము "సర్వైక దేశ సంఖ్యాతపుణ్యాచ్చ" అను సూత్రములోని చివరిపదమునకు వర్తించును. అనగా పుణ్యశబ్దమునకు ఏక శబ్దము పరమైనపుడు అహన్ శబ్దము అహ్నగా మారదు అని అర్థము.

ఉత్తమ శబ్దమునకు బదులుగా పుణ్య అని చేర్చి 'పుణ్యైకాభ్యాం' అని పాణిని అని యుండవచ్చును. కాని పతంజలి అర్థముకానిచోట వ్యాఖ్యానముచే సూత్రార్థమును చెప్పవలెను గాని దోషప్రతిపాదన చేయరాదని విమర్శను నిషేధించెను.

పుణ్యం అహః = పుణ్యాహన్ + టచ్ – పుణ్యాహమ్ (మంచిరోజు), ఇట్లే 'సుదినాహమ్' 'ఏకాహః' ఇత్యాది పదములు సిద్ధించును. 'ఏకాహః' అనునపుడు 'పుణ్యసుదినాభ్యాం చ' అను సూత్రము ద్వారా నపుంసకత్వము రాదు.

## 264. అగ్రాఖ్యాయామురసః (5-4-93)

**టచ్ స్యాత్, అశ్వానాముర ఇవ అశ్వోరసమ్. ముఖ్యోऽశ్వ ఇత్యర్థః.**

ప్రధానార్థకమైన ఉరస్ శబ్దము ఉత్తరపదముగానున్న ఆ తత్పురుషసమాసమునకు సమాసాంత ప్రత్యయము టచ్ వచ్చును.

అశ్వానామ్ ఉరః ఇవ = అశ్వోరసం (అశ్వములలో ఉత్తమమైనది)

## 265. అనోశ్మాయః సరసాం జాతిసంజ్ఞయోః (5-4-94)

**టచ్ స్యాత్ జాతౌ సంజ్ఞాయాం చ. ఉపానసమ్. అమృతాశ్మః కాలాయసమ్. మండూకసరసమ్. ఇతి జాతిః. మహానసమ్. పిండాశ్మః. లోహితాయసమ్. జలసరసమితి సంజ్ఞా.**

అనస్, అశ్మన్, అయస్, సరస్ అను పదములు ఉత్తరపదములుగా ఉండి జాతినిగాని, సంజ్ఞనుగాని బోధించు తత్పురుషములకు టచ్ ప్రత్యయము వచ్చును.

ఉపగతం అనః = ఉపానసమ్.

'కుగతిప్రాదయః' అను సూత్రమునందలి "ప్రాదయో గతాద్యర్థే ప్రథమయా" అను వార్తికముననుసరించి సమాసమేర్పడగా టచ్ ప్రత్యయం చేరి ఉపానసమ్ అని సిద్ధించినది.

అమృతాశ్మః, కాలాయసమ్, మండూకసరసమ్ – ఇవి జాతి వాచకములు. మహానసమ్, పిండాశ్మః, జలసరసమ్ అనునవి సంజ్ఞా విశేషములు.



## 266. గ్రామకౌటాభ్యాం చ తక్ష్ణః (5-4-95)

**గ్రామస్య తక్షా గ్రామతక్షః. సాధారణ ఇత్యర్థః. కుట్యాం భవః కౌటః. స్వతంత్రః. స చాసౌ తక్షా చ – కౌటతక్షః.**

గ్రామకౌట పదములు పూర్వపదములై తక్ష పదము ఉత్తరపదమైనపుడు ఏర్పడే తత్పురుషమునకు టచ్ ప్రత్యయం వచ్చును.

గ్రామస్య తక్షా = గ్రామతక్షః.

కౌటః తక్షా = కౌటతక్షః.

## 267. అతేః శునః (5-4-96)

**అతిశ్వో వరాహః. అతిశ్వీ సేవా.**

అతి అను అవ్యయమునకు శ్వన్ శబ్దము ఉత్తరపదమైనచో ఆ తత్పురుషమునకు 'టచ్' ప్రత్యయము వచ్చును.

అతిక్రాన్తః శ్వానమ్ = అతిశ్వః (వరాహః)

అతిశ్వీ (సేనా)

## 268. ఉపమానాదప్రాణిషు (5-4-97)

**అప్రాణివిషయకోపమానవాచినశ్శునష్టచ్ స్యాత్.**

**ఆకర్షః శ్వేవ – ఆకర్షశ్వః. అప్రాణిషు కిమ్ ? వానరః శ్వేవ వానరశ్వా**

ఉపమానవాచకముగా శ్వన్ శబ్దముత్తరపదముగా కలిగిన తత్పురుష సమాసమునకు సమాసాంతము 'టచ్' వచ్చును. ఆకర్షః శ్వేవ = ఆకర్షశ్వః ("ఉపమితం వ్యాఘ్రాదిభిః" – ద్వారా సమాసము) ఇక్కడ ఆకర్ష శబ్దము ప్రాణివాచకము కాదు. 'వానరశ్వా' అనునప్పుడు వానర శబ్దము ప్రాణివాచకము కావున ఈ సూత్రము ప్రవర్తించబడదు.

## 269. ఉత్తరమృగపూర్వాచ్చ సక్థ్నః (5-4-98)

**చాదుపమానాత్. ఉత్తరసక్థమ్. మృగసక్థమ్. ఫలకమివ సక్థి ఫలకసక్థమ్.**

ఈ సూత్రములో చకారము వలన పూర్వసూత్రము నుండి 'ఉపమానాత్' అనువర్తించును.

తత్పురుషసమాసమున ఉత్తర, మృగ, పూర్వ అను ఉపమావాచకములకు పరమైన సక్థి శబ్దమునకు పరముగ సమాసాంతమగు 'టచ్' ప్రత్యయము వచ్చును.

ఉత్తరం సక్థి = ఉత్తరసక్థమ్

పూర్వం సక్థి = పూర్వసక్థమ్.

"పూర్వకాలైకః ........." (2-1-49) అనునది సమాసవిధాయక సూత్రము.

ఫలకం ఇవ సక్థి = ఫలకసక్థమ్

"మయూరవ్యంసకాదయః....... " (2-1-72) అనునది ఇచట సమాస విధాయక సూత్రము.

## 270. నావో ద్విగోః (5-4-99)

**నౌ శబ్దాన్తా ద్విగోష్టచ్ స్యాన్నతు తద్ధితలుకి. ద్వాభ్యాం నౌభ్యామాగతః. ద్వినావరూప్యః. 'ద్విగోర్లుగనవత్యే' ఇత్యత్ర అచీత్యస్యాపకర్షణాద్ధలాదేర్నలుక్. పంచనావప్రియః. ద్వినావమ్. త్రినావమ్. అతద్ధితలుకీతి కిమ్ ? పంచభిః నౌభి క్రీతః పంచనౌః.**

నౌ శబ్దాంతమైన ద్విగు సమాసమునకు సమాసాంత ప్రత్యయం 'టచ్' చేరును. 'మండూక ప్లుతి' నియమానుసారం "అతద్ధిత లుకి" అనునది "గోరతద్ధితలుకి" (5-4-92) సూత్రము నుండి అనువర్తించును. అందువలన తద్ధితప్రత్యయము లుప్తమైనపుడు నౌ శబ్దమునకు టచ్ ప్రత్యయము రాదు.

ద్వాభ్యాం నౌభ్యామాగతమ్ = ద్వినావరూప్యమ్.

'రూప్య' అను తద్ధితప్రత్యయము "హేతుమనుష్యేభ్యోఽ న్యతరస్యాం రూప్యః" (4-3-81) సూత్రం ద్వారా విధింపబడింది. ఈ తద్ధితప్రత్యయవిధి జరుగుచుండగానే 'నౌ' శబ్దముపై 'టచ్' చేరి 'ద్వినావ' గా మారినది. "తద్ధితార్థోత్తరపదసమాహారే చ" (2-1-51) అను సూత్రము ద్వారా 'ద్వినౌ' శబ్దములకు సమాసము విధింపబడింది. తద్ధితప్రత్యయము లోపించినపుడు టచ్ రాదు. ఉదా - 'పంచభిర్నౌభిః క్రీతః' అను విగ్రహవాక్యమున్నపుడు 'ఠక్' అను తద్ధిప్రత్యయము "ఆర్హా దగోపుచ్ఛసంఖ్యా......" (2-1-51) సూత్రముచే పంచనౌ శబ్దములు సమసింపగా 'అధ్యర్ధపూర్వాద్విగోర్లుగసంజ్ఞాయామ్' అనుదాని ప్రకారముగ 'ఠక్' నకు లోపము. అందువలన "పంచనౌః" అని ప్రత్యయాంతములేని రూపమే సాధురూపమగును.

పంచ నావః ప్రియాః యస్యేతి విగ్రహే పంచనావప్రియః

ద్వయోః నావోః సమాహారః ద్వినావత్





తిసౄణాం నావాం సమాహారః త్రినావమ్ మొదలగు పదములు కూడ ఈ సూత్రము ద్వారా సిద్ధించును.

## 271. అర్ధాచ్చ (5-4-100)

**అర్ధాన్నావష్టచ్ స్యాత్. నావోఽర్ధమర్ధనావమ్. క్లీబత్వం లోకాత్.**

అర్ధ శబ్దము పూర్వపదమై 'నౌ' శబ్దముత్తరపదమైనచో ఆ తత్పురుషమునకు సమాసాంతప్రత్యయము 'టచ్' వచ్చును.

నావో అర్ధం = అర్ధనావమ్

"అర్ధం నపుంసకమ్" (2-2-2) అను సూత్రముద్వారా సమాసము సిద్ధించగా ప్రస్తుత సూత్రము ద్వారా 'టచ్' చేరెను. 'అర్ధనావమ్' అనునది నపుంసకలింగము.

"పరవల్లింగం ద్వంద్వతత్పురుషయోః" (2-4-26) అని ఉండగా నపుంసకలింగమెట్లు అను సందేహమునకు సమాధానముగా "క్లీబత్వం లోకాత్" అని భట్టోజిదీక్షితుల వాక్యమిచ్చుట గమనార్హం.. లోకము వ్యాకరణసూత్రముకన్నా బలమైనది. శిష్ట ప్రయోగమే వ్యాకరణమునకు మూలము.

## 272. ఖార్యాః ప్రాచామ్ (5-4-101)

**ద్విగోరర్ధాచ్చ ఖార్యాష్టచ్ వా స్యాత్. ద్విఖారమ్. ద్విఖారి. అర్ధఖారమ్. అర్ధఖారీ.**

"నావో ద్విగోః" (5-4-99) సూత్రం నుండి ద్విగోః, "అర్ధాచ్చ" (5-4-100) అను సూత్రం నుండి 'అర్ధాత్' అనునవి అనువర్తించును. ద్విగు సమాసమున, అర్ధ శబ్దము పరమైనచో ఉత్తరపదమైన 'ఖారి' కి సమాసాంతప్రత్యయము 'టచ్' తత్పురుషమున వచ్చును. 'ప్రాచామ్' అని చెప్పటం వల్ల పూర్వదేశమున మాత్రమే టచ్ ఆగమమము అని ఇతరత్ర లేదని తెలియును. అందువలన ఈ సమాసాంత ప్రత్యయవిధి వైకల్పికమని తెలియుచున్నది.

ద్వయోః ఖార్యోః సమాహారే = ద్విఖారమ్ (టచ్ ప్రత్యయము వచ్చినపుడు)

ద్విఖారి (టచ్ ప్రత్యయము రానపుడు)

అర్ధం ఖార్యాః = అర్ధఖారమ్, అర్ధఖారీ (స్త్రీ లింగము)

**273. ద్విత్రిభ్యామంజలేః (5-4-102)**

**టజ్వా స్యాద్విగౌ. ద్వ్యఞ్జలమ్. ద్వ్యఞ్జలి. "అతద్ధితలుకి" ఇత్యేవ. ద్వాభ్యామంజలిభ్యాం క్రీతో ద్వ్యఞ్జలిః.**

ద్వి, త్రి శబ్దములు పరమైన అంజలి శబ్దమునకు ద్విగు సమాసమున సమాసాంత ప్రత్యయము టచ్ వైకల్పికముగా చేరును.

ద్వే అంజలీ సమాహృతే = ద్వ్యంజలమ్ లేక ద్వ్యంజలి. ద్వాభ్యాం అంజలిభ్యాం క్రీతః ద్వ్యఙ్జలిః అనునపుడు ఈ సూత్రము ప్రవర్తించదు.

**274. బ్రహ్మణో జానపదాఖ్యాయామ్ (5-4-104)**

**బ్రహ్మన్నాత్తత్పురుషాట్టచ్ స్యాత్సమాసేన జానపదత్వమ్ ఆఖ్యాయతే చేత్. సురాష్ట్రే బ్రహ్మా సురాష్ట్ర బ్రహ్మః.**

బ్రహ్మన్త తత్పురుషసమాసము నందు 'జనపదమునకు చెందినవాడు' అనే అర్థము గోచరించునపుడు సమాసాంతప్రత్యయము 'టచ్' వచ్చును.
సురాష్ట్రేషు బ్రహ్మ = సురాష్ట్ర బ్రహ్మః. (సప్తమీ తత్పురుషము)

**275. కుమహద్భ్యామన్యతరస్యామ్ (5-4-105)**

**ఆభ్యాం బ్రహ్మణో వా టచ్ స్యాత్తత్పురుషే. కుత్సితో బ్రహ్మ – కుబ్రహ్మః. కుబ్రహ్మ.**

'బ్రహ్మన్' అను శబ్దము పూర్వ సూత్రమునుండి అనువృత్తమగుచున్నది. కు, మహత్ శబ్దములకు పరమైన బ్రహ్మన్ శబ్దమునకు తత్పురుష సమాసాంతమైన 'టచ్' ప్రత్యయం వైకల్పికముగా వచ్చును.

కుత్సితో బ్రహ్మ = కుబ్రహ్మః (టచ్ ప్రత్యయము వచ్చినపుడు)
కుబ్రహ్మ (టచ్ ప్రత్యయము రానప్పుడు)
'బ్రహ్మన్' అనునది బ్రాహ్మణ శబ్దమునకు పర్యాయవాచకము

**276. ఆన్మహతః సమానాధికరణజాతీయయోః (6-3-46)**

**మహత ఆకారోఽన్తాదేశః స్యాత్సమానాధికరణే ఉత్తరపదే జాతీయే చ పరే. మహాబ్రహ్మః. మహాబ్రహ్మ. మహాదేవః మహాజాతీయః. సమానాధికరణే కిమ్ ?**





**మహతః సేవా మహత్సేవా . లాక్షణికం విహాయ ప్రతిపదోక్త : సన్మహదితి సమాసో గ్రహీష్యత ఇతి చేత్ మహాబాహుః న స్యాత్. తస్మాత్ "లక్షణప్రతిపదోక్తయోః ప్రతిపదోక్తస్య" ఇతి పరిభాషా నేహ ప్రవర్తతే. సమానాధికరణగ్రహణసామర్థ్యాత్. ఆదితి యోగవిభాగాదాత్వమ్. 'ప్రాగేకాదశభ్య' ఇతి నిర్దేశాద్వా. ఏకాదశ. మహతీ శబ్దస్య 'పుంవత్కర్మధారయే'తి పుంవద్భావే కృతే ఆత్వమ్. మహాజాతీయా.**

**(వా) మహదాత్వే ఘాసకర విశిష్టేషూపసంఖ్యానమ్ పుంవద్భావశ్చ.**

**ఆసామానాధికరణ్యార్థమిదమ్. మహతో మహత్యా వా ఘాసో – మహాఘాసః. మహాకరః. మహావిశిష్టః.**

**(వా) అష్టనః కపాలె హవిషి**

**అష్టాకపాలః**

**(వా) గవి చ యుక్తే**

**గో శబ్దే పరే యుక్త ఇత్యర్థే గమ్యే అష్టన ఆత్వం వక్తవ్యమిత్యర్థః. అష్టాగవమ్ శకటమ్.**

**"అచ్ ప్రత్యన్వవ...." ఇత్యత్ర 'అచ్' ఇతి యోగవిభాగాత్ బ్రహ్మవ్రీహావప్యచ్. అష్టానాం గవాం సమాహారః – అష్టగవమ్. తద్యుక్తత్వాచ్ఛకటమష్టాగవమితి వా.**

మహత్ శబ్దమునకు సమానాధికరణపదము ఉత్తర పదమగునప్పుడు, జాతీయర్ ప్రత్యయము పరమగునపుడు ఆకారము అంతాదేశముగా వచ్చును.

" పుంవత్కర్మధారయ జాతీయ దేశీయేషు" (6-3-42) అను సూత్రమునుండి జాతీయపదము అనువృత్తమగును.

మహారాజః (గొప్పరాజు) – మహాన్ చాసౌ రాజా చ అని లౌకిక విగ్రహవాక్యము. "విశేషణం విశేష్యేణ బహులమ్" (2-1-57) అను సూత్రముద్వారా మహత్ శబ్దమునకు రాజన్ శబ్దముతో సమాసము మహత్ + రాజన్ అని యుండగా ఈ సూత్రముచే 'మహత్' శబ్దమునకు ఆకారము అంతాదేశముగా వచ్చి సవర్ణదీర్ఘము రాగా మహారాజన్ అని అగును. "రాజాహస్సఖిభ్యష్టచ్" (5-4-91) అను సూత్రము ద్వారా 'టచ్' ప్రత్యయము, అనుబంధలోపము విధించగా ప్రథమ ఏకవచనమున పుంలింగముతో 'మహారాజః' అని అకారాంతమున సిద్ధించును.

మహాజాతీయః – మహత్ జాతీయః ('ప్రకారవచనే జాతీయర్')
మహాబ్రహ్మః – మహాంశ్చాసౌ బ్రహ్మ చ.

కాని మహతః సేవా మహత్సేవా అనునపుడు సమానాధికరణము లేదు కావున ఆత్వము రాదు. సమానాధికరణ సామర్థ్యము వలన 'మహాబాహుః' ఇత్యాదులందు కూడ ఆత్వము విధింపబడును. 'ఆత్' అని యోగవిభాగము వలన సూత్రము వేరుచేయుట వలన లేదా 'ప్రాగేకాదశభ్యః' అని పాణినియే స్వయముగా ఉపయోగించుట వలన కాని 'ఏకాదశ' ఇత్యాదులు కూడ సిద్ధించును. మహతీ శబ్దమునకు "పుంవత్కర్మధారయ" ఇత్యాది సూత్రము చేత పుంస్త్వము విధించుకుని ఈ సూత్రము చేత ఆత్వము కూడ చెప్పుకోగా 'మహాజాతీయా' అనునది కూడ సిద్ధించును.

'ఘాసకరవిశిష్టేషూపసంఖ్యానమ్' అను వార్తిక సహాయము ద్వారా 'మహాఘాసః, మహాకరః, మహావిశిష్టః' ఇత్యాదులేర్పడును.

'అష్టనః కపాలే హవిషి' అను వార్తికపు సహాయముతో అత్వము విధించగా 'అష్టాకపాలః' అను రూపము మఱియు 'గవి చ యుక్తే' అను వార్తికపు సహాయముతో 'అష్టాగవం' అనునది ఏర్పడును. మఱియు 'అచ్ ప్రత్యన్వవ' ఇత్యాది సూత్రము విడదీసి చదువుట వలన 'అష్టానాం గవాం సమాహారః అష్టగమ్' అనుపదమేర్పడును.

## 277. ద్వ్యష్టనః సంఖ్యాయామబహుప్రీహ్యశీత్యోః (6–3–47)

**ఆత్స్యాత్. ద్వౌ చ దశ చ ద్వాదశ. ద్వ్యధికా దశేతి వా. ద్వావింశతిః. అష్టాదశ. అష్టావింశతిః. అబహుప్రీహ్యశీత్యోః కిమ్ ? ద్విత్రాః. ద్వ్యశీతిః.**

**(వా) ప్రాక్ శతాదితి వక్తవ్యమ్**

**నేహ ద్విశతమ్. ద్విసహస్రమ్.**

ద్వి, అష్టన్ శబ్దములకు సంఖ్యా వాచకము ఉత్తరపదమైనప్పుడు ఆకారము అంతాదేశముగా వచ్చును. ఈ ఆకారాంతాదేశము బహుప్రీహి యందును, అశీతి శబ్దము ఉత్తరపదముగ ఉన్నప్పుడు మాత్రము రాదు.

ద్వాదశ (పన్నెండు) – ద్వౌ చ దశ చ (ద్వంద్వ సమాసము లేక తత్పురుషము) 'ద్విదశన్' అనుచోట సంఖ్యావాచకము 'దశ' అనునది ఉత్తరపదముగా ఉండుటవలన ఆకారము అంతాదేశమై 'ద్వాదశ' అని అగును.

అష్టావింశతిః – అష్టౌ చ వింశతిశ్చ (ద్వంద్వ సమాసము)

ద్విత్రాః, ద్విశతమ్. ద్విసహస్రమ్ అను బహుప్రీహి సమాసములలో ఆకారాంతాదేశము రాదు. అష్టన్ శబ్దమునకు ప్రస్తుత సూత్రము ద్వారా ఆకారాంతాదేశము చేరును.





**(వా) ప్రాక్ శతాదితి వక్తవ్యమ్**

ఇది నియమ విధాయక వార్తికము. ద్విశతమ్, ద్విసహస్రమ్ అనుచోట్ల సూత్రవిహితమైన 'ఆత్'ను నిషేధించును. అందువలన ద్విశతమ్, ద్విసహస్రమ్ అను బహుప్రీహిసమాసములలో ఆకారాంతాదేశము లేదు.

## 278. త్రేస్త్రయః (6–3–48)

**త్రిశబ్దస్య త్రయస్ స్యాత్పూర్వ విషయే. త్రయోదశ. త్రయోవింశతిః. బహుప్రీహౌ తు త్రిర్దశ, త్రిదశాః. సుజర్థే బహుప్రీహిః. అశీతౌ తు త్ర్యశీతిః. ప్రాక్ శతాదిత్యేవ. త్రిశతమ్, త్రిసహస్రమ్.**

త్రిశబ్దమునకు సంఖ్యావాచకముత్తరపదముగా ఉన్నపుడు 'త్రయస్' అనునది ఆదేశముగా వచ్చును. బహుప్రీహి సమాసమునందు మాత్రము అశీతి శబ్దము ఉత్తరపదమైనప్పుడు ఈ ఆదేశము రాదు.

త్రయోదశ – త్రయశ్చ దశ చ. అలాగే త్రయోవింశతిః ఇత్యాదులు కూడా సిద్ధించును. త్ర్యశీతిః, త్రిశతమ్, త్రిసహస్రమ్ ఇత్యాదులందు ప్రస్తుత సూత్రముచే 'త్రయస్' ఆదేశము రాధు.

## 279. విభాషా చత్వారింశత్ప్రభృతౌ సర్వేషామ్ (6–3–49)

**ద్వ్యష్టనోస్త్రేశ్చ ప్రాగుక్తం వా స్యాచ్చత్వారింశదాదౌ పరే. ద్విచత్వారింశత్. ద్వాచత్వారింశత్. అష్టచత్వారింశత్. అష్టాచత్వారింశత్. త్రిచత్వారింశత్. త్రయశ్చత్వారింశత్. ఏవమ్. పఞ్చాశత్ షష్టిసప్తతినవతిషు.**

"ద్వ్యష్టనః సంఖ్యాయాం....." (6–3–47), "త్రేస్త్రయః" (6–3–48) అను సూత్రములననుసరించి ద్విత్రి, అష్టన్ శబ్దములకు వచ్చు ఆదేశములు 'చత్వారింశత్' అటుపైన వచ్చు సంఖ్యావాచకములు ఉత్తరపదమైనపుడు వైకల్పికముగా వచ్చును.

ద్విచత్వారింశత్, ద్వా చత్వారింశత్

త్రిపంచాశత్ , త్రయః పంచాశత్

అష్టపంచాశత్, అష్టాపంచాశత్

'శతం' పదముత్తరపదమగునపుడు కూడా ఈ ఆదేశము వచ్చును. ఉదా – ద్విశతమ్, అష్టాశతమ్, త్రిశతమ్.

**280. ఏకాదిశ్చైకస్య చాదుక్ (6-3-76)**

**ఏకాదిర్నఞ్ ప్రకృత్యా స్యాదేకస్య చ అదుగాగమశ్చ. నఞో వింశత్యా సహ సమాసే కృతే ఏకశబ్దేన సహ 'తృతీయే'తి యోగవిభాగాత్సమాసః, అనునాసికవికల్పః, ఏకేన న వింశతిః - ఏకాన్నవింశతిః - ఏకాద్నవింశతిః. ఏకోనవింశతిరిత్యర్థః.**

**(వా) షష ఉత్వం దతృదశధాసూత్తరపదాదేష్టుత్వం చ ధాసు వేతి వాచ్యమ్**

**షోడన్. షోడశ. షోఢా - షడ్ధా.**

'న లోపో నఞః' (6-3-73) అను సూత్ర ప్రకారము ఉత్తరపదము పరమగునపుడు నఞ్ లోని నకారమునకు లోపము వచ్చును." అను దానిని బాధించి ఈ సూత్రము లోపమును నిషేధించును. "నకార లోపనిషేధముతో పాటు 'ఏక' అనునది పూర్వపదమైనపుడు 'అదుక్' ఆగమము వచ్చును." అని ప్రస్తుత సూత్రార్థము.

ఏకేన + వింశతిః

ఏక + అద్ + న + వింశతిః

ఏకాన్ + న + వింశతిః

ఏకాన్నవింశతిః (పందొమ్మిది అని అర్థము)

ఏకాన్నత్రింశత్ (ఇరవై తొమ్మిది అని అర్థము)

**(వా) షష ఉత్వం దతృదశధాసూత్తరపదాదేష్టుత్వం చ ధాసు వేతి వాచ్యమ్**

"షష్ నందలి షకారము దతృ దశ మరియు ధాలు పరమగునపుడు ఉకారముగా మారును, మరియు ఉత్తరపదములోని ప్రథమవర్ణము ఉకారముగా కాని ఢకారముగా కాని మారును." అని వార్తికార్థము.

షడ్ దన్తా యస్య = షోడన్ అలాగే షోడశ, షడ్ధా అనునవి సిద్ధించును.

**281. పరవల్లింగం ద్వన్ద్వతత్పురుషయోః (2-4-26)**

**ఏతయోః పరపదస్యేవ లిఙ్గం స్యాత్. కుక్కుటమయూర్యావిమే. మయూరీ కుక్కుటావిమౌ. అర్ధపిప్పలీ.**

**(వా) ద్విగుప్రాప్తాపన్నాలంపూర్వగతిసమాసేషు ప్రతిషేధో వాచ్యః. పంచసు కపాలేషు సంస్కృతః - పంచకపాలః పురోడాశః. ప్రాప్తో జీవికాం - ప్రాప్తజీవికః, ఆపన్నజీవికః. అలం కుమార్యై అలంకుమారిః. అత ఏవ జ్ఞాపకాత్సమాసః. నిష్కౌశాంబిః.**



ద్వంద్వసమాసమున, తత్పురుష సమాసమున ఉత్తరపదమునకు ఏ లింగముండునో ఆ లింగమే సమాసమునకు ఉండును అని సూత్రార్థము.

కుక్కుటమయూర్యౌ (ఇమే) - కుక్కుటశ్చ మయూరీ చ - ఇది ద్వంద్వ సమాసము. ఇచట 'మయూర' శబ్దము స్త్రీలింగ మందుండుటచే 'కుక్కుటమయూర్యౌ' అని స్త్రీలింగమున, 'ఇమే' అను స్త్రీలింగ శబ్దము ప్రయోగింపబడినది.

అలాగే పుంలింగ ద్యోతకమగు 'మయూరకుక్కుటౌ' (ఇమౌ) కూడా సిద్ధించును.

తత్పురుషమున 'అర్ధపిప్పలీ' - 'అర్ధం పిప్పల్యాః' అని స్త్రీలింగమున సాధువగును.

**(వా) ద్విగుప్రాప్తాపన్నాలంపూర్వగతిసమాసేషు ప్రతిషేధో వాచ్యః**

ద్విగు సమాసమునందు, ప్రాప్త, ఆపన్న, అలం అను పదములు పూర్వపదములుగా ఉన్నట్టి సమాసములందు కూడ ఈ పరవల్లింగత్వమునకు నిషేధము చెప్పవలెనని వార్తికము తెలుపుతున్నది అనగా ఉత్తరపదముననుసరించి లింగముండదని భావము.

పంచకపాలః (పురోడాశః) - "పంచసు కపాలేషు సంస్కృతః"

(ఐదు కపాలములలో సంస్కరించబడిన పురోడాశము)

"తద్ధితార్థోత్తర ...." అను సూత్రముద్వారా ద్విగుసమాసము.

"పరవల్లింగం....." అను సూత్రమును ఈ వార్తికము నిషేధించగ, ఉత్తరపదమైన 'కపాల' శబ్దము నపుంసకలింగమైనను సమాసములో పుంలింగములోనే ఉండును.

అలాగే ప్రాప్తో జీవికాం = ప్రాప్తజీవికః (పుంలింగము)

అలం కుమార్యై = అలంకుమారిః (పుంలింగము)

నిర్గతః కౌశాంబ్యాః= నిష్కౌశాంబిః. ఇత్యాదులు కూడ సిద్ధించును.

**282. పూర్వవదశ్వవడవౌ(2-4-27)**

**ద్వివచనమతంత్రమ్. అశ్వవడవౌ. అశ్వవడవాన్. అశ్వవడవైః.**

అశ్వ, వడవ శబ్దములు పూర్వపదములుగా తత్పురుష సమాసమున ఉన్నప్పుడు పూర్వపదము యొక్క లింగమును పొందును.

అశ్వవడవౌ - అశ్వశ్చ వడవా చ (పుంలింగము)

**283. రాత్రాహ్నాహాః పుంసి (2-4-29)**

**ఏతదన్తౌ ద్వన్ద్వతత్పురుషౌ పుంస్యేవ. అనన్తరత్వాత్పరవల్లిఙ్గతాపవాదోఽ ప్యయం పరత్వాత్సమాహారనపుంసకతాం బాధతే. అహోరాత్రః. రాత్రేః పూర్వభాగః -**

**పూర్వరాత్రః, పూర్వాహ్ణః, ద్వ్యహః. "సంఖ్యాపూర్వం రాత్రం క్లీబమ్". ద్విరాత్రమ్, త్రిరాత్రమ్, గణరాత్రమ్.**

రాత్ర, అహ్న, అహ అను శబ్దములు పూర్వపదములుగానున్నప్పుడు ద్వంద్వ తత్పురుష సమాసములు పుంలింగమునందే ఉండును అని సూత్రార్థము.

అహశ్చ రాత్రిశ్చ = అహోరాత్రః (పుం)

రాత్రేః పూర్వభాగః = పూర్వరాత్రః (పుం)

అహ్నః పూర్వం పూర్వాహ్ణః

ద్వయోః అహ్నోః సమాహారః ద్వ్యహః

సంఖ్యావాచకము పూర్వముందున్నచో నపుంసకలింగమే ఉండును. 'ద్విరాత్రమ్' త్రిరాత్రమ్, గణరాత్రమ్ ఇత్యాదులు ఉదాహరణములు.

## 284. అపథం నపుంసకమ్ (2-4-30)

**తత్పురుషః ఇత్యేవ. అన్యత్ర తు అపథో దేశః. కృతసమాసాన్త నిర్దేశాన్నేహ. అపన్థాః.**

'అపథం' అను నఞ్ తత్పురుషసమాసము నపుంసకము నందు ఉండును.

న పన్థాః = అపథమ్ (అనుకూలము కాని మార్గము అని అర్థము)

ప్రస్తుత సూత్రము పుంలింగమును బాధించి నపుంసకలింగమును విధించును. 'పరవల్లింగ' సూత్రమునకు ఇది నిషేధము. కృత సమాసాన్త నిర్దేశము వలన 'అపన్థాః' అనునపుడు ఈ సూత్రము రాదు.

## 285. అర్ధర్చాః పుంసి చ (2-4-31)

**అర్ధర్చాదయః శబ్దాః పుంసి క్లీబే చ స్యుః. అర్ధర్చః. అర్ధర్చమ్. ధ్వజః, ధ్వజమ్. ఏవం తీర్థ, శరీర, మండ, పీయూష, దేహ, అఙ్కుశ, కలశ, ఇత్యాది.**

'అర్ధర్చాది' గణములోని 'అర్ధర్చా' ఇత్యాది శబ్దములు వైకల్పికముగా పుంలింగములోను, నపుంసకలింగములోను కూడ ఉపయోగించబడును.

అర్ధర్చః, అర్ధర్చమ్, ధ్వజః, ధ్వజమ్ ఇత్యాదులు ఉదాహరణములు.

"ఋచః అర్ధమ్" (ఋక్కులో సగము) అను విగ్రహమున 'అర్ధ' కు పూర్వనిపాతము, గుణము, 'ఋక్పూరబ్ధూః' సూత్రముచే 'అ' ప్రత్యయం విధించగ, అర్ధర్చః (పుంలింగము) మఱియు అర్ధర్చమ్ (నపుంసకలింగము) రూపములు సిద్ధించును.



ఈ అర్ధర్చాది గణములో ధ్వజ, తీర్థ, శరీర, మండ, పీయూష, దేహ, అఙ్కుశ, కలశ ఇత్యాది అనేక పదములు కలవు. పాణిని సుమారు 200 పదములు ఈ సూత్రము క్రింద వివరించెను.

## 286. జాత్యాఖ్యాయామేకస్మిన్ బహువచనమన్యతరస్యామ్ (1-2-58)

**ఏకోఽ ప్యర్థో వా బహువద్భవతి. బ్రాహ్మణాః పూజ్యాః. బ్రాహ్మణః పూజ్యః.**

ఈ సూత్రము వలన వచన నిర్దేశము చేయబడినది. అర్థమునకు విరుద్ధముగా వచ్చు ఏకవచన బహువచనములు "జాత్యాఖ్యాయామేకస్మిన్" (1-2-58,59,60,63) ఇత్యాది సూత్రములలో చేర్చబడినవి. ఈ సూత్రము జాతివాచకమైన పదములు ఏకవచనమునకు బదులుగా బహువచనమున వికల్పముగా ప్రయోగింపవచ్చునని తెలుపుచున్నది. 'బ్రాహ్మణః పూజ్యః' అని గాని "బ్రాహ్మణాః పూజ్యాః" అని కాని ప్రయోగముండవచ్చును. జాతి బహు వ్యక్తుల యందు అంతర్గతముగా ఉండునది, వ్యక్తి ప్రాధాన్యతవల్ల బహువచనము, సమిష్టి ప్రాధాన్యతవల్ల ఏకవచనము సాధువులగును.

## 287. అస్మదో ద్వయోశ్చ (1-2-59)

**ఏకత్వే ద్విత్వే చ వివక్షితే అస్మదో బహువచనం వా స్యాత్. వయం బ్రూమః. పక్షే అహం బ్రవీమి. ఆవాం బ్రూవ ఇతి వా.**

**(వా) సవిశేషణస్య ప్రతిషేధః**

**పటురహం బ్రవీమి.**

ఏకవచన, ద్వివచన ప్రయోగార్హమైన "అస్మద్" శబ్దరూపములు బహువచనముతో వికల్పముగా ప్రయోగింపవచ్చునని సూత్రార్థము.

సంస్కృతమున ఒక వ్యక్తి మాట్లాడుతున్నప్పుడు గూడా 'అహమ్' అనుటకు బదులుగ 'వయమ్' అని ప్రయోగము చేయవచ్చును.

అహం బ్రవీమి, వయం బ్రూమః, ఆవాం బ్రూవః వయం బ్రూమః. ఇత్యాదులు ఉదాహరణములు. అయితే విశేషణముతో కూడ నున్న అస్మత్ శబ్దము విషయమున ఈ సూత్రము వర్తించదని వార్తికము తెలుపుచున్నది. ఉదా – పటురహం బ్రవీమి.

## 288. ఫల్గునీప్రోష్ఠపదానాం చ నక్షత్రే (1-2-60)

**ద్విత్వే బహుత్వప్రయుక్తం కార్యం వా స్యాత్. పూర్వే ఫల్గున్యౌ. పూర్వాః**

**ఫల్గున్యౌ. పూర్వే ప్రోష్ఠపదే. పూర్వాః ప్రోష్ఠపదాః. నక్షత్రే కిమ్ ? ఫల్గున్యౌ మాణవికే.**

ద్వివచనవాచకములైన ఫల్గునీ, ప్రోష్ఠపద శబ్దములు బహువచనములోను ప్రయోగించవచ్చును. ఫల్గునీ, ప్రోష్ఠపదాలు రెండు నక్షత్రాలు కావడం వల్ల ద్వివచనమే కాని శిష్టవ్యవహారమున వీటికి బహువచన ప్రయోగము సిద్ధించినది.

ఉదితే పూర్వే ఫల్గున్యౌ (ద్వివచనము)

ఉదితాః పూర్వాః ఫల్గున్యః (బహువచనము)

పూర్వే ప్రోష్ఠపదే: పూర్వాః ప్రోష్ఠపదాః

'ఫల్గున్యౌ మాణవికే' ఇత్యాది వాక్యములలో అవి నక్షత్ర వాచకములు కాదు కావున ద్వివచనమున మాత్రమే ఉండును.

## 289. తిష్యపునర్వస్వోర్నక్షత్రద్వన్ద్వే బహువచనస్య ద్వివచనం నిత్యమ్ (1-2-63)

**బహుత్వం ద్విత్వవద్భవతి. తిష్యశ్చ పునర్వసూ చ, తిష్యపునర్వసూ, తిష్యేతి కిమ్? విశాఖానూరాధాః. నక్షత్రేతి కిమ్ ? తిష్యపునర్వసవో మాణవకాః.**

"తిష్యపునర్వసూ" అను నక్షత్రపదములచే ఏర్పడిన ద్వంద్వ సమాసము ఎల్లప్పుడును ద్వివచనమునందే ఉండును.

తిష్యశ్చ పునర్వసూ చ = తిష్యపునర్వసూ

"తిష్య" ఒక నక్షత్రము. 'పునర్వసూ' రెండు నక్షత్రములకు పేరు. ద్వంద్వ సమాసమున మూడు నక్షత్రములున్నప్పుడు బహువచనము రావలసియుండగా ఈ సూత్రముచే ద్వివచనము సాధువుగా విధింపబడినది. రెండు నక్షత్రములున్నప్పటికీ సమూహము క్రింద ఒక నక్షత్రముగా పునర్వసు లెక్కింపబడినది. సూత్రమున తిష్య పునర్వసు శబ్దములు చెప్పినందువలన "విశాఖానురాధాః" ఇత్యాదులందు ఈ సూత్రము ప్రవర్తించదు. నక్షత్ర శబ్దమున్నందువలన "తిష్యపునర్వసవః మాణవకాః" అనునప్పుడు కూడ ఈ సూత్రము రాదు.



## 290. స నపుంసకమ్ (2-4-17)

**సమాహారే ద్విగుర్ద్వంద్వశ్చ నపుంసకం స్యాత్. పరవల్లిఙ్గాపవాదః. పంచగవమ్. దన్తోష్ఠమ్.**

**(వా) 1. అకారాన్తోత్తరపదో ద్విగుః స్త్రియామిష్టః**

**పఞ్చమూలీ**

**(వా) 2. ఆబన్తో వా**

**పంచఖట్వమ్ - పఞ్చఖట్వీ**

**(వా) 3. అనో నలోపశ్చ వా ద్విగుః స్త్రియామ్**

**పఞ్చతక్షీ, పఞ్చతక్షమ్**

**(వా) 4. పాత్రాద్యన్తస్య న**

**పఞ్చపాత్రమ్, త్రిభువనమ్, చతుర్యుగమ్**

**(వా) 5. పుణ్యసుదినాభ్యామహ్నః క్లీబతేష్టా**

**పుణ్యాహమ్, సుదినాహమ్.**

**(వా) 6. పథః సంఖ్యావ్యయాదేః**

**సంఖ్యావ్యయాదేః పరః కృతసమాసాన్తః పథశబ్దః క్లీబమిత్యర్థః. త్రయాణాం పన్థాస్త్రిపథమ్. విరూపః పన్థాః విపథమ్ కృతసమాసాన్తనిర్దేశాన్నేహ - సుపన్థాః. అతి పన్థాః.**

**(వా) 7. సామాన్యే నపుంసకమ్**

**మృదు పచతి. ప్రాతః కమనీయమ్.**

ఈ సూత్రమునందలి సర్వనామ శబ్దమైన 'సః' "ద్విగురేకవచనమ్" (2-4-1) అను సూత్రమునందలి ద్విగుతోను, "ద్వన్ద్వశ్చ ప్రాణితూర్యసేనాంగానామ్ (2-4-2) నందలి ద్వంద్వముతోను సమన్వయించును. (ద్విగురేకవచనమ్) 2-4-1 నుండి విభాషా సమీపే 2-4-16 సూత్రముల వరకు ఉన్నవి ఏకవచనవిధాయకసూత్రములు. తర్వాత ఈ 'సనపుంసకమ్' అను (2-4-17)వ సూత్రము ద్విగు ద్వంద్వ సమాసములకు నపుంసకలింగమును విధించుచున్నది.

పంచానాం గవాం సమాహారః = పంచగవమ్ (ఐదు గోవుల సముదాయము) ఇది సమూహవాచక నపుంసకలింగము.

దన్తాశ్చ ఓష్ఠా చ = దన్తోష్ఠమ్ (పళ్ళు పెదవులు)

**వార్తికములు :**

1) అకారాన్తోత్తరపదో ద్విగు : స్త్రియామిష్టః – ద్విగు సమాసమున హ్రస్వ అకారాన్తమగు శబ్దమునకు స్త్రీలింగమే విధించబడును. ఉదా : పఞ్చమూలీ.

2) "ఆబన్తో వా" – స్త్రీలింగవాచకాలు అయినపుడు స్త్రీలింగము మరియు నపుంసక లింగమును సమాహారమునందు వచ్చును.

పంచఖట్వమ్ (నపుంసకలింగము), పంచఖట్వీ (స్త్రీలింగము)

3) "అనో నలోపశ్చ వా ద్విగుఃస్త్రియామ్ " – అన్నంతమైన ద్విగు సమాసము స్త్రీలింగము నందు కూడా ఉండును మరియు అన్ లోని నకారమునకు లోపము వచ్చును.

పంచతక్షమ్ (సమాహార ద్విగు సమాసము, నపుంసకలింగము), పంచతక్షీ (స్త్రీలింగము)

4) "పాత్రాద్యన్తస్య న" – పాత్రాదులంతమందు గల సమాహార ద్విగుసమాసము స్త్రీలింగము నందుండదు. స్త్రీలింగ ప్రయోగము పూర్వ వార్తికములచే విధింపబడుచుండగ యీ వార్తికము చేత నిషేధింపబడుచున్నది.

పంచపాత్రమ్, చతుర్యుగమ్, త్రిభువనమ్.

5) "పుణ్యసుదినాభ్యామహ్నః క్లీబతేష్టా" – పుణ్య, సుదిన శబ్దములు పూర్వపదములుగా కలిగి అహ్నపదముతో అంతమగు సమాసములు నపుంసకములగును.

పుణ్యమ్ అహః = పుణ్యాహమ్ , సుదినమ్ అహః = సుదినాహమ్.

6) "పథః సంఖ్యావ్యయాదేః" – సమాసాంతముతో అంతమగు పథశబ్దము సంఖ్యావాచకముతోను అవ్యయముతోను సమసించినపుడు అది నపుంసకలింగమగును. త్రిపథమ్, చతుష్పథమ్, విపథమ్, సుపథమ్ అనునవి సమాసాంతము కలిగిన నపుంసక లింగములు. సుపన్థాః, అతిపన్థాః అనునవి సమాసాంతములు కావు కావున నపుంసకములు కావు.

7) "సామాన్యే నపుంసకమ్" – విశిష్టలింగము యొక్క అపేక్ష లేకుండా సామాన్య లింగాపేక్షతో ఉపయోగించినపుడు ఆపదము నపుంసకమగును. మృదు పచతి (మృదువుగా వండుచున్నాడు). ఇక్కడ 'మృదు' శబ్దము సాధారణవిశేషణముగా ఉన్నది. అందువలన నపుంసకలింగము నందు ప్రయోగింపబడినది.

## 291. తత్పురుషోఽనఞ్ కర్మధారయః (2-4-19)

**అధికారోఽయమ్.**

ఇది అధికారసూత్రము. ఇది "సంజ్ఞాయాం......" (2-4-20) నుండి "విభాషా



సేనాసురా...." (2-4-25) వరకు అనువర్తించును. నఞ్ తత్పురుషము మఱియు కర్మధారయము కాని తత్పురుషములకు నపుంసకలింగము వచ్చునని సూత్రార్థము.

## 292. సంజ్ఞాయాం కన్థోశీనరేషు (2-4-20)

**కన్థాన్తస్తత్పురుషః క్లీబం స్యాత్ సా చేదుశీనరదేశోత్పన్నాయాః కన్థాయాస్సంజ్ఞా. సుశమస్యాపత్యాని సౌశమయః. తేషాం కన్థా, సౌశమికన్థమ్. సంజ్ఞాయాం కిమ్ వీరణకన్థా. ఉశీనరేషు కిమ్ ? దాక్షికన్థా.**

ఉశీనరదేశము నందలి పట్టణమునకు సంజ్ఞయైన 'కన్థా' అను పదము ఉత్తరపదమైనచో తత్పురుషసమాసము నపుంసకలింగమగును. కన్థా శబ్దము స్త్రీలింగము. స్త్రీలింగమునకు బదులుగా నపుంసకలింగము విధింపబడినది.

సుశమస్య అపత్యాని = సౌశమ్యః,

తేషాం కన్థా = సౌశమికన్థమ్.

సౌశమి యొక్క సంతానం సౌశమ్యః. ఆ సౌశమ్యుల యొక్క ఉశీనర దేశంలో ఉన్న కన్థా సౌశమికన్థం "ఉశీనరదేశంలో సౌశమ్యులుండే ఊరిపేరు "సౌశమికన్థం" అని చెప్పబడినది.

వీరణకన్థా, దాక్షికన్థా ఇత్యాదులలో 'వీరణ, దాక్షి' శబ్దములు సంజ్ఞావాచకము మఱియు నగరవాచకములు కావు కనుక 'కన్థా' శబ్దము నపుంసకలింగముగా మారదు.

## 293. ఉపజ్ఞోపక్రమం తదాద్యాచిఖ్యాసాయామ్ (2-4-21)

**ఉపజ్ఞాన్తః, ఉపక్రమాన్తశ్చ తత్పురుషో నపుంసకం స్యాత్, తయోరుపజ్ఞాయ - మానోపక్రమ్యమానయోరాదిః ప్రాథమ్యం చేదాఖ్యాతుమిష్యతే. పాణినేరువజ్ఞా పాణిన్యుపజ్ఞం గ్రన్థః. నన్దోపక్రమం ద్రోణః.**

ఉపజ్ఞ మరియు ఉపక్రమ అను పదములు అంతమగు తత్పురుషసమామసము నపుంసకములగును. ఆ పని ఆ విషయము నందు ఉపక్రమమైగాని, ఆ వ్యక్తి ద్వారా కనుగొనబడిగాని ఉండవలెను.

పాణినేః ఉపజ్ఞా గ్రంథః = పాణిన్యుపజ్ఞమ్

(పాణినిచే మొదటిసారిగా ప్రారంభింపబడిన గ్రంథము, అనగా పాణినికి ముందు లేనిదే ఈ గ్రంథము - (వ్యాకరణ గ్రంథము)) నన్దోపక్రమం ద్రోణః ("నందునిచేత మొదటిసారిగా ప్రవేశపెట్టబడిన కొలమానమైన ద్రోణము")

## 294. ఛాయా బాహుల్యే (2-4-22)

**ఛాయాన్తస్తత్పురుషో నపుంసకం స్యాత్పూర్వపదార్థబాహుల్యే. ఇక్షూణాం ఛాయా – ఇక్షుచ్ఛాయమ్. విభాషా సేనా ఇతి వికల్పస్యాయమపవాదః. 'ఇక్షుచ్ఛాయానిషాదిన్యః' ఇతి తు 'ఆ సమన్తాన్నిషాదిన్య' ఇత్యాఙ్ ప్రశ్లేషో బోధ్యః.**

ఈ సూత్రమున రెండు నియమాలు చెప్పబడినవి. ఒకటి ఛాయా అనే పదముతో ఏర్పడిన తత్పురుష సమాసం అయివుండవలెనని, రెండు, తత్పూర్వపదముయొక్క ఛాయా బాహుల్యమును బోధించుచుండవలెను అని. ఆ సందర్భమున ఛాయాంతమైన తత్పురుషకు నపుంసకలింగము వచ్చును.

ఇక్షూణాం ఛాయా = ఇక్షుచ్ఛాయమ్ (చెఱకు నీడ)

(చెఱకు తోటలయందు నీడ ఎక్కువగా ఉండునని, అది విశ్రాంతికి అనువైనదని ప్రసిద్ధి) "ఇక్షుచ్ఛాయానిషాదిన్యః" అనునపుడు కూడ 'ఛాయా' అనునది నపుంసక లింగమే. ఇక్షూణాం ఛాయా ఇక్షుచ్ఛాయమ్, ఇక్షుచ్ఛాయే ఆ నిషాదినీతితాః 'ఇక్షుచ్ఛాయానిషాదిన్యః' అని భట్టోజీదీక్షితులు వ్యుత్పత్తిని వివరించారు.

## 295. సభా రాజాఽమనుష్య పూర్వా (2-4-23)

**రాజపర్యాయపూర్వోఽమనుష్యపూర్వశ్చ సభాన్తస్తత్పురుషో నపుంసకం స్యాత్. ఇనసభమ్. ఈశ్వరసభమ్.**

**(వా) పర్యాయస్యైవేష్యతే**

**నేహ – రాజసభా – చన్ద్రగుప్తసభా. అమనుష్యశబ్దో రూఢ్యా రక్షఃపిశాచాదీనాహ. రక్షః సభమ్. పిశాచసభమ్.**

రాజపర్యాయ శబ్దములు అమనుష్యవాచకములు అగు శబ్దములు సభాశబ్దముతో కలిసి ఏర్పడిన తత్పురుష సమాసము నపుంసకమగును.

ఇనస్య సభా = ఇనసభమ్ (రాజుల కొలువు కూటము)

ఈశ్వరస్య సభా = ఈశ్వరసభమ్ (ప్రభువు యొక్క కొలువు)

రాజశబ్దముతో గాని మనుష్యవాచక శబ్దముతో గాని సమసించిన తత్పురుషమునకు నపుంసకత్వము రాదు. ఉదా – రాజసభా, చంద్రగుప్తసభా.



అమనుష్యసభా అనునది రూఢిగా రక్షః పిశాచాదులను బోధించును. అందువలన రక్షస్సభమ్, పిశాచసభమ్ ఇత్యాదులందు నపుంసకమైన తత్పురుషము సిద్ధించును.

**(వా) పర్యాయస్యైవేష్యతే**

రాజ శబ్దము కాక దాని పర్యాయశబ్దముతో సమసించి సభా శబ్దముత్తరపదముగా కలిగిన సమాసము మాత్రమే ఇందు నపుంసకక్రియను పొందునని తెలుసుకొనవలెను. అందువలన ఇనసభమ్. ఈశ్వరసభమ్‌లు నపుంసకములైనను రాజసభా, చంద్రగుప్తసభా అను సమాసములు ఉత్తరపదమైన సభా శబ్దము యొక్క లింగముచే మాత్రమే ఉపయోగింపబడును.

## 296. అశాలా చ (2-4-24)

**సంఘాతార్థా యా సభా తదన్తస్తత్పురుషః క్లీబం స్యాత్. స్త్రీ సభమ్. స్త్రీ సంఘాత ఇత్యర్థః. అశాలా కిమ్ ? ధర్మసభా. ధర్మశాలేత్యర్థః.**

సభాశబ్దముతో అంతమగుచు సభాశబ్దము సంఘాతార్థమును బోధించునపుడును, గృహము అని అర్థములో ఉపయోగింపబడనపుడును ఏర్పడిన తత్పురుషము నపుంసకమగును. సభా అను స్త్రీలింగ శబ్దము 'సభమ్' అని నపుంసకలింగముగా మారును అని అర్థము. కాని సభా శబ్దము గృహము శాలా అను అర్థములో ప్రయోగింపబడకూడదు. సభాశబ్దమునకు సంఘాతము. గృహము (శాలా) అని రెండు అర్థములున్నవి. ఒక అర్థములో ప్రయోగించిన సభా శబ్దమునకే నపుంసకలింగము వర్తించును. స్త్రీ సభమ్ అనునది నపుంసకలింగ ఏకవచనము. 'స్త్రీల సంఘాతము', యుద్ధము అని అర్థము. ధర్మశాలా అను అర్థము బోధించు 'ధర్మసభా' శబ్దమునకు నపుంసక లింగము రాదు.

## 297. విభాషా సేనాసురాచ్ఛాయాశాలానిశానామ్ (2-4-25)

**ఏతదన్తస్తత్పురుషః క్లీబం వా స్యాత్. బ్రాహ్మణసేనమ్. బ్రాహ్మణసేనా. యవసురమ్. యవసురా. కుడ్యచ్ఛాయమ్. కుడ్యచ్ఛాయా. గోశాలమ్. గోశాలా. శ్వనిశమ్. శ్వనిశా. 'తత్పురుషోఽనఞ్ కర్మధారయః' ఇత్యనువృత్తేర్నేహ. దృఢసేనో రాజా, అసేనా, పరమసేనా.**

సేనా, సురా, ఛాయా, శాలా, నిశా అనే స్త్రీలింగాంత శబ్దములతో అంతమగు తత్పురుష సమాసమునకు వైకల్పికముగా నపుంసకలింగము విధింపబడును.

బ్రాహ్మణసేనా, బ్రాహ్మణసేనమ్ (బ్రాహ్మణసేన)
యవసురా, యవసురమ్ (యవలు అనే ధాన్యము ద్వారా తయారైన 'సురా' అని అర్థము.
కుడ్యచ్ఛాయా, కుడ్యచ్ఛాయమ్, (గోడనీడ)
గోశాలా, గోశాలమ్ (ఆవుల దొడ్డి)
శ్వనిశా, శ్వనిశమ్ (రేపు రాత్రి)

"తత్పురుషోఽ నఞ్ కర్మధారయః" అనునది అధికారసూత్రమై ఈ సూత్రములో అనువర్తించునని భట్టోజీ దీక్షితులు చెప్పెను. కావున 'దృఢాసేనాయస్యసః దృఢ సేనః అనునపుడు మఱియు 'అశాలా', 'పరమసేనా' నఞ్ తత్పురుషము కర్మధారయ సమాస పదములందు కూడ సూత్రము రాదు.

## కారక ప్రకరణమ్

**1. హరిం భజతి :** అత్ర హరి శబ్దస్య "కర్తురీప్సితతమం కర్మ" ఇతి సూత్రేణ కర్మ సంజ్ఞాయాం, "కర్మణి ద్వితీయా" ఇతి సూత్రేణ ద్వితీయా విభక్తౌ, "ద్వ్యేకయోర్ద్వివచనైక వచనే" ఇత్యనేన ఏకవాక్యతయా ద్వివచనైకవచనే అమ్ ప్రత్యయే, "అమి పూర్వః" ఇత్యనేన పూర్వరూపే "మోఽనుస్వారః" ఇత్యనేన అనుస్వారాదేశే "హరిం భజతి" ఇతి సిద్ధ్యతి.

**2. గాం దోగ్ధి పయః :** అత్ర "దుహ్యాచ్‌పచ్" ఇతి వార్తికే నిర్దిష్టానుసారం దుహ ధాతునా సహ ప్రయుక్తస్య గో శబ్దస్య అపాదానత్వాత్ పంచమీం బాధిత్వా "అకథితం చ" ఇతి సూత్రేణ కర్మ సంజ్ఞాయాం "కర్మణి ద్వితీయా" ఇతి సూత్రేణ ద్వితీయా విభక్తౌ, అమా దేశే పూర్వరూపే, 'పయస్' శబ్దస్య చ "కర్తురీప్సితతమం కర్మ" ఇతి సూత్రేణ కర్మసంజ్ఞాయాం "గాం దోగ్ధి పయః" ఇతి సిద్ధ్యతి.

**3. రామేణ బాణేన హతో వాలీ :** అత్ర హనన క్రియాయాం స్వతంత్రః రామః, అతః రామ శబ్దస్య "స్వతంత్రః కర్తా" ఇతి సూత్రేణ కర్తృ సంజ్ఞాయాం, హనధాతోః కర్మణి క్త ప్రత్యయే, హనన క్రియాయాం ప్రకృష్టోపకారత్వాత్ బాణ శబ్దస్య "సాధకతమం కరణం" ఇత్యనేన కరణ సంజ్ఞాయాం "కర్తృ కరణయోస్తృతీయా" ఇతి సూత్రేణ ద్వయోరపి తృతీయా విభక్తౌ "రామేణ బాణేన హతో వాలీ" ఇతి సిద్ధ్యతి.

**4. పుత్రేణ సహాగతః పితా :** అత్ర ఆగమనక్రియాయాం పితుః సాక్షాదన్వయః నతు పుత్రస్య. పుత్రస్య అప్రధాన త్వాత్ తస్య 'సహయుక్తేఽప్రధానే" ఇతి సూత్రేణ తృతీయా విభక్తౌ "పుత్రేణ సహాగతః పితా" ఇతి సిద్ధ్యతి.



**5. విప్రాయ గాం దదాతిః :** విప్రముద్దిశ్య గాం దదాతీత్యర్థః. దానకర్మ విప్రముద్దిశ్య క్రియతే అతః "కర్మణా యమభిప్రైతి స సమ్ప్రదానమ్" ఇతి సూత్రేణ విప్రశబ్దస్య సంప్రదాన సంజ్ఞాయాం "చతుర్థీ సమ్ప్రదానే" ఇతి సూత్రేణ చతుర్థీ విభక్తౌ 'విప్రాయ గాం దదాతి' ఇతి సిద్ధ్యతి.

**6. చోరాద్‌బిభేతి :** అత్ర భయార్థక భీ ధాతుయోగే భయహేతుభూతస్య 'చోర' శబ్దస్య "భీత్రార్థానాం భయహేతుః" ఇతి సూత్రేణ అపాదాన సంజ్ఞాయాం, "అపాదానే పంచమీ" ఇతి సూత్రేణ పంచమీ విభక్తౌ, "చోరాద్‌భిభేతి" ఇతి సిద్ధ్యతి.

**7. రాజ్ఞాం మతః :** అత్ర రాజకర్తృక వర్తమాన ఇచ్ఛా విషయః ప్రకటితః. అతః "మతిబుద్ధి పూజార్థేభ్యశ్చ" ఇతి సూత్రేణ విహిత వర్తమానార్థస్య క్తస్య యోగే రాజన్ శబ్దస్య "క్తస్య చ వర్తమానే" ఇతి సూత్రేణ షష్ఠీ విభక్తౌ 'రాజ్ఞాం మతః' ఇతి సిద్ధ్యతి.

**8. స్థాల్యాం పచతి :** స్థాల్యాం పచతి తండులానితి అవగన్తవ్యమత్ర. సాక్షాత్తండులాత్మక కర్మగతాం పాకక్రియాం ప్రతి స్థాల్యాః సంయోగసంబంధం పురస్కృత్య తండుల ద్వారా ఆధారత్వాత్ "ఆధారోఽధికరణమ్" ఇతి సూత్రేణ స్థాలీ శబ్దస్య అధికరణ సంజ్ఞాయాం, "సప్తమ్యధికరణే చ" ఇతి సూత్రేణ సప్తమీ విభక్తౌ 'స్థాల్యాం పచతి' ఇతి సిద్ధ్యతి.

## సమాస ప్రకరణమ్

### అవ్యయీభావ సమాసః

**1. అధిహరి :** "హరౌ" ఇతి అధిహరి ఇతి లౌకికం విగ్రహవాక్యమ్, 'హరి+ఙి+అధి+సు" ఇత్యలౌకిక విగ్రహవాక్యే "అవ్యయం విభక్తి సమీపసమృద్ధి" ఇత్యాదినా సూత్రేణ విభక్త్యర్థే అవ్యయీభావ సమాసే, సమాసత్వాత్ ప్రాతిపదిక సంజ్ఞాయాం "సుపో ధాతుప్రాతిపదికయోః" ఇతి సూత్రేణ సుపో లుకి, "ప్రథమా నిర్దిష్టం సమాస ఉపసర్జనమ్" ఇతి సూత్రేణ 'అధి' ఇత్యస్య ఉపసర్జన సంజ్ఞాయాం, "ఉపసర్జనం పూర్వమ్" ఇతి సూత్రేణ పూర్వ నిపాతే "అవ్యయీభావశ్చ" ఇతి సూత్రేణ అవ్యయ సంజ్ఞాయాం, ప్రాతిపదికత్వాత్ పునః సుబుత్పత్తౌ "అవ్యయాదాప్సుపః" ఇతి సూత్రేణ సోః లోపే 'అధిహరి' ఇతి సిద్ధ్యతి.

**2. ఉపకృష్ణమ్ :** కృష్ణస్య సమీపే ఉపకృష్ణమ్ ఇతి లౌకికం విగ్రహవాక్యమ్. కృష్ణ+ఙస్, ఉప+సు ఇతి స్థితే "అవ్యయం విభక్తి సమీప" ఇత్యాదినా సమీపార్థే అవ్యయీభావసమాసే 'సుపోధాతు ప్రాతిపదికయోః' ఇతి సూత్రేణ సుపో లుకి, "ప్రథమా నిర్దిష్టం సమాస ఉపసర్జనమ్" ఇతి సూత్రేణ ఉపసర్జన సంజ్ఞాయామ్, "ఉపసర్జనం పూర్వం" ఇతి సూత్రేణ